TIGHT BINDING BOOK

అధ్యాయం : ఒకటి



సరిగ్గా మా ఇంటిపైన, వినీలాకాశంలో హంసలు విహరిస్తున్నాయి. అవి చాలా క్రిందిగా ఎగురుతున్నాయి. వాటి రెక్కల చప్పుడు ఎక్కడో దూరం నుంచి వినవచ్చే ఘంటానాదంవలె చెవిన పడుతున్నది. 'అది హంసల రెక్కల సంగీతంరా!'—అని అంటాడు తాతయ్య. అలా వినువీధిలో విహారం చేస్తున్న హంసలను వీక్షిస్తూ, వాటి రెక్కల సంగీతం వింటూఉంటే, నేనుకూడా వాటితోపాటు ఎక్కడికో, ఆకాశంలోకి ఎగిరిపోతే బాగుండుననిపించింది. చేతులు పైకెత్తాను, అవి రెక్కలన్నట్లుగా. మృదుమధుర సంగీత ధ్వనులు పట్టువారాలవలె నా చుట్టూ చుట్ట చుట్టుకున్నాయి. హర్షవిషాదాలలో తేలిపోయాను.

సృష్టిలో ప్రతివస్తువూ పెద్దదైపోతున్నది. — మేఘావృతమైన ఆకాశం, పచ్చని నాచుతో నిండిన ఇండ్లపై కప్పులు, ఊరు అవతల సింధూర వృక్ష భరితమగు నీలారణ్యం, కరగిపోతున్న మంచు క్రింద చెమ్మతో ఉమ్మగిలుతూ మడుగులు మడుగులుకట్టి కనుపిస్తున్న మహీతలం —వీటన్నిటి స్వరూపమే మారిపోతున్నది. నేను మాత్రం చిన్న చీమంత వాణ్ణి అయిపోతున్నట్లు తోచింది!

ప్రపంచమంతా నా కనులముందు కదలిపోతున్నది. హంసలు ఎక్కడికో — దూరతీరాలకు ఎగిరిపోతున్నాయి. అవి అలా దూరమై పోవడం నాకిష్టంలేదు. కానీ అవి నాకోర్కెను మన్నించాలికదా మరి? అవి మా ఊరుచుట్టూ తిరిగి మళ్ళీ మా ఇంటి మీదికివచ్చి ఎగిరితే ఎంత బాగుండును!

నేనుకనుక గారడీవాణ్ణి అవుతేనా, క్షణంలో వాటిని మళ్ళీ ఇక్కడికి రప్పించనూ ? మరి అలా చేయడానికి గారడి మంత్రం నాకు తెలిస్తేనా!

నేనేదో స్వప్నజగత్తులో పడిపోయాను. వెనకటి, రాజు-రాణుల కట్టు కథలోని కమనీయ దృశ్యాలు ఒక్కొక్కటే నా కనులముందు ప్రత్యక్షమవుతూ కదలిపోతున్నాయి. — చీమ - దూరని చిట్టడవులు, కాకులు దూరని కారడవులు, చిన్నపిల్లలను కాపాడడానికై మారుపేర్లతో వచ్చి, రెక్కలమీద వారిని కూచోపెట్టుకునిపోయే అడవిరాతులు, హంసలు,— అన్నీ నా ముందు పొడగట్టాయి. కట్టుకథలు ఎంత గమ్మత్తుగా ఉంటాయి! భూమి, ఆకాశం, గాలి, నీరు, గగనంలో పక్షులు,—వీటన్నిటిపైన ఒకానొక మాయాశక్తి ప్రభావం ఉంటుంది ఆ కథలలో........

అప్పటికప్పుడే ఒక అద్భుతం జరిగింది. విలువంపుగా ఉన్న వినీలాకాశంలో స్వచ్ఛ ధవళమేఘమాలపై ఏదో అదృశ్యహస్తం ఒక ధనుస్సును ఎక్కుపెట్టింది. ఫిడేలుమాదిరిగా మేఘమాల మధుగానం చేసింది. మునివ్రేళ్ళపై నిలుచుని నభోమండలంలోకి తేరిపార చూచాను, నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను, అరె! హంసలు మళ్ళీ మా ఇంటి పైన విహరిస్తున్నాయి! ఇది ఎలా సంభవం ? అవి, నామాట మన్నించాయా ? ఊరుచుట్టూ ప్రదక్షిణంచేసి మళ్ళీ ఇక్కడికి వచ్చాయా ? లేక ఇది మరొక హంసలగుంపా ? భవిష్యత్తును సూచించే ఆ ఫిడేలు రాగాలు, ఆ గంధర్వగానం అంతకంతకూ శృతిమించి నా బాల్యంపై ఒక మహాస్వరమేళవలె భాసించాయి. నా ఉత్సాహం పట్టపగ్గాలు లేకుండా అనంత విశ్వాంతరాళంలోకి ఎగిరిపోయి విహరించసాగింది. మరి నాకు- పసివాడనైన నాకు ఆక్షణంలో జగత్తంతా అత్యద్భుతంగాను, మహదానంద భరితంగాను అగుపించింది.

"క్వాక్, క్వాక్, క్వాక్!"— ఒంటి రెక్కగల మా ముసలి బాతు నా కాలికి రుద్దుకుంటూ అరవసాగింది. పాపం. దేనికోసమో అది ఆరాటపడుతున్నట్టు కనుపించింది. ఒంటిరెక్క తపతప కొట్టుకుంటూ, పొడుగాటి మెడచాచి అటూ ఇటూ త్రిప్పుతున్నది. ఒకసారి ఒక కంటితో, ఇంకొకసారి రెండవకంటితో ఆకసంవక దృష్టినిగుడ్చి చూస్తున్నది, పాపం ఏదో ముఖ్యమైన విషయం నాతో చెప్పాలని దాని తాపత్రయం, కానీ 'క్వాక్, క్వాక్!' అని అరవడం తప్ప దానికి మరొక మాటరాదు.

కళకళలాడే గంట గోపురానికి అవల సుదూరంగా ఆకాశంలో హంసలు అదృశ్యమైనాయి. కానీ ఆ మధురగానం ఇంకా నా చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. లేక బహుశః ఆ పక్షుల వెనకాలే మ్రోగుతున్న గోపురం గంటల ధ్వనియేమో అది?

"హంసలు వచ్చాయి. లోకానికి కొత్తజీవితాన్ని తెచ్చాయి." అన్నాడు తాతయ్య. ఏదో కొయ్యచక్రం ఆకులతో అప్పుడే తయారు చేసిన విమానం ఒకటి ఆయన చేతిలో ఉన్నది.

"కొత్తజీవితమా?"— అని అడిగాను నేను ఆశ్చర్యంతో. "అవును, కొత్తజీవితమే!" అన్నాడు తాతయ్య—"వసంతం, కొత్త జీవితం. ఇప్పుడన్నీ కొత్తగా, నవనవలాడుతూ ఆవిర్భవిస్తాయి నాయనా! నదీనదాలలో, సరోవరాలలో మంచుకరిగిపోతుంది. వృక్షాలలో కొత్తగా జీవశక్తి, సారం పెల్లుబికి వస్తాయి. మేఘాలు గర్జిస్తాయి. సూర్యుడు తన తాళపుచెవితో పృథ్వీకవాటాలు తెరుస్తాడు" అనిచెప్పాడు.

"సూర్యుడి తాళపుచెవులు ఎలాంటివి తాతయ్యా?" అడిగాను నేను మరింతగా ఆశ్చర్యపోతూ. మనుష్యుల వద్ద ఉన్నట్లే సూర్యుకిదగ్గర కూడా తాళపుచెవులు ఉంటాయని నేనెన్నడూ ఊహించలేదు.

"సూర్యుడిదగ్గర ఉండేవి బంగారపు తాళపుచెవులు నాయనా, బంగారపు తాళపుచెవులు." "వాటితో పృథ్వీకవాటాలు ఎలా తెరుస్తారు తాతయ్యా ?—"

"అదెంతపనిరా ! ఒకనాడు సూర్యుడు గవాక్షంగుండా తల బయటికి పెట్టి ఈ పృథ్వీ మండలంవంక చూస్తాడు. ప్రజలు, జంతువులు, పక్షులు - అన్నీకూడా బిక్కచిక్కిపోయి కళ, కాంతులు లేక వసంతం కోసం తపించిపోతూ ఉండడం కనుపిస్తుంది. అప్పుడాయన తన సోదరుడు చంద్రుడివంక చూస్తాడు. పృథ్వీకవాటాలు తెరిచే సమయం ఆసన్నంఅయిందికదా-అనిఅడుగుతాడు.అవుననితలడించుతాడుచంద్రుడు. అంతట సూర్యుడు తన తాళపుచెవులు సంపుతాడు. అరణ్యాలు, పొలాలు, నదులు, మైదానాలు — అన్నిటిపైన తన బంగారు కిరణాలు ప్రసరింపజేస్తాడు. జీవిత కవాటాలు తెరుస్తాడు........"

తాతయ్య చెపుతున్నదంతా శ్రద్ధగావిన్నాను. హఠాత్తుగా ఒక భయంకరమైన ఆలోచన తట్టింది :

"అమ్మ పోగొట్టుకున్నట్టే,సూర్యుడుకూడా తాళపుచెవులు పోగొట్టుకోడా తాతయ్యా ?"—అని అడిగాను.

"అదేమిట్రా అబ్బాయ్?"—తాతయ్య కళ్ళు మిలమిల మెరిశాయి. విభ్రాంతపోతూ కనుబొమలు పైకెత్తాడు. చేత్తో నన్ను చిన్నగా తట్టాడు. పగలబడి నవ్వడం మొదలుపెట్టాడు.

తాతయ్య నవ్వుతూ ఉండడం చూస్తే నాకెంతో సరదా. గోడ, తలుపు, చెట్టు-ఏది ఉంటేదానికి చేరగిలబడి కూచుంటాడు ఆయన. ఇవేవీ దగ్గరలో లేకపోతే తన పొట్టమీదనే వాలిపోతాడు. అసలే పెద్దపొట్ట. అది రెండింతలు లావు అవుతుంది. ఆయన మెలిదిరిగిన మీసాలు

బయటికి పొడుచుకుని వస్తాయి. ఆయన రొప్పుతాడు. ఎంతో ఆయాస పడతాడు. "భగవంతుడా! ఈ జీవుణ్ణి కాపాడు!" అని వాపోతాడు. ఆయన బట్టలనిండా రంపపుపొట్టు. కనుల నుండి అశ్రువులు రాలతాయి. ఆ కన్నీటి చుక్కలను ఒక చిన్న పాత్రలో పట్టవచ్చు.

ఆయన నవ్వు నా భయాన్ని పోగొట్టింది. సూర్యుడు ఎన్నడూ తన తాళపుచెవులు పోగొట్టుకోడు. వాటిని ఒక త్రాడుకో, తీగెకో గుచ్చి మెడలో కట్టుకుంటాడు. లేదా మణికట్టుకు చుట్టుకుంటాడు. అవును. ఇది అక్షరాల నిజం. లేకపోతే అంతా అస్తవ్యస్తం అవుతుంది.

"తాతయ్యా! హంసలు ఎక్కడికి పోయాయి.?"—

"స్వచ్ఛ ధవళ మేఘాలలోకి, ప్రశాంత గంభీర సరోవరాలలోకి వెళ్ళిపోయాయి నాయనా."— అని సమాధానం చెప్పాడు తాతయ్య, గంభీరంగా. ఇప్పుడాయన నవ్వడంలేదు. ఉద్విగ్నత, ప్రకోపం ఇప్పుడాయనలో లేవు. ఒకసారి ఇంటివైపు చూచి తల ఊపాడు తాను తయారు చేస్తున్న కొయ్య చక్రం చేతపట్టుకుని, ఆరుబయలున ఉన్న 'వర్క్-షాప్'లోకి మళ్ళీ వెళ్ళిపోయాడు,

"క్వాక్, క్వాక్, క్వాక్!" మా ముసలిబాతు మళ్ళీ అరిచింది, ఆమోదసూచకంగా.

నేను అలాగే ఇంటిముందు ఖాళీజాగాలో నిశ్చలంగా నిలుచుండి పోయాను, తాతయ్యచెప్పిన విషయాలు నామనస్సులో మెదులుతున్నాయి. సింధూరవృక్షాలతో నిండిన అడవి నాకనులముందు ప్రత్యక్షమైంది.అవతల ఎక్కడో దూరానగల సరోవర తీరాలు — వాటిపైన మిలమిల మెరిసే నీలిమబ్బులు, అన్నీ కనులముందు పొడగట్టాయి.

హంసలు ఎక్కడనుంచి వస్తాయో, ఆ దూరపు భూములకు నే

నెన్నడూ వెళ్ళలేదు. కానీ అక్కడికి వెళ్ళే మార్గాన్ని గురించి ఊహించు కున్నకొలదీ నాలో ఉత్సాహం, ఉబలాటం పుట్టుకుని రాసాగాయి. ఎందుకో ఉవ్విళ్ళూరుతున్నాను.

ఇలా అమాంతంగా వెళ్ళి అడవిలో కూచుంటే ఎంతబాగుండును! ఎన్నడూ ఎరుగని సరోవర తీరాల్లో, వెండి కరిగిపోసినట్లుండే సుందర మగు సైకతస్థలాలలో సిగా స్వాహంసలనుచూస్తుంటే ఎంతబాగుండును! సకల జగత్తుకూ పచ్చని, వెచ్చని వసంత శోభను రెక్కలపై మోసుకుని తెచ్చే హంసల పక్షపక్షేపధ్వనులు వింటూ, వాటి గాన మాధుర్యంలో తేలిపోతుంటే ఎంత హాయిగా ఉండును! కానీ నేను ఎవరివెంట వెళ్ళను? వెళ్ళడానికి నాకు బూట్లు ఎక్కడున్నాయి?

అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. నా పాదాలవంక చూచాను. వట్టికాళ్ళు. చలికి కొంకర్లుపోయి, ఎర్రగా కందిఉన్నాయి. ఒక్క నిట్టూర్పు విడిచాను. నా అవిధేయతకు ఎవరో ఒక దెబ్బవేస్తారన్న భయంతో చుట్టుపక్కలు చూచాను. చిన్నపిల్లలు బూట్లులేకుండా వట్టికాళ్ళతో బయట తిరిగితే కొడతారు. వాళ్ళను దేశదిమ్మరులని, పోకిరివెధవలని అంటారు. ఏమిటీ కొత్త ఆచారం? పెద్దవాళ్ళుకూడా ఒక జతబూట్లు కొనుక్కునే స్థితిలో లేనప్పుడు ఒక చిన్న కుర్రవాడు వట్టికాళ్ళతో బయటికి వెడితే కొంప మునిగేదేమిటి?

అర్థంలేని ఈ చిన్నకారణంవల్లనే నన్ను శిక్షించడం జరిగింది.

నేను కిటికీదగ్గర నిలుచున్నాను అవతల పిల్లలు హాయిగా ఆడుకుంటూ ఉంటే చూస్తున్నాను. ఇక అక్కడ నిలుచోలేక పోయాను. షెడ్డులోకి పరుగెత్తాను: అక్కడ తిరగలిక్రింద ఉన్న నీళ్ళతొట్టె ఇవతలికి లాగి దానికొక తాడు కట్టాను, వట్టి కాళ్ళతోనే బయటికి పరుగెత్తి మంచుమీద ఆడుకుంటున్న పిల్లతో చేరిపోయాను.

ఇలాంటి సాధనంతో నేను మంచుమీద ఆడుకోడానికి వెళ్ళడం చూచి తక్కిన పిల్లలెవరూ ఆశ్చర్యపోలేదు. అవును దేనికీ ఆశ్చర్యం? మంచుమీద జారడానికై పిల్లలు ఉపయోగించే సాధనాలు రకరకాలు! అందుకుగాను తయారుచేసుకున్న బూట్లుకాక, తగరపురేకులు, ఇనప రేకులు, గుర్రపు లాడాలు - ఒకటేమిటి? మిరోలా మామకొడుకు ఇవాన్ అయితే, నాలుగు కాళ్ళబల్ల ఒకటి తల్లక్రిందులుగా వేసి దాని సహాయంతో మంచుమీద జారుతుంటాడు! కావలసిందల్లా మంచుమీద జారడం - దేనితో జారితేనేం? — క్రిందపడ్డా ఏడవకుండా ఉండాలి. అందరితోపాటు నీవూ నవ్వుతూ, పకపకలాడుతూ ఉండాలి. అంతే!

ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఎవరో నా చొక్కా కాలరు పట్టుకుని లాగారు. తిరిగి చూచాను. ఇంకెవరు? — మా అమ్మ! భయంతో, క్రోధంతో ఆమె ముఖం వివర్ణమై ఉంది.

ఆ తరవాత ఏం జరిగిందో నేను చెప్పనక్కరలేదు. తప్పక మీరు ఊహించుకుంటారు: తుంటరివాడు, పోకిరి, తెలివితక్కువ దద్దమ్మ, ఆకతాయి, బుద్ధిలేని మొద్దు, దుష్టుడు, ఫుండాకోరు, రౌడీవెధవ, గాడిద— ఇలా రకరకాల పేర్లుపెట్టి తిట్లు, అయితే ఇలా తిట్టడం ఏమాత్రం న్యాయం కాదని అనుకుంటాను నేను మనస్సులో. కానీ "ఇలా తిట్టవద్దు. నేనొప్పుకోను." అని చెప్పేధైర్యం లేదునాకు. అంతే మరొక దెబ్బ పడుతుంది నావంటిమీద. అమ్మ తన శాలువతో నా మెడకుకట్ట గట్టిగా ముళ్ళువేసింది. ఎత్తుకునిపోయింది. వేడివేడి టీ ఇచ్చింది.

తెల్లవారింది. ఇక గండం గడచినట్టే. ఆరాత్రి నేను ఒక్కసారి కూడా దగ్గలేదు. ఈ సందు చూచుకుని తాతయ్య అన్నారు "వీడు సామాన్యుడు కాడు, పిడుగు!" అని. "అవును. వీడు వట్టి మూర్ఖుడు"

అన్నది అమ్మ. తాతయ్య, నేను ఒకరివంక ఒకరం చూచుకున్నాం. అమ్మ కొడతానని వేళ్ళతో బెదిరించింది. అవ్వ నన్ను చర్చికి తీసుక పోవడానికి నిశ్చయించుకున్నది. చర్చిలో నేను పశ్చాత్తాప పడాలట. బుద్ధి, జ్ఞానం తెచ్చుకోవాలట. నాకు బొత్తిగా బుద్ధిజ్ఞానం లేదని పదే పదే అందరూ అంటున్నమాటే. అయితే వాస్తవానికి నే నెన్నడూ చికాకు పడలేదు. నాకు బుద్ధి, జ్ఞానం లేవంటున్నారే అని దిగులు పడనూలేదు. కారణం ఏమిటంటారా ? — పెద్దవాళ్ళలోనే — అనేకమందికి బుద్ధి, జ్ఞానం లేవని చెప్పుకుంటూ ఉంటే నేను విన్నా. వారుకూడా మూఢులేనట, మందబుద్ధులేనట. వాళ్ళకు అసలు తలకాయలేదట. వాళ్ళ బుర్రలో గులకరాళ్ళు, బంకమన్ను అట!

ఆ ఉదయం నాకెంతో హాయిగాఉంది. మా పొరుగింట్లోవాళ్ళ నడిగి, ఒక గంటలో తిరిగి ఇచ్చివేస్తామనిచెప్పి బూట్లు తెచ్చింది అమ్మ. వాటికి కొండరావిచెట్టు బంకపూసి మెరుగుపెట్టింది, చర్చికి వెళ్ళినప్పుడు అక్కడ నేను ఏ ఏ పనులు చెయ్యకూడదో అమ్మ పూసగుచ్చినట్లు చెప్పింది. చర్చిలో అటూ ఇటూ తిరగకూడదు. అక్కడేదీ వాసన చూడకూడదు, తల అష్టవంకర్లు తిప్పకూడదు, నోరు తెరుచుకుని అలాగే చూస్తూ ఉండకూడదు, జనంలోకి నెట్టుకుంటూ పోకూడదు. నవ్వకూడదు, చీదకూడదు. దైవపీఠం మీదికి ఎక్కకూడదు, 'క్రాస్' చేసుకోడం మరిచిపోకూడదు.

చెయ్యకూడని పనులేవో తెలుసుకున్న తరవాత అవ్వతోపాటు వెళ్ళాను. ఇంకేం ? వీధిలో పరుగెత్తడమే నాపని. నేను ముందు పోతున్నాను. అవ్వ వెనకబడింది. పోయినంతదూరం నన్ను పట్టుకో వాలని ఆమె విశ్వప్రయత్నం చేసింది పాపం, కానీ నేను చిక్కితేకదూ? ఎంతచెడ్డా కుర్రవాడన్న తరవాత కుర్రవాడే! ఎంతో వయస్సు వచ్చిన పెద్దవాళ్ళు ఆ సంగతి ఎందుకు తెలుసుకోరోమరి ?

చర్చిలో ప్రవేశించేముందు అవ్వ సాగిలపడి మ్రొక్కింది. నేనూ అలాగే చేశాను. గుడిలో గుప్పున వాసనవస్తున్నది, గొర్రెచర్మం, కాల్చిన మైనం వాసన. గుడిలో ఎటుచూచినా జనం దైవప్రార్థనలు చేస్తున్నారు. చర్చి అధికారి వారిమధ్య తిరుగుతున్నాడు, అయన్ను చూస్తే పిల్లలందరికీ హడలు. ఆ సమయంలో ఆయన చేస్తున్న పనులు రెండేరెండు. ఒకటి భక్తులిచ్చే దక్షిణలు పుచ్చుకోడం, రెండవది కొవ్వొత్తులు ఆర్పడం. ఆయనకు పెదవులు లావు. నోటితో ఊది కొవ్వొత్తులు ఆర్పుతున్నాడు.

సగం కాలిన కొవ్వొత్తి ముక్కలు అమ్ముకుని ఆయన బోలెడంత డబ్బు పోగుచేశాడని జనం చెప్పుకుంటారు. కానీ ఆయన ఒప్పుకోడు. ఈ పుకార్లువిని భగ్గున మండిపడతాడు. "దుష్టకాలం దాపురించింది. నేను కటికి దరిద్రుడనై పోవడానికి అట్టేకాలం పట్టదు." అని అంటాడు. కానీ అలాంటి ప్రమాదం సంభవించే సూచనలేమీలేవు. ఆయన పెరటి నిండా పెంపుడు పక్షులున్నాయి. ఈవేళ, ఆవేళ అనకుండా ఎల్లప్పుడూ వాటి ధ్వనులు రకరకాలుగా వినవస్తుంటాయి. ఆయన ఇంట్లో మాత్రం 'చెడుకాలం' దాపురించినదనడానికి చిహ్నాలు కనుపిస్తాయి. ఇంట్లో గోడలకు నలభై రూబుళ్ళ నోట్లు, ఇరవై రూబుళ్ళ నోట్లు అంటించాడు ! (కెరెన్స్కీ ప్రధాన మంత్రి అయినప్పుడు, 1917 లో రాష్ట్రప్రభుత్వం జారీచేసిన డబ్బు ఇది)

ఒక విగ్రహం ముందు కొవ్వొత్తి వెలిగించింది అవ్వ. ఇంట్లో తయారుచేసిన కొవ్వొత్తి అది. అది వెలిగించి అవ్వ కొంతసేపు నిశ్చలంగా ప్రార్థనచేసింది. తరవాత నాకు జీసస్ క్రైస్ట్ చిత్రం చూపించింది. ఏసుక్రీస్తు తిరిగి స్వస్వరూపంతో భూలోకంలో ప్రత్యక్షమయ్యే చిత్రం

అది. చర్చిలో తూర్పుకొనన అర్ధవలయాకారంలో దారుమయకుడ్యంపై చిత్రించిన చిత్రం అది. తేమగాఉన్న దారువు నుండి నీరు పైకి చిమ్ముతున్నది. 'ప్రపంచానికి తీర్పుచెప్పేరోజును' గురించి నాటకీయంగా చిత్రించిన ఆ చిత్రంలో బొమ్మలన్నీ - పాపాత్ములూ, పుణ్యాత్ములూ అందరూకూడా శోకిస్తున్నట్టు కనుపిస్తున్నారు.

చిత్రంలో కనుపించేదంతా చక్కగా ఊహించుకోవచ్చు. రక్షకుడైన క్రైస్ట్ ఒక ఇంద్రధనస్సుపై ఆసీనుడై ఉన్నాడు. ఆయనకు దిగువగా ఒక హస్తం ఒక త్రాసుపట్టుకొని ఉన్నది. న్యాయానికీ, ధర్మానికి చిహ్నమైన త్రాసు అది. సత్యం, అసత్యం-రెంటినీ రెండు తక్కెడలలో పెట్టి తూకం వేస్తున్నది. ప్రవక్తలు, జీసస్ తల్లి మేరీకన్య, జాన్-మొదలయినవారు స్వచ్ఛ ధవళ మేఘాలపై ఏసుప్రభువుకు ఇరువైపులా నిలబడి ఉన్నారు. బొమ్మలో ఇంకా క్రిందిభాగాన ఎడమవైపు స్వర్గలోకం కనుపిస్తున్నది. దాని చుట్టూ రాతిగోడ, దేహాలు శుష్కించిపోయిన మహాత్ములు కొందరికి, సెయింట్ పీటర్ స్వర్గద్వారాలకు మార్గం చూపుతున్నాడు. శిలాకుడ్యానికి లోపలివైపు, పొడుగాటి గడ్డాలుగల ముగ్గురు ప్రాచీన పురుషులు, ఆనందంలో మునిగిఉన్న కొందరు 'కోనక్కులు' నిలుచున్నారు. వారందరూ తళతళలాడే ఎర్రటి ట్రౌజర్లు వేసుకుని ఆయుధాలు ధరించి ఉన్నారు. చిత్రంలో కుడివైపున నరకం, పాపులు, అధోగతికి పోయినవారు అంతా అక్కడ ఉన్నారు. నరకలోకంలోని భయానక దృశ్యాలన్నీ అక్కడ చిత్రించి ఉన్నాయి, దయ్యాలు, రాక్షసులు, భయంకరమైన జంతువులు, పాపాత్ములు - కనుపిస్తున్నారు. పాపులు తాముచేసిన పాపాలకుగాను రకరకాల నరకబాధలు శిక్షలు అనుభవిస్తున్నారు. ఒక త్రాగుబోతు ఒక చిన్న సీసా పట్టుకుని రాక్షసి నోట్లో ప్రవేశిస్తున్నాడు. తనవాళ్ళందరినోళ్ళు కొట్టి

వారి రక్తం త్రాగుతూ జీవించిన పెద్దమనిషి ఒకడు: దొంగ, పచ్చిమోస గాడు అయిన ఒక మిల్లు యజమాని మెడకొక తిరగలి కట్టుకున్నాడు. అవినీతికి, అధర్మానికి పాల్పడిన న్యాయమూర్తి ఒకడు అన్యాయార్జిత విత్తం అంతా మూట కట్టుకుని ఉన్నాడు: పవిత్రంగా జీవించడానికి మారుగా జీవిత వ్యామోహాలకు వశుడైన సన్న్యాసి ఒకడు, చక్కగా ముస్తాబుచేసుకున్న ఒక యువతి, ఆ బొమ్మ క్రింద 'దురహంకారం' అని వ్రాసిఉన్నది. ఆవిడవెనకాల ఇంకా అనేక బొమ్మలు-పనీ-పాటూ లేక సోమరిపోతులై, వ్యర్థప్రసంగాలుచేస్తూ, ఒకరిపై ఒకరికి చాడీలు చెపుతూ, తగవులు పెడుతూ, నీచంగా ఈ లోకంలో నానారకాల పాపపు జీవితం గడిపేవారి బొమ్మలన్నీ చిత్రించి ఉన్నాయి.

ఈ చిత్రం చూస్తే మనస్సు భయ విచలితమవుతుంది. కానీ పూనికతో చూచాను నేను.........

"మిఖైలో! ఇంకా నీవు లోపలికి పోనేలేదా?"—— వర్కు-షాపులోనుంచి తాతయ్య కేకపెట్టాడు. "హంసల కోసం మనిద్దరం తిట్లు తినకుండా చూడు!" అన్నాడు. ఇలా అని ఆకాశం వంక చూచాడు. మేఘాలు సూర్యుడితో పోట్లాడుతున్నాయి!

పట్టికాళ్ళతోఉన్న నన్ను చూస్తే తాతయ్యకు జాలి, నేను బరువుగా నిశ్వసించాను. గడప ప్రక్క-ఉన్న తిరగలిపై ఎక్కి, పాదాలు దానికి రుద్దడం మొదలుపెట్టాను. ఆ సమీపంలోనే ఒకరంధ్రం ఉన్నది. మా పెంపుడు బాతు వేసవికాలంలో అందులోనే ఉంటుంది; వసంతాగమనాన్ని గురించి హంసలు దానితోకూడా ఏదో చెప్పినట్టున్నాయి! మా బాతుకు ఒంటిరెక్క. అయితేనేం? దాని తెలివికి, చురుకుదనానికి ఆ బజారు వాళ్ళంతా మెచ్చుకుంటారు. వేసవిలో బాతులన్నీ గ్రుడ్లుపెట్టి, వాటిని

పొదిగి పిల్లలు చేస్తుంటాయి. ఆ సమయంలో మా బాతు వాటినిగురించి ఎంతో జాగ్రత్త తీసుకుంటుంది. తన పిల్లలు కాకపోయినప్పటికీ నిరంతరం వాటిని వెయ్యికళ్ళతో కనిపెట్టుతూ ఉంటుంది. మాలకాకిలాంటిది అకస్మాత్తుగా క్రిందికివాలి పిల్లలను తన్నుకపోవడానికి ప్రయత్నిస్తే, మా బాతు మెడ మూరెడు పొడుగుచాచి తన ఒంటి రెక్కతోనే పిల్లలను కప్పిపెట్టి వాటి ప్రాణాలు కాపాడుతుంది. అది ఉండగా పిల్లలనుతన్నుకపోవడం ఏ పక్షితరమూ కాదు.

జనం మధ్య తిరిగేటప్పుడుకూడా మా బాతు గొప్ప తెలివితేటలు, విచక్షణాజ్ఞానం ప్రదర్శిస్తుంది. మంచివాళ్ళు, మర్యాదస్తులు ఎవరైనా మా ఇంటికివస్తే 'రండి! దయచేయండి!' అన్నట్టుగా 'క్వాక్, క్వాక్!' అని అరుస్తూ వారిని ఆహ్వానిస్తుంది. పోలీసులా వెంటఉండి, లోపలి వాకిలి వరకూ వారిని తీసుకుని వస్తుంది. అయితే వేరేరకం మనుష్యులున్నారు. వారిపట్ల తగినట్లే ప్రవర్తిస్తుంది మా బాతు. మిత్రోషానెంకో ఉన్నాడు. డబ్బుకూ ప్రాణానికీలంకె. ముఖం ముటముటలాడిస్తూ భయంకరంగా కనుపిస్తాడు, ఇక యుక్రిమ్ బాబెంకో ఉన్నాడు. జిత్తులమారినక్క. పచ్చి మోసగాడు; వీరిద్దరిలో ఎవరైనా మా వీధిలో కనుపిస్తేచాలు, మా బాతు కోపావేశంతో ఉడికిపోతుంది. దాని ఈకలన్నీ నిక్కపొడుచుకుంటాయి. నేలమీద తపతప కొడుతుంది. "బేక్, బేక్!" అని బిగ్గరగా అరుస్తుంది.

"ఇక నీవు ఊరుకోవే రాకాసిదానా!" అని అంటాడు మిత్రోషానెంకో, ఇది కంటపడగానే,

ఇక బాబెంకో ఉండనేఉన్నాడు గుండ్రటి ముఖమూ అతను మా బాతును చూడగానే అతని ముఖం రెండింతలవుతుంది. "ఎక్కడ పట్టుకొచ్చారయ్యా దీన్ని?—" అని అంటాడు.

"నీలాంటివాళ్ళకోసమే!—" అని మా తాతయ్య, అతనికి ముఖాన కొట్టినట్టు సమాధానం చెపుతాడు. అయినా అతనికి కోపంరాదు. "అవునులే. లోకంలో ఎవరి స్వభావం వారిది, దేనిస్వభావం దానిది." అని ఊరుకుంటాడు.

బాబెంకో తెలివి అంతా డబ్బు పోగుచేయడంలోనే - డబ్బు అనేది ఎక్కడున్నాసరే - పాతాళంలో దాచిపెట్టినాసరే - అతను ఇట్టే పసికట్టుతాడు. బాబెంకో ఎంత అల్పబుద్ధి కలవాడో, జిత్తులమారివాడో తరవాత తరవాత నాకు తేలిసింది. "స్నేహితులు వందమంది ఉన్నారు. శత్రువు ఒక్కడుండేచాలు!" అని తాతయ్య చెప్పిన మాట నాకు బాగా నచ్చింది.

నేను అలాగే వాకిట్లో వణుకుతూ నిలుచున్నాను. ఎవరికంటా పడకుండా చల్లగా జారుకోడం ఎలాగ అని నా ఆలోచన. ఈ సమయంలో పొరుగింటివాళ్ళెవరైనా మమ్మల్ని చూడడానికి వస్తే బాగుండును! లేదా అమ్మ ఏదైనా పాటపాడడం మొదలుపెడితే. పాడేటప్పుడు ఆమె కళ్ళల్లో ఏవో విషాదచ్ఛాయలు కమ్ముకుంటాయి. ఎవరూ చూడకుండా నేను పొయ్యి అరుగు ఎక్కి అక్కడ దాక్కుంటాను, పాదాలు పూర్తిగా తడి ఆరిపోయేవరకూ మాట్లాడకుండా అక్కడే ఉండవచ్చు. కానీ మా ఇంటికి ఎవరూ వచ్చేటట్టు కనుపించడంలేదు, లోపలనుంచి అమ్మ పాటకూడా వినపడడంలేదు. ఇప్పటికి నా పాదాలు చలికి, మంచుకు బాగా గడ్డకట్టుకుని పోయాయి, నాకు తెలుసు, కానీ ఏం చెయ్యాలి? అనుభవించక తప్పదు. అమ్మ నన్నుచూచి ఏమంటుందో ఊహించుకున్నాను. ఆమె ఏమి అన్నా ఎదురు చెప్పకూడదు. మాట్లాడకూడదు. మౌనంగా తలవాల్చుకుని నిలుచోవాలి, తప్పుచేశానని ఒప్పుకుంటున్నట్టుగా తరవాత ఉండి ఉండి అమ్మను ఏదో ప్రశ్న అడగాలి. ఆవిధంగా ఆమె

మనస్సును మరో విషయం మీదికి మళ్ళించాలి. ఈ సూత్రం అప్పు డప్పుడు బాగా పనిచేస్తుంది.

వీధిలో ఎవరిదో అడుగుల చప్పుడు వినపడింది. నాకు ప్రాణం లేచివచ్చినట్టయింది. ఎవరొస్తున్నారో తెలుసుకుందామని తొంగిచూచాను.

ఆ వచ్చేది సెబాస్టియన్ మామయ్య. పేదరైతుల సంఘానికి అధ్యక్షుడాయన. నాకు మళ్ళీ ఉత్సాహం పొంగింది.

"ఏం రా, అబ్బాయ్!—" నన్ను చూడగానే పలకరించాడాయన, ఆప్యాయతతో. గుఱ్ఱపురౌతు ధరించే కోటు ధరించాడు. మొలలో రివాల్వరు ఉంది.

"ఏమిటిది? ఒక ప్రక్కన మంచు కురుస్తూ వణుకుపుడుతుంటే, వాకిట్లో ఏంచేస్తున్నట్టు నీవు?—" అని మళ్ళీ అడిగాడు ఆయన.

"హి, హి,!" అంటూ ఏదో నసికాను.

"ఏమిటీ తమాషా?—"అంటూ ఆయన తలడూపాడు ఉంగరాలు తిరిగిన ఎఱ్ఱని జుట్టు కనుబొమలమీద పడింది. దాన్ని మళ్ళీ బొచ్చు టోపీక్రిందికి నెట్టి సవరించుకున్నాడు. "వట్టికాళ్ళతో ఇలా మంచులో నిలుచున్నావంటే ఏమిటి అర్థం?—" అన్నాడు మళ్ళీ.

"ఏం చెయ్యను - నాకు బూట్లులేవు—" అన్నాను.

"లేకపోతే పొయ్యి అరుగుమీదికి ఎక్కికూచో," అన్నాడాయన.

ఆయనతో మాట్లాడుతూ నేను తలుపుపట్టుకుని ఊగుతున్నాను,

"కాళ్ళు ఆ విధంగా నీలివర్ణంలోకి మారాయే, పైగా నవ్వు తున్నావా?—"

"ఏం ? పిట్టలు పట్టికాళ్ళతోనే తిరగడంలేదూ ?—"

ఆయన ఏమనుకున్నాడో ఏమో ! కళ్ళుమాత్రం చిన్నవిచేసి చూచాడు: తనుకూడా నవ్వడం మొదలుపెట్టాడు ఆయనకు బూట్లున్నాయి. నేనేమో బూట్లు సంపాదించుకోవాలని కలలు కంటున్నాను. అయినప్పటికీ మే మిరువురం అల్లా నవ్వుకుంటూ నిలుచోడం నాకెంతో హాయిగా ఉంది.

"సెబాస్టియన్ మామయ్యా ! నీ కోటులోపల ఉన్నదేమిటి ? రివాల్వరా ?"

"నీకెలా తెలిసింది ?—"

"జోస్యం చెప్పే పక్షులుచెప్పాయిలే !"

"మరి నీకు బూట్లు ఎక్కడ దొరకుతాయోకూడా చెబితే బాగుండేదే !"

"ఎవరైనా బందిపోటు దొంగదగ్గర నుంచి లాక్కున్నావా నీవది ?—"

"అవును."

"దాంతో బాగా కాల్చవచ్చునా ?—"

"ఆఁ !"

"ఒక్కమాటు నేను దాంతో కాల్చిచూస్తే బాగుండును !—" ఇలా అని భయంతో కళ్ళుమూసుకున్నాను.

"ఇదేం ఆటవస్తువు కాదబ్బాయ్ !" అన్నాడాయన. "నీవూ నేనూ కూడా ఇలాంటి వస్తువులు ఎన్నడూ ఉపయోగించకుండా ఉండాలనే నా కోరిక" అన్నాడు.

సెబాస్టియన్ మామయ్య దయార్ద్ర హృదయుడు. సత్యసంధుడు కూడా. అయినా ఈ మాటలు నేనంతగా పట్టించుకోలేదు. తుపాకి కాని, కత్తికాని లేదా పిస్తోలుకాని, లేకపోతే ఎర్రకోసక్‌ల మాదిరిగా బల్లెం కాని చేతపట్టుకున్న మనిషినిచూస్తే నిజంగా ఎంత బాగుంటుంది! ఒకరు కాలుస్తారు. ఇంకొకరు నరుకుతారు. మరొకరు ఒక్క వ్రేటుతో ఏడు గురిని నేలకూలుస్తారు: ఒహో! అద్భుతం! కానీ పెద్దవాళ్ళు అసలు సంగతంతా చిన్న పిల్లలకు చెప్పరు - అవును. అది సహజమే!

సెబాస్టియన్ మామయ్య గేటుకు ఆనుకుని నిలుచున్నాడు. నేను ఆయనదగ్గరికి వెళ్ళాను. కళ్లు చిన్నవిచేసి చూచాడు. వంగి నన్ను పట్టుకోడానికి ప్రయత్నించాడు.కానీ నేను చిక్కకుండా తప్పించుకున్నాను. మళ్లీ దగ్గరికి వెళ్ళాను. మళ్లీ ఆయన నన్ను పట్టుకోబోయాడు. ఈసారి కూడా నేను తప్పించుకున్నాను. ఇలా కాసేపు తమాషాగా ఆడుకున్నాం: తరవాత ఆయన తన జేబులోనుంచి ఒక ఉత్తరం తీశాడు; కాగితం నాలుగు ప్రక్కలా మడతపెట్టి ఉంది.

"ఇదిగో! మీ నాన్నదగ్గరనుంచి వచ్చింది. తీసుకపోయి అమ్మకు ఇవ్వు" అన్నాడు.

"ఓ!—మరి నీవు ఇంట్లోకిరావూ?"—

ఆయన లోపలికివస్తే ఎంతో హాయిగా ఉంటుందనుకున్నాను. అమ్మ, వాళ్ళందరూ ముచ్చట్లు ప్రారంభిస్తారు. నేను సెబాస్టియన్ మామయ్యను పట్టుకుని నిలుచుంటాను. ఆయన, ఉత్తరం చదువుతూ ఉంటాడు. నేను ఆయన రివాల్వరును తనివితీర చూస్తూ ఆనందిస్తాను.

"రా, మామయ్య! లోపలికిరా!"

"పిల్లేదు నాయనా! ఇప్పుడు వ్యవధిలేదు. నాకోసం అవతల జనం కనిపెట్టుకుని ఉన్నారు."

నా ఆశలన్నీ అడుగంటాయి.

"ఇదేం బాగాలేదు" అంటూ ఉత్తరం చేతపట్టుకుని ఇంట్లోకి పరుగెత్తాను. అమ్మ నా దగ్గర ఉత్తరం చూస్తుందేతప్ప, నా పాదాలు చూడదనే ఉత్సాహంతో వెళ్ళాను.

"అమ్మా, అమ్మా! నాన్నదగ్గర నుంచి ఉత్తరం!"

"ఓహ్!—" అంటూ అమ్మ, కదురుతో దారం వడుకుతున్న దల్లా అది క్రిందపడేసింది.

"నిజంగానట్రా, నాన్నదగ్గరనుంచా?—" అని అడిగింది.

"నిజంగానమ్మా! నాన్నదగ్గరనుంచే!—" అన్నాను నేను, సగర్వంగా. ఇక ఇప్పుడు నా పట్టికాళ్ళు ఎవరూ చూడరన్న ధీమా ఏర్పడింది.

అమ్మ ఒక్కక్షణం ఆగి ఉత్తరం తీసుకున్నది. దాన్ని నాలుగు వైపులా పరిశీలించి, దాన్ని వాసనచూచిందికూడా.

"ఇదేమిట్రా, పొగాకువాసన వస్తున్నది?........నీవు చదవ గలవా?—"

"అచ్చు అక్షరాలైతే చదువుతానమ్మా—"

"ఉత్తరాలన్నీ అచ్చులో ఉంటే ఎంత బాగుండును.. ...చరే. దబ్బునపోయి మిహోలా మామను పిలుచుకరావా! వచ్చి కాస్త ఉత్తరం చదివిపెట్టమను."

"ఎలా వెళ్ళనే అమ్మా !—" అన్నాను నేను. బూట్లులేని నా పాదాలవంక చూస్తూ, "బజార్లో అంతా బురదగుంటలమ్మా." అన్నాను. ఏమీ ఎరగనివాడిలా.

"సరేరా ! నా బూట్లు వేసుకునిపో, ఆలస్యం చెయ్యకు—" అంటూ అమ్మ పైన ఉన్న పాతబూట్లు బయటికితీసింది.

బూట్లు తొడుక్కునే అవకాశం చిక్కినందుకు పొంగిపోయాను, అవి నా కాళ్ళకు పెద్దవి కావడంవల్ల గుడ్డపీలికలు చుట్టుకుని వాటిమీద అవి తొడుక్కున్నాను,

"ఇప్పుడు నేనెలా ఉన్నానమ్మా?" అని అడిగాను. కానీ అమ్మకు ఆ విషయం పట్టలేదు.

"వెళ్ళు—ఊ, త్వరగా !" అన్నది ముక్తసరిగా,

"ఓ ! తూనీగలా ఎగిరిపోనూ !—"

ఇంట్లోనుంచి వెడుతూ వెడుతూ సంతోషం పట్టలేక తాతయ్యను చూచి ఏదో కేకపెట్టాను పెద్ద వీరుడిలా, కానీ తాతయ్య అదేమీ పట్టించుకోలేదు. తన పనిలో నిమగ్నుడై ఉన్నాడు, వీధిలోకి పరుగెత్తాను, బురదంతా చింది బూట్లమీద పడుతున్నది. కోసక్‌లు పాడేపాట పాడుతూ పరుగు తీశాను:

"వీథీ, ఓ వీథీ ! చిరు చిన్నవీథివి నీవే !

పచ్చిక, ఓ పచ్చిక ! నిను పచ్చగచేసిందెవరే !"

మా వీధి నిజంగా చిన్నవీథి. వంకరటింకరగా ఉంటుంది. అంతా గుంటలు, మిట్టలు. వేసవిలో సాయంత్రం వేళ చూస్తే అడొక పిల్ల

కాలువలాగా లేదా పొడుగాటి వంతెనలాగా కనుపిస్తుంది. చుట్టూ కంచెలు వేసిన చెర్రీ పండ్లతోటలు, తోటలమధ్య చిన్నచిన్న కుటీరాలు, పూరిండ్లు కనుపిస్తుంటాయి. వీధిలో నివసించే జనమంతా రైతులే. వారు రకరకాల పనులు చేసి జీవిస్తారు. వండ్రంగులు, చెప్పులు కుట్టేవారు, చేతిపనివారు, పీపాలు చేసేవారు, పిండిమరలవారు—అంతా ఈ వీధిలో ఉన్నారు.

చేతిపనిచేసే వారందరిలోకి మాతాతయ్య డెమియాన్ సుప్రసిద్ధుడు. ఆ చుట్టుప్రక్కల ఆయనపేరు తెలియనివారు లేరు. ఆయన చేతితో తయారుచెయ్యని వస్తువులేదు. బాగుచెయ్యని పనిముట్టు లేదు.

నాగలి, నలకపార, దోకుడుపార, కాడిమాను, కొడవలి-ఇలాంటి వ్యవసాయపు పనిముట్లు ఏవైనాసరే తాతయ్య కళ్ళుమూసుకుని ఇట్టే తయారుచేస్తాడు. పనిముట్టు ఏది చెడిపోయినా దాన్ని క్షణంలో బాగు చేస్తాడు. వాయుశక్తితో పనిచేసే మిల్లుకావాలంటే-దాన్ని ఇట్టే నిర్మిస్తాడు. బండి, బండిపట్టాలు, బండి చక్రాలు—ఓహ్! ఒకటేమిటి? ఆయన తయారు చెయ్యలేని వస్తువు అంటూ లేదు. కొయ్యతోగానీ, లోహంతో గానీ. అయితే పనిచేస్తున్నంతసేపూ ఆయనకు మద్యం ఉండాలి. నిషా ఉండాలి. అంతే!

కొయ్య, లోహం-ఇవి రెండూకూడా ఆయన చెప్పినట్టు వింటాయి. ఆయన చేతుల్లో మెలిదిరిగిపోతాయి. బొమ్మల్లా ఆడతాయి. కొయ్య మీద పుణ్యాత్ముల, పాపాత్ముల చిత్రాలు చెక్కగలడాయన. మా పోలిష్ ప్రభువుకోసమని ఆయన ఒకసారి, క్రైస్ట్ శిష్యులైన పీటర్, పాల్ చిత్రాలు కొయ్యమీద చెక్కి ఇచ్చాడని మా పక్క ఇంటివాళ్ళు ఇప్పటికీ ఎంతో గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు.

పాటపాడుతూ మికోలా మామ ఇంటికి పరుగుతీశాను. ఇంటి ముందున్న ఖాళీజాగాలో గొఱ్ఱెల దొడ్డిదగ్గర కట్టెలు పగలకొడుతున్నాడు మికోలా మామ. మనిషి అంత పొడుగూకాదు, మరీ పొట్టీకాదు. ఎఱ్ఱని జుట్టు. చప్పిడి ముక్కు. పెద్దపెద్ద బుఱ్ఱమీసాలు....మనిషి ఎప్పుడూ హాస్యం ఆడుతుంటాడు. పేదవాడైనప్పటికీ ఎప్పుడూ ఉల్లాసంగా ఉంటాడు. తానెప్పుడూ, ఏ సందర్భంలోనూ క్రుంగిపోడు. అంతేకాదు. ఇతరులుకూడా హాయిగా, ఉల్లాసంగా ఉండేటట్టు చేస్తాడు.

ధాన్యం అధికంగా పండించడానికి ఎంతో కృషిచేస్తాడు. అయితే ఒక్కొక్కప్పుడు ఆయన వేసుకున్న అంచెనాలు తల్లక్రిందులవుతాయి. పంట దిగుబడి తగ్గిపోతుంది. అయినప్పటికీ ఆయన నిరుత్సాహపడడు, "కాలమాన పరిస్థితులు నన్ను మోసం చేశాయి. లేకపోతే నా అంచనా తప్పేదికాదు" అని అంటాడు.

లుకెర్యా అత్తయ్య దానికి ఒప్పుకోదు. భర్తతో వాదిస్తుంది.

"అవునే-నాకూ ఒక మంచి ఆవు ఉంటేనా,కాలం కలిసివస్తేనా;" అని భార్యకు సమాధానం చెపుతాడు మికోలా మామయ్య.

1933 లో కరువు వచ్చింది. ఊళ్ళో జనమంతా తిండిలేక మలమల మాడిపోయారు. హృదయ విదారకమైన ఆకలిచావులు. అలాంటి కష్టకాలంలోకూడా మికోలా మామ క్రుంగిపోలేదు. ఏమాత్రం విచారపడలేదు, కష్టాలు, కన్నీళ్ళు దిగమ్రింగి చిరునవ్వులే ఒలకపోశాడు,

"నాకూ, లుకెర్యాకూ తినడానికి రొట్టె లేకపోతే లేకపోవచ్చు. మాకు మాంసం కొదువలేదు. కావలసినన్ని జంతువులున్నాయి. అనేవా డాయన. ఆకలి బాధతో లోపలికి గుంజుకుని పోయిన ఆయన కళ్ళలో

ఏదో వెలుగు మిలమిలలాడేది. ఆయన మాటలు వింటే నాకు మాత్రం కళ్ళలో నీళ్ళుతిరిగేవి.

మికోలా మామకు 'మిణుగురు పిట్ట' ఈక ఒకటి దొరికిందని ఊళ్ళో జనం చెప్పుకుంటారు....

నేను ఇంట్లోకి వెళ్ళేసరికి మికోలా మామ పెద్ద పెద్ద కొండరావి మొద్దులు పగలగొడుతున్నాడు. గొడ్డలి పైకెత్తి "హుమ్! హుమ్!" అంటూ ఒక్కొక్క ప్రేటువేస్తూ ఉంటే, మొద్దులు నడిమికి సగం సగం పగులుతున్నాయి.

ఒక్క క్షణం అలా చూస్తూ నిలవబడి తరవాత నవ్వడం మొదలు పెట్టాను.

"ఎందుకోయ్ నవ్వుతున్నావు?—" అని అడిగాడు మికోలా మామ ఆశ్చర్యంతో.

"నీవు 'హుమ్!' అని అంటూ ఉంటే—"

"ఓ, అదా!" అన్నాడాయన ఓరగంట నావంక చూస్తూ, "అది నీకు తెలియదా ఏమిటి?—" అని అడిగాడు.

"తెలీదు" అన్నాను.

"అవుతే, నీవు పనికిరావు."

"అలాగా! ఎందుకనీ?—"

"ఎందుకంటావా?— 'హుమ్!' అని అననిదే మొద్దు పగలదు."

"నిజంగానా?—"

"నా మాట నమ్మకపోతే ఒకసారి నీవే ప్రయత్నించి చూడు!"

నేను గొడ్డలి అందుకున్నాను. పైకెత్తి ఒక్క ప్రేటు వేశాను. మొద్దు ఏగలలేదు.

"మరి నేను చెప్పలేదూ?—" అంటూ మికోలా మామ నవ్వ సాగాడు. ఆయన మీసమూ, చట్టిముక్కూకూడా అష్ట వంకర్లు తిరిగాయి. 'హామ్‌' అనకపోతే మొద్దుపగలదనుకో. కట్టెలు కొట్టేవాడికి ముఖ్యంగా కావలసింది ఇదే!—" అన్నాడు.

"నీకు 'మిణుగురు పిట్ట' ఈక దొరికిందట, నిజమేనా మామా?" అని అడిగాను నేను.

"ఓహో! సంగతంతా తెలుసుకోవాలని ఉందా ఏమిటి నీకు?—" మికోలా మామ నా వంక అదోలా చూచాడు. ఆ చూపులో ఏదో మర్మం దాగి ఉంది.

"ఆయనకు మిణుగురు పిట్ట' ఈకె దొరికినమాట నిజమే. సందేహం లేదు. అయితే ఆ విషయం చెప్పడం ఆయనకు ఇష్టం లేదు" అనుకున్నాను నాలో నేను. ఏదో గంధర్వలోకంలో, మాయా జగత్తులో అడుగుపెట్టినట్టు అనిపించిందినాకు మళ్ళీ.

నామీద ఆయనకు నమ్మకం పుట్టేటట్టు మెల్లగా, రహస్యంగా అడిగాను. "నిజంగా నీకు దొరికిందా మామా?—"

"అవును - దొరికింది"అని చెప్పాడాయన, ఒక వ్రేలుతో మీసం మెలివేశాడు. ఒక కంటితో ఓరగా వీధిలోకి చూచాడు. అప్పుడా చుట్టు ప్రక్కల పుట్టపురుగుకూడా లేదు. పిచ్చుకల గుంపు ఒకటి కనుపించింది. అంతే.

"దాంతో ఏం చేస్తావుమామా —?"

"రాత్రివేళ అంతా నిద్రపోయిన తరవాత, 'మిణుగురుపిట్ట' ఈక వెలుతురులో బూట్లు తయారు చేస్తాను."

"బూట్లా ?" అని అడిగాను నేను మళ్ళీ.

"వేరే దీపం లేనప్పుడు ఏం చెయ్యను మరి?—" అన్నాడాయన, పకపక నవ్వసాగాడు. ఆయన ముఖం ఎర్రబారింది. ఆయనతో కలిసి నేనూ నవ్వడం మొదలు పెట్టాను.

కొంచెం సేపయిన తరవాత ఇద్దరం అక్కడ నుంచి బయలుదేరాం. మా ఇంటికి వస్తూ త్రోవలో మికోలా మామ, తానొక గుఱ్ఱం కొన పోతున్నట్టు చెప్పాడు. మా ఊళ్ళోనేకాక ఆ చుట్టుప్రక్కల గుఱ్ఱాలన్నిటికీ పెద్దది, శ్రేష్ఠమైనది అగు గుఱ్ఱాన్ని తాను కొనదలిచినట్టు తెలియ జేశాడు.

అలాంటి గుఱ్ఱాన్ని కొనాలని మికోలా మామ ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాడు. కానీ ఏ కారణం వల్లనో ఇంతవరకూ కొనలేదు. తనకు కావలసిన జాతి గుఱ్ఱం ఎక్కడా దొరకలేదని చెప్పాడాయన. అయితే ఇరుగు పొరుగువాళ్ళు అలా అనరు. వాళ్ళు చెప్పేది కొంచెం భిన్నంగా ఉంటుంది. మికోలా మామ దగ్గర డబ్బులేదని, డబ్బు పోగైన నాడు ఆయన కోరిన జాతి గుఱ్ఱం దొరుకుతుందని వాళ్ళు చెపుతారు. ఏమైనప్పటికీ ఆయన మాత్రం పేదవాడులా కనుపించడు. గ్రామాధి కారులు ఆయన ఆస్తిపాస్తులన్నీ లెక్కవేసినప్పుడు కూడా తాను పేదవాణ్ణి కానని, మధ్యతరగతి రైతునని చెప్పాడాయన.

"ఏమిటి నీ 'మధ్యతరగతి' ?— అని సెబాస్టియన్ మామ నవ్వుతూ అడిగాడు. "భార్య, బిడ్డలేనా ?"—

"చూడు సెబాస్టియన్!—" అంటూ మికోలా మామ తన ఆస్తి పాస్తులన్నీ పది వ్రేళ్ళతో లెక్కపెట్టి చెప్పాడు. "ఒక పూరిగుడిసె, ఒక సామాన్లకొట్టు, ఒక ధాన్యపుకొట్టు, ఒక షెడ్డు, ఒక రోలు, రోకలి, బాతులు, కోడిపుంజు, గుంపెడు కోడిపెట్టలు, బోలెడు గ్రుడ్లు, ఇవన్నీ కాక చెప్పులు కుట్టే వ్యాపారం ఉంది నాకు."

"ఓహో! ఇదంతా నీ ఆస్తుల జాబితా అన్నమాట!—" అన్నాడు నవ్వుతూ సెబాస్టియన్ మామ. "ఎందుకూ, ధనికులైన రైతులలో లెక్కవెయ్యాలి నిన్ను" అన్నాడు....

మా ఇంటికి చేరుకున్నాం. మికోలా మామ తన జేబులో నుంచి ఒక కళ్ళజోడుతీసి పెట్టుకున్నాడు. ఉత్తరం చదివేటప్పుడు ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది.

మా నాన్నగారు క్షేమంగా ఉన్నట్టు తెలుసుకుని నేను ఎంతో సంతోషించాను. కానీ ఉత్తరంలో ప్రతి అక్షరంలోనూ చెప్పినమాటే చెప్పాడు మా నాన్న. అది వింటూ ఉంటే నాకు నవ్వువచ్చింది. "మా బంధువు గ్నాట్, డేనిలో కుమారుడు, మికేలా కుటుంబానికి చెందిన పెట్రో కుమార్తె అగు ఒల్యానా భర్త-అతనికి నా నమస్కారాలు! అన్నవస్త్రాలకు లోటులేకుండా ఆయన హాయిగా జీవించుగాక!—"

నాకు నవ్వు ఆగలేదు. గ్నాట్ మామయ్య నా మనస్సులో మెదిలాడు, సన్నగా, పొడుగ్గా ఉంటాడు. వాళ్ళ ఇంట్లో ఖాళీ జాగాలో బెంచీమీద కూచుని రొట్టెముక్క నములుతూ ఉంటాడు.

అయితే నాన్న రాసినమాటలు వింటున్నప్పుడు అమ్మకు కళ్ళు చెమ్మగిల్లాయి. మరి నేను ఎలా నవ్వను? నాన్న తన ఉత్తరంలో

ఇంకా చాలామందిని అడిగి, వారికి నమస్కారాలు చెప్పాడు. నేను బరువుగా నిశ్వసించాను. చివరకు ఉత్తరం చదవడం అయిపోయింది. అమ్మ చేయమాలుతో కళ్ళు తుడుచుకున్నది.

తినడానికేమైనా ఉన్నదేమో చూడడానికి అమ్మ వంట ఇంట్లోకి వెళ్ళింది. నేనూ అమ్మవెంట వెళ్ళాను. ఆమె కళ్ళవంక చూచాను.

"ఏమిటి నాయనా ?—" నా తల నిమురుతూ అడిగింది అమ్మ.

"ఏం లేదమ్మా !" అన్నాను. ఎందుకో నా కంఠం వణికింది. "నాన్న తొందరగా ఇంటికివస్తే" అన్నాను.

"నాన్నకోసం బెంగపెట్టుకున్నావుట్రా ?—"

"అవునమ్మా ! వచ్చేటప్పుడు నాన్న నాకు బూట్లు తెస్తాడా అమ్మా ?—"

"తేవడం కష్టం నాయనా' కష్టం. తెస్తే అందరికీ సంతోషమే." ఇలా అని అమ్మ, దుఃఖం ఆపుకోలేక తల ప్రక్కకు త్రిప్పి కిటికీవంక చూచింది.

"ఎందుకని తేలేదమ్మా ?—" అడిగాను మళ్ళీ.

"మనకు కష్టపురోజులురా మిళై లో! కానీ అంతా చక్కబడుతుందిలే.... ఏమిటీ ? నీకేమన్నా కావాలా ?—"

"బయటికి వెడతానమ్మా—"

"వీధిలో ఆడుకోటానికా ?"

"ఎక్కడో ఆడుకుంటాను,"అన్నాను. కానీ బయటికి వెళ్ళాను అంటే అడవిలోకే వెడతానని నాకు తెలుసు. అపుతే ఆమాట చెప్పడం

వల్ల లాభం లేదు. అడవిలో బందిపోటు దొంగలుంటారని నన్ను భయపెడతారు.

"అవుతే నన్ను ఏంచేయమంటావురా ఇప్పుడు ?—" అడిగింది అమ్మ. ఇప్పుడు అమ్మ ముఖం ప్రసన్నంగా ఉంది.

"నన్ను బయటికి వెళ్ళనివ్వమ్మా, చాలు !—"

"అంతేనా ?—" ఆమె తల పంకించింది.

"అవును. అవునమ్మా !" ఆమె రెండు చేతులు పట్టుకుని మారాం చేశాను.

ఆమె ఒక్క క్షణం నన్ను పరీక్షగా చూచింది. ఆమె మనస్సు కరిగింది. ఊడిపోయిన. నా చొక్కాగుండీ మళ్ళీ సరిగ్గా పెట్టింది. వెళ్ళి రమ్మని చెయ్యి ఊపుతూ నన్ను పంపించింది.

"వెళ్ళరా, వెళ్ళు ! కానీ ఒక విషయం గుర్తుంచుకో: నాకు ఉన్నదల్లా ఆ జతబూట్లే, బురదలో నీళ్ళల్లో, నీ ఇష్టం వచ్చినట్లు ఎగిరి, త్రొక్కి వాటినికాస్తా పాడుచెయ్యకు. నీళ్ళల్లో. బురదలో తిరగకు. కనుపించిన కుక్కనల్లాపట్టుకుని ఆటలాడకు. ఎవరితోనూపోట్లాడకు...." అని బోధచేసింది.

"అలాంటివేవీ చేయనమ్మా" తలుపు అవతల నుంచి కేకపెట్టాను. కానీ ఏవేవి చేయకూడదని చెప్పిందో అవన్నీ మరిచిపోయాను. అవును. స్వేచ్ఛగా సాయంత్రం వరకూ ఆడుకోవచ్చు. నన్ను అడిగేవాళ్ళులేరు. ఆ ఆనందంలో ఇక నాకేదీ జ్ఞాపకం ఉండదు.

నేను వీధిలోకి పరుగెత్తేటప్పటికి, నా వెనుకనుంచి నవ్వు వినిపించింది. తిరిగి చూచాను. మా ప్రక్క ఇంటి, పిట్టగోడమీద పెట్రో షెవ్‌చిక్

కూచుని ఉన్నాడు....నన్ను చూచి నవ్వుతో పలకరించేది అతనొక్కడే. ఆ నవ్వులో నానార్థాలూ ఉన్నాయి! పెట్రో నా ఈడువాడే: అయినప్పటికీ నాకంటె అన్ని విధాల గొప్పవాడిలా ప్రవర్తిస్తాడు. నన్ను లోకువగా చూస్తాడు, అవును. క్రిందటి సంవత్సరం, వాళ్ళు మూడు ఆవులు కొన్నారు. వాటిని అతనే కాస్తాడు. మరి నేనూ? తాతయ్య పనిచేస్తూ ఉంటే చూస్తూ ఉండడమే నా పనల్లా. కాకపోతే అప్పుడప్పుడు మా ఆడగుఱ్ఱాన్ని మేపుకుని వస్తూ ఉంటాను. అది ముసలిదై పోయింది, పైగా దానికేదో రోగం. దాన్ని, దాని విషయంలో శ్రద్ధతీసుకునే నన్నూచూచి అంతా ఎగతాళిచేయడమే. ఏదో తింటిపెడితేతప్ప అది తనమీద ఎక్కి కూచోనివ్వదు. అయినప్పటికీ అది దౌడు తీయదు. దౌడు తీయించడానికి మనం ప్రయత్నిస్తే కాలు కరుస్తుంది. సరైన గుఱ్ఱం మీద ఎక్కి స్వారీ చేయాలని ఎన్నాళ్ళనుంచో కలకంటున్నాను. కానీ నాకల కలగానే ఉండిపోయింది.

పెట్రో నన్నుచూచి ఈలవేశాడు. ఆవులుకాసే పిల్లలదగ్గర నేర్చుకున్నాడు. అతను ఇలా ఈలవేయడం.

నన్ను ఏడిపిస్తున్నానన్న సంగతి తెలియనట్టు నటిస్తూనే అతనిలా పిచ్చిపనులు చేస్తుంటాడు.

"మీ అమ్మ బూట్లు నీవు తొడుక్కున్నావా?—" అని అడిగాడు పెట్రో, నా కాళ్ళవంక చూచి.

"ఇదివరకు అమ్మవి, ఇప్పుడు నావి" అన్నాను నేను.

"నీవా?"

"అవును అమ్మ మరొక కొత్తజత కొనుక్కుని ఇవి నాకిచ్చింది."

"వట్టి కోతలు!—" అన్నాడు పెట్రో. నా మాటమీద అతనికి నమ్మకం లేదు.

"కావాలంటే పోయి అడుగు"అన్నాను

"ఊఁ! అయితే అదృష్టవంతుడివి!" అన్నాడు పెడ్రో. అతని కంఠస్వరంలో అసూయ ఛాయామాత్రంగా కనుపించింది. కానీ అతనికి ఒక జత బూట్లు ఉన్నాయి. ప్రత్యేకంగా అతనికోసం తయారుచేసినవి. మరి నన్నుచూచి అసూయపడడం దేనికి?

"అడవికి వెడదాం, రా పెడ్రో" అన్నాను.

"ఏముందీ అడవిలో?—"

"ఏముందీ, వట్టి అడవి. అదిచాలదూ?—"

"అది నే నెప్పుడూ చూస్తూనే ఉన్నాను."

"అవుతే నీవు రావద్దులే—" నేను వెళ్ళబోయాను.

"ఉండు!" అంటూ పెడ్రో పిట్టగోడదూకి నాముందు నిలబడ్డాడు.

"ముందు నేను. నా వెనకాలే రా నీవు!"అన్నాడు; ఆజ్ఞాపిస్తున్నట్లు.

"ముందు నీవు పోవడం నాకిష్టమే"అన్నాను నేను అమాయకంగా.

"ఎందుకని?—" అడిగాడతను.

"నా బూట్లకు బురదకావడం ఇష్టం లేదు."

ఇక ఇద్దరం బయలుదేరాం. నిమ్మతోపునాటి లోయలో ప్రవేశించాం. అక్కడ వాగులున్నాయి. అవి గలగల ధ్వనులు చేస్తూ ప్రవహిస్తున్నాయి. ఈ వాగులన్నీ ఒక తటాకంలో కలుస్తాయి: అక్కడనుంచి మైదానాలలో గుండా 'భల్లూకలోయ'లోనికి ప్రవహిస్తాయి. అక్కడే నది ఉంది. నది ఇంకా విశాలంగానే ఉంది. కానీ వాగులుమాత్రం మృదంగ తరంగ ధ్వనులతో హిమ శిలాఫలకాలపై నాట్యం చేస్తున్నవి. మేం కూడా నృత్యం చేశాం. పెడ్రో చేసిన అల్లరి ఇంత - అంతకాదు. మంచుగడ్డపై

ఎగిరి గంతులువేశాడు. మికోలా మామ. నాస్ట్యా అత్తయ్య, తాగినప్పుడు ఎర్మొలాయ్ మామ ఎలా ఉంటారో అలా వారిని వెక్కిరిస్తూ నృత్యం చేశాడు.

"హీ, హో,హో! హీ, హో,హో!" అంటూ కేకలుపెట్టాడు. కాసేపట్లో బూట్లతోపాటు మా ట్రౌజర్లు, చొక్కాలుకూడా తడిసి ముద్ద అయినాయి.

మంచుగడ్డలు ఫెళఫెళ విరుగుతున్నాయి.

"విన్నావా ?—" అన్నాడు పెట్రో.

"విన్నాను" అన్నాను.

"ఏమిటో తెలుసా ?—"

"తెలీదు."

"బల్లెం మొన, మంచుగడ్డలను పగలగొడుతున్నది."

"బల్లెం మొన అంతగట్టిదా ?—"

"అవును. ఇనుములాగా."

నదీప్రవాహధ్వనులు విన్నాం. చెట్ల అవతలనుంచి మంచుగడ్డలు ఫెళఫెళ విరుగుతున్నధ్వని మరల వినవచ్చింది.

మా ఉల్లాసం, ఆనందం పట్టపగ్గాలు లేకుండా ఉంది. తడిసి ముద్ద అయిఉన్న ఆ బట్టలతోనే, బూట్లతోనే అడవికి వెళ్ళాం: పెద్దపెద్ద వృక్షాలు శాఖోపశాఖలుగా విస్తరించి ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. అంతటా మర్మరధ్వనులు. అరణ్యం యావత్తూ వసంతాగమనాన్ని సూచిస్తున్నది. అడవి అంటే నాకు చాల ఇష్టం. కానీ ఆ గంభీరత నాకు

భీతిగొలిపింది. నేను అరణ్యంలో పయనించడం ప్రారంభిస్తే తుదకు నరసంచారం లేని ఏ కీకారణ్యంలోనికో వెడతాను.

ఆ చెట్లమధ్య అకస్మాత్తుగా ఒక ఇల్లు పుట్టుకునివస్తే బాగుండును! ఒక తలుపు చప్పుడు వినిపిస్తే ఎంత బాగుండును? ఒక పండ్లతోట కనుపిస్తే ఎంత హాయిగా ఉండును? కొండరావిచెట్ల నుండి ద్రవం ప్రవహిస్తున్నది. "డుబ్, డుప్, డుబ్!" అంటూ బొట్లు బొట్లు పడుతూ ఉంటే ఎంతో ఆనందం కలిగింది. ఒకచోట నేలలోనుంచి నీరు ఉబికి వస్తున్న చలమ కనుపించింది. ఆ నీటి ఊటలో నీటి బుడగలు పుట్టి అంతలోనే అంతర్ధానమవుతున్నాయి. కొన్నిచోట్ల గుంపులు గుంపులుగా పుట్టకొక్కులు మొలిచి ఉన్నాయి. వాటిమీద మంచు బిందువులు: రాలిన చెట్ల ఆకులు నేల అంతటా పరుచుకుని ఉన్నాయి.

ఒక కొండరావిచెట్టు బోదె చుట్టూ చేతులు పెనవేసి చెవులుపెట్టి విన్నాను. నాకేమీ ధ్వని వినిపించలేదు. అడవి ఇంకా మేల్కొన్నట్టు లేదు।

ఒక చెట్టు చిటారుకొమ్మపై నుంచి పాలపిట్ట, అరిచింది. తళతళ లాడే దానిరెక్క మా కళ్ళల్లో మెరిసింది.

"శీతాకాలంలో పాలపిట్టలు దక్షిణానికిపావు. ఎందుకో తెలుసా?–" అని అడిగాడు పెట్రో.

"ఎందుకూ___" అన్నాను నేను.

"వాటికి పిచ్చెక్కి పళ్ళు తెలీదు రోజంతా తిరుగుతూనే ఉంటాయి. అలా తిరిగి తిరిగివచ్చి ఎంతదూరం తిరిగిందీ లెక్క వేసుకుంటాయి!___"

"ఓహో!" అన్నాను ఆశ్చర్యంతో.

పాలపిట్ట ద్రోహబుద్ధిగలపక్షి. చిన్నచిన్నపక్షులను తిని జీవిస్తుంది. ఇతర పక్షుల అరుపులను అనుకరిస్తుంది.

"కుందేలు, కుందేలు!" అని అరిచాడు పెట్రో; ఒక కొండ కోనలోకి ఉరుకుతూ.

అంతలోనే అది అడవిలో అదృశ్యమైంది.

"నా దగ్గర ఇప్పుడు తుపాకి ఉంటేనా?—" అన్నాడు పెట్రో.

అతనిదగ్గర తుపాకి లేనందుకు నాకేమీ విచారం కలగలేదు. జంతువులను వేటాడి చంపి తెచ్చేవారిని నేను కంటితో చూడలేను.

ఒక పొదచుట్టూ మంచు మడుగుకట్టి ఉన్నది. అకస్మాత్తుగా చూచాను. అరె! అడవి నిద్రపోవడం లేదు. హంసలు వసంతశోభను తెచ్చి అడవికికూడా అందించాయి! అవును, వసంతం అంటే జీవం! క్రొత్త జీవితం!

అధ్యాయం రెండు

నేను దారిలోకివస్తానని తాతయ్య పదేపదే చెపుతూనే వచ్చాడు. అవ్వకూడా ఆ మాటే అన్నది. కానీ అమ్మకుమాత్రం అనుమానమే.

"ఏమో, ఏమవుతాడో! వాడికి బుర్ర సరిగాలేదు" అంటుంది అమ్మ.

అయితే ఆమె అనుకున్నంత బుద్ధిలేనివాణ్ణీ, హఠంచేసేవాణ్ణీ కాను నేను, ఏదైనా పనిచెబితే చేసేవాణ్ణి. తాతయ్యకు పనిలో సహాయ పడేవాణ్ణి, మామునలిగుర్రాన్ని తోలుకునిపోయి మేపుకొనికు తెచ్చేవాణ్ణి. కట్టెలు పగులుగొట్టేవాణ్ణి. అవసరం వచ్చినప్పుడు అమ్మకుకూడాపనిలో కాస్త సహాయంగా ఉండేవాణ్ణి, తోటపనికూడా చేసేవాణ్ణి. నేనేమి వళ్ళు వంగని సోమరిపోతును కాను.

అయినా నాలో ఏదో దౌర్బల్యం ఉన్నదనీ కొందరంటారు. మరి కొందరు నాకేదో వెఱ్ఱి అని చెపుతారు, నా కష్టాలన్నిటికీ యిదే కారణం అయింది.

చదవడం నేను తొందరగానే నేర్చుకున్నాను. ఎవరి సహాయం కూడాలేదు. తొమ్మిదవయేడు వచ్చేసరికి దాదాపు అన్ని పుస్తకాలు చదవగలిగాను. షెవెంకో వ్రాసిన "కొబ్జార్", నీవా పత్రికలు, కట్టుకథల పుస్తకాలు అనేకం. నీపర్ మాంత్రికుడు, సల్లాకీ-క్రూర హస్తం, ముగ్గురురాజులు-వజ్రాలవర్తకుడు - మొదలైన చిల్లర నవలలు, స్థానికకోసక్ కేంద్రాలవారు, ఎర్రసైన్యం ప్రచురించిన కరపత్రాలు ఇవన్నీ చదివాను. చదివినవాటిల్లో కొన్నిమాటలు ఇంకా మనస్సులో

నక్షత్రాలవలె మెరుస్తూనే ఉన్నాయి. కొన్ని మాటలు మసకమసకగా జ్ఞాపకం ఉన్నాయి,

నేను చదివినవాటిల్లో తల-తోక లేని పుస్తకాలు కొన్నివున్నాయి. "రాబిన్ సన్ "క్రూసో"లో లాగా వాటిల్లో అద్భుత సాహసకృత్యాలు ఏవీఉండవు. కథానాయకుడెందుకో ఊరు వదలి అరణ్యాలకు పోతాడు. అలా పోయినవాడు అద్భుతకార్యాలు చేస్తే బాగుండును. కానీ అలాటి దేమీ ఉండదు. చివరకు పొలం దున్నుకుంటూనో, బూట్లు పాలిష్ చేస్తూనో కాలక్షేపం చేస్తాడు. బూట్లన్నా, బూట్ పాలిష్ అన్నా నాకూ ఇష్టమే. బూట్లు భోగపురుషులు ధరించేవనికూడా నాకు తెలుసు. ఆ రోజులలో చర్మ పరిశ్రమ ఒక గొప్ప పరిశ్రమక్రింద లెక్క. ఒక జత బూట్లంటే టోలెడంత ఖరీదు. ఇక పొలం దున్నడమంటే ఒక పవిత్రమైన కార్యంగా భావించేవారు.

వసంతఋతువులో మొట్టమొదటనాగలిపట్టిపొలందున్నేవాణ్ణి ఎంత గొప్పగా చూచేవారో నాకు ఇప్పటికీ జ్ఞాపకం. ప్రొద్దుకూకేవేళ అతను ఇంటికి రాగానే పెద్ద, చిన్న అందరూ కూడా ఆతనిని చూడటానికి వెళ్ళేవారు. అతను తన భుజంమీది మూటవిప్పి అందులోనుండి ఒక పాసిన రొట్టెముక్కతీసి యిచ్చేవాడు. అది ఒక కుందేలు పంపించిందని చెప్పేవాడు! అది ఒక అద్భుతం! మొట్టమొదట నాగలిపట్టి మొదటి చాలు దున్నడం నిజంగానే మరపురాని సంఘటన. ఎన్నో ఏండ్లక్రితం మా నాన్న, దగ్గరుండి నాచేత మొట్టమొదట నాగలిపట్టి, దున్నించిన సంఘటన నాకిప్పటికీ జ్ఞాపకం. ఆ సాయంత్రం ఇంటికిరాగానే ఆయన ఆ విషయం అందరికీ చెప్పాడు. "ఎటుచూచినా మబ్బులు కమ్మాయి, ఉరుములు ఉరిమాయి. మెరుపులు మెరిశాయి. కానీ మేం మాత్రం పొలం

దున్నుతూనే ఉన్నాం"—అని నాన్న వాళ్ళందరికీ చెపుతూ ఉంటే నేను నిజంగా గర్వంతో పొంగిపోయాను.

శీతాకాలంలో పాటలుపాడుతూ ఎక్కడికో ప్రయాణం సాగించే యాత్రికులనుగురించి చెప్పగా విన్నాను—

భగవంతుడు స్వయంగా నాగలివెంట వుంటాడట! దున్నేవారి కోసం మేరీమాత స్వయంగా అన్నం తీసుకొనిపోతుందట. అందువల్లనే నాగలి దున్నేవారంతా ట్రాక్టర్ డ్రైవర్లుగామారిన ఈ ఆధునిక యుగంలో కూడా పొలంలోవారికి అన్నం తీసుకుపోయే స్త్రీలను చూచినప్పుడు నాకు ఆ పురాణ గాథలే స్ఫురణకు వస్తాయి.

ఈ పల్లెలూరి ప్రజలకు పుస్తకాలంటే గిట్టదు. చదువుకునేవారిని చూచినా వారికి సరిపడదు. వారిని అదో తరహాగా చూస్తారు. అయినప్పటికీ పుస్తకాలంటే నాకు ప్రీతి.

కొత్తపుస్తకం కంటపడితేచాలు, ప్రపంచంలో సర్వం మరిచిపోయి గ్రంథపఠనంలో నిమగ్నుడనయ్యే వాణ్ణి. వెంటనే అమ్మ "అదుగో మళ్ళీ వాడు పుస్తకం పట్టుకుని కూచున్నాడు!.........ఒరేయ్! ముందది అవతలపెట్టిరా, లేకపోతే పొయ్యిలో పారవేస్తాను"—అనేది.

అవుతే ఆమె ఒక్క పుస్తకంకూడా అలా పొయ్యిలో పారవేసిన పాపాన పోలేదు. కానీ నేను పుస్తకం చదువుతున్నంతసేపూ ఆమె కళ్ళన్నీ నామీదే ఉండేవి, నాకేదో కీడు కలుగుతున్నట్టు భయం భయంగా చూసేది.

"చదువుకుంటే వచ్చే హాని ఏమున్నదమ్మా?"— అని అడిగాను నేను.

"నాకేం తెలుసురా!"

"తెలియకపోతే ఎందుకలా అంటావు?"—

"అందరూ అంటుంటే నేనూ అంటున్నాను. ఎవరో ఒకతను బైబిల్ అదేపనిగా చదివాట్ట. అంతే. అతనిబుర్ర గుమ్మడికాయలా అయిపోయిందంట!"

"నేను బైబిల్ చదవడం లేదమ్మా"

"ఈ రోజుల్లో యింకా అదికూడా చదవాలీ?"

బుద్ధి, తెలివితేటలు - వీటిని గురించి ప్రసక్తివచ్చినప్పుడల్లానేను నోరెత్తకండా కూచునేవాణ్ణి.

శీతాకాలంలోనైనా సరే పగటపూట ఎలాగో ప్రొద్దుపుచ్చేవాణ్ణి. కానీ రాత్రిళ్ళసంగతే వేరు. చదివితే బుర్ర చెడిపోతుందని పదే పదే చెప్పిన తరువాత అమ్మ దీపం ఆర్పివేసేది. ఇక నేను చీకట్లో ఉండి పోయేవాణ్ణి. కథలలోని రాజులు, రాణులు, దుర్మార్గులైన జమీందారులు- వీరంతా కళ్ళల్లో మెదిలేవారు. రాకుమారుడు ఒక్కొక్కప్పుడు ఎలా మన్మధబాణ పీడితుడయ్యేదీ పర్యాలోచించుకునే వాడిని.

ఈదీపంఒకటి పాడుది-పెట్రోలుకంపు, "టుప్పు టుప్పు"అంటూ ఏ క్షణంలోనో ఆరిపోయేటట్టు ఉండేది, అమ్మమీద ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చేది, చివరకు ఆమెను మోసగించడం ఎలాగా అని రకరకాల ఉపాయాలు ఆలోచించేవాడిని, ఇంట్లో అంతా పడుకుని గాఢనిద్రలో మునిగిపోయెవారు. కీచురాళ్ళధ్వని తప్ప మరెక్కడా అలికిడి ఉండదు. నేను మెల్లగా, చప్పుడు కాకుండా. మునివ్రేళ్ళపై నడుస్తూ పొయ్యి అరుగు ఎక్కేవాడిని. పొయ్యిలో మండుతున్న కర్రముక్కతో దీపం వెలిగించే వాడిని, వెలుతురు గదిలో మరెక్కడా కనుపించకుండా ఉండే

టట్టు దీపాన్ని చాటుగా అమర్చి ఉంచేవాణ్ని. మళ్ళీ రాజులు, రాణులను గురించి, కోసకలనుగురించి, యోధులనుగురించి, మాంత్రికులను గురించిదయ్యాలు, భూతాలనుగురించి అదేపనిగా కథలుచదువుతూ వాటిని గురించి, పర్యాలోచన చేసుకుంటూ కూచునేవాణ్ని.

ఆ కాలంలో గ్రామాలలో రకరకాల భూతాలు, దయ్యాలు ఉండేవి. అవి రైతులను, పశువులను, పంటలను అనేకవిధాల పీడిస్తూ ఉండేవి. మాంత్రికుడు కాని, క్షుద్రవిద్యలునేర్చినవాడు కాని కంటికి కను పిస్తేచాలు, వాణ్నిపట్టి పల్లార్చేవాళ్ళు. సాధారణంగా వాళ్ళను పట్టుకుని ఒక చెయ్యి నరికివేసేవాళ్ళు. అలా చేయడంవల్ల ఇక వాళ్ళు ఆవుపాలు పిదికి వాటిని ఎండిపోయేటట్టుచేసే అవకాశం ఉండేదికాదు. వీళ్ళకుమరొక విధమైన శిక్షకూడావుండేది. నాగలికికట్టి ప్రాణాలు పోయేవరకు దున్నించే వాళ్ళు. మాంత్రికులను, అభిచారకర్మలను చేసేవాళ్ళను పట్టుకోవడంలో మా ఊరిలోకల్లా మికోలా మామది పెట్టిందిపేరు. వాళ్ళకోసం ఆయన సర్వత్రా గాలించేవాడు. చేపలబుట్టలు, సామాన్లగదులు, వంతెనలక్రింద సొరంగాలు, చెట్లతొర్రలు, నదీతీరాలలోని తుంగదుబ్బులు — ఇవన్నీ దయ్యాలు, భూతాలూ నివసించే ప్రదేశాలు, ఇవి ఎక్కడున్నా ఉండనీ మికోలామామనుండి తప్పించుకోడం వీటితరంకాదు. భూతప్రేత పిశాచాల తోకలు, కొమ్ములు, కాలి గిట్టలు - బండెడు ప్రోగుచేశాడాయన.

"వీటిని కొనేవాడెవడైనా వుంటే నేను ఇట్టే భాగ్యవంతుడనై పోదును" అంటాడాయన.

"ఇలాంటి మాటలువింటే ఆయన భార్య, తుపుక్కున ఉమ్మివేసి దేవుడి దగ్గరకుపోయి అపరాధం అన్నట్టు "క్రాస్" చేసుకుంటుంది.

మికోలామామకున్నంత ధైర్యం నాకు లేదు. ఆయన దగ్గర

ఉన్నట్టు నా దగ్గర గొడ్డలికూడా లేదు. అందాక ప్రతిరాత్రి నేను చదివిన కథలలోని భయంకరమైన విషయాలు తలచుకుని వణికిపోయేవాణ్ణి. భయంతో గుండె ఆగిపోయినంతపని అయ్యేది. చివరకే రాత్రి వేళనో కోళ్ళు కూసేవి. అప్పుడు నాకు మళ్ళీ ప్రాణం లేచివచ్చినట్టు అనిపించేది. కోళ్ళు తమ రెక్కలతో భూత ప్రేతాదులను పారద్రోలుతాయని నమ్మకం.

నేను పెట్రోలు దీపంతో గమ్మత్తు చేస్తున్న సంగతి కనిపెట్టడానికి అమ్మకు ఎన్నాళ్ళో పట్టలేదు. నిజానికి నాదే తప్పు. నేను చదివిన భయంకరమైన కథల్లోని భూతాలు, నా గదిలో గోడలచుట్టూ తిరుగుతున్నట్టు నాలుకల చాచి భయపెడుతున్నట్టు అనిపించేది. నేను కెవ్వన కేకపెట్టేవాణ్ణి. ఇలా జరిగేసరికి అమ్మ, పెట్రోలుదీపం నాకు చిక్కకుండా పెట్టెలోపెట్టి తాళం వేసింది.

తాళపుచెవితోనో, మరో ఉపాయంతోనో పెట్టెతాళం తీయడానికి చాలరోజులు ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. కానీ లాభంలేకపోయింది. అయినా నేను నిరుత్సాహపడలేదు. చివరకు నేనే ఒక పెట్రోలుదీపం తయారుచేయడం మొదలెట్టాను. చాలా సులభంగా, త్వరగా, ఉత్సాహంగా దాన్ని తయారుచేశాను. లావయ్యక కత్తితో ఒక తుపాకీగుండు అడుగు భాగాన్ని కోసి దానినిండా ఒక పత్తి దూర్చాను. ఒక మొక్కజొన్న దంటు ఛివ్వి బెండులాగా దానికి పెట్టి, దాన్ని ఒక పెట్రోలుడబ్బాలో అమర్చాను. సమస్యను నేను ఇలా పరిష్కరించినందుకు అమ్మ సంతోషించిందో లేదో నాకు తెలియదు కాని నేనుమాత్రం పొంగిపోయాను. పెట్టెతాళం తీశానేమోనని అమ్మ గబగబా పెట్టె దగ్గరికివెళ్ళి పరీక్షించింది. నేనుమాత్రం చేసిన ఘనకార్యానికి సంతోషిస్తూ ఇంట్లోనుంచి చల్లగా జారుకున్నాను.

చదువుకునే పుస్తకం సంపాదించడంకంటె ఒక దీపాన్ని నిర్మించడం సులభమని నాకు అనిపించింది. నాకు వీలయిన విధాల ప్రయత్నించాను. దాచుకున్న డబ్బు ఖర్చుపెట్టుకున్నాను. కోళ్ళగూటిలో గ్రుడ్లు దొంగిలించాను.

'మూడు సంచుల తమాషా' అనే ఒక చిన్న పుస్తకంకోసం పుస్తకాలమ్మే వాడికి అయిదు పదిగ్రుడ్లు ఇచ్చాను. చాల శ్రేష్ఠమైన గ్రుడ్లు అవి. దయా-దాక్షిణ్యాలులేని పుస్తకాలంగడివాడు అవి కాజేసి ఆ పుస్తకం నా ముఖాన వారేశాడు. అయినా నేను చేసినపని గొప్పది అయినట్లు సంబరపడ్డాను. కానీ నా సంతోషం మొగ్గలోనే తునిగి పోయింది! నా పుస్తకం సంగతి, నేను చేసిన బేరం సంగతి ఎలా తెలిసిందో అమ్మకు తెలిసింది. ఎవరో చెప్పారు. దాంతో తిట్లు, చీవాట్లు వచ్చాయి. 'మూడుసంచుల తమాషా'కు ముప్పయి సంచుల కన్నీళ్ళు కార్చవలసివచ్చింది. సుఖ, దుఃఖాలు అన్నదమ్ముల్లా ప్రక్క ప్రక్కనే ఉంటాయని ఇలాంటి అనుభవాలు మనకు నేర్పుతాయి.

నా పుస్తకంచూచి మా బంధువుల కుర్రవాడు గివా ఎగతాళి చేసినంతగా మరెవ్వరూ చేయలేదు. వాడి జుట్టు గొర్రెబొచ్చులా ఉండేది. పైగా తలకు బొచ్చుటోపి. నేను చేసిన బేరంసంగతి విని అతను విరగబడి నవ్వాడు. "బొచ్చుటోపి! కింద గొర్రెబొచ్చు!—" అంటూ నేను కూడా వాడిని ఎప్పుడూ ఏడిపిస్తూనే ఉండేవాడిని. కాని ఈసారి వాడిదే పైచెయ్యి అయింది.

అమిత భాగ్యవంతులం కాబోతామని గివా తల్లిదండ్రుల ఆశ. డబ్బుగడించడంకోసం వారు ఏమైనా సంసిద్ధమే. ఎన్ని అబద్ధాలైనా ఆడతారు. ఎన్ని అక్రమాలకైనా ఒడిగట్టుతారు. డబ్బులేనివారు లేనట్టు వుండరు. గొప్పలు చెప్పుకుంటూ, డాంబికాలుపోతారు.

వ్లాడిమిర్ చిన్నాన్నకు ఎంత ధాన్యం ఉన్నదో, పొలంలో ఎన్ని గడ్డివాములున్నాయో, తోటలో ఎన్ని బంగాళాదుంపలున్నాయో, ఇతరులకు కూడాఅన్నిఉన్నాయి. కానీ ఆయన అలా అనుకోడు. అందరికంటెతాను మిన్న అయినట్టు నటిస్తాడు. ఆయనవైఖరిపట్ల అంతరూ, ఎదుట సాను భూతే ప్రదరిస్తారు. చాటునవ్వుతారు. పిలవకండానేతనఇంటికి అతిథులు చుట్టపక్కాలు వస్తారేమోనని ఆయన ఒక చక్కని ఉపాయం కనిపెట్టాడు. బయటివాకిలికి ఎప్పుడూతాళం తగిలించి ఉంటుంది. ఇంట్లోనుంచే దానికి తాళంవేయవచ్చు. ఈఏర్పాటువల్ల, వచ్చినవాళ్ళు ఇంట్లో మనుష్యులెవరూ లేరనుకుని వెళ్ళిపోతారు. ఎవరన్నా అప్పు అడుగుతారనుకోండి తనకు చెముడున్నట్టూ, వినబడనట్టూ నటిస్తాడు, ఆ తరువాత ఏదో విషాద గాధంతా వెళ్ళబోసుకుంటాడు. అదివిని అప్పు అడుగవచ్చినవాడు, అయ్యో, భగవంతుడా అనుకుని వెళ్ళిపోతాడు. 1921లో ప్రవ్యోల్బణంవల్ల ఎంత పదవాళ్ళుకూడా కోటీశ్వరులై కూర్చున్నారు, అలాంటప్పుడుకూడా తన దగ్గర ఒక్క రూబుల్ అయినా లేదని వ్లాడిమిర్ చిన్నాన్న ఒట్టుపెట్టుకునేవాడు.

"డబ్బంతా ఏం చేస్తావు వ్లాడిమిర్? ఉప్పులో ఊరవేస్తావా? ఊరగాయపెడతావా? లేక అలాగే మింగేస్తావా?" అని అడిగేవాడు మికోలా మామయ్య, వాళ్ళిద్దరూ "వోడ్కా" త్రాగటానికి కూచున్నప్పుడు భలే సరదాగా కబుర్లు చెప్పుకునేవారు.

అదివిని వ్లాదిమిర్ చిన్నాన్న కోపంతో కస్సుమని లేచేవాడు. లేదా గుర్రుమంటూ "చూడు నిన్నేం చేస్తానో!"— అని భయపెడుతున్నట్టు చెయ్యి ఎత్తేవాడు. అయితే ఆయన్ను లొంగదీయడం ఎలాగో మికోలా మామయ్యకు తెలుసు. మెల్లగాఒంగి ఆయనచెవిలో "సంచులు సంచులు డబ్బు పాతర్లలోపోసి దాచావని జనం చెప్పుకుంటున్నారు!" అనేవాడు.

వ్లాడిమిర్ చిన్నాన్న చివాలునలేచి ఇక అక్కడ క్షణం ఉండకుండా టోపీ చేతపట్టుకుని పరుగుతీసేవాడు.

త్రాగేటప్పుడు వాళ్ళిద్దరి సంభాషణ వినితీరాలి. ధనికుడైన వ్లాడిమిర్ చిన్నాన్న క్షణక్షణానికీ నిరుపేద అయిపోతాడు. పేదవాడైన మికోలా మామయ్య నిముషనిముషానికీ భాగ్యవంతుడవుతాడు!

"ఎంత పాపిష్టిసంవత్సరం ఇది?" అంటాడు వ్లాడిమిర్ చిన్నాన్న గడ్డంక్రింద చెయ్యిపెట్టుకొని బరువుగా నిశ్వసిస్తూ. "ఎట్టిగడ్డితప్ప చారెడు గింజయి వచ్చేటట్టులేదు పొలంలో" అంటాడు.

"ఈ యేడు పందినంతపంట నా కెన్నడూ పండలేదు" అంటాడు మికోలామామ.

"కొందరు అదృష్టవంతు లంటారు నాయనా, ఏం చేస్తాం?"— అంటాడు మళ్ళీ వ్లాడిమిర్ చిన్నాన్న. ఆయన ఫాలభాగాన అసూయ రేఖామాత్రంగా పొడసూపుతుంది. "నాకు కష్టాలుతప్ప మరేమీలేదు. ఒకటి పోయేటప్పటికి మరొకటి కాచుకుని ఉంటుంది. ఈ యేడు మా నల్లపందికూడా నన్ను మోసం చేసింది. ఒక పిల్లకూడా పెట్టలేదు" అంటాడు, కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

మికోలా మామయ్యకు సంతోషం పొంగివస్తుంది. "మా పంది, కుందేలు పిల్లలనుపెట్టినట్టు పెడుతున్నది. తడవకు పదిహేను,పదహారు!" అంటాడు.

"తడవకు పదహారు పిల్లలే!" అంటాడు వ్లాడిమిర్ చిన్నాన్న సందేహం వెలిబుచ్చుతూ

"నామాట అబద్ధమేమో మా ప్రక్క ఇంటివాళ్ళను అడుగు

ముద్దులు మూటకట్టే పిల్లలు. అందాకా యెందుకూ? మా పందినికొనడా
నికి "లిటిన్"నుంచి పెద్దభూస్వామి కూడా వచ్చాడు. కావలసినంత
డబ్బు పడేస్తాను, దాన్ని ఇవ్వు అని అడిగాడు, కాని నిలువెత్తు ధనం
పోసినా దానిని ఇవ్వనని చెప్పాను"

"హుఁ! అంతేలే! కొందరు పెట్టిపుట్టినవాళ్ళు! అదృష్టం దానం
తట అది తన్నుకుంటూ వస్తుంది నీ కాళ్ళ దగ్గరికి.........అయినా అన్ని
పందులున్నాయే—ఏం చేస్తావు?"

"ఏం? మార్కెట్టుకు తీసుకునిపోయి అమ్ముతాను. లేదా వండు
కుని తింటాం. పందిమాంసం నాకు ఇష్టమైనకూర. అసలు ఆ కూర
లేనిది నాకు ముద్ద నోట్లోదిగదు!"

ఇదివిని వ్లాడిమిర్ చిన్నాన్నతప్ప, అంతా నవ్వుతారు. మికోలా
మామయ్య బంగాళదుంపలుకూర, పులుసుతప్ప మరేమీ తినడని వాళ్ళకు
తెలుసు.

వ్లాడిమిర్ చిన్నాన్న పిల్లలకు ఆయనపోలిక రాలేదు. తండ్రి ఆశ
పోతు అని చెప్పి ఎగతాళిచేస్తారు వాళ్ళు. వాళ్ళబ్బాయి గీవా పిట్టగోడ
రంధ్రంలోనుంచి బయటికి చూస్తూ నవ్వాడు. "నాన్న మార్కెట్‌కు
వెళ్ళాడు బఠాణీలు అమ్ముకుని రావడానికి. సాయంత్రందాకా తిరిగి
రాడు" అన్నాడు.

"ఏందుకని?"

"వాటికి బాగా ధరవస్తేకాని, అమ్మడు, మిరియాలు అమ్మేధరకు
బఠాణీలు అమ్మాలని ఆయన ఆశ......... నీవు కూడా మార్కెట్టుకు
బరతవా?"—

"ఇదివరకు వెళ్ళివచ్చింది చాలు!"

అన్నాను నేను ముఖం ముడుచుకుని. పుస్తకం విషయంలో నేను చేసిన బేరం గుర్తుకొచ్చింది.

గీవా నావంక పరీక్షంగా చూచాడు. నా బాధ గ్రహించినట్టు కను పించాడు. "మనిద్దరం కలిసి ఆలోచిస్తే నీ పీ గొడవనుండి బయటపడే మార్గం కనుపిస్తుంది" అన్నాడు.

"ఎలాగ? నా దగ్గర డబ్బులేందే! మా కోడి పెట్టకూడా గ్రుడ్లు పెట్టడమూ అయింది. పిల్లలను చేయడమూ అయింది"అన్నాను.

"పుస్తకం కొనుక్కోవాలని నీకు అంత మోజుగా ఉందా?"—

"అవును"

"సరే. నీకొక పుస్తకం వచ్చేటట్టుచేస్తాలే!" గీవా కళ్ళలో ఏదో దురాలోచన ఛాయామాత్రంగా మెరిసింది. "ఈస్టర్ పండుగ రోజులలో ఆదివారంనాడు మనం ఒక మంచిబేరం చేద్దాం!" అన్నాడు.

"ఈస్టర్ పండుగరోజుల్లోనా?"

"అవును. పండుగనాడు పగలగొట్టిన గ్రుడ్లతో నీవు పుస్తకాలు కొనుక్కోవచ్చు."

గీవా ధోరణి నా కర్థంకాలేదు. "ఎక్కడా?" అని అడిగాను.

"చర్చిలో" అన్నాడు గీవా. "నీ కొక మాయ కోడిగ్రుడ్డు చేసి పెడతాను, దాని సహాయంతో ఒక పెద్ద సంచెడు పగిలిన గ్రుడ్లు వచ్చే టట్టు చేస్తాను." అన్నాడు.

(పూర్వం రష్యాలో ఈస్టర్ ఆదివారంనాడు రంగువేసిన గ్రుడ్లు చర్చికి తీసుకొని పోయి స్నేహితులు ఒకరికొకరు ఇచ్చుకోడం ఆచారం)

"సంచెడు అక్కర్లేదు నాకు"

"పోనీ నీకు ఎన్ని కావాలంటే అన్ని. అది నీ ఇష్టం. ఈ సారి మునుపటిలాగా నీవు మోసపోవు."

ఈస్టర్ పండుగ వచ్చింది. గురువారంనాడు నేనూ, గీవా మా కోడిపెట్ట గూడు దగ్గరికి వెళ్ళి మా కార్యక్రమం ప్రారభించాము. గీవా ఒక సూదితో ఒక గ్రుడ్డుకు ఒక చిన్న బెజ్జం పొడిచాడు. దానిలో బీరాకు పసరు పోశాడు. తరవాత మేంగీవా ఇంటికి వెళ్ళాం. అక్కడ ఒకచిన్న మైనపు ఉండ వెచ్చ చేసి దాని నుండి సన్నని తీగెలు తీశాం. ఆ తీగలు గ్రుడ్డు రంధ్రంలో దూర్చాం ఆ విధంగా డొల్ల యావత్తూ మైనంతో నింపాం. తరవాత మళ్ళీ మైనం అంతా కరిగిపోయేటట్టు పొయ్యిలో దాన్ని వెచ్చచేశాం, తరవాత దానికి రంగువేసి ఎండబెట్టాం. ఇప్పుడు మా మాయ గ్రుడ్డు అందంగా తయారైంది.

ఈస్టర్ ఆదివారం వచ్చింది. చర్చిలో పెద్ద పెద్ద వాళ్ళంతా పోగైనారు. బయట అబ్బాయిలు, అమ్మాయిలు ఏకమై ఏవేవో కొంటెపనులు చేస్తున్నారు.

చర్చి ముందరి జాగాలో అశోకవృక్షం క్రింద నేను గీవాను కలుసుకున్నాను. అతను నేను తెచ్చిన "మాయగ్రుడ్డు" చూచాడు.

"సంచి తెచ్చుకున్నావా?" అని అడిగాడు.

"దేనికి" అన్నాను.

"పగిలిన గ్రుడ్లన్నీ ఎందులో పోసుకోవాలనుకున్నావు?"

"జేబులో"

"ఓహో! నీకు బుర్రలేదు. జేబులో ఎన్ని పడతాయి? పైగా నలిగి పొడి అయిపోవూ?" అంటూ అతను లాభం లేదన్నట్లు తక్కిన పిల్లలవంక చూచాడు.

నా దగ్గర ఉన్న గ్రుడ్డు మొదట మికోలా మామయ్య కుమారుడు ఇవాన్ చూచాడు. అతని దగ్గర కొండం విదెవడు రసంతో రంగువేసిన గ్రుడ్డు ఉన్నది.

"ఇంతకూ ఏమైనా దొరికిందా?"

"ఇంకాలేదు. చూస్తాను" అన్నాను. ప్రక్కవాళ్ళను మోసం చేసే ధైర్యంలేదు నాకు.

"ఏం చూస్తావు? రేపటిదాకా ఇలాగే చూస్తూ కూచుంటావా?" అంటూ ఇవాన్ నవ్వాడు ఇప్పటికే అతను జేబునిండా పగిలిన గ్రుడ్లు సంపాదించుకున్నాడు. నేనెందుకూ పనికిరాని వాణ్ణని అతను ఎగతాళి పట్టించాడు.

ఇక నేను ఉండబట్టలేక సరే కానివ్వు" అన్నాను.

అతను రంగువేసిన తన గ్రుడ్డు పిడికిట్లో పట్టుకుని చెయ్యిచాపాడు. నేను నా గ్రుడ్డుతో మెల్లగా దానిని కొట్టాను. కానీ అతని గ్రుడ్డు పగులలేదు, నా గ్రుడ్డు పగులలేదు. మేమిరువురం ఒకరివంక ఒకరం తేరిపార చూచుకుంటూ క్షణంసేపు అలాగే నిలుచున్నాం. తరువాత నవ్వుకున్నాం.

గీవా ఎంత పెద్దపన్నాగం పన్నినప్పటికీ నేను అదృష్టహీనుడను. తెలివి తక్కువవాడిని కావడంవల్ల కార్యం సాధించుకోలేకపోయాను. నాకు పుస్తకం లభ్యమయ్యేటట్టులేదు.

చివరకు మాజీ గుమాస్తా యుఖిమ్ బాబెంకో సహాయాన్ని అపేక్షించాలని నిశ్చయించుకున్నాను. బాబెంకో పెట్టి నీచుడు, దుష్టుడు అని చాటున జనం అంతా అంటారు. కానీ అతనుమాత్రం గ్రామ లోకల్లా తానే గొప్ప తెలివికలవాడనన్నట్టు ప్రవర్తిస్తాడు. అతనిలో పాపభీతి

సున్న. పరోపకారం ఏకోశాన లేదు. అయితే ఒక విషయంలో అతన్ని మెచ్చుకోవచ్చు. బాంబెంకో దస్తూరి చాల అందంగా ఉంటుంది. ముద్దులు మూటకట్టే గుండ్రటి అక్షరాలు వ్రాస్తాడు.

బాబెంకో తానొకప్పుడు గుమాస్తానన్న గర్వంతో, ప్రొద్దుతిరుగుడు గింజలు నములుతూ ఆడపిల్లమధ్య కులాసా చేస్తున్నాడు ఆడపిల్లలంతా వాస్యానుగురించిన ఎషావగీతం ఒకటి పాడుతున్నారు. ఒక అమ్మాయి ఎప్పుడైనా పాటలోనే తన ప్రేమాంకురాన్ని నాటుతుంది. తరవాత దానికి నీళ్ళుపోస్తుంది. అటుపైన పువ్వుపూయిస్తుంది. చివరకుతనకు నచ్చిన ప్రియుడికి ఆ పుష్పాన్ని ప్రేమ కానుకగా సమర్పిస్తుంది!

"బాబెంకో మామయ్యా!" అన్నాను. ఆయన ట్రౌజరు ఒక చేత్తోపట్టుకుని, భయం భయంగా. గుర్రపుస్వారీ చేసే వాడిలాగా పిక్కల దగ్గర బిగుతుగా ఉన్న ట్రౌజరు తొడుక్కున్నాడాయన.

"ఒరేయ్! ముందు చెయ్యి అక్కడనుంచి తియ్యి. మాట్లాడేది నోటితో అయితే చెయ్యి ఏం చేస్తుంది? చెయ్యి ఊరుకోదా ఏం?" అని ఆయన కసురుకున్నాడు.

"ఏమిటి? ఏం కావాలి నీకు? ఈస్టర్ నిబంధనలో పదవసూత్రం ప్రకారం నన్ను ముద్దాడాలనుకుంటున్నావా?" అని అడిగాడు.

"లేదు" అన్నాను భయంతో కంపించిపోతూ.

"మరి ఏమిటి? దేనికొచ్చినట్టు? చెప్పరా వెట్టిముఖమా?"

"నీదగ్గర ఏమైనా పుస్తకాలున్నాయా?"

"ఏం పుస్తకాలు? చదువుకునేవా?"

"అవును"

"ఓ! రకరకాల పుస్తకాలున్నాయి. కానీ దేనికిరా వెళ్ళివాడా? నీకూ, నాకూ బేరం కుదరదే!"

"ఎందుకు కుదరదూ?" అన్నాను నేను ధీమాగా.

"నీముఖం! నీ వేం కొంటావురా పుస్తకాలు?" అన్నాడాయన ఎద్దేవగా.

"కాదు. నీ దగ్గర ఏం పుస్తకాలున్నాయో చెప్పు?"

"నీవు ఊహించుకో గలవి, ఊహించుకోలేనివికూడా ఉన్నాయి" ఇలా అని బాబెంకో ఒక్క క్షణం ఆగాడు.

"అయినా నీకు సరిపడే పుస్తకం ఏమిటో నాకుతెలుసు - "టామ్ సాయర్!" అది నా దగ్గర ఉంది!" అన్నాడు.

నా చెవులను నేనే నమ్మలేకపోయాను. ఆ పుస్తకంలోని అసాధారణ సాహసకృత్యాలను గురించి నేను ఎన్నోసార్లు విన్నాను. కానీ ఇంతవరకూ పుస్తకం చూడలేదు ఇంకేం? దొరకనే దొరికింది! సంతోషం పట్టలేక పోయాను.

"నాకు చదువుకోడానికి ఇస్తావా మామయ్యా?" ప్రతిమాలుతున్నట్టు అడిగాను.

కానీ నా ప్రయత్నం నాకే హానికలిగించింది. బాబెంకో కోపంతో భగ్గున మండిపడ్డాడు.

"పెద్దవాళ్ళతో పరాచకాలాడుతున్నావుట్రా కుర్రకుంకా? ముందు ఇక్కడనుంచి వెళ్ళు లేదా చెంపలు వాయగొడతాను!" అని అరిచాడు.

పెద్దవాళ్ళతో నేను పరాచకాలాడతానా? అలాంటివిషయం ఎలా"

అనుకున్నావు మామయ్యా? అందులోనూ పవిత్రమైన ఈస్టర్ ఆదివారం నాడా?" అన్నాను.

నేను చిత్తశుద్ధితోనే చెపుతున్నట్టు నమ్మకం కలిగింది ఆయనకు. "ఈ రోజుల్లో కుర్రపుంకలు చాలా మంది అలాంటి వాళ్ళేగా!" అన్నాడు నెమ్మదిగా.

"అది నిజమే మామయ్యా!........సరే నాకు "టామ్‌సాయర్" ఇస్తావా మరి?"

"దేనికి నీకది?"

"చదువుకోడానికి"

"చదువుకోడానికా?..........సరేనోయ్! చదువుకోడానికి నీకు ఆ పుస్తకం ఇస్తాను..........నీవు మీ మామయ్యకు నాలుగు గ్లాసులనిండా వేయించిన గుమ్మడిగింజలు తీసుకొచ్చి ఇవ్వు..........చూడు! మోసం చేశావా ఊరుకోను. సరిగ్గా నాలుగు గ్లాసుల గింజలున్నదీ లేనిదీ కొలిచి చూస్తాను."

సందు దొరికిందికదా అని ఇంకా ప్రతిమాలసాగాను.

"ఆకురాలే కాలంలో తెచ్చిస్తాను గుమ్మడి గింజలు. ఒప్పుకుంటావు కదూ?.........లేకపోతే ఈ కాలంలో ఎక్కడ దొరుకుతాయి?"

"అయితే నేనుకూడా ఆకురాలే కాలంలోనే నీకు పుస్తకంఇస్తాను భయపడకు, ఈలోపుగా పుస్తకాన్ని ఎలుకలు కొరికి తినవులే!" ఇలా అని బాబెంకో మామయ్య అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

గుమ్మడి గింజలు సంపాదించడం ఎలాగా అని ఆలోచించు కుంటూ నేను ఒంటిగా నిలుచుండి పోయాను. నాలాంటి దురదృష్టవంతు డెవడైనా ఉంటాడా? నేను పాపిష్టి నెలలో పుట్టాను, అమ్మచెప్పినమాట నిజమే!

ఈష్టర్ పండుగ ఆనందమంతా గంగలో కలిసింది. తరువాత కొంత సేపటికి గంటగోపురం యెక్కాను. నాలాంటి కుర్రకుంకలు మరి కొందరుకూడా ఎక్కారు. మేమంతా గోపురంమీద జల్సా చేద్దామనుకున్నాం. కానీ మా ఆటలు సాగలేదు. కాపలావాడు మమ్మల్ని గంట ముట్టుకో నివ్వలేదు. అవును, ఈస్టర్ పండుగరోజులుకదా మరి? ....

తరువాత ఒకరోజు అమ్మ, పొడుగాటి గుడ్డసంచీ ఒకటి బెల్టు మాదిరిగా నడుముకు కట్టుకున్నది.

"ఏమిటమ్మా అది? ఆడవాళ్ళంతా నడుముకు బెల్టు పెట్టుకుంటారా?" అని అడిగాను.

"నీ ముఖం! ఊరుకోరా!" అన్నది అమ్మ.

"అవునమ్మా! అదేమిటి?"

"నీ కెలా చెప్పనురా? గుమ్మడిగింజలు వెచ్చగావుండేటట్టు చెయ్యడానికి ఇలా కట్టుకుంటారులే."

"గుమ్మడిగింజలా" అంటూ ఆమెవంక అనుమానంగా చూచాను. నాకూ, బాబెంకోకూ జరిగిన సంభాషణ అమ్మ విన్నదా ఏమిటి? లేక ఆమె నన్ను తమాషా పట్టిస్తున్నదా" అనుకున్నాను.

"గుమ్మడి గింజలురా! చెప్పడంలేదూ?"

"వాటిని వెచ్చగా వుంచడం దేనికి? లేకపోతే చెడిపోతాయా?" భయపడుతూ అడిగాను.

"అలా అని ఎవరు చెప్పారురా నీకు? గుమ్మడిగింజలు ఇలా బెల్టులో కట్టుకుంటే, గుమ్మడికాయలు ఇంతింతలావు అవుతాయి! మన గుమ్మడికాయలు ఎంతలావున పెరిగాయో చూడలేదా నీవు?"

"అవును చూశానమ్మా!"

"ఇంకేం మరి? అందుకే!"

గుమ్మడికాయలతో నాకేం పనిలేదు. అవి ఎందువల్ల లావు అవు తాయోకూడా నాకు అక్కరలేదు నాకు కావలసిందల్లా గుమ్మడి గింజలు అమ్మకనుక బెట్లు పారేసుకుంటే, నేనుకనుక గుమ్మడిగింజలు తీసుక పోయి బాబెంకోకు ఇస్తే - నాకు పుస్తకం వస్తుంది! దీపంచుట్టూ పురు తిరిగినట్టు నా మనస్సంతా ఆ బెట్టుచుట్టూ తిరగడం మొదలుపెట్టింది!

ఇంట్లో ఎక్క డెక్కడ దాచిపెట్టిన గుమ్మడిగింజలన్నీ అమ్మ పోగుచేయడం మొదలుపెట్టింది? ఆ గింజల్లో జీవం వున్నది. అవి మా తోటలో పాతిపెట్టితే మొలకెత్తి, పెద్దవై, తీగలుసాగి, తోటంతా అల్లు కుని పెద్దపెద్ద కాయలుకాస్తాయి. అవును. దోసకాయలు, బటాణీలు, తెల్ల చిక్కుళ్ళు, ఎఱ్ఱ చిక్కుళ్ళు, గోరుచిక్కుళ్ళు, ఎఱ్ఱజొన్నలు మొక్క జొన్నలు, కాబేజీ, కారెట్లు, గెనుసుగడ్డలు, ఉల్లిగడ్డలు, పసుపు కొత్తిమిరాకు, గసగసాలు——ఇంకా ఎన్నెన్నో మాతోటలోపండుతాయి. విత్తనాలు చల్లడం, కాయగూరలుపండించడం అమ్మకు ప్రాణప్రదమైన విషయం. ఆమెలో ఏదో నూతనోత్సాహం పుట్టుకొస్తుంది, ఆమె కళ్ళు మిలమిలా ప్రకాశిస్తాయి. విత్తనాలంటే ఆమెకు ప్రాణం. భూమాతంటే అమితభక్తి.

"నాకు కాసిని గుమ్మడిగింజలు ఇవ్వమ్మా?" అమ్మను అడిగాను.

ఆమె నాలుగు గింజలు నా చేతిలో పెట్టింది. "ఇవి విత్తనాలు నాయనా! మరిన్ని పెట్టడానికి వీలులేదు" అన్నది,

విత్తనం అనేది ఆమె దృష్టిలో చాల పవిత్రమైన వస్తువు "రైతు జీవితం పాపిష్టి జీవితం. అన్నీ కష్టాలే. తినడానికి తిండి వుండదు" అని

ఆమె తరచు కర్షకుల జీవితాన్ని నిందిస్తూ వుంటుంది. కానీ భూమిఅంటే ఆమెకు పంచప్రాణాలు. భూమాతను మించినదేమున్నదని అంటుంది, భూమిని నమ్మినవాళ్ళు ఎన్నటికీ చెడరని చెపుతుంది. ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె భూదేవితో మాట్లాడుతున్నట్టు కనుపిస్తుంది ! భూమాత సుఖదుఃఖాలలో పాలు పంచుకుంటున్నట్టు "తల్లీ! శ్రమజీవులకు, సోమరులకు అందరికీ కూడా పంట యివ్వు!" అని ప్రార్థిస్తున్నట్లు కనుపిస్తుంది.

నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు అమ్మ నన్ను చెయ్యిపట్టుకుని తీసుకపోయేది. దోసపింజె మొట్టమొదట ఎలా ఏర్పడుతుందో, మొదట పూసిన పొద్దుతిరుగుడు పువ్వు సూర్యునివంక ఎలా తిరుగుతుందో చూపేది. అలాంటి సమయాలలో ఆమె కళ్ళు ఆనందంతోను, గర్వంతోను ప్రకాశించి వి. పృధ్వీసంపద యావత్తూ తను రహస్యంగా నిక్షిప్తం చేసుకుంటున్నట్టు కనుపించేది. హిమకణాన్ని ప్రేమించడం ఎలాగో, ఉషఃకాల సౌందర్యాన్ని ఆరాధించడం ఎలాగో. చెట్లు, పూలు, పండ్లు ఆకులు వసంతశోభ, ప్రకృతి – వీటన్నిటిలోనూనిండి నిబిడీకృతమై ఉన్న ఒకానొక నిగూఢ రామణీయకతను అవగతం చేసుకుని ఆస్వాదించడం ఎలాగో మొట్టమొదట అమ్మేనాకు నేర్పింది, ఇవే ఆ తరువాత నా జీవితంలో ఎప్పటి కప్పుడు నూతన చైతన్యాన్ని ఉద్భవింపజేస్తూ నన్ను నిజమైన మనిషిగా జీవించేటట్టుచేశాయి.

అమ్మ సహజంగానే గింజలతో మాట్లాడటం మొదలుపెట్టింది. కొన్నిటిని మెచ్చుకున్నది. మరి కొన్నిటిని ఈసడించింది.

"ఏమే బటాణీ! క్రిందటి సంవత్సరం నీవు కాయనేలేదు. మరి ఈ ఏడన్నా బాగా కాస్తావా?.........ఏమే, చిక్కుడూ! నీవు ఎప్పుడూ బాగానే కాస్తావులే!"

శాస్త్రయ్య వచ్చాడు.

"అదుగో మళ్ళీ గింజలతో మాట్లాడటం మొదలుపెట్టావూ ?" అన్నాడు.

తాతయ్యకు చేతిపనులపై ఉన్నంతగౌరవంభూమి, వంట పీటిమీద లేదు! తాతయ్యమాటలకు అమ్మ నొచ్చుకుని "అలాగేనా మాట్లాడటం పెద్దవారు" అన్నది.

"అవును, అలామాట్లాడకూడనిమాట నిజమే!" అంగీకరించాడు. తాతయ్య.

అంతలో ఒక గుర్రబ్బండి వచ్చి మా గేటుముందు ఆగింది. బండ్లోనుంచి దిగుతున్న వ్యక్తినిచూచి తాతయ్య చిరునవ్వు నవ్వాడు.

"మనమేమీ మామూలు జనంలాంటి వాళ్ళంకాదురా! మన తాహతువేరు, మన దర్జావేరు! ఆసంగతి తెలియాలి అందరికీ. చూడు! మంత్రులు మన ఇంటికి వస్తుంటారు!" అన్నాడు.

"మంత్రులా?" అన్నాను నేను వెంటనే, ఆశ్చర్యచకితుడనై.

తాతయ్య కిటికీవంక వ్రేలు పెట్టిచూపాడు. "చూడు! కాన్వాసు బూట్లు తొడుక్కున్న ఆవ్యక్తి మన గేటుతీస్తున్నాడు."

"అవును"

"ఆయనెవరో తెలుసా? ఇంతకుముందు మంత్రి!"

"ఆయన మంత్రిలా కనుపించడంలేదే?" అన్నాను నేను,

"కానీ ఆయన నిజమైన మంత్రి" అని చెప్పాడు తాతయ్య.

"నీవా" పత్రికల్లో ఇంతకుముందు ఆయన్ను గురించి నేను చదవలేదే—ఆయన బొమ్మకూడా చూడలేదు" అన్నాను మళ్ళీ.

"ఆయనలాంటి మంత్రులను గురించి పత్రికల్లో వ్రాయరు

నాయనా! వాళ్ళ బొమ్మలు కూడా అచ్చువేయరు" ఇలా అంటూ తాతయ్య ఆయనను కలుసుకోడానికి గబగబా ఎదురువెళ్ళాడు. అవును, మంత్రులు మనలాంటి వాళ్ళ ఇళ్ళకు రోజూరారు కదా! నేను కూడా తాతయ్యవెంట పరుగెత్తాను.

ఆ అపరిచిత వ్యక్తి ఒక రైతు. ఆయన తాతయ్యకు నమస్కారం చేసి, పలకరించాడు. తాతయ్య ఆరోగ్యాన్ని గురించి అడిగాడు కాల మాన పరిస్థితులనుగురించి, పంటలను గురించి, నేను ఎన్నడూ విననటు వంటి పోరాటాలు, దేశానికివినాశకరమైనపరిస్థితులనుగురించి. దక్షిణాదిన కరువు కాటకాలు, రాజకీయాలు, బందిపోటుదొంగలు - వీటినిగురించి, పరరాజ్యాపహరణాసక్తులు, దురాశాపీడితులు అయిన పెద్దపెద్ద విదేశాల వారు మా దేశాన్ని కబళించడానికై సాగిస్తున్న పన్నాగాలను గురించి వారిద్దరూ చాలాచాలా మాట్లాడుకున్నారు. కానీ స్ట్రాటన్ మామయ్యను చూచినవాళ్ళెవరూ.ఆయన ఒక మంత్రిపదవి నిర్వహించాడని అనుకోరు. చివరకాయన తన కొయ్యనాగలి ఒకటి బాగుచేసిపెట్టమని తాతయ్యను అడిగాడు.

"కొయ్యనాగలా?" అన్నాడు తాతయ్య.

"అవును, ఈ రోజులలో యినపనాగళ్ళు ఎక్కడ దొరుకుతాయి? లోహంయావత్తూ, ప్రాణాలు నిలపడానికిమారు ప్రాణాలు హరించడానికి యుద్ధంలోకి పోతున్నది" అన్నాడాయన కోపంగా.

"అవును! అన్నాడు" తాతయ్య.

"నాకు ముగ్గురు తమ్ముళ్ళు, యుద్ధానికివెళ్ళి ఒక్కడూ తిరిగి రాలేదు. పెద్దవాడు ఫ్రాన్స్‌లో చనిపోయాడు. సరే - మేము ఇలా పొలందున్నుకుంటూ కాలం గడుపుతున్నాం" అన్నాడు స్ట్రాటన్ మామయ్య.

మేం బండి దగ్గరికి వెళ్ళాం. బండ్లో నాగలి ఉంది. అది చేత్తో తయారుచేసిన నాగలి. దాని పిడి, చక్రం యావత్తూ కర్రతో తయారు చేసిందే. అలాంటి నాగలి అంతకు ముందు నే నెన్నడూ చూడలేదు.

"మీ ఊళ్ళో మంచి వండ్రంగం పనివాళ్ళెవరూ లేరా?–" అడిగాడు తాతయ్య.

"మీకు సాటివచ్చే పనివాళ్ళెవారూ లేరు. నాగలి బాగుచేయమని ఇస్తే, బాగుచేయటానికి బదులుగా దాన్ని ముక్కలు చేసఇస్తారు. అందుకే మీ దగ్గరికి వచ్చాను." అన్నాడాయన.

"సరే, వచ్చిన వాళ్ళను ఊరికే పంపను.........మీ దగ్గర నాగలి కర్రు ఉన్నదా?–" "లేదు. ఆస్ట్రియన్ 'బాయినేట్' దొరుకుతుందా? అదైతే శ్రేష్ఠమైన ఉక్కు–"

"వాటిపాడుగాను లెండి!" అన్నాడు తాతయ్య ఏవగింపుగా. "బాయ్‌నెట్ల" మీదకాదు ఆయన కోపం, సైనిక వాదులమీద, సామ్రాజ్య వాదులమీదనే ఆయన కోపమల్లా.

నాగటి కర్రు ఏదో విధంగా తయారుచేయడం కోసం తాతయ్య, వర్కుషాప్ లోకివెళ్ళాడు. అప్పుడు నేను స్ట్రాటన్ మామయ్యతో ఇలా అన్నాను:

"మీరు రాగానే, తాతయ్య నన్ను వెట్టివాణ్ణి జేయటానికి ప్రయత్నించాడు."

"ఏం కాదేం?"

"మీరు కోపంతెచ్చుకోనంటే చెపుతాను"

"తెచ్చుకోనులే చెప్పు"

"మీరు మంత్రి అని చెప్పారు తాతయ్య"

"అవును - మంత్రినే నాయనా" అన్నాడాయన, తన కాన్వాస్ బూట్లవంక చూస్తూ.

నేను ఆయన వంక తదేకంగా చూచాను. ఆయన ముఖంలో గర్వం ఎక్కడా కనుపించలేదు.

"మీరెక్కడ మంత్రిగా ఉన్నారు? సెయింట్ పీటర్స్బర్గ్‌లోనా"

"లేదు"

"మరి కీవ్‌లోనా?"

"అంత దూరంకూడా కాదు" ఆయన కళ్ళు మిలమిలలాడాయి.

"అయితే విన్నిట్సాలో అయి ఉండాలి?"

"ఇంకా దగ్గరిలోనే నాయనా. మా స్వంతగ్రామంలోనే."

"కుర్రవాళ్ళను ఏడిపించడమంటే మీలాంటి పెద్ద వాళ్ళకు సరదా అనుకుంటాను ?-" అన్నాను నేను, కోపంగా ముఖం ప్రక్కకు త్రిప్పుకుని.

"చూడు నాయనా! నిన్ను ఏడిపించాలని కానేకాదు. నేనుచెప్పింది నిజం. భాగ్యవంతుల తాలూకు మంత్రులు పెద్ద పెద్ద నగరాలలో నివసిస్తారు. మేము రైతుల తాలూకు మంత్రులం"

"మరి మీరు భాగ్యవంతుల మంత్రులతో చేరరా?"

"లేదు. మేము వారితో పోరాడాం"

"మీరు ఎలాంటి దుస్తులు ధరిస్తారు?"

"ఎలాంటివైనా సరే. ఏవి దొరికితే అవే. గొర్రె చర్మాలు, కోట్లు, నూలు బట్టలు, స్వదేశంలో తయారైన ముతక బట్టలు—అన్నీ ధరిస్తాం. బూట్లు ధరించేవాళ్ళు అదృష్టవంతులు"

"మీరు ఎవరి పక్షం?"

"పేద రైతుల రిపబ్లిక్ పక్షం"

"అది చాలా పెద్దదా?"

"మూడు గ్రామాలు, భవనాలుగల ఇజారా నేల. కానీ జర్మన్‌లు, ఆస్ట్రియన్‌లు దాన్ని కబళిస్తున్నారు. మాకు శక్తి ఉన్నంతవరకూ వాళ్ళను ఎదిరించి నిలువరించాం. తరవాత అడవులకు వెళ్లాం, అక్కడ మా రిపబ్లికును ఏర్పాటు చేయడానికి"

"ఇప్పు మీరు మంత్రికాదా?"

"కాదు. ఇప్పుడు నేను పేదరైతు సంఘములో సభ్యుడను." అన్నాడాయన ఉల్లాసంగా. ఉన్నత పదవులు పోయినందుకు కొందరు ఎంతో బాధపడతారు. కానీ ఆయనలో అలాంటిదేమీ కనుపించలేదు. స్ట్రాటన్ మామయ్యతో నాకు బాగా స్నేహం ఏర్పడింది. తాతయ్యను, నన్ను, వాళ్ళఊరికి రావలసినదిగా ఆహ్వానించాడాయన రైతులతాలుకు మంత్రులు సమావేశాలుజరిపిన కుటీరం ఇప్పటికీ అక్కడ అలాగే ఉన్నదట. వాళ్ల ప్రధాన మంత్రి ఇప్పుడు వొలోస్టు సహకారసంఘం అధ్యక్షుడుగా ఉన్నాడట.

స్ట్రాటన్ మామయ్య అలా వెళ్ళిపోయాడో లేదో మా గ్రామపెద్ద మమ్మల్ని చూడడానికివచ్చాడు. ఆయన ఊరపందిలా ఇంతలావున ఊరి ఉంటాడని మా తాతయ్య ఎప్పుడూ చెపుతూ ఉంటాడు. ఇప్పుడాయన్ను చూడగానే తాతయ్య చెప్పిన మాట జ్ఞాపకంవచ్చింది. పొట్ట చెక్కలయ్యేటట్లు నాలో నేను నవ్వుకున్నాను. ఆయన వచ్చాడు. అదేపనిగా కబుర్లు ప్రారంభించాడు. అందులోనూ రాజకీయాలు. రాజకీయాలలో తనకు గొప్పపరిజ్ఞానమున్నదని ఆయనకు తగనిగర్వం. కారణం మరేమీకాదు. మత గురువు చందా కట్టి తెప్పించే వార్తాపత్రిక, డబ్బు ఖర్చులేకుండా

ఆయన చదువుతాడు. పత్రికలో చదివే పడికట్టు రాళ్లవంటి మాటలు పది జ్ఞాపకం పెట్టుకుంటాడు. కానీ వాటి అర్ధంకూడా ఆయనకు తెలియదు. అయినా రాజకీయాలు తనకే తెలిసినట్టు అవకాశం చిక్కినప్పుడల్లా ఆ పడికట్టు పదజాలం ఉపయోగిస్తూ ఉబ్బితబ్బిబ్బు అవుతుంటాడు. విదేశ వ్యవహారాలతో మొదలై చివరకు ఉప్పు, పప్పు మిరపకాయ, చింతపండు, కిరసనాయిలూ–మున్నగు విషయాలవరకూ సాగుతుంది ఆయన ఉపన్యాసం !

ఆయన ధోరణి తాతయ్యకు నచ్చదు. ఆయనకు తగినట్టే, మెల్లగా వాతపెట్టినట్టు సమాధానం చెప్పేవాడు.

"ఏమయ్యా ! నీవు నాతో పనుండి వచ్చావా లేక ఊకదంపుడు రాజకీయాలు మాట్లాడడానికి వచ్చావా ?" ఉండి ఉండి విసుగుపుట్టి అడిగాడు తాతయ్య.

"ఒక బండి చక్రం తయారుచేసి ఇస్తారేమోనని వచ్చాను. చూడండి ! నా పరిస్థితి అంతా మారిపోయింది. పేదరికం అనుభవిస్తున్నాను." అన్నాడు గ్రామపెద్ద.

"అయితే ఎకాఎకి పేదరైతు సంఘానికి వెళ్ళండి. పేదవాళ్ళకు ఆ సంఘం ఎప్పుడూ సహాయపడుతుంది." అని సలహా చెప్పాడు తాతయ్య. గ్రామపెద్ద ముఖం కందగడ్డలా ఎర్రగా అయింది.

ఇంతలో అమ్మ లోపలివాకిట్లోకి వచ్చింది. ఏదో పనిమీద ఖాళీ జాగాలో నుంచి ప్రక్క ఇంటికి వెళ్ళింది. ఇంకేం ? నాకు సమయం చిక్కింది. అమ్మ ఎప్పుడు ఆవతలికి వెడుతుందా అని కాచుకుని కూచున్నాను. అమ్మను అలా పోనిచ్చి గభాలున వంట ఇంట్లో దూరాను.

పొయ్యి అరుగుమీద రెండు సంచులనిండా గుమ్మడి గింజలు పోసి ఉన్నాయి. ఎవరన్నా చూస్తారేమోనని ఒకసారి కిటికీలో నుంచి బయటికి చూచాను. రెండు సంచులూ విప్పాను. ఆకురాలే కాలందాకా ఎందుకూ? ఇప్పుడే దొరికాయి గుమ్మడిగింజలు. చూస్తేనే నోరూరేటట్టు ఉన్నాయి. కాని ఇప్పుడు నేనేం చేయాలి? రెండు సంచులంటే బోలెడు గింజలు. దొంగిలిస్తే ఎవరూ చూడరు. నేను చేస్తున్నపని చాల తప్పు అని నాకు తెలుసు. కానీ ఆశ నన్ను పట్టి పీడించింది.

ఒక గ్లాసు తీసుకుని అరుగు ఎక్కాను. గ్లాసుతో గుమ్మడి గింజలు కొలిచాను. రెండు గ్లాసులు ఒక జేబులో, రెండు గ్లాసులు ఇంకొక జేబులో పోసుకున్నాను. జేబులు రెండూ రాళ్ళుపోసుకున్నట్టు అమిత బరువుగా ఉన్నాయి. అరుగు దిగాను. అక్కడున్న దేవుడి విగ్రహం నా వంక కోపంగా చూస్తున్నట్టు, 'జాగ్రత్త'— అని వ్రేలు ఎత్తి బెదిరిస్తున్నట్టు అనిపించింది. నేను చేసిన నేరానికి ప్రత్యక్ష సాక్షి ఆ భగవంతుడే!

ఒక ప్రక్కన భయం, మరొకప్రక్కన ఆనందం —రెంటిమధ్య ఊగిపోయాను. మెల్లగా ఇంట్లోనుంచి జారుకున్నాను. వీధిలో వెళు తున్నాను. ఫెళ ఫెళ ఎండకాస్తున్నది. వేసవికాలపు సూర్యుడు. సూర్య కాంతి దూసుకునివచ్చి ఇండ్లపైన, గోడలపైన, చెట్లపైన - అంతటాపడి మిలమిలలాడుతూ ప్రకాశిస్తున్నది. పృథ్విలో ప్రతివస్తువూ సూర్య రశ్మిలో జలకమాడుతున్నట్టున్నది. అంతటా నూతన శోభ. అంతటా ఏదో క్రొత్తజీవం. ఏవేవో ఆలోచించుకుంటూ వీధి మలుపు తిరిగాను. దో కర్కశమైన పురుషకంఠం వినిపించింది.

"ఏమమ్మా! నీకే చెప్పేది? ఎవరు చేస్తారు నీకు సహాయం! గవంతుడు చేయాలి. పోయి ఆయన్ను అడుగు!—"

ఆ పురుష కంఠ స్వరంతోపాటు భయంకరంగా ఒక కుక్క అరవడం వినిపించింది. గలగలమంటూ గొలుసు చప్పుడైంది. పిట్టగోడ సందులో నుంచి ఇంట్లోకి చూచాను. లోపల్నుంచి మరొక గొంతు వినిపించింది.

"ఎక్కడ నుంచి వచ్చారట వాళ్ళు?"-

"ఖెర్సన్ నుంచి వచ్చానని చెపుతున్నది ఆమె. ఈ రోజుల్లో ఎక్కడ చూచినా దేశదిమ్మరులు-నానారకాలవాళ్ళు. ఇంక రొట్టెముక్క పడేస్తేపోదు. బంగాళదుంపల కూరకావాలి వాళ్ళకు!" అని మళ్ళీ పురుష కంఠం, ఈ సడింపుగా సమాధానం చెప్పింది.

"ఈ బిచ్చగాళ్ళకు అంతూ పంతూ లేకుండా ఉంది" మళ్ళీ లోపల నుంచి ఒక గొంతు.

భయవిచలితురాలైన ఒక స్త్రీ గేటులో నుంచి ఇవతలికి వచ్చింది చిరిగి పీలికలైన గుడ్డలు కట్టుకున్నది. కాళ్ళకు చిరిగిన బూట్లు. ఆమె చాలా చిన్న వయస్సులోనే ఉంది. కానీ ఆమె చెక్కిళ్ళు గుంటలు పడ్డాయి. కళ్ళు లోతుగా గుంజుకుని పోయాయి. ముఖం వివర్ణంగాఉంది. నేలమీదికి చూస్తున్నది. పాపం ఒక చిన్న పిల్లవాడు. తలకు టోపీలేదు. వట్టికాళ్ళు. ఆవిడ కొంగుపట్టుకొని దీనంగా, దిగులుగా చూస్తున్నాడు. ఆకలి, అంతులేని అలసట, ఆ తల్లీబిడ్డల ముఖాలలో నీలినీడల్లా కమ్ముకుని ఉన్నాయి. చలికి ఆమె చేతులు పగిలి ఉన్నాయి. ఆమె నల్లటికళ్ళలో నీళ్ళు నిండాయి.

ఆమెకూ, ఆమెబిడ్డకూ ఒక రొట్టెముక్క ఇవ్వడానికి నిరాకరించి కసిరి కొట్టిన వ్యక్తి ఎవరో నాకు బాగాతెలుసు. అతనొక భాగ్యవంతుడు పేరుకు ధర్మాత్ముడు. ఇతరుల కడుపులుకొట్టి ఆ పెద్దమనిషి నూరు రూ

ట్ళ బ్యాంకునోట్లు, అయిదు వందల రూబుళ్ళ బ్యాంకు నోట్లు కట్టలు కట్టలు సంపాదించాడు, బంగారు కణికెలు, వెండి నాణాలు పోగుచేశాడు. చూడడానికి పుణ్యాత్ముడులా కనుపిస్తాడు. అతని పొలాలు, తోటలు పుష్కలంగా పంటపండుతాయి. పండకుండా బీడువారినదల్లా అతని ఆత్మ మాత్రమే।

రొమ్మునచేతులు అడ్డంగాపెట్టుకుని ఆ అభాగ్యురాలు, కుక్క తన మీదికి ఎగబడని ఇల్లు ఏదా అని చూస్తున్నది. ఆ పసివాడు నా వంక భయం భయంగా అనుమానం గాచూశాడు. వాడి తలవెంట్రుకలు ఉంగరాలు తిరిగి ఉన్నాయి.

నా జేబులో గుప్పెడు గింజలున్న సంగతి గుర్తుకొచ్చింది. జేబులోనుంచి ఒక గుప్పెడుతీసి వాడికి పెట్టేను. వాడు రెండు చేతుల తోను అవి పట్టుకుని వాళ్ళ అమ్మవంక చూచాడు. ఆవిడ తలపంకించి బరువుగా నిశ్వసించింది. కష్టంలో ఉన్నప్పుడు మా అమ్మకూడా అలాగే నిట్టూరుస్తుంది. నాకు జ్ఞాపకమే. ఒక జేబులో ఉన్న గింజలన్నీ ఆ పసివాడి చొక్కా కొంగునపోశాను. రెండోజేబులోవి కూడా తీసి పొయ్యబోయాను. కానీ తల్లినన్ను వారించింది.

"ధన్యవాదాలు నాయనా। చాలు నాయనా పెట్టినవిచాలు" అన్నది. విచారభరితమైన అవనతనేత్రాలతో ఆమె వంగి నాకు నమస్కారం చేసింది. ఆవిడ వెచ్చని కన్నీళ్ళు నా చెక్కిళ్ళపైబడి జారువారాయి. "ఎప్పటికీ నీకు క్రూరాత్ములబాధ లేకుండుగాక నాయనా।"అని ఆశీర్వదించింది.

నా హృదయం ద్రవించింది.ఎందుకో వెక్కివెక్కి ఏడ్చాను.

బహుశః ఆమె ఒకమామూలు స్త్రీ కాదు. ఒక ఆత్మ: రష్యన్ రైతుల ఆత్మ ఆమె. వారి విషాద నేత్రాలకు చిహ్నం ఆమె।

మరొకసారి ఆమె నావంక దీనంగా, దిగులుగా చూచింది. ఆమె ఆమెబిడ్డ మా వీధివైపు వెళ్ళారు. వాళ్ళు వీధిమలుపు తిరిగేవరకూ అటు వైపే తదేకంగా చూస్తూ నిలుచున్నాను. ఆమె దీనవదనం అశ్రుపూరిత నేత్రాలు, ఆ పసివాడు, వాడి ఉంగరాలుజుట్టూ - అన్నీ సాకళ్ళల్లో మెదులుతున్నాయి. మానవ వేదనలాలూకు మహాభయానక దృశ్యాన్ని చూస్తూ అలాగే చాలసేపు నిలుచుండిపోయాను.

పెద్దనల్లపంది ఒకటి శ్రీమంతుడి ఇంట్లోనుంచి బయటికివచ్చింది. దాని మెడకు కొయ్యపత్రం ఒకటి తగిలించి ఉంది. బంగాళాదుంపల గుజ్జు ఇష్టం వచ్చినంతతిని, తాగి వస్తున్నట్టున్నది. దాని మూతి, మెడకు వంటినిండాకూడా బంగాళాదుంపల గుజ్జు అతుక్కొని ఉంది.

"నీవు కొట్టెముక్క తినవు, బంగాళాదుంపలు కావాలినీకు!" అని అంటూ నేను అక్కడనుంది బయలుదేరాను.

ఇప్పుడు నేనేం చెయ్యాలి? తిరిగి ఇంటికి వెళ్ళనా? లేక బాబెంకో దగ్గరికేపోయి నా పని పూర్తిచేసుకోనా? ఇప్పుడు నా దగ్గరున్నది రెండు గ్లాసుల గుమ్మడిగింజలేగా? బహుశా అవే పుచ్చుకుని అతను నాకు పుస్తకం ఇవ్వవచ్చు. వీధివెంట పరుగెత్తాను. విల్లో 'చెట్లనుండి' మొయ్యి' మని గాలివీస్తున్నది. ఎండ తెరలు తెరలుగావచ్చి నాముఖాన పడుతున్నది.

నేను వెళ్ళేసరికి బాబెంకో తన ఇంట్లో చిట్టచివర ఉన్న ఒక గదిలో ఉన్నాడు. చిరిగిన ట్రౌజరు వేసుకుని బెంచీమీద కూచున్నాడు. చూపుడువ్రేలితో 'బలాలైకా' (చిన్నవీణవంటి ఒక సంగీతవాద్య విశేషం) తంత్రులపై వేళ్ళతో దరువువేస్తూ పాటపాడుతున్నాడు:

"ఎందుకలా కనుపిస్తావు తమాషాగా ?
చెప్పనా, నాదగ్గర డబ్బులేదుగా.
డబ్బులేదు నీ దగ్గర ఎందుకూ ?
తమాషాగా కనుపిస్తున్నందుకూ"

టేబిల్ మీద ఒక పూలకుండీ అంత సిరాబుడ్డి, దాని ప్రక్కన మొనచెక్కిన ఈకకలం ఒకటి ఉన్నాయి. ఏవో వ్రాసిన కాగితాలుకూడా కొన్నిపడి ఉన్నాయి. అవును బాబెంకో ఏవో పాటలు రాస్తున్నాడు.

నన్ను చూడగానే అయన జుట్టువెనక్కు సవరించుకుని చిన్న నవ్వు నవ్వాడు.

"ఏమోయ్ వెట్టి మొగమా ! గుమ్మడి గింజలు తెచ్చినట్టున్నావే చూడబోతే ?—" అన్నాడు.

నేను సమాధానం చెప్పలేదు.

"ఏం, నేను చెప్పింది నిజమేనా ?—" అడిగాడు మళ్ళీ.

"కొంత నిజం—" అన్నాను తడబడుతూ.

"ఎందుకని కొంత ?—" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఏదో జరిగిందిలెండి."

"ఏమిటి, ఏం జరిగింది ? మనం బేరం ఆడుకున్న ప్రకారం నాలుగు గ్లాసుల గింజలు తీసుకరాలేదా ?—"

"రెండు గ్లాసులే తెచ్చాను."

"ఈ పప్పులు నాదగ్గర ఉడకవు అబ్బాయ్ !" అంటూ బాబెంకో తిరిగి 'బలాలైకా' వాయించడం మొదలుపెట్టేడు.

"అకురాలే కాలందాకా ఆగండి. తక్కినవి తెచ్చిపెడతాను."

"అప్పటిదాకా ఆగితే ఒకరితో పనిలేకుండా నేనే బోలెడు గింజలు సంపాదించుకోగలను." అన్నాడు బాబెంకో, నిక్కచ్చిగా.

ఇక నేనేం చేయాలి? కాసేపు నిలుచున్నాను. ఇక వెళ్ళిపోదామని బయలుదేరుతూ ఉంటే ఆయన పిలిచాడు.

"ఇదిగో, ఒక నిమిషం ఆగరా అబ్బాయ్! ఏవీ అసలు నీ దగ్గరున్న గింజలు చూపించు."

ఇలా అని బాబెంకో నా దగ్గరకి వచ్చాడు. జేబులో చెయ్యిపెట్టి కాసిని గుమ్మడిగింజలు తీసుకుని నోట్లోపోసుకున్నాడు. "ఫరవాలేదు. రుచిగానే ఉన్నాయి." అన్నాడు నములుతూ.

"సరే తెచ్చినవేవో తెచ్చావు ఇచ్చిపో. అద్భుతకథలు కొన్ని ఇస్తాను నీకు చదువుకోడానికి. టామ్‌సాయర్ మాత్రం ఇప్పుడివ్వను. అనుకున్న ప్రకారం గింజలు తెచ్చినప్పుడే ఇస్తాను, సరేనా?"

"సరే" అన్నాను, మనస్సు కుదుట పడింది.

గింజలకోసం బాబెంకో చెయ్యిచాపాడు,

"ఈ రెండుగ్లాసుల గుమ్మడిగింజలు ఇప్పుడు తీసుకోండి. ఆకు రాలేకాలంలో మరి నాలుగుగ్లాసుల గింజలిస్తాను, టామ్‌సాయర్ ఇవ్వండి" అన్నాను,

"ఒరేయ్! నా దగ్గర ఈ వేషాలు పనికిరావు! ఏపుస్తకంధర ఆ పుస్తకానిదే!" అన్నాడు బాబెంకో.

"పోనీ, ఒక్కరోజుకు టామ్‌సాయర్ ఇవ్వండి!" అని ప్రతిమాలాను.

"ఇవ్వను, అడక్కు" అన్నాడాయన. అతని హృదయం కఠినం

పాషాణం నయం. "కథల పుస్తకం కావాలా అక్కర్లేదా?" అని అడిగాడు.

"కావాలి" అన్నాను.

నా జేబులో ఉన్న మిగతా గుమ్మడిగింజలు తీసుకున్నాడు. తర వాత ఒక ట్రంకుపెట్టె తెరచి అందులోనుంచి కథలపుస్తకం తీసి ఇచ్చారు.

"ఇదుగో! ఎన్నిరోజులు పడుతుంది చదవడానికి?"

"షుమారు నాలుగురోజులు"

"ఇదుగో, ఆదివారం తీసుకొచ్చి ఇవ్వు.ఆదివారం"

"ఆదివారం మీరు ఇంటిదగ్గర ఉంటారా?"

"ఉదయమంతా ఇంట్లోనే ఉంటాను. తెచ్చివ్వు! ఇవ్వకపోయావా, ఒరేయ్! నా సంగతి తెలుసుగా నీకు - జాగ్రత్త!" అంటూ నా వంక చురచురా చూశాడు బాబెంకో, ఆయన పుస్తకం నేను దొంగిలించినట్టు.

అమ్మకంటపడాలంటేభయం! (గుమ్మడిగింజలు కనుపించపోయే సరికి ఆమెకు నామీద అనుమానం పుట్టదూ?) ఎకాఎకి "షుకోవ్ కొలను"కు వెళ్ళాను. ఆ కొలనులో నీళ్ళు సూర్యుడితో దాగుడు మూతలాడుతుంటాయి! గాలితో, మేఘాలతో తోబూచులాడుతుంటాయి! ఒక్కొక్కప్పుడు కొలనులో చేపలు ఎగిరి ఒడ్డుకు వస్తాయి. అలలు గుండ్రంగా సుళ్ళు తిరుగుతూ చాకిరేవుకు తాకి చూడముచ్చట గొలుపు తుంటాయి. నేను వెళ్ళేసరికి కొలనులో ఎవరూ గుడ్డలు ఉతకడంలేదు. నేను ఇసుకమీద పడుకుని కథల పుస్తకం చదవడం మొదలుపెట్టాను. నా మనస్సు మళ్ళీ ఏవో అద్భుతలోకాలలో విహరించసాగింది. నా చుట్టూ వసంత శోభ ఇళికాలాడుతున్నది. కానీ నా మనస్సు చుట్టూ కథ

లలోని గంధర్వ లోకాలు, రాజులు, రాణులు, యక్ష రాక్షసుల రూపాలు అద్భుత దృశ్యాలు–ఇవన్నీ ముసురుకుని ఉన్నాయి. నాకెంతో హాయిగా, తృప్తిగా ఉంది. అలా ఎంతసేపు చదివానో నాకే తెలియదు. నేను మళ్ళీ బాహ్య ప్రపంచంలోకి వచ్చి నా చుట్టు కలయచూచే సరికి పొద్దు వాట వాలింది.

మళ్ళీ భయం పట్టుకున్నది. ఇంటికిపోతే నాకోసం ఏ ప్రమాదం ఎదురు చూస్తున్నదో! నాకో ఆలోచన తట్టింది. లోయలో సుగంధపాల వ్రేళ్ళు కనుక తీసుకుని పోతే అమ్మ కోపం చల్లారుతుంది. అవి తెచ్చి నందుకు అమ్మ నన్ను ఎంతో మెచ్చుకుంటుంది.– కానీ, మళ్ళీ గుమ్మడి గింజల విషయమేనా మనస్సులోకి వచ్చి పీడించసాగింది. లోపల మన స్సాక్షిఅనేది ఉన్నట్టు భావించుకునే వాడికి, చేసిన తప్పును ఏవిధంగా సమాధాన పెట్టుకుందా మనుకున్నా సాధ్యంకాదు.

అయినప్పటికీ నా జేబునిండా సుగంధపాల వ్రేళ్ళు కుక్కుకుని ఇంటిముఖంపట్టాను. అదిగో, మా ఇల్లు, రానేవచ్చిది నాకు ఎలాంటి చీవాట్లు, చెప్పుదెబ్బలు తగలనున్నాయో! గభాలున ఇంట్లోకి వెళ్ళాలని బుద్ధిపుట్ట లేదు. బయట పిట్టగోడ ఎక్కి కాసేపు కూచున్నాను. లోపల వసారాలో, తోటలో, ఏం జరుగుతున్నదో కనిపెట్టుతూ కూచున్నాను. అవ్వ తోటలో తిరుగుతున్నది. ఆపిల్ చెట్లమధ్యనుంచి ఏదేదో పరిశీలిస్తూ మెల్లగా నడుస్తున్నది. ఏదో ధ్యానముద్రలో ఉన్నట్టున్నది ఆమె ముఖం. అవును. తోట అన్నా, పండ్లచెట్లన్నా ఆమెకు ప్రాణం. వాటిని చూస్తుంటే ఆమె ఈ లోకంలో ఉండదు. వర్కుషాపులో తాతయ్య పనిచేసుకుంటున్నాడు. ఆయన తలమీద టోపీ సగం జారించి. తల వెంట్రుకలు గాలికి ఊగుతున్నాయి.

తాతయ్య నన్ను చూడనే చూశాడు. మొదట ఆయన ముఖంలో ఆశ్చర్యం గోచరించింది. తరువాత చిరునవ్వుతో పలకరించాడు.

"దేశంమీద పోయినవాడు తిరిగి వచ్చాడే! నిన్ను ఏ భూతాలో ఎత్తుకునిపోయి ఉంటాయనుకున్నానురా!"

"అలాంటి ఆలోచన యెందుకొచ్చింది తాతయ్యా నీకు?" అన్నాను నేను ఉత్సాహంతో. నామీద ప్రళయం వచ్చిపడే సూచనలేవీ లేనందుకు నాకు ధైర్యంగానే ఉంది.

"ప్రొద్దునపోయి ఇప్పటిదాకా ఎక్కడున్నావురా? నీకోసం ఊరంతా గాలించాను!"

"ఊఁ! తరువాత?"

"తరువాతనా? అదేనా నీవు చెప్పాల్సింది? పోయ్యేవాడివి ఎవరితోనైనా మాటమాత్రం చెప్పి పోకూడదూ? నీకోసం నేనిక్కడ వస్తువు తయారుచేస్తూ కాలమంతా వ్యర్థం చేసుకుంటున్నాను."

"నాకోసం ఏం వస్తువు తయారుచేస్తున్నావు తాతయ్యా?"

"నన్ను నువ్వు ఏమి అడిగావురా?"

"గాలిమర!"

"నేనేం చెప్పాను?"

"నాలాటి మనమడు ఏది అడిగితే అదిచేసి ఇస్తానని చెప్పావు నీవు!" తాతయ్య అన్నమాట నాకు సరిగ్గా జ్ఞాపకం ఉంది.

"నీకెంత జ్ఞాపకశక్తిరా!" అన్నాడు తాతయ్య నవ్వుతూ. నాకోసం ఆయన చెక్కపెట్టితో గాలిమర తయారుచేస్తున్నాడు.

"ఎంత బాగుంది!" అన్నాను.

"నిజంగా బాగుందా? బాగుండాలనే చేతనయినంతవరకు పాటు పడ్డాను" అన్నాడు తాతయ్య. "సరే ఇక ఇంట్లోకి వెళ్ళు" అన్నాడు.

"అమ్మ ఏం చేస్తున్నది?" కిటికీవంక ఓరగా చూస్తూ అడిగాను.

"మామూలే. మొదట కోపడింది. తరవాత ఆ కోపం చల్లారింది. నిన్నుగురించి అడగటానికి ప్రక్కయింటికి వెళ్ళింది. అంతే." అని చెప్పాడు తాతయ్య.

నేను మెల్లగా తలుపుతీశాను. లోపల ఒకవైపునుంచి వేయించిన గసగసాలవాసన వస్తున్నది. మరొకవైపునుంచి కాల్చిన రొట్టెలవాసన. విత్తనాలపూట టేబిలుమీద పెట్టుకుని వాటిని పరిశీలిస్తూ కూచుని ఉంది అమ్మ. కొన్ని విత్తనాలు చేతపట్టుకుని ఎప్పటిలాగే ... లోతాను ఏదో గొణుక్కుంటూ ఉంది. నా హృదయం క్రుంగిపోయింది. మళ్ళీ ఇంట్లో నుంచి మెల్లగా జారుకుందామనుకున్నాను కానీ అమ్మ నన్ను చూచింది.

"చివరకు వచ్చావుట్రా?" అన్నది. "నీతో ఎలా వేగనురా? ఏం చేసేది నిన్ను?" అన్నది. ఆమె నల్లటికనురెప్పలు పైకిపోయాయి. ఆమె కపోలాల పై నీలనీడలు కమ్ముకున్నాయి.

"అమ్మా, లోయలోకివెళ్ళి నీకోసం సుగంధపాలవ్రేళ్ళు తెచ్చా! పెద్దలోటా రసంవస్తుంది!" ఇలా అంటూ గబగబ జేబులోఉన్న సుగంధ పాలవ్రేళ్ళు తీసి, బెంచీమీద కుప్పపోశాను అమ్మమనసు మళ్ళిద్దామని నా ఆశ.

కానీ సుగంధపాల వ్రేళ్ళతోపాటు నా జేబులోనుంచి రెండు గుమ్మడిగింజలు క్రిందపడ్డాయి! నాకు శరీరం కంపించింది. భయంతో అమ్మవంక చూచాను. కానీ ఆమె ముఖంలో కోపంలేదు. మెల్లగా. విచారంగా ఇలా అన్నది:

"ఏమిరా మిఖైలో! కరువు ప్రాంతాలనుంచి వచ్చిన ఆ చిన్న పిల్లవాడికి నీవేనా గుమ్మడి గింజలు పెట్టింది?"

"అవునమ్మా! సంచిలోనుంచీ తీసుకున్నాను."

అమ్మ కాసేపు ఏమీమాట్లాడలేదు. విచారవదనంతో కూచున్నది. ఆమె నన్ను తిట్టినా, కొట్టినా ఎంతో సంతోషించేవాడిని.

"నీవు చాలా మంచిపని చేశావు నాయనా" అన్నది చివరకు.

"పేదవాళ్ళకు పేదవాళ్ళు సహాయం చేయకపోతే మరెవరు చేస్తారు నాయనా? వాళ్ళకు ఒక రొట్టెముక్కో, ఒక గిన్నెడు పులుసో పడేయవలసింది పేదవాళ్ళేరా?" అన్నది.

నా హృదయంలో శూలం పొడిచినట్టు బాధ కలిగింది.

"ఆ చిన్న పిల్లవాణ్ణి నీవెలా చూచావమ్మా?"

"అభాగ్యవతి అయిన ఆస్త్రీ తన బిడ్డతో మనింటికి వచ్చింది నాయనా. నేను వాళ్ళకు కడుపునిండా రొట్టెపెట్టాను. త్రోవలో తినడానికి ఉంటుందని కాస్త రొట్టె మూటకట్టి యిచ్చానుకూడా. తన కొడుక్కు గుమ్మడిగింజలు పెట్టిన కుర్రవాడిని ఆమె ఎంతగా తలచుకున్నదను కున్నావు? నీవే ఈపని చేసివుంటావని ఊహించుకున్నానురా పిచ్చి వెధవా! కానీ నే నేమీ అనలేదు. మిఖైలో! నీవు ఏమి కానున్నావో నాయనా!"

"నీవేం భయపడకమ్మా. ఏదో ఒకటి నాకు మంచి జరుగుతుం దమ్మా" అన్నాను నేను, గుండె చిక్కపట్టుకుని.

అమ్మ నన్ను దగ్గరకు తీసుకున్నది. ఒడిలో కూచోబెట్టుకుని తల నిమిరింది. బరువుగా నిశ్వసించింది.

—o—

అధ్యాయం : మూడు

వేసవి మెల్లమెల్లగా వెళ్ళిపోయింది. పోతూపోతూ నీలివర్షపు ధారలను, పచ్చని వెచ్చని వసంతశోభను, నైటింగేల్ మృదుమధుర గానాన్ని వెంటతీసుకుని పోయింది. గ్రీష్మం పొడసూపింది.

అమ్మ వర్ణించి చెబుతుంది ఈ విధంగా. అద్భుతకథలలోని దేవకన్యలా మాట్లాడుతుంది ఆమె. వేసవిలో ప్రాతఃకాలాన ఎన్నెన్నో అద్భుతాలు, మార్పులు జరుగుతాయని ఆమె చెపుతుంది. కానీ ప్రొద్దున్నే నిద్రలేవాలంటే నాకు తగనిబద్ధకం. మరి అమ్మనన్ను లేపుతుంది. నేను నిద్రమత్తుకళ్ళతో తూగుతూ వుంటాను. ఆమె అప్పుడే తోటలోనుంచి వస్తుంది. తోటలో చెట్లన్నీ మంచుబిందువులతో మిలమిలలాడుతుంటాయి. అమ్మ మెల్లగా నా భుజం నిమురుతూ, ఏదో లోకంలోకి చూస్తున్నట్లు కిటికీలోనుంచి చూచి మెల్లగా ఇలా అంటుంది:

"నీకేమీ వినపడ్డంలేదుట్రా మిఖైలో?"

తాతయ్య అమ్మవంక చూస్తాడు. వచ్చే చిరునవ్వును ఆపుకుంటాడు. ఏమీ మాట్లాడడు. మంచు ఆవరించివున్న తోటలోకి చూస్తాను నేను. పండ్లచెట్లన్నీ మసకమసకగా కనుపిస్తాయి. ఏదైనా వినిపిస్తుందేమోనని చెవులు దోసెలు చుకుని వింటాను. ఉషఃకాల తుషారధ్వని ఒక్కటే నాకు వినిపిస్తుంది.

"గ్రీష్మం మన తోటలోనికిపాకి పారాడుతున్నది. దాని పదధ్వని వినపడ్డంలేదుట్రా నీకు?" అడుగుతుంది అమ్మ.

"లేదు" అని సమాధానం చెపుతాను విచారంగా. కానీ ఆ మరునటిరోజు నాకు కనుపిస్తుంది, రంగురంగులతురాయి ధరించినవేసవి మా వనసీమలో విహరించడం చూస్తాను. నానిద్రమత్తు అంతా క్షణంలో మటుమాయమవుతుంది.

"రా రా! బయటకువెళ్ళి దాని అడుగుజాడలు చూద్దాం. రా!" అన్నది అమ్మ.

మేం వెళ్ళాం. అమ్మముఖాన చిరునవ్వులు చిందుతున్నాయి. నా ముఖం నిద్రమత్తులో తూగుతున్నది. ఆవలిస్తున్నాను. మావాకిటముందున్న చెర్రీచెట్టు హిమపాతంలో జలకమాడుతూ మమ్మల్ని పలకరించింది.

"చూశావా? గ్రీష్మం తన హస్తాంగుళులతో ఇవాళ చెర్రీపండ్లను స్పృశించింది. అవి ఎరుపెక్కుతున్నాయి" అన్నది అమ్మ.

చెర్రీ ఫలాలను నూరారి పరిశీలించి చూశాను. అవును. మన్మథబాణం తాకిన కన్నె పడుచు కపోలాల్లా అవి ఎరుపెక్కాయి. ఒక్క రాత్రిలో ఎంతమార్పు! నాకు ఆశ్చర్యం కలిగింది.

"శుభోదయం గానా అత్తయ్యా!" ఒకసన్ననికంఠం వినిపించింది. మా అమ్మను పలకరించిన ఆ గొంతు మేరియానాది. మతగురువు ఇంట్లో పని చేస్తున్నది ఆ అమ్మాయి.

ప్రక్క ఇంటి పిట్టగోడ మీద ప్రత్యక్షమైంది ఆ పిల్ల. పెదవులపై చిరునవ్వు, నీలికళ్ళల్లో నిగనిగలాడే కాంతి, సిరిపాలు మూటకట్టే ముఖం—ఇవన్నీ నన్ను ఇట్టే ఆకర్షించాను. నన్నుతట్టి మేలుకొల్పాయి. ఇప్పుడు నాకు నిద్రమత్తు లేదు.

"శుభోదయం అమ్మాయీ!" అని బదులుపలికింది అమ్మనవ్వుతూ "ఏమమ్మా. ఇంత ప్రొద్దున్నే లేచి వచ్చావూ?" అన్నది.

"నిన్ను చూడాలని వచ్చాను అత్తయ్యా లోపలికి రావచ్చా?" అడిగింది మేరియానా.

"అభ్యంతరం ఏమున్నదమ్మా"

మేరియానా. బడిపిల్లవాడిలా పిట్టగోడ చెంగున దూకింది. గౌను కొంగు చెట్టుకొమ్మకు తట్టుకున్నదేమోనని వెనక్కు తిరిగి చూచింది. కానీ అలాంటిదేమీ లేదు. ఆ అమ్మాయి పరుగెత్తుకుంటూ అమ్మ దగ్గరకి వచ్చింది. ఆమెముఖం ముద్దాడింది. తువ్వాలులో మూటకట్టిన వస్తువేదో అమ్మకిచ్చింది.

"ప్రొద్దున్నే ఏమిటమ్మా తెచ్చావు?" అమ్మ అడిగింది.

"ఏమీ లేదు అత్తయ్యా. గోధుమతో చేసిన పిండి చక్రాలు. పంచదారతో చేశాను. నీకోసం తెచ్చాను. మా అయ్యగారి కోసమని ప్రత్యేకంగా తయారుచేసిన పిండివంట ఇది!"అని చెప్పింది మేరియానా

"అయ్యో, పిచ్చిపిల్లా! ఇవెందుకు తెచ్చావమ్మా! మీ అమ్మగారు చూస్తే నీమీద మండి పడుతుంది! ప్రొద్దస్తమానం రాచి రంపాన పెడుతుంది" అన్నది అమ్మ.

"మరేం భయంలేదు అత్తయ్యా! ఇంత మాత్రం చేత వాళ్ళ ఇల్లు గుల్లయి పోదులే! కట్టుకు పోయేటంత ఉన్నది. ఏంచేస్తారు ఆ సంపాదనంతా?– ఏం మిఖైలో! ఏమంటావు?"– అన్నది మేరియానా. అకస్మాత్తుగా నా వంకచూచి.

"అవును, నిజమే." ఆమెతో ఏకీభవించాను. మేరియానా అంటే నాకెంతో ఇష్టం. పైగా తువ్వాలు. మూటలో ఉన్న గోధుమ పిండి చక్రాలు ఘుమ ఘుమ వాసన వస్తున్నాయి. నాకు నోరూరుతోంది.

"నీ గౌనుకు పూలువేసి కుట్టారే– ఎంత బాగున్నాయి!" అన్నది అమ్మ ఆ పిల్ల గౌనుకు అల్లిన పూలు. తాకుతూ.

మేరియానా పొంగిపోయింది.

"ఇలాంటివి నాకు ఇష్టం అత్తయ్యా." ఇలా అని ఆ అమ్మాయి, నావంక చూచింది. "ఈ అబ్బాయిని పాపం, ఇంత ప్రొద్దున్నే నిద్రలే పావేం అత్తయ్యా?"- అని అడిగింది, నా పట్ల సానుభూతి ప్రదర్శిస్తూ.

"అవును. వేసవి వచ్చిందికదూ? వాడికి చూపిద్దామని."

"ఓ, అదా కథ!" అన్నది మేరియానా నిశ్వసిస్తూ. "ఏంమిఖైలో! ఇంతకు ముందెన్నడూ వేసవి ఎలా ఉంటుందో చూశ్శేదా?"-అని నన్ను అడిగింది.

"లేదు మేరియానా." అన్నాను.

"ఫరవాలేదు, చూచేకాలం ముందు చాలా ఉందిలే. ఉన్నదంతా ముందేఉంది.................. అవునూ? నీ గుఱ్ఱాన్ని అడవికి తోలుకపోతావా ఇవ్వాళ? లేక పచ్చిక బీళ్ళల్లో మేపుతావా? అని అడిగింది.

"తాతయ్య ఎక్కడికి తోలుకుని పొమ్మంటే అక్కడికి." అని చెప్పాను.

"అడవికి తోలుకుపో. యాకిమ్ వ్యవసాయ క్షేత్రం ఉన్నదే-దాని దగ్గర, అదెక్కడో తెలుసా నీకు?"-

"ఆఁ. తెలుసు."

"గుఱ్ఱాన్ని అడవిలో వదిలిపెట్టు. నీవేమో అతని పండ్లతోటలో చెర్రీపండ్లు కోసుకో. సరేనా?"-

"అవి ఇంకా పండలేదు."

"పండకేం, పండాయి. నిన్ననే నేను అడవికి వెళ్ళినప్పుడు చూచాను."

"మరి నేను పండ్లుకోసుకుంటే యాకిమ్ ఏమన్నా అనడూ?"-

"ఏమీ అనడు. నిన్న నేను ఆయనతో చెప్పాను. మిఖైల్ పండ్లు కోసుకుంటాడు. కోప్పడవద్దు - అని చెప్పాను సరేనన్నాడు."

"నీవెంత మంచివానివి మేరియానా!"-

"సరేలే. నాక్కూడా కాసిని మంచి చెర్రీపండ్లు తీసుకరా" ఇలా అని మేరియానా అమ్మవైపు చూచింది. "అత్తయ్యా! రాత్రి నాకొక కల వచ్చింది!"

"ఏమిటా కల? చెప్పు?"- అడిగింది అమ్మ-

"మా ఊళ్ళో మా ఇంట్లో ఉన్నానట. ప్రొద్దున్నే లేచి రొట్టెలు చేయటానికి పిండి కలుపుతున్నాను. అకస్మాత్తుగా కిటికీలోనుంచి చంద మామ కనుపించాడు అప్పుడే మా పిన్నమ్మ అక్కడకి వచ్చింది. ఎవరి కోసం మేరియానా, రొట్టెలేస్తూన్నావు?- అని అడిగింది. నాకు ప్రియమైన చంద్రుడి కొసం- అని నేను సమాధానం చెప్పాను. అంతే! మెలుకువ వచ్చింది. ఈ కలకు అర్థమేమిటి అత్తయ్యా?"-

అమ్మ నవ్వింది. కానీ ఆ నవ్వులో ఒక విషాదరేఖ లీలామా త్రంగా కనుపించింది.

"మేరియానా! నీ కలకు అర్థంఏమిటో చెప్పనా? ఇకనీవు ఎంతో కాలం ఇక్కడ పనిచెయ్యవు! త్వరలోనే నీకు ప్రియుడు లభిస్తాడులే!"- అన్నది.

"ఏమిటత్తయ్యా నీవు చెప్పేది?"- అన్నది మేరియానా; ఆ పిల్ల ముఖంలో తెరలు తెరలుగా సిగ్గు పొర్లివచ్చింది.

"నీకు తొందరిలోనే చక్కని ప్రియుడు లభిస్తే!"- అమ్మ ఇలా అనగానే మేరియానా అమ్మమీద వాలిపోయి, ఆమెచెవిలో ఏదో గునగున

లాడింది. తరవాత "ఇక నేను వెళ్ళాలి మా అమ్మగారు లేచి కాఫీకోసం పిలుస్తుంది. ప్రపంచ మొదటే ఆమెకు కాఫీ ఇవ్వాలి." అన్నది.

"ఈ రోజుల్లో మీకు కాఫీ గింజలు ఎక్కడ దొరుకుతున్నాయమ్మా?"- అని అమ్మ అడిగింది.

"చట్టా వ్యాపారం చేసే వాళ్ళుఉన్నారుగా. వాళ్ళదగ్గర కొంటారు. ఒక్కొక్కసారి సింధూరపు కాయలు వేయించి, వాటితో కాఫీపొడి తయారు చేసుకుంటారు. డబ్బుగలవాళ్ళు అంతేనత్తయ్యా!"- అని చెప్పి మేరియానా లేడి పిల్లలా అక్కడ నుంచి దూసుకొని పోయింది.

"ఎంత చక్కని పిల్ల? ఏం తెలివి? ఈ పిల్లను ఎవరు పెండ్లాడనున్నారో! చెప్పుక్రింద పూవులా నలిగిపోకుండా ఈ అమ్మాయికి తగిన వాడు దొరికితే!"-

అని అమ్మ తనలోతాను అనుకున్నది. పేదవాళ్ళ పిల్లలను గురించి అమ్మ ఎప్పుడూ ఇలాగే దిగులు పడుతూ ఉంటుంది. ముఖ్యంగా భాగ్యవంతుల ఇళ్ళల్లో పనులుచేసుకుని జీవించే ఆడపిల్లలపట్ల ఆమెకు ఎంతో సానుభూతి. వాళ్ళకు ఏమి అన్యాయం జరుగుతుందోఅని ఆమె భయం.

"అవుతే ఇవాళ నేను. యాకిమ్ తోటకు వెడతానమ్మా" అన్నాను

"దోవ తెలుసునట్రా?"-

"తెలుసునని చెప్పాను కదమ్మా"

"నీ ముఖం- నేనే దోవకనుక్కోలేను- ఆ అడవిలో నీకేం తెలుస్తుందిరా?"-

"లేదమ్మా! ఆడవాళ్ళు ఎప్పుడూ అంతే! అడవిలో దోవ తప్పి

పోతారు ; కానీ అడవిలో తిరగడం నాకెంతో ఇష్టం. నా కా దోవలన్నీ తెలుసు."- అని చెప్పాను.

ఒకసారి నేనొక గొప్ప సాహసకృత్యం చేశాను. దాన్ని గురించి ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు. వేసవి సెలవులకు కొంచెంముందు మా గుర్రాన్ని నేను అడవికి తోలుకొని పోవలసివచ్చింది. కానీ అదిచెప్పిన మాటవినేది కాదని నాకు తెలుసు, అది నా కనుగప్పి ఎటోతప్పించుకుని పోతుందని నా భయం. పగలల్లా అలాగే వెయ్యి కళ్ళతో దాన్ని కనిపెట్టాను. కానీ ప్రొద్దుగూకేవేళ నాకు నిద్రవచ్చింది. గుర్రం తప్పించుకుని పోకుండా దాని కళ్ళెం నా కాలికికట్టుకుని, పడుకున్నాను నాకు గాఢంగా నిద్రపట్టింది. తరవాత అది మూతితో నా కాలు పొడుస్తూ నన్ను నిద్ర లేపడానికి ప్రయత్నించింది. కానీ గాఢసుషుప్తావస్థలో ఉన్న నాకు చాల సేపటివరకూ మెలకువ రాలేదు. చివరకు తెల్లవారగట్ల గుర్రం ఎందుకో, దేన్ని చూచో బెదిరినట్టున్నది. గభాలున అది దౌడుతీయడం ప్రారంభించింది త్రోవ- తెన్నూ లేకుండా నన్ను అలాగే క్రింద ఈడ్చుకుంటూ పోతున్నది. నాకు ఒళ్ళంతారాసుకొనిపోయి మెలకువవచ్చింది. నాకు కంపరం పుట్టింది. ఎక్కడున్నదీ, ఏ స్థితిలో ఉన్నదీ తెలియలేదు కాలికి కట్టిన కళ్ళెపుతాడు ఊడదీయడానికి ప్రయత్నించాను. కానీ అప్పటికే నా తల దిమ్మెక్కి పోయింది........ ఆ తరవాత రెండు రోజులవరకూ నాకు తల దిమ్ము వళ్ళునొప్పులు పోలేదు, అయినప్పటికీ ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. ధైర్యంగా నాలో నేనే నిబ్బరించుకున్నాను.

ప్రొద్దున్నే రొట్టె అదీ తిన్న తరవాత గుర్రాన్నితీసుకుని బయలు దేరాను, ఎప్పుడు సమయం చిక్కుతుందా, ఎప్పుడేవిధంగా ఇబ్బందిపెట్టి ఏడిపిద్దామా అని గుర్రంఎదురు చూస్తున్నట్టున్నది. దానిచూపుల్లోనేఒకవిధమైన క్రౌర్యం నాకు కొట్టొచ్చినట్టు కనుపిస్తున్నది, అసలీఅంవి మాలిన

గుఱ్ఱం మా కర్మకాలి మాపాల పడ్డది; డబ్బుపోతే పోయింది మంచి గుఱ్ఱం ఒకటి కొనాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాం. చివరకుమాకు దొరకిన గుఱ్ఱం ఇదీ।

ఈ గుర్రాన్ని యెలా కొన్నామో ఇప్పటికీ నాకు జ్ఞాపకం, తాతయ్య, ట్రోపిమ్‌టిమ్‌చెంకో కలిసి సంతకు వెళ్ళారు. తాతయ్య వెంట నేనూ వెళ్ళాను. సంతకు వెళ్ళినప్పుడు అక్కడ కలిసిన బంధువులను, స్నేహితులను పలకరించి వారితో పిచ్చాపాటి మాట్లాడటంతోటే మాకు సగం కాలం గడిచిపోయింది. ఈ ప్రాంతాలలో తాతయ్యను ఎరుగని వారు లేరు. అందరూ ఆయన్ను పలకరించేవారే. కూచోబెట్టి మాట్లాడే వారే. అసలు సంతలో గుఱ్ఱాలు అమ్మే మార్కెట్టువగ్గరికి ఆయన చేరు కోడమే కష్టమైపోయింది. ఎలాగయితేనేం కులాసా పురుషులు కొందరు ఆయనచుట్టూ చేరారు. ఆయన్ను ఎకాఎకీ సారాదుకాణంలోకి తీసుకుని పోయారు. ఇంకేముందీ? అక్కడ అంతా జల్సా! డబ్బంటే లెక్కలేదు. డబ్బుతో ఆనందాన్ని కొంటారు! అయితే కొందరిది కొని తెచ్చుకున్న ఆనందం, మరి కొందరిది విషాదం! వాళ్ళు మన లోకంలోలేరు, తాగు తున్నారు, వాగుతున్నారు! ఆడుతున్నారు, పాడుతున్నారు! కొందరు "అల్లాయి"పదాలు లంకించుకున్నారు. తాతయ్య ఆ గుంపులో చేరాడు, తనకు ఇష్టమైన పాట ఒకటి ప్రారంభించాడు,

"కట్టు బట్టలమ్ముకున్న కన్నెపడుచు చూడు!
ప్రియుడికి కొనిపెట్టెను ఒక కాలిజోడు!
వారిద్దరుచూడ చక్కని జోడు!
ఈ లోకంతో పనిలేదు వారికి నేడు!!"

ఆ బృందంలోనివారంతా తాము సంతకువచ్చిన పనేమిటో మరచి పోయారు, సంగీతంలో మునిగిపోయారు, వారిలా పెద్దగా పాటలు పాడ

టముచూచి అంగడి యజమానికి భయం పుట్టింది. ఈ కేకలు, అరుపులూ విని, ఎక్కడెక్కడి పల్లెటూళ్ళ అల్లరి చిల్లర జనం దుకాణం చుట్టూ పోగై, తాగి తందనాలాడి డబ్బు ఎగనామం పెడతారేమోనని అతని భయం

"ఆ పాడేదేమిటో కాస్త చిన్నంగా పాడండయ్యా - అరుపులెం దుకూ?" అన్నాడు అంగడి యజమాని.

"పాటలేకపోతే మజా ఏమున్నదయ్యా! స్వర్గానికి రాజబాట పాట! పేదవాడి హృదయానికి ప్రియమైన పూలతోటపాట!" అన్నాడు తాతయ్య.

అంగడి యజమాని భయపడుతూనే, తెచ్చిపెట్టుకున్న నవ్వు నవ్వాడు. అతనికీ, తాతయ్యకూ కాస్త వాగ్వాదం జరిగింది. తాతయ్య చెప్పే సమాధానాలకు అతను తట్టుకోలేకపోయాడు. అందరూ తాతయ్యనే సమర్థించి, ఆయనకు మరింత ఉత్సాహం కలిగించారు. తాతయ్య మరొకపాట మొదలుపెట్టాడు.

ఇలా చాలాసేపు కొనసాగింది. చివరకు గుర్రాన్ని కొనడానికి తాము సంతకు వచ్చామన్న సంగతి తాతయ్యకూ, ట్రోఫిమ్ మామయ్యకూ జ్ఞాపకం వచ్చింది. వాళ్ళు ఇప్పుడు మన లోకంలోనికి వచ్చారు.

"రోజంతా వ్యర్థమై పోయిందే!" అన్నాడు తాతయ్య కలవరంతో

చివరకు వాళ్ళిద్దరూ ఎలాగో గుర్రాలు అమ్మే మార్కెట్‌కు చేరుకున్నారు.

మొదట ఒక గుర్రం మాకంటపడింది. అది ఒక ఎరుకలవానిది. నల్లగా, కాలిన తుమ్మమొద్దులా ఉన్నాడతను! చిన్నకళ్ళు, తీక్షణమైన చూపులు. గుర్రంమీద యెక్కాడు, కళ్ళెం చేతపట్టాడు. గుర్రం

చూడబోతే అంతంతమాత్రాన లొంగేటట్టులేదు. అతను అదిలిస్తున్నాడు అది దాని పొగరంతా చూపిస్తున్నది.

ఆ గుర్రాన్ని చూడగానే తాతయ్య కళ్ళు జిగేల్‌మన్నాయి! కానీ ఆయన ఉత్సాహం అంతలోనే అదృశ్యమయింది. అవును, ఆయనకు కావలసింది అలాంటి పొగరుబోతు గుర్రం కానేకాదు.

"ఏమోయ్! ఎంత ఆ గుర్రం ఖరీదు?" ట్రోఫిమ్ మామయ్య అడిగాడు.

వెంటనే ఎరుకలవాడు గుర్రాన్ని మావద్దకు నడిపించుకునివచ్చి నిలబెట్టేడు ఆది ముందరకాళ్ళతో నేల గీరుతూ నిలుచున్నది.

"ఎంతని అడుగుతున్నారా దొరా?" అన్నాడు యెరుకలవాడు. అతనికళ్ళు మత్తుతో తూగుతున్నట్లున్నాయి. "ఎంత అని అడుగుతున్నారాబాబూ? నా హృదయాన్ని ముక్కలు ముక్కలు చేస్తోంది! ఇది గుర్రంకాదు దొరా, ఇది నా గుండెకాయ! ఈ గుర్రం పోయిందీ అంటే వీడి గుండెకాయ పోయినట్టే!" అన్నాడు మళ్ళీ.

"అవుతే దీన్ని అమ్మటానికి ఎందుకు తెచ్చావు?" అని అడిగాడు తాతయ్య. సహజంగా సానుభూతి చూపుతూ.

"ఎందుకని అడుగుతున్నారా? పొట్టకోసం దొరా, పొట్టకోసం! పొట్టకోసమే వీడు దీన్ని ప్రాణప్రదంగా పెంచాడు. పొట్టకోసమే వీడు దీన్ని అమ్మటానికి తెచ్చాడు!" అన్నాడు ఎరుకలవాడు.

"బాగుంది ఇహ చెప్పకు, నీ పొట్ట మరీ పెరిగిపోతుంది!" అన్నాడు ట్రోఫిమ్ మామయ్య, మత్తుగా నవ్వుతూ. "సరే-ఇంతకూ నీ "గుండెకాయకు" ఎంతకావాలో చెప్పు!" అన్నాడు.

"వికల శకలాలైన వీడి గుండెకాయ ఎవరికి కావాలి బాబూ ?"

అన్నాడతను విశ్వసిస్తూ అతని కళ్ళల్లో ఏదో కుట్ర దాగి ఉంది. "గుర్రం ఖరీదు యాభై రూబుళ్ళు. బంగారు రూబుళ్ళు కానీ, వెండి రూబుళ్ళు కానీ!, అన్నాడు."

"అబ్బో!" అన్నాడు తాతయ్య. ఆయన జేబులో అయిదు రూబుళ్ళ బంగారు నాణెం ఒకటి. వెండి రూబుళ్ళు ఆరూ ఉన్నాయి, అంతే.

"మరి మీరు ఈ రాజా గుర్రానికి ఎంత ఇస్తారో చెప్పండిదొరా?"

"ధర మా నోటితో చెప్పం. నీగుర్రం కొనడానికి భాగ్యవంతుడైన వర్తకుణ్ణి నీవే చూచుకో" అన్నాడు తాతయ్య.

కానీ ఎలుకలవాడు అంత సులభంగా వదిలిపెట్టేటట్టు లేడు.

"చెప్పండి, మీరు ఎంత ఇస్తారో చెప్పండి?" అని మళ్ళీ అడిగాడు.

"మేమా? పదిరూబుళ్ళు!" అన్నాడు ట్రోఫిమ్ మామయ్య.

ఎలుకలవాడు తన గుర్రాన్ని చెంగున ఎగిరించాడు. అతనికి కోపం వచ్చింది.

"బేరంలో ఎప్పుడూ ఇద్దరు మూర్ఖులుంటారు. ఒకడు చాలా ఎక్కువ చెప్పేవాడు, ఒకడు చాలా తక్కువ ఇచ్చేవాడూ." అన్నాడు.

"ఇహ అతిగా వాగకోయ్!" అన్నాడు ట్రోఫిమ్ మామయ్య. చూడు నిన్ను ఏం చేస్తానో అన్నట్లు పిడికిలి బిగించాడు.

మేం మార్కెట్ అంతా తిరిగాం. గానీ మా డబ్బుకు ఎక్కడా గుర్రం దొరకలేదు. చీకటి పడుతున్నది. చివరకొకగుర్రం కనుపించింది ఒక గ్రామస్థుడు దాన్ని అమ్మకానికి తెచ్చాడు. అతను తాగి, నిషాలో

ఉన్నాడు. బక్క పలచగా ఉన్నాడు మనిషి. ఇంతపొడుగు ముక్కు. తలకొక బొచ్చు టోపీ పెట్టుకున్నాడు. అతని గుర్రం బూడిదరంగులో ఉన్నది. దాని మెడకొకతాడు తగిలించాడు.

"ఎంతయ్యా ఈ గుర్రం ఖరీదు?-" అని అడిగాడు ట్రోఫిమ్ మామయ్య. దానికి పళ్ళు సరిగ్గా ఉన్నదీ లేనిదీ పరీక్షించడం మొదలు పెట్టాడు. కానీ అదీ పొగరుబోతు గుర్రమే. ట్రోఫిమ్‌మామయ్య వ్రేలు ఒకటి కొరికి పెట్టింది.

"చూడండి! మా గుర్రం చచ్చు గుర్రమేమీకాదు. దానికీ హుషా రెక్కువ!"- అన్నాడు యజమాని.

"మాకు హుషారుతో పనిలేదు. లేవయ్యా! ధరఎంతో చెప్పు?"- అని అడిగాడు మళ్ళీ ఫిట్రోమ్ మామయ్య.

"మీ దగ్గర ఎంత ఉంటే అంత!"- అని చెప్పాడు యజమాని; వెంటనే.

"ఎంత ఉంటేఅంతా? అంటే నీఉద్దేశ్యం?" అడిగాడు తాతయ్య.

"అతను తాగి ఉన్నాడు!" అన్నాడు ట్రోఫిమ్ మామయ్య మెల్లగా

"నేను తాగానా? మీరే- మీరిద్దరే చిత్తుగా తాగి మత్తుగా ఊగుతు న్నారు!"- అన్నాడాపల్లెటూరి బేరగాడు కోపంగా.

"అబ్బాయ్! ఎవరూ తాగ లేదు. తాగ నక్కర్లేదు కూడా" గొడవ లేకుండా సర్దుబాటుచేయటానికి ప్రయత్నించాడు తాతయ్య. "భగవంతుడి దయవల్ల మేము భూమిమీదనే నిలుచుని ఉన్నాం!"_ అన్నాడు. "అవును భూమిమీదనే నిలుచున్నారు!-" అన్నాడు మళ్ళీ ఆ గ్రామస్థుడు.

"సరే. ఇంతకూ గుర్రాన్ని ఎంతకు అమ్మదలచావు?"-

"మీ దగ్గర ఎంత ఉంటే అంత ఇవ్వండి" "సరే- మా దగ్గర ఒక కోపెక్ మాత్రమే ఉన్నదనుకో!-" అన్నాడు, తాతయ్య నవ్వుతూ.

"నేనంత పిచ్చివాణ్ణి కాదండీ! నేనెవరితో బేరమాడుతున్నానో నాకు తెలుసు. మీదగ్గర డబ్బున్నదని నాకు తెలుసు. అదిగో! కనిపిస్తూనే ఉంది."

"సరే- అదే నీ ఆఖరు మాట అవుతే - ఒక రూబుల్ ఉస్తాను. పుచ్చుకుని గుఱ్ఱం ఇవ్వు."

"ఆవిధంగా మీకు బుద్ధి పుడితే ఆలాగే కానివ్వండి" అన్నాడు గుఱ్రం యజమాని.

ఇంతస్వల్ప మొత్తానికి అతను అంగీకరిస్తాడని తాతయ్య కలలోకూడా అనుకోలేదు. జేబులోనుంచి డబ్బు సంచి తీశాడు కానీ ఆయనకు అనుమానం వచ్చింది: ట్రోఫిమ్ మామయ్య చెవిలో రహస్యంగా ఇలా అన్నాడు:

"చూడబోతే ఈ బేరం చిత్రంగా ఉందే ట్రోఫిమ్! ఇందులో మోస మేమీ లేదుకదా? చూడబోతే ఇది మగ గుఱ్ఱం కానట్టున్నది. ఆడ గుఱ్ఱం కావచ్చు."

"గుఱ్ఱాల సంగతి నాకు బాగా తెలుసు, నేను గుఱ్ఱాల మధ్య పుట్టి గుఱ్రాల మధ్య పెరిగాను, గుఱ్రాల మధ్య తిని, గుఱ్రాలమధ్య తిరిగాను. గుఱ్రం ఆమడ దూరాన ఉండగనే దానివాలకం ఎలాంటిదో చెప్పగలను! నీవు నక్కను తొక్కివచ్చావు! ఇలాంటి గుఱ్రం దొరకడం నీ అదృష్టం!"- అన్నాడు ట్రోఫిమ్ మామయ్య. ఇందుకు తననే మెచ్చుకోవాలన్నట్టుగా.

ఆ విధంగా పది రూబుళ్ళకు మాకు గుర్రం వచ్చింది. దాన్ని ఇంటికి తీసుకుని వచ్చాం.

మరునాటి ఉదయం అందరికన్నా ముందు మా అవ్వ, గుర్రాన్ని కట్టేసిన చోటికి వెళ్ళింది. తరవాత పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతూ ఇంట్లోకి వచ్చింది.

"నిన్న సంతలో ఏం కొనుక్కొనివచ్చారుమీరు?"-అని తాతయ్య నడిగింది.

"గుర్రం. మంచి హుషారైన మగ గుర్రం!-" అని చెప్పాడు తాతయ్య సగర్వంగా.

"మగ గుర్రమా?-" అన్నది అవ్వ. తూలి పడబోయి, తలుపు పట్టుకున్నది. "మరి మగ గుర్రం ఒక రాత్రిలో ఆడ గుర్రంగా ఎలా మారిపోయింది? దయచేసి కాస్త చెపుతారా?-" అన్నది.

"ఏమిటి నీ వనేది? ముసలితనంలో నీకు మతిచెడ్డట్టున్నది!" అన్నాడు తాతయ్య నిర్ఘాంతపోతూ. "అయినా మగ గుర్రం మగ గుర్రమే ఎన్ని రాత్రిళ్ళు గడిస్తే మాత్రం ఆడ గుర్రం ఎలా అవుతుందీ?-" అన్నాడు.

"కావాలంటే మీరే వెళ్ళి చుడండి?"- అన్నది అవ్వ.

మేమంతా గుర్రపు సాలలోకి వెళ్ళిచూచాం: తాతయ్య, గుర్రాన్ని ఒకటికి పదిసార్లు పరీక్షచేసి చూచాడు. నిజంగా అది ఆడగుర్రమే!

"మరి ఇప్పుడేమంటారు?"- అని అడిగింది అవ్వ, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

"మోసం! పచ్చిమోసం!" అన్నాడు తాతయ్య- అంతకంటే ఏం చెపుతాడు మరి? చివరకు అవ్వ, అమ్మ, నేను పగలబడి నవ్వడం మొదలు పెట్టాం.

"పైగా తాను గుఱ్ఱాలమధ్య పుట్టి గుఱ్ఱాలమధ్య పెరిగానన్నాడు! దొంగ వెధవ! ఈసారి కంటపడనీ, చెపుతా వాడిపని!—" అంటూ తాతయ్య, త్రోఫిమ్ మామయ్యమీద నిప్పులు కురిపించాడు. తరవాత ఆయన, లజ్జ, అవమానాలతో క్రుంగిపోయి తన పనిచూచుకోడానికి వెళ్ళాడు.

అప్పటినుంచీ త్రోఫిమ్ మామయ్య కొన్నాళ్ళవరకూ మా ఇంటి చాయల రాకుండా తప్పించుకుని తిరిగాడు: చివరకెలాగైతేనేం ఒకనాడు వచ్చాడు చంకలో రొట్టె, జేబులో సీసా ఉన్నాయి.

"ఏమోయ్! గుఱ్ఱాలమధ్యపుట్టి, గుఱ్ఱాలమధ్య పెరిగావుకదూ? గుఱ్ఱాల విషయంలో నీకుగల అనుభవం మరెవరికీ లేదన్నావుకదూ?" అన్నాడు తాతయ్య, అతను కంటపడగానే.

"అవును ఇప్పటికీ చెపుతున్నాను. నా అనుభవంలో లోపమేమీ లేదు. కానీ వచ్చిన చిక్కల్లా...." అంటూ త్రోఫిమ్ మామయ్య ఏదో చెప్పబోయి గొణిగాడు. పాపం ఏం చెప్పాలో అతనికి తోచలేదు. "ఇదంతా నా కర్మ - నేను దురదృష్టవంతుణ్ణి. దరిద్రానికీ, కష్టాలకుతోడు, నన్నేదో భూతం పట్టి పీడిస్తున్నది.—" అన్నాడు.

"చాల్లే ఊరుకోవయ్యా!—" అన్నది అవ్వ "నిన్ను పీడిస్తున్నది భూతమూకాదు, దురదృష్టమూకాదు. సారా! మీ ఇద్దరినీ అదే మోసం చేసింది!—" అన్నది.

"మద్యం మా ఇరువురినీ ఆడించినమాట నిజమే! నేను కాదనను, కానీ దురదృష్టంకూడా దాపురించింది. అది ఎప్పుడూ మావంటివాళ్ళమీదనే ఎక్కి కూచుంటుంది!" అన్నాడు మళ్ళీ త్రోఫిమ్.

దురదృష్టంమాట అలా ఉంచవయ్యా. కానీ 'రెండు చక్రాలు' నోట్లో పడితే ఎంత పెద్దమనిషికూడా పిచ్చివాడై పోతాడయ్యా! అదీకథ!" అంటూ అవ్వ నవ్వింది.

ట్రోఫిమ్ మామయ్య తన దురదృష్టాన్ని నిందించుకుంటూ, చేసిన పొరపాటుకు క్షమాపణలు చెప్పుకోసాగాడు. అసలు ఎప్పుడూ అంతే అతను. మాట ఎంత తొందరో, పని అంత నిదానం!

ఒకసారి మా గ్రామపెద్ద నదిలోపడి మునిగిపోతూ ఉంటే ట్రోఫిమ్ మామయ్య కళ్ళారా చూస్తూకూడా ఏమాత్రం చలించలేదు. ఒడ్డున నిలుచుని నిశ్చింతగా ఉన్నాడు.

"అయ్యో! రక్షించు, రక్షించు! ట్రోఫిమ్! నీకు పుణ్యం ఉంటుంది. వందరూబుళ్ళు ఇస్తాను. నన్ను బయటికిలాగు!—" అని అరిచాడు గ్రామపెద్ద.

"బంగారపు నాణాలు ఇస్తావా, బ్యాంకు నోట్లు ఇస్తావా?—" అని అడిగాడు ట్రోఫిమ్ మామయ్య, తాపీగా.

"నీవు ఏదికావాలంటే అవే ఇస్తాను!—" అన్నాడు గ్రామపెద్ద.

అప్పుడు ట్రోఫిమ్ ఆయన్ను ఒడ్డుకు లాగాడు కానీ అందుకు ఒక రూబుల్‌గాని, ఒక బ్యాంకు నోటుగాని అతనికి లభించలేదు. గ్రామపెద్ద అతనికి చిల్లిగవ్వ ఇవ్వకుండా ఎగనామం పెట్టాడు. అవుతే ఒకటి జరిగింది, గ్రామపెద్ద నీళ్ళలో మునిగినప్పుడు అతని బూట్లు కాస్తా పోయాయి. బూట్లతోసహా అతన్ని బయటికితీసి ఉన్నట్లయితే ట్రోఫిమ్ కోరిన బహుమానం అతను ఇచ్చే వాడేనట!

"ఈసారి నీళ్ళలో పడ్డప్పుడు బూట్లు లేకుండా పడు! తెలిసిందా?—" అన్నాడు ట్రోఫిమ్, గ్రామ పెద్దతో.

మా గుఱ్ఱం కథ యావత్తూ నాకు జ్ఞాపకం వచ్చింది. దాన్ని తీసుకుని పోయి మేపుకుని వచ్చేపని నాకు అప్పగించారు.

నేను గుఱ్ఱాన్ని తోలుకుని యాపిల్ తోటకు వెళ్ళేటప్పటికి బాగా ఎండ ఎక్కింది. చెట్లపై మంచుతెరలు విడిపోయాయి. తోట అవతలి ప్రక్కన పచ్చిగడ్డి ఏపుగా పెరిగి ఉన్నది. ఏనుగుపల్లేరు, విష్ణుక్రాంత-ఇంకా రకరకాల గడ్డిపూలు కన్నుల పండుగగా కనుపిస్తాయి. అక్కడక్కడ ఆపిల్, పేరీ, చెర్రీ పండ్లచెట్లు ఉన్నాయి. తోట చిట్టచివర-ఎన్నేళ్ళనాటివో సింధూరపు వృక్షాలు-వృద్ధమూర్తుల వలె కనుపిస్తున్నాయి. ఒక పన్నెండు తేనెపట్టులు, క్రొత్తగా వేసిన ఒక కుటీరం ఉన్నాయి.

నేను అక్కడికి వెళ్ళేసరికి - తోటలో ఆవలికొసన ఒక స్త్రీమూర్తి కనుపించింది. మెల్లగా తనలోతాను ఏదో పాడుకుంటూ నడచిపోతున్నది. నేను నిర్ఘాంతపోయి నిలుచున్నాను. ఆమె, వలిపెంలాంటి తెల్లటి వస్త్రం పైన కప్పుకున్నది. ఆమె ఆకారం, ఆ నడక - అదంతా చూస్తే ఆ ఉదయం అమ్మ నాతో చెప్పినమాట జ్ఞాపకం వచ్చాయి. బహుశః ఆమె మామూలు స్త్రీ కాదు. వనకన్య కావచ్చు। వేసవి ఆరూపం ధరించి, వనసీమలలో విహరిస్తూ ఉండవచ్చు।

ఆమె అలా పోయిపోయి అడివిలో అదృశ్యమైంది, ఆమె ఎటు వెళ్ళిందో జాడ కనుక్కోడానికి గబగబా వెనకాలే వెళ్ళాను. త్రోవలో ఒకచోట గడ్డిపూలు వెదజల్లి ఉన్నాయి. మరొకచోట ఏవో అపురూపమైన అడుగులు కనుపించాయి, అలా వెదుకుతూ వెదుకుతూ చాలలెక్క వెళ్ళాను. అంతలో ఏదో చిన్న నవ్వు వినిపించింది, వెనక్కు తిరిగి చూచాను. తోట చివర పిట్టగోడ ప్రక్కన ఒక అమ్మాయి నిలుచుని ఉంది. ఎనిమిదేండ్ల పిల్ల నల్లటి జుట్టు. సన్నగా. తీగెలా ఉంది. గోధుమ వర్ణంలోఉన్న పెద్దపెద్దకళ్ళు. ఎర్రని చెక్కిళ్ళు, ఆ పిల్లపెదవులపై ఒక

చిన్న చిరునవ్వు దోబూచులాడుతున్నది. నేనున్నమాత్రం ఎందుకు నవ్వ కూడదూ ? నవ్వాను.

"నీ పేరు నాకు తెలుసులే !—" అన్నది ఆ అమ్మాయి, మెళ్ళో పూలలదండ, అటూ ఇటూ ఆడిస్తూ.

"నీకు తెలియదు" అన్నాను.

"నాకు తెలుసు" అన్నదిమళ్ళీ.

"ఎలా తెలుసు ?—"

"జ్ఞాపకం లేదూ ? గడచిన శీతాకాలం ?—"

"ఏమిటీ జ్ఞాపకం ఉండేది ? —"

"నీవు నీళ్ళతొట్టిలో కూచుని మంచుమీద జారుతూ ఆడు కోడం !—"

మేమిద్దరం నవ్వుకున్నాం. అవుతే ఆ కథ చివరకు ఎంత విషాదాంతంగా పరిణమించిందీ ఆ అమ్మాయికి ఏం తెలుసు ? తెలిస్తే అలా నవ్వదు. అది నాకు నవ్వులాట విషయం కాదు.

"నీకెంత ధైర్యం అనుకున్నాను నేను"

"ఓహో ! అదేమంత పనిలే !" అన్నాను నేను. ఆవిడ నన్ను మెచ్చుకున్నందుకు లోలోపల సంతోషించాను.

"ఇదిగో పండ్లు. కావాలా ?—" అడిగింది ఆ అమ్మాయి. ఆ పిల్ల చేతిలో పండ్లబుట్ట ఉంది.

పండ్లు కావాలా అని అడిగితే వద్దంటారా ఎవరైనా? కానీ నాకేదో అభిమానం అడ్డువచ్చింది. సంశయించాను.

"ధన్యవాదాలు - వద్దు" అన్నాను.

"కొద్దిగా తీసుకో. ఇంకా కోసుకుంటాలే. బోలెడు పండ్లున్నాయి"

కొద్దిగా తీసుకున్నాను.

"బాగున్నాయా ?—"

"చాలాబాగున్నాయి" నేను గుత్తాన్ని విడిచిపెట్టాను. అది గడ్డి మేస్తున్నది.

"నీ పేరేమిటి ?—" అని అడిగాను.

"ల్యూబా"

"ఇక్కడేం చేస్తున్నావు ?—"

"తేనెపట్టులకు కాపలా ఉన్నాను.

"ఒక్కదానివా ?—"

"అవును" ఆ అమ్మాయి కళ్ళమీద ఏదో నీలినీడవచ్చి వాలింది.

"మీ అమ్మ, నాన్న ఎక్కడున్నారు ?—"

"అమ్మ ఇంట్లో పనిచేసుకుంటున్నది. నాన్న కొత్తగా గుడిసె వేస్తున్నాడు. బహుశః వాళ్ళు ఇంతలో ఇక్కడికిరారు.

"ఇంతకుముందు ఎవరైనా అడవిలోకి వెళ్ళడం చూచావానీవు?—"

"తెల్లటి శాలువ కప్పుకున్న మనిషా ?—"

"అవును"

"ఆమె మా అత్తయ్య వాసిలీనా. ఆమె బాగా పాడుతుంది. కానీ మా మామయ్య ఆమెను ఎప్పుడూ తిడుతుంటాడు. పాటతో పాపిష్టి వాళ్ళందరనీ వశపరచుకుంటావని అంటాడాయన."

"అలాగా !" నా ఊహలన్నీ ఉఫ్‌మని ఎగిరిపోయాయి. వాసి లీనా అత్తయ్యపై జాలికలిగింది. నా హృదయం విచారంతో నిండి

పోయింది, ఆమె భర్త దుర్మార్గుడు. లేకపోతే ఆమెను పాట పాడవద్దంటాడా? ఆమె నిజంగా వనకన్య అపుతే ఎంత బాగుండేది! పొలాలలో, తోటలలో, వనసీమలలో అలా అలా తిరుగుతూ అద్భుతాలు చేస్తూ ఉంటే ఎంత బాగుండేది!

"మేం క్రొత్తగా ఇల్లు వేసుకుంటున్నాం - చూడవూ?—" అన్నదా పిల్ల నా చొక్కా పట్టుకుని.

"ఏముంది అక్కడ చూడడానికి?—"

"విశేషమేమీలేదు. కానీ – సాయంత్రంవేళ అంతా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ఇంట్లో కూచోడం నా కిష్టం.... నీ విక్కడికి చెర్రీ పండ్ల కోసమే నా వచ్చేది?—"

"నీకెలా తెలుసు?—" ఆశ్చర్యంతో అడిగాను.

"అదొక రహస్యంలే!–నేను అడవిలో ఉండగా ఎవరో నా చెవిలో చెప్పారు!—" అన్నది ల్యూబా.

"ఎవరబ్బా నీ చెవిలో చెప్పేది?—"

"మేరియానాలే!—"అంటూ ఆ అమ్మాయి నవ్వింది. "మేరియానా కూడా చెర్రీ పండ్లకోసమే వచ్చింది. నీవు వస్తావని, కాసిని పండ్లు కోసుకోనివ్వవలసిందని నాన్నను అడిగింది - ఆ అమ్మాయి అంటే నాకు ఇష్టం, మరి నీకూ?—"

"నాకూ ఇష్టమే"

"ఆ అమ్మాయి అల్లికపని ఎంత చక్కగా చేస్తుందనీ!—"

"అవును,"

"చూడబోతే ఆ అమ్మాయి త్వరలో ఎవరినో పెండ్లాడేటట్టున్నది."

"కావచ్చు" అన్నాను నేను. ఆ అమ్మాయి వెళ్ళిపోతుందనీ, ఇహ నే నెప్పటికీ ఆ పిల్లను చూచే అవకాశం ఉండదని అకస్మాత్తుగా నా మనస్సుకు తట్టింది.

"మా ఇంట్లో ఒక చిన్న మేకపిల్ల ఉంది. ఒక కాలు విరిగి నేలవ లేకుండా పడిఉంటే నాన్న తీసుకొచ్చాడు." అన్నది ల్యూబా.

"మాకొక కారు ఉంది. కొన్నాళ్ళు మేం దానిమీద ఎక్కి తిరిగాం" అన్నాను నేను.

"కారా ? నిజంగా కారే ?—" అని అడిగింది ల్యూబా, కళ్ళు పెద్దవేసి.

"అవును నిజంగా కారే ! పెద్దపెద్దవాళ్ళంతా ఎక్కి తిరిగే కారు !" అన్నాను.

ఇలా అని ఆ అమ్మాయి మనస్సులో ఎన్నెన్నో ఊహలు సృష్టించాను. ఇలాంటి పనులు చేయడంలో నేను ఘటికుడను !

"ఎక్కడిది మీకు కారు ?—" అడిగింది ల్యూబా.

"ఆ కథంతా మీ నాన్నకు తెలుసు, అడుగు. చెపుతాడు" జరిగి పోయిన కథంతా ఇప్పుడు మళ్ళీచెప్పడం విసుగు అన్నట్టుగా మాట్లాడాను.

"నీవు చెపితే వినాలనిఉంది" అన్నది ల్యూబా ఆ పిల్లకళ్ళు తళ తళలాడాయి.

నీవు వినే ఉంటావు. క్రిందటి సంవత్సరం పిల్‌సుడ్‌స్కీదళాలు మనసరహద్దారిగుండా తిరోగమించాయి. నుగ్గునుగ్గు అయిన ఒక కారు విడిచిపెట్టి వెళ్ళారువాళ్ళు. ఇదివిని తాతయ్య పరుగుపరుగున అక్కడికి

వెళ్ళాడు. ఎందుకూ పనికిరాకుండా పడిఉన్న ఆ కారును, ఎద్దులకు కట్టి ఇంటికి లాక్కొచ్చాడు. ఆ కారు బాగుచేయడంకోసం తాతయ్య పడిన శ్రమ ఇంతా-అంతా కాదు. ఆయనతోపాటు నేను ఎన్నోరోజులు చెమటలు కక్కుతూ అహర్నిశలూ పనిచేశాడాయన. ఒక్కోపూట తిండి కూడా లేదు. ఎన్నెన్నో పనిముట్లు తెచ్చాడు దాన్ని బాగుచేయడానికి చివరకు కారు మొత్తం ఊడదీశాడు.

"ఆయనకు భయం పుట్టలేదూ?"

"దేనికి భయం?—"

"కారులోపల భూతం ఉంటుందికదూ! అదేనటగా కారు నడిపేదీ?—"

"ఎవరన్నారు? కారునడిపేది భూతం కాదు, మరీ—"

"ఏమో ఎవరికి తెలుసు?" అన్నది ల్యూబా.

"జనం రకరకాలుగా చెపుతారు. సరే-తరవాత ఏం జరిగిందీ?—"

"తాతయ్య అలా చెమటలు కక్కుతూ పని-చేసి చివరకు ఎలాగైతేనేం కారు బాగుచేశాడు! కారు గుర్రుమన్నది! 'బుర్రు' మన్నది! రకరకాలుగా అరిచింది! చివరకుకదిలింది! కారు అంటేఏమిటనుకున్నావు అది ముందుకూ పోతుంది, వెనక్కూ నడుస్తుంది! నేనూ తాతయ్య కారులో ఎక్కాం. లోపల మెత్తని చర్మంతోకుట్టిన దిండ్లు. వాటిమీద దొరల్లా కూచున్నాం. తాతయ్య కారు నడిపాడు. మేము అలా కారుమీద మా బంధువులను చూడడానికి వెళ్ళాం. భలే తమాషాగా ఉందిలే! తిరునాల జనం! కారు చూడడానికి గుంపులు గుంపులు వచ్చారు! ఇళ్ళతో నుండి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆడవాళ్ళు అవుతే ఏదో కీడు మూడ మన్నట్టు క్రాస్"' చేసుకుని దేవుణ్ణి తలచుకున్నారు! పిల్లలు మా కారు

వెనకాలే పరుగెత్తారు. దాన్ని పట్టుకోవాలని కుక్కలు అరుస్తూ చక్రాల క్రిందిగా పరుగులు తీశాయి. కోళ్ళు, బాతులు బెదిరి, ఎగిరిపోయాయి. మేం గర్వంగా దొరల్లా చూస్తున్నాం. మేం ఎప్పుడూ కారులోనే తిరుగుతున్నట్టు, కాలు క్రిందపెట్టనట్టు ప్రవర్తించాం.

"అబ్బ! బలేబాగుంది కదూ?-"

"అద్భుతంగా ఉంది! మెత్తని దిండ్లు"

"ఏదో ఒకనాడు నేనూ కారు కొంటాను." అన్నది ల్యూసా. ఏవో కలలు కంటున్నట్టు.

"నీవు భయపడవుకూడా."

"సరే - చివరకు మీ కారు ఏమైంది?-"

"కొందరు చట్టా వ్యాపారస్తులు దాన్ని కొనాలని వచ్చారు. తాతయ్యను బెదిరించాలని చూచారు. పొడుగాటి సబ్బుముక్కలిస్తాం కారు ఇవ్వమని అడిగారు, ఎల్ సడెస్కీ తిరిగివస్తే మీ పని ఏమవుతుందో చూడండి - అంటూ భయపెట్టారు. పొడుగాటి సబ్బుముక్కలు పది తీసుకుని కారు ఇద్దామన్నది మా అవ్వ. కానీ తాతయ్య ఒప్పుకోలేదు. బట్టలు ఉతుక్కోడానికి సబ్బు అక్కర్లేదులే అన్నాడాయన. తరవాత మా గ్రామపెద్ద వచ్చి బేరమాడాడు. అతనికి కావలసింది కారుకాదు. దిండ్లకుకుట్టిన చర్మం అతనికి కావాలి. దిండ్లకుకుట్టిన చర్మం, మనవంటికి మంచిది కాదన్నాడు తాతయ్య. కానీ గ్రామపెద్ద వినలేదు. ఏది మంచిదో, ఏది చెడ్డదో తనకు తెలుసునన్నాడు. తరువాత తాతయ్య సెబాస్టియన్ మామయ్య దగ్గరకివెళ్ళి కారు ఏంచేయమంటావని అడిగాడు. అధికార్లకు అప్పగించమని ఆయన సలహా చెప్పాడు. అలాగేచేశాం. అధికారులు తాతయ్యకు ధన్యవాదాలు అర్పించారు."

నేను చెప్పిందంతా ల్యూబా విన్నది. తరవాత నేను పండ్లకోసం వచ్చానన్న సంగతి ఆ పిల్లలకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

"రా! పండ్లు కోసుకుందువుగాని - మంచిచెట్టుదగ్గరికి తీసుకుని పోతాను. మా వాసిలీనా అత్తయ్య, "పాట" అని పేరుపెట్టిం ఆ చెట్టుకు."

"చెట్టుకు భలేపేరు పెట్టిందే!-"

అన్నిట్లోకీ అందమైన చెట్టు అది. అత్తయ్యపాట బాష్పాలు రాలుస్తుంది! ఈ ఆంచాలచెట్టు హిమబిందువులు రాలుస్తుంది!

మేము పిట్టగోడ ఎక్కి తోటలోకి గ్నాం. ఒక చెట్టు దగ్గరికి తీసుకునిపోయింది ల్యూబా. చెట్లు అన్నిట్లోకి అందమైన చెట్టు అది. కొమ్మలు అందంగా తీర్చిఉన్నాయి. సూర్యకాంతిలో జలకమాడుతూ, మిలమిల మెరుస్తున్నది ఆ చెట్టు. పండ్లు గుత్తులుగుత్తులు ఉన్నాయి. మరియానాకోసం చాలా పండ్లగుత్తులు కోసుకొని పోదామనుకున్నాను.

"చెట్టు ఎక్కు" అన్నాది ల్యూబా.

"ముందు నిన్ను పైకి యెత్తనా?"

"వద్దు. నేను పల్లెరు కాయలు కోసుకోవాలి" అంటూ ల్యూబా తగుతీసింది.

నేను చెట్టు ఎక్కాను. పండ్లుకోస్తే అలాంటి చెట్టుకే కొయ్యాలి. నాకు యెంత సంతోషంగా ఉందోచెప్పలేను, అబ్బ ఒక్క కొమ్మవంచితే చాలు, బుట్టెడు పండ్లు,

నేనలా పండ్లు కోస్తూఉండగా, అంతలోనే నా కొక పాట విన వచ్చింది. ప్రేమించి పెళ్ళిచేసుకోవాలనుకుని పెద్దవాళ్ళ మూలంగా విప లులై వియోగం పొందిన ప్రేయసీ ప్రియుల ప్రేమగీతం అది. ఆ పాట

పొలాలగుండా, పచ్చికమైదానాలగుండా అలా అలా అల్లలుగా తేలు కుంటూ వచ్చి నాచెవులకు తాకింది. చెట్టుపై పళ్ళుకోస్తున్న నేను నిలుచో లేకపోయాను. పడిపోతానేమోనన్న భయం పుట్టింది. జాగ్రత్తగా కొమ్మ పట్టుకున్నాను. ఆ పాట యెవరిదై ఉంటుందా అని కొమ్మ సందుల్లో నుంచి చూశాను, దూరంగా చెట్లమధ్య సుడిగుండంలా గుండ్రంగా తిరు గుతూ, ఒక చిన్నపిల్ల కనుపించింది. తళతళలాడే ఎండపొదలో ఆవిడ రూపం మెరిసిపోతూ, ఏదో లోకంలో విహరించే దేవకన్యలా గోచరిం చింది. పాడుతూ అలసిపోయేవరకూ అలా గిర్రున తిరుగుతూనే ఉంది.

"ల్యూబా! ఇదేనా నీవు పల్లేరుకాయలు ఏరడం?"అని కేకవేశాను.

ల్యూబా మరొకసారి గిర్రున తిరిగి ఉరుకుతూ వచ్చి పిట్టగోడ ఎక్కింది,

"నీవు కొంటె పిల్లవాడివి!" అన్నది నన్ను యెక్కిరిస్తూ.

"నీవు అల్లరి పిల్లవు!" అన్నాను నేను మళ్ళీ. మాటకు మాట!

"సరే_ఒకమాట ఇట్రా!"

"దేనికి?"

"నిప్పుచెయ్యాలి. నాకు కాస్త సహాయం చేద్దువుగాని."

"నిప్పు దేనికి?"

"దేనికో అడగవద్దు,"

"మేమిద్దరం వాళ్ళ గుడిసె దగ్గరికి వెళ్ళాం. కుటీరానికి కాస్త సమీపంలో ఎవరో చలిమంటవేసి చల్లార్చిన బూడిదకుప్ప కనుపించింది. ల్యూబా ఆ బూడిదలో ఏమైనా నిప్పున్నదేమోనని కెలికి ఊదడం మొదలు పెట్టింది. ఆ పిల్ల కళ్ళనిండా బూడిదపడ్డది. ఎంత సేపటికీ నిప్పు కాలేదు.

"ఉండు! అసలులోపల ఏమైనా నిప్పు ఉన్నదో లేదో చూద్దాం!-" అంటూ నేను బూడిదకుప్పనంతా పెళ్ళగించి చూశాను. కొస్త నిప్పు కనిపించింది. ఎండుపుల్లలు, కొండరావిచెక్కలు ఏరితెచ్చి నిప్పుమీద వేసి మంటచేశాను. మండింది.

"ఉండు! మొక్కజొన్నజావ కాచుకుందాం" అంటూ ల్యూబా ఇంట్లోకి వెళ్ళింది. ఒకగిన్నె, ఒకసంచీతో మొక్కజొన్నరవ్వ తీసుకుని క్షణంలో తిరిగి వచ్చింది.

"మొక్కజొన్న జావ ఎలా చేయాలో నీకు తెలుసా!" అని అడిగాను.

"ఓ! ఎంత రుచిగా వుంటుందో చూద్దువుగాని." ల్యూబా మొక్కజొన్న జావ తయారుచేసింది. ఇద్దరం తాగాం. చాలా రుచిగావుంది.

"సరేకానీ, తెల్లకాటుకపిట్టను చూశావా నీవు?" అని అడిగింది ల్యూబా.

"అది తెల్లగా ఉంటుందా? నాకు తెలియదే! నేను నల్లటి పిట్టను చూశాను."

"పోనీ నీటి కుక్కను చూశావా?"

"లేదు. ఎన్నడూ చూళ్ళేదు."

నేను యెన్నోసార్లు చూశాను. ఒక నీటికుక్క ఇక్కడ ఒక బొరియచేసుకుని ఉంటున్నది. రోజూ సాయంత్రంపూట బొరియలో నుంచి బయటకు వస్తుంది. ఎక్కడేం జరుగుతున్నదో అని కాసేపు విలుచుని చూస్తుంది. తరువాత ఆహారంకోసం బయలుదేరి పోతుంది. శీతాకాలంలో అవుతే పండ్లు తినడానికి తోటలోనికి వస్తుంది" అని చెప్పింది ల్యూబా.

నీటి కుక్క బొరియ చూడడంకోసం మేం పరుగెత్తాం. తరువాత తెల్లకాటుకపిట్ట నివసించే పండ్లచెట్టు దగ్గరికి తీసుకపోయింది ల్యూబా. చెట్టు మీద క్రింది కొమ్మపైన ఒక గూడు కట్టుకున్నదిఆ పిట్ట. గ్రుడ్లుపెట్టి వాటిమీదహాయిని పొదుగుతున్నది. అది చిన్నగూడు. పిట్టతోక బయటికి కనుపిస్తున్నది. మా పదధ్వని చెవిన పడగానే పిట్ట, తలత్రిప్పి మావంక చూచింది బెదురుగా. దాని కళ్ళు నల్లగా, నల్లపూసల్లా మెరుస్తున్నాయి. మేము దాని దగ్గరికి వెళ్ళాం. కానీ అది యెగిరిపోలేదు.

"ఇహ రా మిఖైలో!" అన్నది మెల్లగా ల్యూబా. "దాన్ని బెదర గొట్టకు. రా- పోదాం! నీ కొత్త నీటిబుగ్గ చూపిస్తా రా! అన్నది.

అప్పటికి ప్రొద్దు కుంకవస్తున్నది. ల్యూబాను విడిచి వెళ్ళడం నాకు ఇష్టంలేదు.

"మిఖైలో! మళ్ళీ రా! ఈ సారి వచ్చేటప్పుడు చదువుకోడానికి ఏవైనా మంచి పుస్తకాలు తీసుకరా మనిద్దరం చదువుకుందాం. ఇంకా పండ్లుకోసుకుని పోదువుగానిలే. నాన్న ఏమీ అనడు" అన్నది ల్యూబా. అలా మేం యెవరి త్రోవన వాళ్ళం వెళ్ళిపోయేటప్పుడు ఆ అమ్మాయి కంఠస్వరంలో ఏదో విషాదం గోచరించింది.

"ఇక్కడ వంటరిగా ఉంటే నీకు భయం పుట్టదూ?"

"కొంచం భయంగానే ఉంటుంది. కానీ వాసిలీనా అత్తయ్య వస్తుంది, నాన్న అయినా వస్తాడు కాసేపటికి. ఇలా అంటూ ల్యూబా అడవివంక చూసింది: "వాళ్ళు వచ్చేదాకా నేను ఒక్కదాన్ని ఇంట్లోనే కూచుంటాను" అన్నది.

నేను గుఱ్ఱం యెక్కుతూవుంటే ల్యూబా వాకిట్లో నిలుచుని "ఇక వెళ్ళి రా. ఉంటాను" అన్నట్టు చెయ్యి ఊపింది.

కొంత దూరం వెళ్ళేవరకూ నేను వెనక్కు తిరిగి చూస్తూనే ఉన్నాను. ఆ పిల్ల నావైపు తదేకంగా చూస్తూ వాకిట్లోనే నిలబడిఉంది. అంతలోనే అడవిలోనుంచి మృదుమధుర గానం వినవచ్చింది. ల్యూబా సంతోషంతో అటువైపు పరుగెత్తింది. పొడుగ్గా, సన్నగా తీగెలా ఉన్న ఒక స్త్రీ, చెట్ల మధ్యనుంచి వచ్చింది. ల్యూబా పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆవిడ కౌగిట్లో వాలిపోయింది. తరువాత మళ్ళీ పాట. ఈసారి రెండు గొంతులు వినిపించాయి.

నేను ఇంటికి వెళ్ళాను మంచి చెర్రీపండ్లు తీసుకొనివచ్చినందుకు అంతా నన్ను మెచ్చుకున్నారు.

"మనమడు సామాన్యుడు కాడు, అసాధ్యుడు!"- అన్నది అవ్వ

"ఒరేయ్! రేపు చేపలుపట్టడానికి నదికివెడుతున్నాను. నీవూ వస్తావా?"- అని అడిగారు తాతయ్య.

"ఓ తప్పకుండావస్తాను." అన్నాను సంతోషంతో.

సరే-అవుతే విన్న చీకటితోటే లేపుతాను పికాచాలు కునేవేళ!"- అన్నాడు తాతయ్య

పికాచాలు ఎట్లా పోట్లాడుకుంటాయి తాతయ్యా?"-

"మనుష్యులు పోట్లాడుకోవడంలేదూ? - అలాగే! మనుష్యులు భూమిమీద పోట్లాడుకుంటారు. పికాచాలేమో గాలిలో పోట్లాడుకుంటాయి. అంతే తేడా!-" అని చెప్పాడు తాతయ్య.

"ఇహ ఊరుకోండి, మీ మాటలు, మీరు!" అంటూ అవ్వ కోపంతో అన్నది, "మీ నోటికి అన్నీ పాడుమాటలే వస్తాయి. దయ్యాలు, భూతాలు! - పిల్లలకు చెప్పవలసిన మాటలు ఇవేనా?-" అన్నది.

"చెపితే ఏం? వాటినిగురించికూడా తెలుసుకోవద్దూ వాడు!" అన్నాడు తాతయ్య.

"మనం చేపలు దేంతో పట్టుకుంటాం తాతయ్యా?–"

"వలతోటిరా!"

"అక్కడ గండుచేప లున్నాయా తాతయ్యా?–"

"ఓ రకరకాల చేపలున్నాయి–"

నాకు చెప్పలేనంత సంతోషంగా ఉంది. మనస్సులో రకరకాల దృశ్యాలు పొడగట్టాయి. భల్లూకలోయ, అక్కడ ప్రవహించే నది. అక్కడ నీళ్ళల్లో చేపలు ఎగురుతుంటాయని తాతయ్య చెప్పాడు. ఎక్కడ చూచినా చేపలే. కాసేపట్లో బుట్టెడు చేపలు పట్టుకోవచ్చు.

నేనూ, తాతయ్య పెరట్లోకివెళ్లి అక్కడున్న వల పరిశీలించాం. వల, సంచీ సిద్ధంచేసి పెట్టుకున్నాం.

ఎంత త్వరగా తెల్లవారుతుందా అని ఉంది నాకు. ఆరాత్రి గడపడం కష్టమనిపించింది.

"చూడరా, నక్షత్రాలు ఎలా ప్రకాశిస్తున్నాయో!" అన్నాడు తాతయ్య ఆకాశంపంక చూస్తూ.

మళ్ళీ ఏదో లోకంలో ప్రవేశించినట్టనిపించింది నాకు. తాతయ్య నన్ను వీధి వాకిట్లోకి తీసుకుని వెళ్ళాడు. పైన నీలాకాశం. మిలమిలలాడే నక్షత్రాలు ఊరికి దూరంగా పొలాలు – అవతల చర్చి.

ఆకాశం ఒక పూల రథంలా అగుపిస్తున్నది! దానికి చక్రాలు లేవు, అంతే!

"తాతయ్యా! ఆ రథానికి చక్రాలు లేవేం?"

ఓరి వెర్రివాడా అది దివ్యరథం! దానికి చక్రాలు ఎవరూ చేయ లేరు. చేసేవడ్రంగులుకూడా అక్కడ వుండరు!" అన్నాడు తాతయ్య.

వడ్రంగులు లేని ఊరు ఒకటికూడా నేను చూళ్ళేదు. ఎంత చిన్న గ్రామంలోనైనా అలాంటిపనివారు ఉంటారు.

"ఎందుకని అక్కడ వుంటారు తాతయ్యా?"

"అక్కడుండేవా రంతా మహాత్ములు, పుణ్యాత్ములు!"

"అయితే మాత్రం. వాళ్ళెక్కడికీ పోరా?"

"పోతారు. కాపీ ఎప్పుడూ కాలినడకనే"

"నిజంగా?"

"నిజంగానే"

ఆ పుణ్యాత్ములమీద నాకు జాలివేసింది. ఎంతదూరమైనా కాలి నడకతో వెడతారా? మనలాగా హాయిగా గుఱ్ఱాలమీద, బండ్ల మీద వెళ్ళ కూడదూ?

"వాళ్ళు చాలా దూరం నడుస్తారా తాతయ్యా?"

"ఓ!"

"మరి కాళ్ళు నొప్పులు పుట్టవూ?"

"వాళ్ళకు బాధ అనేది ఉండదు నాయనా. వాళ్ళు హాయిగా జీవిస్తారు."

"హాయిగా అంటే?"

"వాళ్ళకు అన్నీ ఉంటాయి, ఏ కొఱతా ఉండదు."

"వాళ్ళకు పొలం ఎవరు దున్నిపెడతారు?"

"ఎవరూ దున్నరు. పొలం దున్నకుండానే వాళ్ళకు తిండి దొరుకు తుంది."

"అంటే అక్కడ రొట్టెల దుకాణాలు ఉంటాయా?" మిత్రో ఫెవెంకో రొట్టెలదుకాణం నా జ్ఞాపకం వచ్చింది.

తాతయ్య, తలుపుపట్టుకుని బిగ్గరగా నవ్వడం మొదలుపెట్టాడు.

అంతలో అవ్వకూడా అక్కడికి వచ్చింది. ఆమెకూడా నవ్వ సాగింది. తాతయ్య నవ్వితే అవ్వకూడా నవ్వుతుంది.

తాతయ్య, అవ్వ ఎంతో అన్యోన్యంగా వుంటారు. అలాంటి దంపతులను ఎక్కడా చూడం. నిజంగా వాళ్ళిద్దరూ పుణ్యాత్ములు. ఎంత మంచి మనస్సు వాళ్ళది! అసలే దారిద్ర్యం కొట్టుమిట్టాడే ఊరు మా ఊరు. ప్రజలు తిండిలేక మలమలమాడిపోయిన రోజులున్నాయి. కానీ అలాంటి సమయంలోకూడా మా అవ్వ, తాత తిండిలేనివారికి తిండిపెట్టే వారు. మా తాతగారి యిల్లు ఒక ధర్మసత్రంలా ఉండేది. ఆ పుణ్యదంప తులు ఎవరినీ పల్లెత్తుమాట అనరు. ఏజీవుణ్ణీ కష్టపెట్టరు. ఎవరి మనస్సూ నొప్పించరు. ఆదంపతులనుచూచి ఊళ్ళోరైతుజనం అంతాఆశ్చర్యపోతుం టారు. వారిద్దరిమధ్య జరిగే సంభాషణలు వినితీరాలి. తాతయ్య పని చేసు కుంటూ ఉండి, రాత్రి పొద్దుపోయి ఇంటికి వస్తాడు. అవ్వ నిద్రపోతూ ఉంటుంది. ఆయన అవ్వను నిద్రలేపడు. అక్కడే ఉన్న ఒక దుంగ మీద పడుకుని అలాగే నిద్రపోతాడు. తెల్లవారుతుంది. ఆయన వళ్ళంతా మంచులో తడిసి ముద్దయి ఉంటుంది. అవ్వ, ఆయన్ను నానా చీవాట్లు పెడుతుంది. ఇహ ఎప్పుడూ ప్రొద్దుపోయి ఇంటికిరానని ఆయన వాగ్దానం చేస్తాడు. కానీ ఆ మాట ఆ నాటికేసరి. మరునాడు మళ్ళీ మామూలే!

తాతయ్య, అవ్వకూడా దాస్యంలో క్రుంగి ఉన్న కుటుంబాలల్లో జన్మించారు. ఒకరి పెత్తనం లేకుండా స్వతంత్రంగానే పెళ్ళి చేసు

కున్నారు. కొద్దిపాటి భూమితో జీవితం ప్రారంభించారు. అవుతే కర్షక బ్యాంకువారు కౌంట్ కోచుబీ భూమిని, నగదురూపంలో అయితే "దెస్యాటినా" (సుమారు 2 ఎకరాల 70 సెంట్లభూమి) ఒక్కొంటికి నూటఇవవై అయిదు రూబుళ్ళ చొప్పున, అప్పుగా అయితే మూడువందల రూబుళ్ళ చొప్పున 49 సంవత్సరాలకు విక్రయించటం మొదలు పెట్టినప్పుడు, మా తాతయ్య స్వశక్తితో సంపాదించుకున్న డబ్బుపెట్టి మూడున్నర "దెస్యాటినాల" భూమి కొనుక్కోవడం జరిగింది. కానీ పాపం ఏం చేస్తాడు? ఏడాది రెండేళ్ళు గడిచేటప్పటికి సంతానం కలిగింది. తన బిడ్డ నిరుపేదగా ఉండకూడదని రైతుగా బ్రతకాలని ఆయన కోరుకున్నాడు.

ఆ విధంగా మా తాతయ్య, ఆయన కుమాళ్ళు, మనుమలు కుటుంబమంతా కూడా భూమి దున్నుకుంటూ, పంటపండిస్తూ రైతులుగా జీవించారు. కానీ యుద్ధం వచ్చిపడింది. నిర్దాక్షిణ్యంగా వారిని పొట్టన పెట్టుకున్నది. అంతే! అంత పెద్దకుటుంబానికల్లా చివరకు ఇద్దరు మగ వాళ్ళు మిగిలారు.

నేను వెళ్ళి బట్టలు మార్చుకుని బెంచీమీదపడుకున్నాను. అంతలో మా బయటవాకిలి చప్పుడైంది.

నాన్న తిరిగి వచ్చాడా? అనుకున్నాను. గభాలున లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి చూశాను. కానీ నాన్నకాదు. ఒక చిన్న కుర్రవాడు, ఒక అమ్మాయి-మా పిట్టగోడమీదికి ఎక్కి ఆకాశంలో నక్షత్రాలవంక చూస్తున్నారు. నేను దిండులో తలదూర్చుకుని పడుకున్నాను.

అనేక దృశ్యాలు కలల్లా, అలల్లా కనులముందు తేలిపోసాగాయి. పొలాలు, అడవి, చెర్రీ పండ్లచెట్లు, ఏదో మధురగానం, కిలకిల నవ్వుతున్న ల్యూబా! మళ్ళీ హంసలు కనుపించాయి. ఒక పెద్దగుంపు,

అవి ఏదో దివ్యలోకం నుండి, అద్భుతలోకంనుండి వచ్చాయి, నన్ను ఎత్తుకుని రెక్కలమీద కూచో బెట్టుకున్నాయి. ఒక లోయలోకి తీసుకుని పోయాయి. అక్కడ తాతయ్య కనుపించాడు, చేపలుపట్టుకునే వల పట్టుకుని నాకోసం నిరీక్షిస్తున్నాడు.

"ఇంత ఆలస్యంగా వచ్చావేంరా ?" అని అడిగాడు నను చూడగానే.

"అప్పుడే నేను కొన్ని చేపలు పట్టాను"-అన్నాడు. అవును. చేపలు కొన్ని ఒడ్డున ఇసుకలో ఎగురుతూ, తోకలాడిస్తూ కనుపించాయి.

తెలతెలవారుతుండగా తాతయ్య నన్ను లేపాడు. నేను వల తీసుకోడానికి వెళ్ళాను. తోటలో ఏదో శబ్దం వినిపించింది. అటు చూశాను. ఒక స్త్రీమూర్తి చెట్లమధ్యనుంచి మెల్లమెల్లగా నడచిపోతున్నది. కొంత సేపటికి ఆ రూపం అదృశ్యమైంది.

ఎవరా స్త్రీమూర్తి? అమ్మ చెప్పినట్టు వేసవి ఈ రూపం ధరించి తోటలో తిరుగాడుతున్నదా? ఆమె చూడబోతే మేరియానాలాగే కనుపిస్తున్నదే! అవును. అచ్చంగా అలాగే ఉంది. ఆబ్బ! వేసవి ఎన్ని అద్భుతాలు ప్రదర్శిస్తున్నది. వేసవి చూపే వన్నెలను, చిన్నెలను గురించి ఒక్క మా అమ్మకే తెలుసు!

—o—

అధ్యాయం నాలుగు

సూర్యుడు మేఘాలచాటున దాగిఉన్నాడు. మధ్యమధ్య తన సహస్ర కిరణాలు విప్పి తొంగిచూస్తున్నాడు. పృథ్విని ఒక ఉయ్యాల తొట్టిగా, తన కిరణాలు ఉయ్యాల చేర్లుగాచేసి, పృథ్వీమండలం అనే ఉయ్యాలనుపట్టి ఊపుతున్నాడు।

చెట్లు - చేమలులేని విశాల మైదానంచుట్టూ పరచుకుని ఉన్నది. ఏదో బడలికవల్ల విశ్రాంతి తీసుకుంటున్నట్టు కనుపిస్తూ ఆకురాలేకాలం ప్రారంభమైనట్టు సూచిస్తున్నది. దూరంగా ఒక పొలంలో ఒక రైతు పొలం దున్నుతున్నాడు. అతనికి చేరువగా కొన్ని 'గాలిమరలు' ఆకాశంలో రెక్కలువిప్పి గిర్రున తిరుగుతున్నాయి.

ఈనాటివరకూ పొలాలను గురించి మనస్సులో ఎప్పుడు తలచుకున్నా నాకు ఎలాంటి ఆందోళన ఉండేదికాదు. తరతరాలుగా యుక్రేనియన్ ప్రజా జీవితానికి ప్రతిబింబాలుగా నిలిచిఉంది. విషాదభరితమగు కర్షక జీవితచరిత్రను వినీలాకాశంపై, మేఘాలపై విచిత్రంగా లిఖిస్తూ వస్తున్న 'గాలిమరలను' చూచి నేటివరకూ నేను మరోవిధంగా భావించలేదు.

నేనే ఒక 'గాలిమరనని', రెక్కలు విప్పుకుని ఆకాశంలో విహరిస్తున్నానని అనుకున్న సమయాలుకూడా ఉన్నాయి।

చివరకు పెడ్రో, నా కంటబడ్డాడు. [redacted]

మీద నడిచివస్తున్నాడు. అతను లావుపాటి చేతికర్రతో. చికోరీ మొక్క-లను తాకుతుంటే అవి అటూ ఇటూ ఊగుతున్నాయి. ఎండకు తిరిగి వస్తున్నాడు ఆ 'గోప బాలుడు'. అతనిముఖం సుడిపడి ఉన్నది. కళ్ళు విద్రిమత్తులో ఉన్నాయి. అవుతే ఒకానొక విధమైన సంతృప్తి గోచరిస్తున్నది అతని ముఖంలో! మైదానంలో పచ్చిక మేస్తున్న తన ఆల మందవంక ఒకమాటు చూచాడు. ఆవులను లెక్క-పెట్టుకున్నాడు. పొలాలవంక ఒకసారి చూచాడు. చివరకు నా దగ్గరకివచ్చి వ్యంగంగా ఇలా అన్నాడు :

"ఏయ్, 'పుస్తకాల పురుగూ! ఎలావుంది జీవితం?-"

"అధ్వాన్నంగా ఉంది."

"ఇప్పటికీ నామీద కోపం పోలేదా?"

"ఎప్పుడో పోయింది"

"మరి జీవితం ఎందుకని అధ్వాన్నంగాఉంది? నీకుబోలెడు పుస్తకాలు కావాలి. కానీ అవి దొరకడంలేదు. అందుకనేనా?-"

"అవును" అన్నాను. నన్ను ఎగతాళి చేయడానికి అతను మరో కారణం కనిపెట్టాడని నాకు తెలియకపోలేదు.

"అబ్బాయ్! నీవు ఎన్ని పుస్తకాలైనా చదువు. ఎన్నటికీ మత గురువు కాలేవు." అన్నాడతను, తన తెలివికి తానే గర్వపడుతున్నట్లు.

"మంచి పుస్తకాలే నీకు మంచి భోజనం అనుకుంటావు!" అన్నాడు మళ్ళీ.

వాణ్ణి ఎగతాళి చేయడానికి ఇహ ఇప్పుడు నావంతు వచ్చింది:

"నీవు భోజనం చేసేటప్పుడు రకరకాల పదార్థాలు పళ్ళెం పట్టకుండా ఉంటాయి కదూ-"

"మహారాజులు ఎలాంటి భోజనం చేస్తారో బిచ్చగాడికి ఎలా తెలుస్తుంది?-"

"ఎవరో మహారాజులు పెట్టే తిండితిని బ్రతుకుతున్నావు నీవు."

"అవును అదే నేనూ చెప్పదలచాను." అన్నాడు పెట్రో. "పాయసం, వేయించిన బాతుమాంసం, తియ్యటి పంచదార లడ్లు, పిండి వంటలు. ఓహ్! తివితీరాలి" - అన్నాడు.

"పాపం, భలే కలకంటున్నావు!-"

"కలకాదు నిజం. మతగురువు ఇంట్లో అలాంటి భోజనమే నేను చేసేది."

"ఆ మాట మరెవరికన్నా చెప్పు: నాకు చెప్పకు." పెట్రోను లేపిడిపట్టించి, ఏడిపించే అవకాశం చిక్కింది నాకు. మతగురువు భార్య ఎంత తుచ్ఛురాలో నాకు తెలుసు. ప్రొద్దుటనుంచి రాత్రివరకూ తన డబ్బు, ఆస్తి లెక్కచూచుకోటం తప్ప ఆమెకు మరొక పనిలేదు. అంత ఉండికూడా ఏమీ లేనట్టు ఎప్పుడూ గొణుగుతుంటుంది. ఈ రోజుల్లో జీవించడమే కష్టంగా ఉన్నదని అంటుంది. తన ఆస్తిపాస్తులన్నీ ఎవరో దోచుకుని తింటున్నట్టు గోలపెడుతుంది. అవుతే ఎవ్రికోవక్ ఎవరైనా ఇంటికివచ్చినప్పుడుమాత్రం నోరెత్తదు. పిల్లిలా ఉంటుంది, 'మేరియానా! నా చిట్టితల్లీ!' అంటూ పసిపిల్లను ఎంతో అప్యాయతతో పిలుస్తుంది.

"మతగురువు యింట్లో నేను విందారగించావంటే నీకు నమ్మకం లేదుకదూ?" అన్నాడు పెట్రో. అతను పచ్చికమీద వెల్లకిలా పడుకుని

రెండుచేతులూ తల క్రిందపెట్టుకుని మేఘాలు లెక్కిస్తున్నట్టు ఆకాశం వంకచూశాడు.

"ఎవరు నమ్ముతారోయ్! మతగురువు భార్య నీ ప్రక్కనే కూచుని విందారగించిందనికూడా నీవు చెప్పుతావు!" అన్నాను.

"నీకేం తెలుసు, తెలివితక్కువ మొద్దువు!" అన్నాడు పెట్రో కోపంగా. "మొన్న పర్వదినంనాడు మతగురువు భార్య యాత్రకు వెళ్ళింది. అప్పుడు దాసీపిల్ల - మేరియానా నాకు ఎలాంటి భోజనం పెట్టిందో తెలుసా? పైగా నన్ను చూచి ఏమన్నదనుకున్నావు?.... నేను చాలా అందంగా తయారవుతున్నానట!"

"ఓహో!"

తననుగురించి మేరియానా ఏం చెప్పిందో ఆ మాటలు మళ్ళీ చెప్పాడు పెట్రో సగర్వంగా.

"నేను ఊరికే గొప్పలు చెప్పుకుంటున్నానని అనుకుంటున్నావేమో! అనుకుంటే అనుకో నాకేం లెక్కలేదు!" అన్నాడు.

అతను అబద్ధం చెప్పాడని నేననుకోలేదు. మేరియానా మాటలు నన్ను మేలుకొలిపాయి! ఇప్పుడొకసారి పెట్రోవంక చూచాను. చిరిగిన బట్టలు, మాసిపోయిన టోపీ - కానీ ఇప్పుడతను నా కళ్ళకు యెప్పటిలాగా లేడు. నిజానికి అతను అందమైనవాడే. చక్కని కళ్ళు. తీర్చి దిద్దిన నల్లటి కనుబొమలు. పెట్రో అందమైన కుర్రవాడన్న సంగతి మొదటిసారిగా నేను గ్రహించగలిగాను.

అటు తిరిగిచూచాను. దూరంగా ఊరు కనిపిస్తున్నది. చుట్టూ బాదంచెట్లు. బూరుగచెట్లు. మేరియానా జ్ఞాపకం వచ్చింది. ఆవిడ నడక, ఆనవ్వు - కళ్ళముందు కట్టినట్టు కనుపించాయి. కిలకిల నవ్వుతుంది

ఆ పిల్ల. ముత్యాలవంటి పలువరుస, నవ్వితే బుగ్గలుమీద, గడ్డంమీద సొట్ట పడుతుంది. ఆ పిల్ల ఎప్పుడూ ఏదో పాటపాడుతూ, నవ్వుతూ ఎంత ఆనందంగా ఉంటుంది। వాళ్ళ అమ్మగారు తిట్టినప్పుడైనా సరే నవ్వడం మానదు।

"ఏమే! నీ పాడుగాను! నీకు మాయరోగం పుట్టా! మహమ్మారి నిన్ను దిగమ్రింగా!" ఇలా నోటికి వచ్చినట్టు తిట్టిపోస్తుంది మతగురువు భార్య.

"ఇవేనా, ఇంకేమైనా ఉన్నాయా నాకు వచ్చేరోగాలు? మీ తిట్లన్నీ నాకు దీవెనలేనండి!" అంటూ మేరియానా, పకపక నవ్వుతుంది.

యజమానురాలు నిర్ఘాంతపోయి చూస్తూ బరువుగా నిట్టూర్చి మళ్ళీ ఇలా అంటుంది.

"అయ్యో! భగవంతుడా! పాపులందరినీ రక్షించు! తెలిసిచేసిన పాపం తెలియక చేసినపాపం - అన్నీ పోగొట్టు! ఏమే పిల్లా నీకు నరకమే చివరకు గతి!"

"పోనియ్యండమ్మా. అక్కడైనా సుఖంగా ఉంటాను!" అంటుంది మేరియానా పరమ సంతోషంతో.

"ప్చ్? ప్చ్, ప్చ్! ఓసి నీ పాడుగాను! ఎంతకు తెగించావే?-నీకు దేవుడూ, దైవమూ లేడంటే? - నరకంలో సుఖంగా ఉంటావా? ఏం మాటలు, ఏం మాటలు? అయ్యో భగవంతుడా!"

"మరి నన్ను ఏం చెయ్యమంటారు అమ్మగారూ? ఎక్కడికి పొమ్మంటారు? గుట్టపుసాలలోకి వెళ్ళేదా? పోనీ తోటలోకి వెళ్ళిపోనా? పొలాల్లోకి పొయ్యేదా!"

"ఎంత సాహసమే పిల్లా నీకు? ఎదిరించి మాట్లాడు తున్నావే?" అంటుంది మళ్ళీ మతగురువు భార్య. భయ విచలిత అయి. "అయ్యో. భగవంతుడా! పాపులందరినీ క్షమించు!" అంటూ ప్రార్థిస్తుంది.

మేరియానా ఎక్కడికి వెళ్ళినా సంగీతం, సంతోషం వెదజల్లు తుంది! తెలిసినవారంతా ఆ పిల్లను ప్రేమిస్తారు. ఆవిడ ఎప్పుడూ సుఖంగా ఉండాలని. భూస్థితి ఉంది. పనిచేయగలిగిన కుర్రవాడు ఆ అమ్మాయికి భర్తగా లభించాలని అందరూ కోరుకుంటారు.

అరె! మతగురువు దగ్గరనించి నాకు ఒక మంచి పుస్తకం తెచ్చి పెడుతుంది ఈ అమ్మాయి! ఈ విషయం ఇన్నాళ్ళబట్టి నాకు తోచలేదు. ఇప్పుడు తోచింది. ఈ ఆలోచన తట్టగానే ఎన్నో మధుర స్వప్నాలు నా మనస్సులో మెదిలాయి. పెట్రో వర్ణించిచెప్పిన విందు భోజనాలవిషయం ఇహ నా చెవి కెక్కడంలేదు.

"వెళ్ళి భోజనం చెయ్యి. పరుగెత్తు. లేకపోతే ఈ ఎండదెబ్బకు మాడిపోతావు" అన్నారు పెట్రో చివరకు.

ఇలాఅని అతను జేబులోనుంచి చెకుముకి సంచీతీశాడు. అందులో ఆకురాయి, చెకుముకిరాయి ఉన్నాయి. వాటితో కొడితే నిప్పుపడుతుంది, అతని మామ ఆస్ట్రియనులతో పోరాడినప్పుడు కార్పేథియన్ పర్వత ప్రాంతం నుండి అతనికి రాయి తెచ్చిపెట్టాడు. పెట్రోకు సరదా అయిన వస్తువు యిదొక్కటే!

నేను ఇంటి ముఖం పట్టాను! కొన్ని గోధుమపొలాలు, బంగాళ దుంపలతోటలు దాటాను. మికిటోవ్ కొలను దగ్గరికి వచ్చాను. దాని నిండా గండుచేపలు, కొలనులో నీళ్ళ నీలివర్ణం, నీళ్ళలోనుంచి రకరకాల ధ్వనుల్లు వినవస్తున్నాయి. వంగి చెవిపెట్టి విన్నాను. ఆ ధ్వనులు వినడం

నా కెంతో ఇష్టం. పచ్చని పచ్చికలోనుంచి ఏవో గుసగుసలు వినవస్తున్నాయి. వసంతకాలంలో అయితే ఈ కొలనులో నీళ్ళు భయదజలద గర్జనచేస్తూ లోయలోగుండా మహావేగంతో ప్రవహిస్తుంటాయి. కోపంతో నురగలు కక్కుతూ చెట్లను కూకటివ్రేళ్ళతో సహా పెకలించివేస్తాయి. ఆనకట్టలను కోసివేస్తాయి. వేసవిలో ఈ జలాలు సన్నని స్వరంతో వేణుగానం చేస్తాయి. శీతాకాలంలో ఎక్కడో అడుగునకుపోయి నిశ్చలంగా నిద్రపోతున్నట్టుంటాయి.

ఇటీవల వేసిన మొక్కజొన్నపంట ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నది. నేను పొలాలన్నీ తప్పించుకుని రోడ్డుమీదకి వచ్చాను. పెరెంటీ తాత బండి కంటపడింది. ఆయన బండి తోలుకుంటూ వస్తున్నాడు. ఆయన కుమ్మరిపని చేస్తాడు. ఆ పనిలో ఆయన అందెవేసిన చెయ్యి. పాపం ఆయన వృద్ధుడైనాడు, నడుము పూర్తిగా వంగిపోయింది. బండిలో ముందరివైపు తొట్టిలో కూచుని బండి తోలుతున్నాడు. బండి మీద ఆయన మనుమలు కూచున్నారు. చిన్నపిల్లలు పిట్టల్లా ఉన్నారు. వాళ్ళ చేతుల్లో మట్టి గుర్రాలున్నాయి. చూస్తే ముద్దొస్తున్నాయి. పెరెంటీ తాత తయారుచేసినవే అవి. మట్టితో రకరకాల బొమ్మలుచేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. గుర్రంచేస్తే ఒకసారి చేసినట్టు ఇంకొక సారి చెయ్యడు. ప్రతిసారీ వాటికి ఏదో కొత్తరూపం కల్పిస్తాడు. కొత్త పద్ధతి కనిపెడతాడు. ముఖ్యంగా తన మనుమలను సంతోషపెట్టడమే ఆయనకు కావలసింది. అవును పాపం ఆ వృద్ధుడు ఒంటరివాడు. ఈ లోకంలో ఆయన కెవరూ లేరు. ఆ చిన్నారి మనుమలే ఆయనకు సర్వస్వం. ఆయన కొడుకును కోసక్లు ఉరితీశారు. కనుకనే మనుమలను కళ్ళలోపెట్టుకుని కాపాడుకుంటున్నాడు. ఎక్కడికి వెళ్ళినా, ఏ సంతకు పోయినా వాళ్ళను వెంటపెట్టుకపోతాడు. కాదూ మరి. బండిమీద ప్రయాణం చిన్నపిల్లలకు ఎంతోసరదా.

బండిమీద రకరకాల మట్టిపాత్రలు ఉన్నాయి. కుండలు, కూజాలు. మూతలు, మూకుళ్ళు - ఒకటేమిటి? అన్నిరకాల పాత్రలు. వాటిమీద అందంగా పూలు, లతలు చెక్కి ఉన్నాయి. కొన్నిపాత్రల మూతులు గుర్రంమెడలాగా, గాడిద తలలాగా తయారుచేసి ఉన్నాయి. మట్టిమంది మాణిక్యాలను సృష్టించగలిగిన మానవశక్తికి ప్రతిబింబాలు ఆ మృణ్మయ పాత్రలు!

"పెరెంటీ తాతా! నాకో మట్టిగుర్రం ఇవ్వవూ?-" అని అడిగాను.

"ఏం కొరదాతో కొడతావా?-" అన్నాడు తాత. బోసినోటితో ఆయన నవ్విన నవ్వు - బుర్రమీసాలమీదిగా అలలా లేచి వాయువులో లీనమైంది.

"నాకో మట్టిగుర్రం ఇవ్వు తాతా!" మళ్ళీ అడిగాను.

"ఇంకా కాస్త పెరిగి పెద్దవాడివి అయినతరవాత ఇస్తాను."

"ఈమాటే క్రిందటి సంవత్సరం చెప్పావు!"

"చెప్పానా? అవుతే ఇస్తాలే. కానీ కుమ్మరిచక్రం త్రిప్పడంలో నీవు నాకు సహాయపడాలి."

"ఓ! తప్పకుండా. రేపు వస్తాను."

"అవుతే, గుర్రంకూడా రేపే ఇస్తాను."

"మరి ఇప్పుడెక్కడికి వెడుతున్నావు ఇవన్నీ తీసుకుని?-"

"కొరాలెవ్‌షీనోకు - అమ్మకానికి, నీవూ వస్తావా బండెక్కి-"

"వద్దు తాతా! మట్టిపాత్రలు పగలగొడతానేమోనని నాభయం."

"ఎలాగైనా తెలివైన కుర్రవాడివి!-"

ఇలా అని తాతయ్య మళ్ళీ నవ్వాడు. బండి సాగిపోయింది. నేను ఊరివైపు పరుగుతీశాను.

నేను మా యింటికివెళ్ళే త్రోవన పోలేదు. మతగురువు ఇంటికి వెళ్లే త్రోవ పట్టాను. ఆ ఇల్లు అన్నిటికీ ఎడంగా ఒకమూల ఉంది. చుట్టూ పొదరిండ్లు.

ఇంటిదగ్గరికి వెళ్లేసరికి ముందు ఖాళీ జాగాలోనుంచి రెండు కుక్కలు అరుస్తూ నామీదికి వచ్చాయి. మరో ముసలికుక్క వాకిలి మెట్లమీద నిలుచుని "బౌ, బౌ" మని అరవసాగింది.

మేరియానా తోటలోనుంచి గబగబా నావద్దకు వచ్చింది. ఆ అమ్మాయి చెయ్యి ఎత్తి అదిలించగానే కుక్కలు అరవడం మానుకున్నాయి.

"మిఖైలో! వచ్చావా?" అన్నది ఆ అమ్మాయి సంతోషంతో. తన తోడబుట్టినవాడు కనుపిస్తే ఎంత ఆనందం పొందుతుందో అంత ఆనందం పొందింది.

"ఆకలివేస్తున్నదా మిఖైలో?-" అని అడిగింది, వెంటనే.

"లేదు" అన్నాను, ముఖం ప్రక్కకుతిప్పి నేను బిడియపడుతున్నానని ఆమె గ్రహించింది.

"ఎందుకు బిడియపడతావు?"

"బిడియం ఏమీ లేదు, మేరియానా! నేను భోజనం చేశాను. పైగా బోలెడన్ని తెల్లగడ్డలు తినేశాను."

"తెల్లగడ్డలా?" అంటూ నవ్వింది ఆమె. "ఎందుకు దబాయిస్తావు?-" అన్నది.

"దబాయింపుకాదు. నిజం! మా ఉల్లిగడ్డలు నీవు చూళ్లేదుగా భలే బాగుంటాయి. ఒక్కొక్కటి నా పిడికిలంత లావుంటాయి"

"సరే కానీ, మీ అమ్మ పొమ్మంటే వచ్చావా?-"

"లేదు నేనే వచ్చాను."

"ఎవరిని చూడాలని వచ్చావు?-"

"నిన్నే!-"

"నిజంగా?-" అన్నది మేరియానా. ఆవిడ ముఖం మళ్ళీ ఆనందంతో వెలుగులు విరజిమ్మింది. "మంచిపని చేశావు! నన్నెవరైనా చూడడానికివస్తే ఎంతో బావుండునని ఇప్పుడే అనుకుంటున్నాను. మా బంధువులంతా చాలా దూరంలో ఉన్నారు-" అంటూ నిట్టూర్చింది.

"నీతో ఒకటి చెప్పాలని ఉంది." అన్నాను అసలు విషయం చెప్పకుండా, భయభయంగా.

"ఏమిటది?-"

"నా కేదైనా పుస్తకం తెచ్చిఇవ్వగలవా?-"

"నీవు చదువుకోడానికా లేక సిగిరెట్ల కాగితంక్రింద చింపివేయడానికి మరెవరికన్నానా?-"

"నాకే, చదువుకోడానికి."

"అయ్యో! ఏం చేసేదీ? ఈ విషయంలో నేను నిస్సహాయురాలిని మిఖైలో! మతగురువు తన పుస్తకాలన్నీ పెట్టెల్లో పెట్టుకుని తాళాలు వేసుకుంటాడు. ఎవరో తింటారన్నట్టు!"

"తాళాలు వేస్తాడా?"

"అవును తాళాలులేకుండా ఉంటే నీకో పుస్తకం తీసిఇవ్వగలను. నీకోసం ఏ సహాయమైనా చేస్తాను మిఖైలో! నీవు నావాడివి. అవునా?"

ఆ అమ్మాయి మళ్ళీ కిలకిల నవ్వింది. ఆవిడ బుగ్గంమీద, గడ్డంమీద సొట్టలు పడ్డాయి.

ఇహ ఏం చెప్పాలో నాకు తోచలేదు. అలాగే దిగాలుపడి నిలుచున్నాను.

“దిగులుపడకు మిష్టర్! కాస్త ఓపికపట్టు. మతగురువునో ఆయన భార్యనో ఎలాగో మాయచేయడానికి మార్గం ఆలోచిస్తాలే.”

ఇలా అని మేరియానా నా చెయ్యి గట్టిగా నొక్కింది. మేమిద్దరం రివ్వున పరుగుతీశాం. మతగురువు ఇంట్లో వంటగదిలోకి వెళ్ళాం. గది విశాలంగా ఉంది. అక్కడ ప్రతివస్తువూ తళతళ మెరిసిపోతున్నది. పొయ్యివద్దగ్గర కొన్ని పిల్లికూనలు ఆడుకుంటున్నాయి. బెంచీమీద ఒక కొయ్యతొట్టిలో పిసికిన గోధుమపిండి ఉన్నది. తినుపదార్థాలు, వంట సామాన్లు పెట్టే ఒక బీరువాలోనుంచి కమ్మని వాసన వస్తున్నది. నాకు నోరూరింది. కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి. మేరియానా బీరువా తలుపు తీసింది. ఒక ‘కేక్’ తీసి దానిమీద పంచదార జల్లి నా చేతిలో దురిమింది.

“తరవాత తిందువుగాని. నీకు ఇష్టమైన వస్తువు. స్వయంగా నేను చేశాను ... ఉండు ఒక్క నిముషం” అంటూ ఆమె పెదవులపై వ్రేలు పెట్టుకుని ఏదో ఆలోచిస్తున్నదానిలా ఒక క్షణం నిలుచున్నది. ఇంట్లో ఎక్కడైనా అలికిడి అవుతున్నదేమోనని ఒకచెవిపెట్టి విన్నది. తరవాత లోపలికి వెళ్ళింది. కాసేపట్లో తిరిగివచ్చింది. గుడ్డచాటున ఏదో పెట్టుకుని వచ్చింది. ఆమె కళ్ళల్లో ఆనందం, ఉత్సాహం కనుపిస్తున్నాయి. ఆమె రాగానే పిల్లికూనలు ఎగబడ్డాయి. ఆ పిల్ల వాటిని అవతలికి నెట్టి

వేసింది. "ఉండండే, మీ పాడుగాను!—" అన్నది! తరవాత నాతో "తెచ్చాను మిఖైలో!" అన్నది.

"ఓహో!" నా అదృష్టం పండింది.

"ఇదిగో!" అంటూ బైండుచేసి ఉన్న ఒక పుస్తకం నా చేతి కిచ్చింది. "పుస్తకం కావాలంటే వాళ్ళే పెడుక్కుంటారులే!—"అన్నది.

"ధన్యవాదాలు మేరియానా, ధన్యవాదాలు!" పుస్తకం తీసుకున్నాను. కానీ ఎక్కడ దాచుకోవాలో తోచలేదు.

"చదువుకో మిఖైలో! బాగా చదువుకో! మా అందరిలాగా చదువు రాని మొద్దువు కాకుండా నీవైనా బాగా చదువుకుని పెద్దవాడివికా! చదువు రాని మమ్మల్ని చూచి సిగ్గుపడకు. మమ్మల్ని పరిహాసం చెయ్యకు" అంటూ మేరియానా, కళ్ళుతుడుచుకున్నది, తన విచారమంతా పోగొట్టుకుంటున్నట్టు. "ఈ పుస్తకం చదవడానికి ఎన్ని రోజులు పడుతుంది?—" అని అడిగింది.

"రెండురోజులు చాలు" అని చెప్పాను.

"రెండురోజులేనా?—" ఆశ్చర్యంతో అడిగింది మేరియానా. "నేనీ పుస్తకాన్ని జీవిత కాలంలోకూడా చదవలేను. ఏముంటుందో అందులో? నాకు కాస్తచదివి వినిపించు మిఖైలో!" ఇలా అని ఆమె తలుపులు వేసింది. నేను పుస్తకం తెరిచాను, కానీ నా హృదయం క్రుంగిపోయింది!

"ఏమిటీ?—"అని అడిగింది మేరియానా, భయంతో...."పుస్తకం మంచిదికాదా? అసభ్యమైన రాతలున్నాయా?" అంటూ నా చేతిలోనుంచి పుస్తకం లాక్కున్నది.

"ఎందుకూ పుస్తకం లాక్కుంటావు?—" అని అడిగాను.

"మరి పుస్తకం తెరవగానే ఎందుకలా అయిపోయావు?" అంటూ ఆవిడ కొన్ని పేజీలు తిరగవేసింది.

"ఈ పుస్తకం మన భాషలో వ్రాసిందికాదు, అందుకని" అని ఆవిడ చేతిలోనుంచి మళ్ళీ పుస్తకం తీసుకున్నాను. అర్థంకాని ఆ అక్షరాలవంక తదేకంగా చూడసాగాను.

"నీకు మంచి ఉపకారమే చేశాను! నాలాంటి పల్లెటూరి పిల్లకు అన్ని పుస్తకాలూ ఒక్కలాగే కనుపిస్తాయి!......సరే. ఈ మాత్రానికి దిగులుపడకు. చదవడానికి ప్రయత్నించినందువల్ల నష్టమేమీలేదు. మనం నేరుగా మతగురువు కొడుకు దగ్గరికివెళ్ళి మరోపుస్తకం ఇమ్మని ఆయననే అడుగుదాం" అన్నది మేరియానా.

ఆ మరుక్షణంలోనే మేం మరో విశాలమైన గదిలోకి వెళ్ళాం అక్కడొక పెద్ద 'డెస్కు' ఉంది. దానిమీద పడుకుని హాయిగా నిద్రపోవచ్చు. ఆ గది మతగురువు కుమారుడిది. కీవ్ విశ్వవిద్యాలయం నుంచి ఆయన్ను ఇటీవలే బహిష్కరించారు. మేం వెళ్ళేటప్పటికి ఆయన కుర్చీలో కూచుని ఉన్నాడు. ఆయన ముక్కు మూరెడు పొడుగు! తలకాయ కర్బూజాపండులా ఉంది. నా విషయమంతా మేరియానా ఆయనకు చెప్పింది. ఆయన కుర్చీలోనుంచి లేచి కాసేపు నన్ను ఎగాదిగా పరిశీలించి చూచాడు. నా కాళ్ళకు బూట్లులేవన్న విషయం ప్రత్యేకంగా గమనించాడు. నా కాళ్ళనిండా దుమ్ము, బురదమరకలు ఉన్నాయన్న సంగతి అప్పుడు నాకు గుర్తుపచ్చింది. నా బట్టలు, నా ఆకారం అన్నీ తలుచుకుని ఆయన ముందు సిగ్గుతో, అవమానంతో క్రుంగిపోయాను. పైగా నా జేబులో కేక్ ఉన్నందువన జేబు ఇంతలావున పైకి కనుపిస్తున్నది.

"ఓహో! అదా సంగతి? నీ వొక పెద్ద పండితుడివి కావాలను కుంటున్నావన్నమాట!—" అని అడిగాడాయన చివరకు.

ఆయన ఎత్తిపొడుపు ధోరణిచూచి "చదువుకోడానికి ఏదైనా పుస్తకం కావాలి" అన్నాను.

"అవునులే. ఈ రోజుల్లో ప్రతివాడూ చదవాలనుకుంటున్నాడు. నీలాంటి పనికిమాలిని కుఱ్ఱకుంకలందరికీ ఇదొక వేషం అయిపోయింది!" అన్నాడాయన. ఇలా అని మేరియానావంక చూచాడు. కంఠస్వరం హెచ్చిస్తూ "ఇక నీవు సినిమానుంచి వెళ్ళొచ్చాయా! పనంతా చేశావా?—" అన్నాడు.

"పనంతా ఎప్పుడో చేశాను ... వస్తాను మిస్సైలో!—" ఇలా అని మేరియానా 'ఫరవాలేదులే' అన్నట్టు నావంక చూచింది. "ఆయన నీకోమంచి పుస్తకం ఇస్తారులే—" అన్నది.

మేరియానా గర్వంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది. పోతూ పోతూ వెనకనుంచి మతగురువు కుమారుణ్ణి ఒకసారి వెక్కిరించి మరీ వెళ్ళిపోయింది! నాకు నవ్వు ఆగలేదు. కానీ అంతలో మతగురువు అక్కడికి వచ్చాడు. తలముగ్గుబుట్టలా నెరిసి ఉంది. చిరిగిన దుస్తులు ధరించాడు. ట్రౌజరు వేసుకున్నాడు. మతగురువులు ట్రౌజర్లు వేసుకుంటా రని నే నెన్నడూ ఊహించలేదు.

"చూడు నాన్నా, ఈ పండిత పుత్రుడు! పుస్తకం కావాలని వచ్చాడు!—" అన్నాడు మతగురువు కుమారుడు, వాళ్ళ నాన్నతో. తరవాత వారిద్దరూ బిగ్గరగా నవ్వారు. లజ్జ, అవమానం, అభిమానం- అన్నీ ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టి నిలువెల్లా దహించివేశాయి. కాళ్ళు భూమిమీద ఆనడంలేదు. లోలోపల క్రుంగిపోతున్నాను. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇలాంటి అనుభవం నేను ఎన్నడూ ఎరుగను. నేనసలు ఏడ్చేపిల్లవాణ్ణికాను. ఎన్నిబాధలయినా భరిస్తాను. ఎన్ని దెబ్బలయినా

తింటాను. కాపీ కంటతడిపెట్టను. అలాంటిది ఇప్పుడీ అవమానం. మనోవేదన భరించలేక పోయాను.

ఆ తండ్రీ కొడుకులిద్దరూ ఒకటి, రెండు నిముషాలసేపు ఏదో చిత్రంగా మాట్లాడుకున్నారు. తరవాత కుమారుడు ఒక పెద్ద పుస్తకాల బీరువాదగ్గరికివెళ్ళి తాళం తీశాడు. దానినిండా పుస్తకాలే. నాకు కళ్ళు చెదిరాయి. అన్ని పుస్తకాలు నా జన్మలో చూళ్ళేదు. అన్నీ పెద్దపెద్ద పుస్తకాలు. తోలుతో, గుడ్డతో బైండుచేసి ఉన్నాయి. వెండి, బంగారు గిల్టుతో మెరిసిపోతున్నాయి. ఒక మనిషి ఆధీనంలో ఇన్నిపుస్తకాలుంటాయా? ఆ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని, ఆనందాన్ని కడుపార గ్రోలవచ్చు! కానీ అన్ని పుస్తకాలున్నంతమాత్రాన, అంతటి విజ్ఞాన సంపదను నిక్షిప్తంచేసుకుని ఉన్నంతమాత్రాన ఒక పుస్తకంలేనివాణ్ణి ఏడిపించడం ధర్మంకాదు. మతగురువు కుమారుడు కొంతసేపు ఆ బీరువాలో పుస్తకాలు వెదికాడు. చివరకు ఒక పుస్తకం తీశాడు. దానిమీద ఉన్న ధూళి దులిపి వాళ్ళనాన్నకు చూపాడు. మతగురువు ఏదో ఆశ్చర్యాన్ని కనపరిచాడు. కాపీ ఏమీ అనలేదు.

"ఇదిగో! చాలా గొప్ప గ్రంథం. ఇదిచదివితే నీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. చదివి మళ్ళీతెచ్చి ఇవ్వు. పుస్తకం భద్రంగా ఉంచు. మురికిచేతులతో పుస్తకం ముట్టుకోకు!" అన్నాడు మతగురువు కుమారుడు, పుస్తకం నాచేతికి ఇస్తూ.

నేను ఆ గదిలోనుంచి ఇవతలికి వచ్చాను. ఇప్పుడు మళ్ళీ నాకాళ్ళల్లోకి సత్తువ వచ్చింది. నా కళ్ళలోనుంచి, హృదయంలోనుంచి ఏదో విచారం తొలగిపోయినట్టనిపించింది. ఒక్క ఉరుకులో ఇంట్లోనుంచి బయటపడ్డాను. వెనకనుంచి మతగురువు కుమారుడు బిగ్గరగా నవ్వడం, కుక్కలు మొరగడం, నాకు వినిపించింది.

నేను ఇంట్లో అడుగుపెట్టగానే "ఆరిభగవంతుడా!....ఏందుర్బుద్ధి పుట్టిందిరా నీకు? ఎక్కడికి వెళ్ళావు?—" అన్నది అమ్మ.

చేతిలోఉన్న పుస్తకం పైకెత్తి ఊపుతూ. "ఇదిగో, చూడమ్మా!" అన్నాను గర్వంగా.

"అవును - నీవు ఏదో ఒకటి చేస్తూనే ఉంటావు! ఊరకుక్క కూడా నీవు తిరిగినట్టు తిరగదు!" అన్నది అమ్మ. కానీ నేను ఇంటికి వచ్చినందుకు అమ్మమనస్సుకు హాయిచిక్కింది. ఆమె ఏవేవో ఆలోచనలలో మునిగిపోయింది.

ఒక్కొక్కప్పుడు నాకు అనిపిస్తూ ఉంటుంది. అమ్మ కనుక నన్నుగురించి ఎప్పుడూ శ్రద్ధతీసుకోకుండా ఉన్నట్టయితే నాగతి ఏమయ్యేది? ఈనాటికీ అమ్మ నాకు జ్ఞాపకం. ఆమె దయార్ద్ర హృదయం. ఆమె చల్లనిచూపు. సేదతీర్చే ఆమె హస్తస్పర్శ – అన్నీ ఇప్పటికీ నేను ఊహించుకోగలను. భావించుకోగలను. అనుభవించగలను కూడా.

మా తాత. అవ్వ చనిపోయినప్పుడు మేం ఇల్లుమారవలసివచ్చింది. ఒక పూరిగుడిసెలోకి వెళ్ళి అక్కడ ఉన్నాం. ఆ గుడిసెలోకి గాలీ – వెలుతురూ కూడా రాదు. గుడ్డివెలుతురు వచ్చేకిటికీలు రెండున్నాయి. ఇంటికి కాస్త శోభవస్తుందేమోనని అమ్మ, ఆ కిటికీలముందు కోరింద పొదలుతెచ్చి నాటింది. ఆ గుడిసెలో మాకు పుష్కలంగా ఉన్నవల్లా పొగ కీచురాళ్ళు. ఊళ్ళోఉన్న కీచురాళ్ళన్నీ ఆ ఇంట్లోనే పోగైనాయి మామీద పగపట్టినట్టు! ఆ ఏటికాఏడు వాటిగోల మాకు మిక్కుటమై పోయింది. రాత్రిళ్ళు ఇంటినిండా అవే స్వేచ్ఛావిహారంచేస్తుంటాయి. రొట్టెను ఉండ నివ్వవు. వాటిపోరు పడలేక రొట్టెకూడా మేం పైన అటకమీద దాచుకో వలసివచ్చింది. మా బాధచూడలేక మా ఇరుగుపొరుగువాళ్ళు, పురుగులను పారద్రోలే ఒక మంత్రగాణ్ణికూడా పంపించారు.

ఒక ముసలి ఆవును కొనడానికి నాన్న ఎంతో శ్రమపడవలసి వచ్చింది. ఎంతోకాలం కష్టపడి డబ్బుపోగుచేసి చివరకు ఒక ముసలి ఆవును కొన్నాడు. మా ఇంటిని ఆనుకునిఉన్న పందిట్లో దాన్ని కట్టివేస్తూ వచ్చాం. రాత్రిళ్ళు నాకు మెలుకువ వచ్చినప్పుడు చూస్తే, గోడ అవతల నుంచి ఏదో మూల్గుడు వినిపించేది. తరచు ఇలా జరుగుతూ ఉండేది. మొదట మొదట నేను భయపడ్డాను. కానీ మళ్ళీ అలాగే నిద్రపోయే వాణ్ణి. దురదృష్టవశాత్తూ చాలకాలం వరకు ఆ ఆవు. మా స్వంతం కాలేదు. నేను మా పల్లెటూరి బడిలో నాలుగు తరగతులు చదువుకున్నాను. అక్కడ చదువు పూర్తికాగానే ఒక చెప్పులు కుట్టేవాడిదగ్గర నన్ను పనికి కుదిర్చాడునాన్న. అతనికి పుట్టెడు చెముడు అతని భార్య అందగత్తె. అతను, భార్యను ఎప్పుడూ చావచితకకొడుతూ ఉంటాడు. కొట్టకపోతే మాట వినదని అంటాడు.

నన్ను ఈ పనిలో చేర్చేవిషయంలో అమ్మ వ్యతిరేకించింది. నన్ను చదివించమని, ఈ పనిలో చేర్చవద్దని నాన్నతో అహర్నిశలూ పోరాడింది. ఏడ్చింది, తిట్టుకున్నది. బ్రతిమాలింది. మా ఊరికి దాదాపు పధ్నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న గ్రామ పాఠశాలలో నన్ను చదివించమని పట్టు బట్టింది.

అమ్మపోరు పడలేక చివరకు నాన్న "ఊరికే గోలపెడుతున్నావే తప్ప నీకు బుర్రలేదు. దరిద్రంతో నిండా మునిగి ఉన్నాను. పిల్లవాణ్ణి బడికి పంపించమంటావే ఎలా పంపేది? డబ్బు చెల్లించి వాడికి చదువు చెప్పించే తాహతు నాకు ఉన్నట్టయితే ఇలా ఎందుకుంటాను? రెండు చేతులూ విరిగేట్టు పనిచేసినా నాకు అంతడబ్బురాదు. ఇహనేను వీధుల్లో ముష్టిఎత్తుకుంటూ తిరగాలి." అని కోపంతో అన్నాడు.

"మీరు ఎన్ని అయినాచెప్పండి. వాణ్ణి చదివించాలి, చదువుకోసం వాడు అల్లాడి పోతున్నాడు - మీరే చూస్తున్నారుగా, ఏదో మార్గం చూడండి." అన్నది అమ్మ, పట్టినపట్టు విడువకుండా.

నాన్నకు కోపం ఆగలేదు. క్రోధావేశంతో ఆయన ముఖంమీద నరాలన్నీ ఉబ్బాయి. "నన్ను చంపండి, మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. అడుగడుగునా, దురదృష్టం భయంకరంగా నాల్కలు చాచుకుని నా ఎదుట ప్రత్యక్షమవుతున్నది. ఏం చేసేదినేను?—" అన్నాడు నాన్న.

"మన ఆవును అమ్మివేయండి." అని సలహా చెప్పింది అమ్మ.

"ఆవునా? నీకు నిజంగా మతిపోయిందా ఏమిటి?" అన్నాడు నాన్న.

రైతుకు ఆవు ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. ఇహ అమ్మ కూడా మారుమాట్లాడలేదు.

కానీ నాన్నమళ్ళీ ఆలోచించుకున్నాడు, దరిద్రంతో చస్తే చద్దామనుకున్నాడో ఏమో. చివరకు ఆవును అమ్మివేశాడు. నేను బడిలో చేరాను.

సరే - ఇదంతా వెనకటిసంగతి ఇహ ప్రస్తుతానికి వస్తాను. మత గురువు ఇచ్చిన పుస్తకం చేతపట్టుకుని నిలుచున్నాను. పుస్తకం తెరిచే ముందు శుభ్రంగా చేతులు కడుక్కుని తువ్వాలతో తుడుచుకున్నాను.

పుస్తకం తెరిచి లోపలిపేజీ చూచాను. పుస్తకంపేరు "విశ్వసృష్టి విజ్ఞానం" అని ఉంది. నాకు అర్థంకాని పేరు అది. ఇహ లోపలి పేజీలలో చూస్తే నాకు అసలే బోధపడలేదు విదేశ భాషలోని అక్షరాలు, ఏదో గూఢమైన లిపి పుస్తకం నిండా ఉన్నాయి. నేను మళ్ళీ క్రుంగి పోయాను, కానీ మతగురువు చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. ఇది చాల

గొప్పగ్రంథం అని చెప్పాడాయన. ఎలాగైనా ఆ గ్రంథంలోని సారం ఆకళింపు చేసుకోవాలని విశ్వప్రయత్నం చేశాను. ఒక పెద్ద గుండ్రాయిని మోసుకుని పోయినట్లుగా సంచీలో ఆ పుస్తకాన్ని మోసుకుని పొలాలకు వెళ్ళేవాణ్ణి. చదివి అర్థంచేసుకోడానికి నానాతంటాలు పడేవాణ్ణి. ఇదంతా కనిపెట్టింది అమ్మ ఎందుకో ఆందోళన చెందసాగింది.

"మతగురువు నీకు బైబిల్ ఇచ్చాడా? అవుతే తిరిగి ఇచ్చివేసిరా" అన్నది అమ్మ. ప్రపంచంలోని గ్రంథాలలోకల్లా బైబిల్ అత్యంత నిగూఢము, చదివి అర్థం చేసుకోడం కష్టతరము అయిన గ్రంథమని, దాన్ని చదివితే మతి పోతుందని ఎవరో చెప్పగా అమ్మ విన్నది.

"ఇది బైబిల్ కాదమ్మా! విశ్వసృష్టి విజ్ఞానం —" అన్నాను.

"విశ్వసృష్టి విజ్ఞానమా? — అవుతే చదువు." అన్నది అమ్మ.

చదవమని చెప్పడం అమ్మకు తేలికే. కానీ నా పుస్తకం అర్థమయ్యేది ఎలాగ? సాయంత్రం వరకూ పుస్తకం ముందు పెట్టుకుని కూచున్నాను. బుర్ర పగలగొట్టుకున్నాను. కానీ లాభం లేకపోయింది. అవుతే కొన్ని విషయాలు అందులో నాకు కనుపించాయి. గ్రహాలు ఎన్ని ఉన్నాయి? అవి ఎలాంటివి? భూమికీ సూర్య, చంద్రులకూ ఎంతెంత దూరం? ఇవి ఆ గ్రంథంలో ఉన్నాయి. కానీ నాకు పరిచయం లేని అక్షరాలు, నిగూఢమైన గుర్తులు, ఖగోళశాస్త్రం, జ్యోతిర్విజ్ఞానం లాంటి మాటలు బుర్రబద్దలు కొట్టుకున్నా నాకు అర్థంకాలేదు.

పొలానికి పోయి అక్కడ పుస్తకం చదవడానికి నేను పడుతున్న పాట్లన్నీ పెద్రో చూచాడు. నన్ను వెక్కిరించడానికి మళ్ళ అతనికి సందు దొరికింది.

"నీఅంత తెలివైనవారు మరెవరూ లేరనుకుంటున్నావు నీవు కదూ? ఆ పుస్తకంలో ఏం అర్థమైంది నీకు?—" అని అన్నాడు.

"అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను. మొదట చాల కష్టంగా ఉంది." అన్నాను నేను.

గ్రంథంలోని విషయాలను గురించి నాకు ఎన్నెన్నో ఆలోచనలు వస్తున్నాయి ఈ అనంతమైన ఆకాశానికి అంతు ఎక్కడ? అవనీ ఆకాశాలను కలిపే మార్గం ఎక్కడ? తప్పక ఎక్కడో ఒకటి ఉండాలి. మరి ఈ విషయాలన్నీ ఎవరిని అడగను? పుస్తకం అర్థం చేసుకోడానికి నాకు ఎవరు సహాయపడతారు? మా వీధిలో చదువుకున్నవాళ్ళందరిని గురించి ఆలోచించాను. కానీ వాళ్ళలో చాలమంది ఒక్క అక్షరం ముక్క రాయడం ఒక్క అక్షరం ముక్క చదవడం వచ్చినవాళ్ళు. అంతే. మతగురువుకు తెలుసు కానీ ఆయన దగ్గరికివెళ్ళి అడిగే ధైర్యంలేదు నాకు. పోనీ సెబాస్టియన్ మామయ్య దగ్గరికి వెడితే? అవును. ఆయన పేదరైతు సంఘం అధ్యక్షుడు: యుద్ధంలో పోరాడి అనేకసార్లు గాయపడినవాడు. ఆయనకు అన్నీ తెలుసు. ఆయనకు ఎక్కడెక్కడినుంచో ఉత్తరాలు, పత్రికలు వస్తూఉంటాయి. పైగా ఆయనకు మానాన్న బాగా తెలుసు. మొన్న ఒకనాడు వీధిలో కనపడ్డప్పుడుకూడా నన్ను గుర్తుపెట్టి పలకరించాడు.

సాయంత్రం ఇంటికి వెళ్ళగానే గుఱ్ఱాన్ని కట్టివేసి మళ్ళీ బయలు దేరాను.

"ఎక్కడికిరా వెడుతున్నావు?—" అమ్మ ఆదుర్దాగా అడిగింది.

"పేదరైతు సంఘానికి" నేను సమాధానం చెప్పి వీధివాకిలి దాటాను.

"బహుశా అక్కడ సమావేశంలో ఉపన్యాసం ఇస్తావు కాబోలు!—" ఇలా అని అమ్మ నవ్వింది.

నేను వెళ్ళడానికి అమ్మ అనుమతించినట్టు భావించుకుని, ఆమె, మనస్సు మార్చుకోకముందే గబగబా వెళ్ళిపోయాను. నేను క్షణంలో కనుపించకుండా పోతానని అంటూ ఉంటుంది అమ్మ ఎప్పుడూ; అవుతే పెద్రో అమ్మమ్మ హానా అతని, ఇదే మాట అంటూ ఉంటుంది..

జనపచేను దగ్గరికి చేరుకున్నాను. పేదరైతు సంఘం కార్యాలయం అక్కడికి ఎంతో దూరం లేదు. ప్రతిసాయంత్రం అక్కడ జనం పోగవుతారు. పేదరైతులు ఎంతోమంది ఎన్నెన్నో ఆశలు పెట్టుకుని అక్కడికివస్తారు: లెనిన్ మహాశయుని సిద్ధాంతాలు వింటారు. ఎక్కడ లేని శక్తి, ఉత్సాహం వారిలో పొంగివస్తాయి.

నేను చాలముందు వచ్చాను అక్కడికి. సమావేశానికి ఇంకా ఎవరూ రాలేదు. ఆవరణలో ఒక్క కాపలావాడు మాత్రం కనుపించాడు. పాతచీపురు ఒకటి పట్టుకుని ఊడుస్తున్నాడు. తరవాత గావ్రిలా షెవ్‌కో కనుపించాడు. ఒక పెద్ద బల్లమీద పడుకుని నిద్రపోతున్నాడు. ఒకప్పుడు ఒక భాగ్యవంతుని ఇంట్లో ఉన్న బల్ల అది. గావ్రిలా ఒక మాజీ గుమాస్తా. మాజీ గ్రామపెద్ద. వోలోస్ కార్యనిర్వాహక వర్గానికి మాజీ అధ్యక్షుడు. సైనిక దుస్తు, టోపీతో సహా-అతన్నిగురించి చెప్పవలసినవన్నీ గడచిపోయిన సంగతులే।

తలుపు చప్పుడు విని గావ్రిలా ఒక్కనిముషం కళ్ళుతెరచి చూశాడు.

గావ్రిలా చాలా తెలివైనవాడు ఇదివరకు అనేక పదవులు నిర్వహించాడు. కానీ అతడుచేసిన పొరపాట్లవల్ల ఆ పదవులన్నీ ఊడిపో

యాయి. రాజకీయ రంగంలో రాణించడం మహాకష్టమైన విషయమని అతను గ్రహించాడు. ఇహ లాభంలేదని, అప్పటినుంచీ గ్రామస్తులకు ఉత్తరాలు, దరఖాస్తులూ, దస్తావేజులు వ్రాసిపెడుతూ జీవయాత్ర సాగిస్తూ వచ్చాడు. ఈ రంగంలో అతనికి అతనేసాటి అయినాడు. ఆ పనిలో ఆ చుట్టుప్రక్కల అతనితో పోటీచేసేవారు లేరు.

గావ్రిలా నావంక చూసి "ఎవరు నీవు? —" అని అడిగాడు.

"పానాస్ కుమారుణ్ణి."

"ఓ! పానాస్! స్టోల్యార్కాయా వీధి కదూ?"

"అవును."

"సరే; ఎందుకొచ్చావు ఇక్కడికి? ఏదైనా దరఖాస్తు వ్రాసి పెట్టాలా? —"

"కాదు"

"మరింక దేనికి? —"

"ఒక పుస్తకం చదివి అర్థం చెప్పాలి."

"పుస్తకమా!.... అది నీకర్థంకాలేదా? —"

"ఊహూ! చాల కఠినంగా ఉంది."

"అది అర్థం చేసుకునే తెలివిలేదా నీకు? —"

"లేదు."

"ఏదీ, ఆ పుస్తకం ఇలా ఇవ్వు."

గావ్రిలా నాదగ్గర నుంచి పుస్తకం తీసుకున్నాడు. కొంతసేపు పేజీలు తిరగవేస్తూ చూచాడు. ఏదో పెద్ద ఆలోచిస్తున్నట్లు తను బొమ

చిట్లించాడు. తరవాత మెల్లగా పుస్తకం నాచేతికి ఇచ్చారు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

ఆయన సమాధానం ఇలా ఉంటుందని నేను ఊహించలేదు. ఇహ నేనుచేసేదేమున్నది?— కానీ తదేకంగా చూస్తూ అలాగే నిలుచుండి పోయాను. తరవాత పెద్దగా దగ్గి, గొంతు సవరించుకున్నాను. అయినా ఆయన వినిపించుకోలేదు.

"పుస్తకం విషయం మీరేమీ చెప్పలేదేం మామయ్యా?—" అని అడిగాను చివరకు ఎలాగో ధైర్యంతో.

"ఏమిటీ! ఇంకా నీవు వెళ్ళిపోలేదూ?" అన్నాడాయన. ఆయన ముఖంలో ప్రతికనలిక అసహనాన్ని ప్రదర్శిస్తున్నది!

"లేదు మామయ్యా."

"వెళ్ళకపోతే ఇప్పుడైనా వెళ్ళడం మంచిది. నీవు వినదలచు కుంటే ఒకే ఒకమాట చెప్తాను. ఇలాంటి పుస్తకం చదవడానికి ముందు నీవు గొంతువరకూ తిండితినాలి. ఈ పుస్తకంలో ఉన్నదంతా చెత్త! తెలిసిందా?—" అన్నాడు.

"తెలిసింది." అన్నాను.

"అవుతే ఇహవెళ్ళు." ఇలా అని ఆయన మళ్ళీ కళ్ళుమూసు కున్నాడు.

తరవాత నేను కాపలావాడిదగ్గరకి వెళ్ళి "సెబాస్టియన్ మామ ఇప్పుడొస్తాడా తాతా?—" అని అడిగాను.

"అసలు ఇవాళ ఆయన రాడనుకుంటాను. ఈరోజంతా ఆయన కిపారొవ్‌స్కీ అడవుల్లో బందిపోటు దొంగలను వెంటాడుతున్నాడు.

దొంగల తాలూకు గాయపడిన గుఱ్ఱం ఒక దానిని ఆయన తీసుకొచ్చాడు కూడా" అని చెప్పాడు తాత.

"ఆ గుఱ్ఱం మంచిదేనా?—"

"ఓ! భలే గుఱ్ఱం: స్వారీచేస్తే అలాంటి గుఱ్ఱంమీదనే చెయ్యాలి. సెబాస్టియన్ అదృష్టవంతుడు!"

"దురదృష్టం అతనివంక కన్నెత్తి అయినా చూళ్లేదు!—" ఈ మాటలు యుత్రిమ్ బాబెంకోవి. ఆయన హఠాత్తుగా వాకిట్లో ప్రత్యక్షమైనాడు.

"ఇహ ఊరుకోవయ్యా! పనీపాటు లేకుండా ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటావు!" అని కాపలావాడు బాబెంకోమీద విరుచుకు పడ్డాడు.

"ఏం? నేను చెప్పినమాట అబద్ధమా? ఉన్నమాటే అన్నాను. దురదృష్టం అతనివంక కన్నెత్తి అయినా చూళ్లేదు—" అన్నాడు మళ్ళీ బాబెంకో.

ఇలా వాళ్ళిద్దరికీ కొంత వాగ్వాదం జరిగింది. బాబెంకో పట్టి దుర్మార్గుడని, పనీపాటూ లేకుండా పోచుకోలు కబుర్లు చెపుతూ పోకిరిలా తిరుగుతున్నాడని తాత తిట్టిపోశాడు.

బాబెంకో అందుకు తగిన సమాధానం చెప్పి కాపలావాడి నోరు మూయించడానికి ప్రయత్నించాడు.

ఇలా వారిద్దరూ వాదించుకుంటూ ఉండగానే అవతలనుంచి మరి ఇద్దరి కంఠస్వరాలు వినిపించాయి. అట్రొస్మ్, సెర్గీ అక్కడికి వచ్చారు. వాళ్ళిద్దరూ అడవుల్లో నివసిస్తున్నారు. కోసకులుగా వారి పేర్లు ప్రసిద్ధం. భారీమనుష్యులు. దగ్గర ఎన్నో ఆయుధాలున్నాయి. వారి ముందు, యుత్రిమ్ చిన్న చీమలా కనుపించాడు. వారి భుజాలమీద రైఫిళ్ళు

ప్రేలాడుతున్నాయి, మొలలో బెల్టుకు చేతిబాంబులు, ఇంకా ఆయుధాలు ప్రేలాడగట్టుకున్నారు.

గావ్రిలా, వాళ్ళనుచూచి "ఇవన్నీ ఎక్కడనుంచి తెచ్చారు?—" అని అడిగాడు.

"వ్యవసాయ క్షేత్రాలలో" అంటూ ఆ అడవి మనుష్యులు, నిర్లక్ష్యంగా రైఫిళ్ళ క్రిందపెట్టారు. మొలలోఉన్న బాంబులు, చేతిగ్రెనేడ్లుతీసి ఒక మూల కుప్పపోయడం మొదలుపెట్టారు.

"ఏమిటి మీరు చేసేది? అవి ప్రేలిపోతాయి!—" అన్నాడు బాంబెకో.

"ప్రేలిపోతే మరీమంచిది. నీ బుర్రలో ఉన్న తుప్పువదలి పోతుంది!—"

ఇలా అంటూ వారిద్దరిలో సెర్గీ, ఒక బాంబుతీసి బంతిని విసరినట్లుగా ఒకమూలకు విసిరివేశాడు!

బాబెంకోకు భయం పుట్టింది. కుందేలు పిల్లలా వాకిట్లో నుంచి అవతలకి గెంతాడు. గావ్రిలా మాత్రం ఉరుకుతీయ పోయాడు. కానీ సెర్గీ, తన బలమైన హస్తంతో అతన్ని ఒడిసిపట్టుకున్నాడు.

"ఒక్కనిముషం ఉండు, ముందు ఇవన్నీ ఒక జాబితా వ్రాసిపెట్టు. తరవాత పోనిస్తాను" అన్నాడు

గావ్రిలా, భయంతో కంపించిపోయాడు. అతని ముఖం కుంచించుకుని పోయింది. ప్రాణం పోతుందా అన్నట్టు రొప్పుతున్నాడు.

"నన్ను ఇంకా నాలుగు కాలాలపాటు బ్రతకనివ్వండి నాయనా!—" అని బ్రతిమాలుకున్నాడు,

"ఫరవాలేదు. నీ ప్రాణాన్ని పోనివ్వంలే!" ఇలా ఓదారుస్తూ

సెర్గీ, ఒక పెద్ద బొంబుతీసి బల్లమీద పెట్టాడు. మరేం భయం లేదులే అన్నట్టు. గావ్రిలా తన ముఖం మీది చెమట తుడుచుకున్నాడు. బల్లమీద ఒక మూలకూచుని వ్రాయడం మొదలుపెట్టాడు. ఆయన చెయ్యి వణుకుతున్నది. జాబితా తయారైంది. గావ్రిలా దాన్ని సెర్గీకి ఇచ్చాడు. సెర్గీ ఒకసారి ఆ జాబితాను పైనుంచి క్రిందికి పరిశీలించాడు.

"అంతా రాశావా ఇందులో?—" అని అడిగాడు.

"ఆఁ అంతా రాశాను," అని చెప్పాడు గావ్రిలా.

"మరికాసేపు ఉండవూ? ఏదో పిచ్చా-పాటీ మాట్లాడుకుందాం,"
ఇలా అని సెర్గీ, పగిలిన ఒక చేతిగ్రెనేడ్ కాలితో తన్నాడు. అది బంతిలా దొర్లుకుంటూ ఒక మూలకు పోయింది.

"నాకు వ్యవధిలేదు వస్తాను." అంటూ గావ్రిలా, ఒక కన్ను గ్రెనేడ్‌మీద ఉంచి మెల్లగా అక్కడనుంచి తప్పించుకున్నాడు. ఆయన వెళ్ళిపోతుంటే అడవి మనుష్యులు పగలబడి నవ్వారు.

వాళ్ళ వాలకం, ప్రాణాంతకమైన ఆయుధాలపట్లకూడా వాళ్ళు అంత నిర్భయంగా ప్రవర్తించడం, నిష్కల్మషమైనవాళ్ళ నవ్వు-అన్నీ చూచాను.

కావలావాడు ఆ ఆయుధాలన్నిటినీ, వెలుపలఉన్న మరొకగదిలోకి తీసుకుని పోయారు. ఒకప్పుడు ఖైదీలను అట్టిపెట్టి ఉంచడానికి ఉపయోగించినగది అది. అడవి మనుష్యులు తమ పొగాకు సంచులుతీసి, చేతితో చుట్టిన పెద్దపెద్ద సిగరెట్లు కాల్చడం మొదలు పెట్టారు. తరవాత వాళ్ళు కిటికీవద్దకు వెళ్ళి నిలుచున్నారు.

ఆకాశంలోకి నక్షత్రాలు వచ్చాయి. భూమిమీదికి వ్రాలిపోతున్నట్టు కనుపించింది ఆకాశం. తోటలలో నుంచి పుష్పపరిమళం వస్తున్నది ఆ

అడవి మనుష్యులు వినీలాకాశంవంక చూస్తూ ఏవేవో విచిత్రమైన మాటలు మాట్లాడుకున్నారు.

"ఇవాళ మనం కాసేపట్లో తప్పించుకున్నాం. లేకపోతే నా?—" అన్నాడు సెర్గీ.

"అవును" అన్నాడు ఆర్ట్యోమ్.

"ముఖ్యంగా ఆ గుహ దగ్గర."

"అవును."

"గాల్వెల్‌స్కీ ముఠా మళ్ళీ ఈ ప్రాంతాలలో కనుపించినదని అంటున్నారు."

ఈ మాటలువిని ఇహ నేను అక్కడ ఉండకుండా బయలుదేరాను. సెబాస్టియన్ మామయ్య దగ్గరికి వెళ్ళడానికి ఇది సమయంకాదు. వేళ మించిపోయింది. కానీ దొంగల ముఠా దగ్గరనుంచి ఆయన స్వాధీన పరచుకున్న గుర్రాన్ని చూడాలని ఉంది నాకు. ఒక్క క్షణం సందేహించిన పిదప ఆసకట్టవైపు పరుగుతీశాను. అక్కడ ప్రవాహం వద్ద 'విల్లో' పొదలు ఎంతో బాగుంటాయి! మెల్లగా గుసగుసలాడుతున్నట్టు ముచ్చట్లు చెపుతాయి! ఇక్కడ రోడ్డు కుడివైపునకుమళ్ళి కొలనువైపు వెడుతుంది. కొలను చివరనే సెబాస్టియన్ మామయ్య ఇల్లు.

అడవిమనుష్యులు గుర్రాలమీద స్వారీచేస్తూ నా ప్రక్కనుంచి వెళ్ళారు. నన్ను గుర్తుపట్టి ఒక చిన్న నవ్వు నవ్వారు. అంతే! వాళ్ళ ముఖాలు మళ్ళీ గంభీరంగా మారిపోయాయి.

నేను సెబాస్టియన్ మామయ్య ఇంటికి చేరుకున్నాను. ఆ పూరింటి కప్పులో పిచ్చుకలు గూడు కట్టుకున్నాయి. బయట రెండు గుర్రాలు ఒక

గుంజకు కట్టివేసి ఉన్నాయి. లోపలవాకిలి తెరచే ఉంది. లోపల అడవి మనుష్యులు సెబాస్టియన్ మామయ్యతో మాట్లాడుతూ ఉండడం నాకు వినిపించింది.

“ఇదొక పెద్ద లెక్కలోదికాదు. క్రిందటి సంవత్సరం మనం తుపాకులు, మందుగుండు సామగ్రి గుట్టలు గుట్టలు పట్టుకున్నాం. ఒక్క ఊళ్ళోనే ముప్ఫయి బండ్ల ఆయుధ సామగ్రి మనవశమైంది.” అంటున్నాడు సెర్గీ.

“అవును. నాకు జ్ఞాపకం ఉంది. మరతుపాకులు, రైఫిళ్ళుకూడా ఉపయోగించేవాళ్ళు అప్పుడు.” అంటున్నాడు సెబాస్టియన్ మామయ్య.

నేను మెల్లిగా లోపలి గదిలోకి వెళ్ళాను. తలుపు గడియపెట్టుకుని నిలుచున్నాను. మొదట సెర్గీ నన్ను చూచాడు.

“చూడండి! ఎవరో వచ్చారు! ఎక్కడనుంచి వచ్చాడో తెలియదు కాని, మొత్తానికి ఈ కుర్రవాడు ఎక్కడచూచినా ఉంటాడు!” అన్నాడు, నా వంక చెయ్యి చూపుతూ.

“నమస్కారం” అన్నాను సెబాస్టియన్ మామయ్యనుచూచి.

“నమస్కారం,” అన్నాడాయన మళ్ళీ. “కూచో” అన్నాడు. నన్నుచూచి ఆయన ఆశ్చర్యపోలేదు.

“ఫరవాలేదులెండి, నిలుచుంటాను” అన్నాను.

“కాదు, ఇలారా. కూచో” అన్నాడాయన మళ్ళీ, బల్లమీది నుంచి వస్తూ. ఆయన ముఖం ప్రకాశవంతంగా ఉంది. “ఏమిటి నాయనా! మీరంతా కులాసాగా ఉన్నారా?” అని ప్రేమతో అడిగాడు.

“ఆ! కులాసాగానే ఉన్నాం మామయ్యా!” అని దర్జాగా నేను

సమాధానం చెప్పాను. కానీ ఆ అడవి మనుష్యుల ముఖాలలో నవ్వు కనిపించింది.

"మీనాన్న ఉత్తరాలు రాస్తున్నాడా? —"

"ఆఁ! మిమ్మల్ని అడిగినట్టు చెప్పమని రాశాడుకూడా."

"మంచిది. త్వరలో ఇంటికి వస్తాడటనా? —"

"వస్తాడనే అనుకుంటాను—అంతా సవ్యంగా ఉంటే! —"

అడవిమనుష్యులు మళ్ళీ నన్నేదో ఎగతాళి చెయ్యబోయారు. కానీ సెబాస్టియన్ మామయ్య వాళ్ళవంక గ్రుడ్లురిమిచూచాడు. వెంటనే వాళ్ళు తెలివి తెచ్చుకున్నారు. గదిలో ఉన్న 'పియానో'ను ఆసక్తితో పరిశీలించ సాగారు. చాల చక్కని పియానో అది. ఊళ్ళో పిల్లలు, వృద్ధులు - అందరూకూడా ఆ పియానో ప్రశస్తిని గురించి విని ఉన్నారు.

విప్లవం వచ్చి, రైతులందరూ భాగ్యవంతులదగ్గరనుంచి భూములు, ఆస్తులు స్వాధీనపరుచుకోడం జరిగింది. అప్పుడుకూడా సెబాస్టియన్ మామయ్య తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోలేదు. అదనంగా ఒక గుఱ్ఱాన్నికాని, ఒక ఆవునుకాని ఆఖరుకు ఒక నాగలికాని ఆయన సంపాదించుకోలేదు. కానీ ఒక 'పియానో' మాత్రం ఇంటికి తెచ్చుకున్నాడు. ఆ వస్తువు ఆ ఊళ్ళోవారినేకాక ఆ ప్రాంతం వారందరినీకూడా ఆకర్షించింది. దానిని చూచి ఆనందించనివాళ్ళు లేరు. ఆఖరుకు వృద్ధుడైన సెబాస్టియన్ మామయ్య నాన్నకూడా పియానో సంగీతం వినడానికి అక్కడికి వచ్చేవాడు అవును గీతం; సంగీతం ఎంత హాయిగా ఉంటాయి!

అడవిమనుష్యులు అక్కడ నుంచి వెళ్ళిపోయారు, అప్పుడు సెబాస్టియన్ మామయ్య "ఏమిటి? ఏం పనిమీద వచ్చావు? —" అని నన్ను అడిగాడు.

"ఏం లేదు, ఏం లేదు...." అంటూ గొణిగాను. "దొంగలముఠా దగ్గరనుంచి మీరు తెచ్చిన గుఱ్ఱాన్ని చూడాలని ఉంది" అన్నాను.

"దాని కథంతా అప్పుడే విన్నావన్నమాట?—" ఇలా అని ఆయన నవ్వాడు.

"అలాంటి గుఱ్ఱం ఎక్కడా లేదని అంటున్నారు."

"నిజమే - అది చాలా మంచిగుఱ్ఱం. దానికి గాయాలు మాననీ నిన్ను దానిమీద ఎక్కించి స్వారీచేయిస్తాను. సరేనా?—"

"ఓ! అలాగే!—"

మేం ఇంట్లోనుంచి ఇవతలికివచ్చి ఒక చిన్నతోటలోకి వెళ్ళాం. అక్కడ గుఱ్ఱం పడుకుని ఉంది. పాపం దానికి ఒంటినిండా గాయాలు. మా అడుగులు చప్పుడు విని అది పెద్దగా మూల్గడం మొదలు పెట్టింది దాని మెడకు ఒక అల్లిక తువ్వాలుచుట్టి ఉంది. సెబాస్టియన్ మామయ్య దాని వీపుచరిచి ఏవేవో మాటలుచెప్పి ఓదార్చాడు. దాని కళ్ళనీళ్ళు తుడిచాడు.

"పాపం! బాధతో అది మూల్గుతున్నది. చాలా తెలివైన జంతువు, మిషైలో! దాన్నిచూస్తే మనుష్యులతో మాట్లాడుతుందా అనిపిస్తుంది!" అన్నాడు.

సెబాస్టియన్ మామయ్య మాటమీద నాకు ఎంతో గురి. ఆయన తూచి మాటలాడతాడు, ఎక్కడా పొరపాటు ఉండదు. పశువులు మాట్లాడు కోడం తాను విన్నానని ఆయన చెపితే, అదికూడా నేను నమ్ముతాను,

"ఇహ నీవు ఇంటికివెళ్ళు మిషైలో! ప్రొద్దుపోయింది. మీ అమ్మ నీ కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. మీ ఇంటిదాకా నీతోవచ్చి దిగబెట్టనా?"

"వద్దు మామయ్యా, వద్దు."

"ఒక్కడివీ - నీకు భయంలేదూ?-"

"లేదు.... మిమ్మల్ని ఒకటి అడగాలని వచ్చాను మామయ్యా. నేను ఒక పుస్తకం చదువుతున్నాను. దానిలో కొన్నిటికి అర్థం నాకు విశదపరచి చెప్పగలరా?-"

"ఇప్పుడా?-"

"మీకు వీలైతే ఇప్పుడే."

"అది అంత ముఖ్యమైతే-లోపలికిరా. దీపందగ్గర కూచుందాం."

మేం దీపందగ్గరికి వెళ్ళాం. సెబాస్టియన్ మామయ్య పుస్తకం తెరిచి చదవడం మొదలుపెట్టాడు. ఆయన ముఖంలో ఆశ్చర్యం గోచరించింది. తరవాత ఆయన ఆలోచనలో మునిగిపోయాడు. బుద్ధినంతా పుస్తకంమీద కేంద్రీకరించి చదివాడు.

"ఇంత మంచి పుస్తకం నీకెక్కడ దొరికింది?-" అని అడిగాడు.

"మతగురువు ఇచ్చాడు." జరిగిన సంగతంతా ఆయనకు చెప్పాను.

"అలాగా!" అంటూ ఆయన కోపంతో తుపుక్కున ఉమ్మివేశాడు. ఆయన ముఖం ఎర్రగా కందిపోయింది. ఆయన పుస్తకంలో మరికొన్ని పేజీలు తిరగవేశాడు, వాటినుంచి కొన్ని పేరాలు చదివాడు. "ఇది గ్రహ, నక్షత్రాదులకు సంబంధించిన గ్రంథం! మిథైలో! ముఖ్యమైన విషయం ఏమిటంటే - ఇప్పుడు మనం భూమిని గురించి అధ్యయనంచేసి తెలుసుకోవలసి ఉంది. భూమినిగురించి బాగా తెలుసుకుని, ఆ విజ్ఞానాన్ని పేదలకు పంచిపెట్టు, ఆ పని జరిగిననాడు దివ్య లోకాల గురించి, గ్రహ, నక్షత్ర లోకాలను గురించి, తెలుసుకోడానికి మనకు

బోలెడు వ్యవధి ఉంటుంది. ఈ పుస్తకం రేపే తీసుకునిపోయి మళ్ళీ మతగురువుకు ఇచ్చివెయ్యి. ఇప్పుడు నీవు చదవదగిన పుస్తకాలేవో చూచి అవి నీ కిమ్మన్నానని నేను చెప్పానని ఆయనకు చెప్పు. ఒకసారి నేనువచ్చి ఆయనను చూడదలచాననికూడా చెప్పు. నీవు మళ్ళీ రేపు సాయంత్రం ఇక్కడికి రా. నేను చెప్పిందంతా నీకు అర్థమైందా?-"

"ఊఁ!" అన్నాను నేను.

"సరే - ఇహ వెళ్ళు"

ఇది జరిగి ఎన్నో ఏండ్లు అయింది. ఈ సంఘటనను గురించి నేను దాదాపు పూర్తిగా మరచిపోయానుకూడా.

కానీ మళ్లీ ఇప్పుడు ఆ సంఘటన యాదృచ్ఛికంగా నా మనస్సులో మెదిలింది.

మానవ చరిత్రలో మొట్టమొదటిసారి మా దేశస్థుడైన ఒక రైతు బిడ్డ రోదసిలో ప్రయాణం చేశాడు! ఈనాటి ఘనవిజయం ఇది. విశ్వ సృష్టి విజ్ఞానానికి సంబంధించిన ఆ పుస్తకం, ఆనాటి సంఘటన ఇప్పుడు నాకు జ్ఞాపకం రావడంలో ఆశ్చర్యంలేదు.

"నవ్వీన నాపచేనే పండుతుంది.-" ఈ సూక్తి నిజంగా ఎంత నిజం!

—o—

అధ్యాయం ఐదు

"మిఖైలో! లే నాయనా, లే!"

"కాసేపుఉండు తాతయ్యా! తాతయ్య నిద్రలేపినా నాకు కళ్ళు తెరిపిళ్ళు పడలేదు. కానీ నా కల చెదిరిపోయింది. పచ్చని పంటచేలు. ఉషఃకాల తుషారం, విశాల లోయలోని సరోవరం, ఊగుతూ, మర్మర ధ్వనులు చేస్తూ నీళ్ళలోకి వాలిఉన్న రెల్లుగడ్డి - ఇవన్నీ నా స్వప్నంలో దృశ్యాలు. రెల్లుగడ్డిని పట్టుకోబోయి, నేను కప్పుకున్న దుప్పటిని లాగుతున్న తాతయ్య చెయ్యి పట్టుకున్నాను! స్వప్న దృశ్యాలన్నీ మాయమైనాయి. నా కలలో పాలు పంచుకుంటున్నట్టుగా తాతయ్య కంఠస్వరం కూడా ఎంతో మృదువుగా, మెల్లని చల్లని పిలుపులా ఉంది!

"లే మిఖైలో! లే! ఏమిటా బద్ధకం? సంతకు ఎవరు ముందుపోతే వారికి మంచిగుఱ్ఱం దొరుకుతుంది!" అన్నాడు తాతయ్య.

"నాకు గుర్రం అక్కర్లేదు. అక్కర్లేదంటే అక్కర్లేదు -"

"గుర్రం లేకపోతే అతను రైతే కాడు," అన్నాడు తాతయ్య నవ్వి. "లే, లే! త్వరగా లే!" అన్నాడు.

"ఇంకా కాసేపు పడుకోనివ్వు తాతయ్యా."

"ఇప్పటికే ప్రొద్దు పొడిచింది. చద్దిభోజనం నీ కోసం బల్లమీద సిద్ధంగా ఉంది. చూడు ఎలా వాసన వస్తున్నదో!-"

పట్టబలపంతాన తాతయ్య నన్ను నిద్రలేపాడు. నాకేదో, వాసన వస్తున్నది కానీ అది బల్లమీద సిద్ధంగాఉన్న పదార్థాలవాసనో లేక నిద్రలో నేను కలకంటున్న పచ్చని పొలాలలోని పరిమళమో లేదా నేను

పడుకుని నిద్రపోతున్న గడ్డిపరుపులోని గడ్డివాసనో తెలియలేదు. చివరకు సూర్యకాంతివచ్చి నా కళ్ళలో గుచ్చుకున్నది. మంచంమీది నుంచి లేచాను. తాతయ్య నాకోసం తయారుచేసిన చిన్న కొయ్యమంచం అది.

చెట్లమీద, పూలపొదలమీద మంచు బిందువులు తళతళ మెరుస్తున్నాయి. ప్రాగ్దిశన ఆకాశంలో బాలభాస్కరుని కిరణాలు దూసుకుని వచ్చాయి. తునకలు తునకలుచేసిన వైడూర్యపు మణిలా కనుపిస్తున్నది మబ్బు. మా ఇంట్లోకి ఎండవచ్చింది, ఒకవైపు వెలుగు, ఒకవైపు నీడ మడుగులుకట్టి కనుపిస్తున్నవి.

"అమ్మయ్య! ఎలాగైతేనేం లేచావు చివరకు!—"అన్నది అమ్మ పొయ్యిదగ్గర కూచుని. మంట వెలుగువచ్చి ఆమె ముఖాన్ని ఉజ్వలితం చేస్తున్నది. ఆమె దుస్తులమీద అల్లిన పూలు, ఆ వెలుగులో విచిత్ర శోభను సంతరించుకుని ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. మేం ఎప్పుడూ పేదవాళ్ళమే అయినా మాకు పూలకు కొదువలేదు. మాకు ఎక్కడ చూచినా పూలే! తోటలో పూసినపూలు; మా పొయ్యి అరుగుమీద చెక్కిన పూలు, మా తువ్వాళ్ళపైన, దుస్తులపైన అల్లినపూలు. "ఏమిట్రా కలలు కంటున్నావు?—" అడిగింది అమ్మ.

"కల మరచిపోయానమ్మా."

"సరే, సరే! ముందు ముఖం కడుక్కో, గుర్రాన్ని తోలుకుని పోయేవేళ అయింది." అంటూ తాతయ్య తొందరపెట్టాడు.

ముఖం కడుక్కునేసరికి నాకు నిద్రమత్తు వదిలింది. ప్రొద్దుటి భోజనంకోసం చేసిపెట్టిన ఉప్పుడుపిండి, బంగాళదుంపలహారం, కేకులు ఘుమఘుమ వాసన వస్తున్నాయి.

"వెల్లుల్లిపాయలు నంచుకుని తినరా, లావెక్కుతావు!" అన్నాడు తాతయ్య.

ఈ పెద్దవాళ్ళతో వచ్చిన చిక్కు ఇదే. వాళ్ళమాటలన్నీ తమాషాగా ఉంటాయి. అవసరాన్నిబట్టి మాట్లాడుతుంటారు. ఏదైనా ఒక పొరపాటు చేస్తామనుకోండి. "ఏమిరా! ఇంత పెద్దవాడివైనావు ఇలాంటి పని చేయడాకి నీకు సిగ్గుగాలేదూ?—" అని అంటారు. ఆ కుర్రవాడే మళ్ళీ ఒక విషయాన్ని గురించి ఏదైనా అడుగుతాడనుకోండి! అప్పుడు వాళ్ళే "నీవు చిన్నవాడివి. నీకెందుకూ ఆ విషయాలన్నీ!" అని అంటారు. ఇలా ఒకదానికొకటి వ్యతిరేకం వాళ్ళమాటలు.

"చూడు! ఎంత కమ్మని పదార్థాలు చేశారో. తిందువుగాని త్వరగా లేవరా అంటే లేవకపోతివి!—" అన్నాడు తాతయ్య.

"గుఱ్ఱాన్ని అడవికి తీసుకుని పోయేదా తాతయ్యా?—" అని అడిగాను.

"అలాగే తీసుకపోరా, అడవులు ఇప్పుడు ఎంతో అందంగా ఉంటాయి." తాతయ్య చిన్నప్పటినుంచే అడవుల్లో తిరిగి అడవులతో స్నేహం చేశాడు, అడవులంటే ఆయనకు ఎంతో ఇష్టం.

"కానీ ఎక్కడికో దూరం పోకు." అన్నాడు మళ్ళీ తాతయ్య.

"నాకో పెద్ద సంచీ ఇవ్వు తాతయ్య. పుట్టకొక్కులు కనుపిస్తే తెస్తాను." అన్నాను.

"తెస్తే అంతకన్నానా? పులుసు పెట్టుకోవచ్చు." అన్నది అమ్మ.

"అమ్మ ఒక ట్రంకుపెట్టె తెరిచి అందులో నుంచి ఒక గుడ్డ సంచీతీసి ఇచ్చింది. ఆ సంచీ ఆమెదే. చిన్నతనంలో ఉన్నప్పుడు దాని మీద పూలు అల్లింది.

దొడ్లో మా గుఱ్ఱం సకిలిస్తూ ముంఎరికాళ్ళతో నేల గిరుతూఉంది.

అది నన్ను చూడగానే తల ఆడించింది. "త్వరగా ఎక్కు. దబున్న పొలాలకు తీసుకునిపో. నాకు ఆకలి అవుతున్నది." అని చెపుతున్నట్టుగా ఉంది అది తల ఆడించే ధోరణిచూస్తే. అవును. మా గుఱ్ఱం ఎన్నెన్ని జిత్తులు నన్నుతుందో నాకు బాగాతెలుసు. ఆకలి అయినప్పుడది పిల్లి కూనలా పడిఉంటుది. కానీ పొట్టలో కాస్తతిండి పడగానే ఎంతటివాణ్ణి అయినా దగ్గరికి చేరనివ్వదు.

గుర్రాన్ని తోలుకుని బయటివాకిట్లోకి వచ్చాను. అది తన తల నా బుజానికివేసి రుద్దడం మొదలుపెట్టింది. దాన్ని నేను నానాతిట్లు తిట్టాను. నీవు దొంగవు, జిత్తులమారిదానివి, యజమానిపట్ల అవిధేయురాలవు. నీకు జ్ఞానంలేదు—ఇలా ఎన్నెన్నో తిట్టాను. కానీ అది, పట్టించుకున్నట్టు లేదు. నా బుజం నాకింది. తొందరగా పొలాలకు తీసుకుని పొమ్మని ప్రాధేయపడింది.

నేను గుర్రం ఎక్కి పొలాలకు వెడుతున్నాను. ఇప్పుడు బాగా ఎండవచ్చింది. నా మనస్సు ఉల్లాసంతో ఊగుతున్నది. ఎన్నెన్నో ఆలోచనలు వస్తున్నాయి. క్రితంరోజు సాయంత్రం సెబాస్టియన్ మామయ్యతో నేను మాట్లాడినసంగతులు జ్ఞాపకం వచ్చాయి. ఇవాళ మాపటికి మళ గురువుదగ్గరికివెళ్ళి మరొక పుస్తకం తీసుకోడం ఎలాగా అన్న ఆలోచన వచ్చింది. సంతోషం పట్టలేక నవ్వాను.

"ఏమిట్రా కొంటెవెధవా, నవ్వుతున్నావు?—" అకస్మాత్తుగా మికోలా మామమాట వినిపించింది."

కొడవలి, దంతె బుజాన పెట్టుకుని ఆయన పొలానికి పోతు న్నాడు. నడుముకు బెల్టులో తోలుసంచీ ఒకటి దూర్చుకున్నాడు. కొడవలి సానపట్టే రాయిపెట్టుకునే సంచీ అది.

"నవ్వేహక్కు లేదానాకు?—" అని అడిగాను నేను గుర్రాన్ని ఆయనకు సమీపంగా పోనిచ్చి.

"ఉపవాసదినంనాడు నీకాహక్కు లేదు."

"ఇవాళ నేనేమీ ఉపవాసం చేయడం లేదు."

"అవుతే మాంసం తిందామనుకుంటున్నావా?—"

"ఆఁ! తిన్నానుకూడా."

"అవును, నీ నోరుచూస్తే తెలుస్తూనే ఉంది. ఏం మాంసం తిన్నావు?—"

"అడవి ఎలుగుమాంసం. కేకులు, ఉల్లిగడ్డలతో కలిపితిన్నాను. అమ్మ ప్రత్యేకంగా చేసింది ఇవాళ."

"అడవి ఎలుగా?....ఎందుకు అబద్ధాలాడతావురా కుర్రకుంకా—?"

"అనుకుంటే అనుకోండి అబద్ధాలని."

"పోనీ అది రుచికి ఎలా ఉంటుందో చెప్పు?—"

"మామూలు పందికొవ్వులాగే ఉంటుంది. కాకపోతే కాస్త బిరుసు."

మికోలా మామయ్యకు ఇదినిజమేనని నమ్మకం కలిగింది.

"ఎక్కడ దొరికింది మీకది?—" అని అడిగాడు ఆశ్చర్యంతో. ఆయన కళ్ళు, ముక్కు, నోరు, ముఖకవళికలు—అన్నీ విస్మయాన్ని వ్యక్తం చేశాయి!

"ఎక్కడంటావా?—" ఇలా అని నేను కొంచెం తటపటాయిం ఛాను,

"అది మా పందికోసమని వచ్చింది - మేం పట్టుకున్నాం!" అన్నాను.

"ఓరి దొంగవెధవా! ఇన్నేళ్ళు వచ్చినవాణ్ణి నన్నే పట్టికొట్టిద్దామనుకుంటున్నావుట్రా.—" అన్నాడు మికోలా మామ. ఇలా అని కాసేపు ఆగాడు.

"ఒరేయ్! కుర్రవాడంటే ఇలా ఉండాలి. సరదాలేని జీవితం జీవితమే కాదనుకో. హాస్యానికి అబద్ధమాడినా ఫరవాలేదు. సరే-వస్తానోయ్!—" ఇలా అని ఆయన వెళ్ళిపోయాడు.

ఈ సన్నివేశం నాకు మరింత ఉత్సాహాన్ని కలిగించింది అక్కడక్కడ పచ్చికమీద ఇంకా మంచు పోలేదు. ఆడవాళ్ళు కుండలు చేత పట్టుకుని నీళ్ళకు పోతున్నారు. చిన్న చిన్న అమ్మాయిలు తలలకు తువాళ్ళు కట్టుకుని ఆలమందలను తోలుకుని పోతున్నారు. చేతులలో వలలు, పొడుగాటి కర్రలు పట్టుకుని ఇద్దరు బెస్తవాండ్రు ఎదురుపడ్డారు.

నేను ఊరుదాటాను. వీళ్ళుదాటాను. బొగచెల్ వ్యవసాయ క్షేత్రం కూడా దాటాను. అడవికి వచ్చాను. అడవిలో వెదుతుంటే పైన ఆకాశం, క్రింద మంచు. గంగరావిచెట్లు ఏదో పాటపాడుతున్నట్టు 'జుమ్మని' ధ్వనిచేస్తున్నాయి. కొండవాగు మ్రోతలు పెడుతూ ప్రవహిస్తున్నది. శీతాకాలం ప్రారంభమవుతున్న సూచనలు సర్వత్రా గోచరిస్తున్నాయి. బుద్ధకొంగలు, హంసలు, ఇంకా ఇతరపక్షులూ ఇప్పటికే చలికి తట్టుకోలేక దక్షిణప్రాంతాలకు వెళ్ళిపోయాయి. అడవిబాతులు, మఱికొన్ని పక్షులు వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ ఒక చిన్న పిట్టమాత్రం శీతాకాలం వస్తున్నదనేసంగతి మఱచిపోయి కొమ్మ. కొమ్మపైన వాలి ఏదో సంగీతం పాడుతున్నది. ఈ శీతాకాలంలో బడిలో గడపడానికి

మారుగా పొలాలలోను, అడవులలోను గడపవలసి వచ్చినందుకు నాకు విచారం కలిగింది, నా ఆశలన్నీ మా నాన్నమీద పెట్టుకున్నాను, ఆయన ఇంటికి రావాలి. వస్తూవస్తూ నా కొకజత బూట్లు పట్టుక రావాలి.

నాన్నను గురించి, ఆయన ఇంటికిరావడాన్ని గురించి నేను ఇలా ఆలోచించుకుంటూ ఉండగా, గుర్రం పచ్చగడ్డి పరకలు కొంచెం కొంచెం కొరికి తింటూ, ఇహనన్ను క్రిందపడేయడానికి సన్నద్ధమవుతున్నది.

వెంటనే గుర్రం మీది నుంచి దూకాను. దాని ముందరికాళ్ళు రెండూ కట్టివేశాను, పుట్టకొక్కులకోసం అడవికి వెళ్ళనా లేక కోస్టుస కోవ్ తోటకు వెళ్ళనా అని ఆలోచిస్తూ నిలుచున్నాను. పుట్టకొక్కులు సంపాదించడం ఘనకార్యం మేమీకాదు, అయిదేండ్ల పసివాడైనా ఆ పని చేస్తాడు. అయితే శ్రేష్ఠమైన 'తెల్ల' పుట్టకొక్కులు దొరకడం కష్టం. అవి ఎక్కడో, వేటిచాటుననో దాగి ఉంటాయి. ఎంతో జాగ్రత్తగా వెదికితే తప్ప లేకపోతే కంటికి కనుపించవు. పుట్టకొక్కు కంటపడగానే నేను దాన్ని ముట్టను. ముందు దాన్ని జాగ్రత్తగా పరిశీలించాల. అది నాకు నచ్చాలి. అప్పుడుకాని చాకు బయటికి తియ్యను.

పొదరిండ్ల మధ్య తిరుగుతూ పాట పాడడం మొదలు పెట్టాను.

"తాతయ్య వెళ్ళాడు పుట్టకొక్కులకొరకు
అవ్వకూడా బయలుదేరింది చివరకు।
తాతయ్య కోసినవి బుట్టనిండిపోయె
అవ్వకోసినవైతె పిడికెడు లేవాయె॥"

పాపం అవ్వ ఎంత అసమర్థురాలు! పుట్టకొక్కుల విషయం ఆమెకు తెలియదు,

నేను మళ్ళీ మళ్ళీ పాటపాడుతూ అడవిలో తిరగసాగాను. పాట అడవి అంతా ప్రతిధ్వనిస్తున్నది. మంచి పుట్టకొక్కులు ఎక్కడ దొరుకు

తాయా అని అన్నిమూలలా గాలిస్తూ, మంచులో పచ్చికలో తిరుగుతున్నాను.

"బుర్రుపిట్ట బుర్రుపిట్ట ఏడుందవే!
పుట్టకొక్కు నాకొకటి చూపించవే!!"

ఒక కొండ రావిచెట్టు బెరడులోనుంచి పుట్టుకొచ్చిన పుట్టకొక్కు ఒకటి కనుపించింది. కానీ అది మంచిదికాదు. అవును. పుట్టకొక్కు ఉండే ప్రదేశం ఇదికాదు. అడవిలో ఇంకా లోపలికి పోవాలి.

ఇదిగో - ఇక్కడ! నా చుట్టూ వెండి కరిగిపోసినట్టున్నది. వెండి, బంగారంగా మారుతున్నది. అదొక అందం! అదొక శోభ! ఇదంతా కొండరావిచెట్ల అడవి. ఆ చెట్లమధ్య ఇంకా ఎన్నో రకాల వృక్షాలు. ఒకదాని నొకటి పెనవేసుకుని ఉన్నాయి. గాలి ఉన్నా! లేకున్నా వృక్షాగ్రాలు కదులుతున్నాయి. చలికి భయపడి ప్రతి ఆకు కంపించిపోతున్నట్టున్నది. అంతటా జాగ్రత్తగా పరిశీలించి చూదాను. అవును. పుట్టకొక్కుల భూమి యిది! నేలన్నిటినుంచీ పుట్టకొక్కుల వాసన వస్తున్నది!

అల్లంతదూరంలో రెండు పుట్టకొక్కులు అగుపించాయి! వాటి తలలు ఎర్రగా ఎర్రటోపీల్లా ఉన్నాయి! ఎంత ముద్దొస్తున్నాయి! రెండూ కవలపిల్లల్లా ఉన్నాయి. కానీ అవి ఇంకా చిన్నవి. పాపం ఇప్పుడే వాటిని కోసివేయడం న్యాయంకాదు.

"ఎర్రటోపీల్లారా! స్వాగతం! సుస్వాగతం!!" - అన్నాను కానీ అవి సమాధానం చెప్పలేదు!

తరవాత నా దృష్టి మరొకచోట పడింది. అవతలిప్రక్క నాచు పెరిగినచోట—పుట్టకొక్కులు గుట్టలు గుట్టలు కనుపిస్తున్నాయి! వాటి

తలలు పెద్ద పళ్ళాలంత ఉన్నాయి! అంత పెద్ద పుట్టకొక్కులు ఇంతకు ముసుపు నే నెన్నడూ చూళ్ళేదు. నేను వాటిదగ్గరికి పరుగుతీశాను. అన్నివైపులా వాటిని పరీక్షించాను. వాటిని నాలో నేను మెచ్చుకుంటూ కాసేపు నిలుచున్నాను. తరవాత చాకుతో వాటిని జాగ్రత్తగా కోసి తీసు కోవడం మొదలుపెట్టాను.

అబ్బ! ఇవాళ ఎటువంటి రోజు! పుట్టకొక్కులతో నా సంచీ, గడ్డిటోపీకూడా నిండిపోయాయి. ఆఖరుకు మా గుర్రంకూడా వాటిని చూచి ఆశ్చర్యపడినట్టు కనుపించింది!

ఘనవిజయం సాధించినట్టు నాలో నేను పొంగిపోతూ ఇంటికి వెళ్ళాను. చూచిన ప్రతి ఒక్కరూ నేను తెచ్చిన పుట్టకొక్కులు చాలా బాగున్నాయని మెచ్చుకున్నారు. అవి ఎక్కడ దొరికాయనికూడా అడి గారు. నేను ఎంతో గర్వపడ్డాను. కానీ అవి ఎక్కడ లభ్యమైనవో ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచాలన్న తలంపు నాకు కలగ లేదు.

త్రోవలో నాకు యుక్రిమ్ బాబెంకో ఎదురుపడ్డాడు. పుట్టకొక్కు లంటే అతనికి తగని ఇష్టం.

"ఇవన్నీ నీ వొక్కడివే తీసుకొచ్చావా?" అని అడిగాడు బాబెంకో. అతని కళ్ళల్లో అపనమ్మకం స్పష్టంగా గోచరించింది.

"ఒక్కణ్ణి కాకపోతే ఇంకెవరున్నారు? నాకు డబ్బున్నది కనుకనా కూలివాణ్ణి పెట్టుకోడానికి?-" అన్నాను. గుర్రంమీద దర్జాగా కూచుని.

"నిజంగా నీ అదృష్టం!" అన్నాడు బాబెంకో. గుర్రం కళ్ళెం పట్టుకుని మొదట నా టోపీలో ఉన్న పుట్టకొక్కులు చూచాడు. తరవాత సంచీ చూచాడు.

"చూడు! కళ్ళారా చూడు కావాలంటే!" అన్నాను నేను ఎగతాళి చేస్తున్నట్టు. ఒక్కరోజు చదవడానికి కూడా అతను 'టామ్‌సాయర్' పుస్తకం నా కివ్వలేదు. అదింకా నాకు జ్ఞాపకమే ఉంది.

"బాగున్నాయి, చాలా బాగున్నాయి." పుట్టకొక్కులు శ్రేష్ఠమైన వని బాబెంకో అంగీకరించాడు.

"సరే మనిద్దరం ఒక బేరం ఆడవచ్చు!–" అన్నాడు.

"ఏమిటది?–" అడిగాను, తాపీగా.

"నీవు నాకు పుట్టకొక్కులు ఇవ్వు. నేను నీకు పుస్తకం ఇస్తాను."

"హుం!" అన్నాను నిర్లక్ష్యంగా. బాబెంకో నమ్మదగిన మనిషి కాదని అందరికీ తెలుసు.

"నీవీ పుట్టకొక్కులు ఇచ్చినందుకు 'టామ్‌సాయర్' నీకు చదువుకోడానికి ఇస్తాను." అన్నాడు బాబెంకో మళ్ళీ.

"కేవలం చదువుకోడానికేనా?–" అని అడిగాను.

"కాక ఎప్పటికీ ఇచ్చేస్తాననుకున్నావా ఏం? ఈ ముష్టి పుట్ట కొక్కులు నా మాటుకు నేను వెళ్ళి తెచ్చుకోలేననుకున్నావా ఏమిటి?–"

"తెచ్చుకోగలిగితే వెళ్ళి తెచ్చుకో – ఎవరొద్దన్నారు?" అని నేనూ తగినట్లే సమాధానం చెప్పాను.

"ఉండు – నే చెప్పేది విను. ఈ ఊరి మొత్తంమీద 'టామ్ సాయర్' పుస్తకంలేదు. అది జ్ఞాపకం ఉంచుకో!–" నేను గుర్రంమీద వెళ్ళిపోతూ ఉంటే బాబెంకో వెనకనుంచి కేకవేస్తూ ఈ మాటలు అన్నాడు.

నేను సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాను.

పొలాన్ని కుడివైపు మళ్ళించి అనేక గోతులు, సందులు దాటి సెబాస్టియన్ మామయ్య ఇంటిదగ్గరికి వెళ్ళాను. అక్కడ గుర్రందిగి లోపలి వాకిట్లోకివెళ్ళి చూచాను. కానీ ఇంట్లో ఎవరూ లేరు. గదిలో ఉన్న పియానోమీద నా దృష్టి పడింది. కాస్త ధైర్యం తెచ్చుకుని దాని దగ్గరికి వెళ్ళాను. నల్లటిమూత పైకెత్తాను. కానీ దానిని వాయించే ధైర్యం లేకపోయింది. ఇలాంటి అద్భుతమైన సంగీత వాద్యాలను పిల్లలు వాయించగలిగితే ఎంత బాగుండును! బరువుగా ఒకమాటు నిశ్వసించాను. మళ్ళీ పియానోమీద మూతవేశాను. నా గడ్డి టోపీలో ఉన్న పుట్టకొక్కులన్నీ తీసి బెంచీమీద కుప్పపోశాను. తరవాత సంచీలోవి కూడా కాసిని తీసి అక్కడ పెట్టాను. అపరిమితమైన ఆనందంతో ఇవతలికి వచ్చేశాను.

ఇంట్లో భోజనాలు అయినతరవాత అమ్మ, అవ్వ కలసి తోటలోకి వెళ్లారు. తాతయ్య యథాప్రకారం తన పనిలో నిమగ్నుడైనాడు. అప్పుడు నేను 'విశ్వసృష్టి విజ్ఞానం' పుస్తకం తీసుకుని మతగురువు ఇంటికి బయలుదేరాను. అక్కడికి వెళ్ళగానే వెనకటిలా కుక్కలు ఎగబడ్డాయి. అయితే మునుపటిలా ఇప్పుడు మేరియానా కనుపించలేదు. బండివాడు ఆంటన్ కనుపించాడు. గుఱ్ఱాలంటే కుస్తీపట్లు పట్టడమంటే అతనికి సరదా! దానివల్ల అతనికి ఎముకలన్నీ గుల్లఅయినాయి. అతని వంటిమీద విరగని ఎముకంటూలేదు. గుఱ్ఱాలమీద నుంచి ఎన్నోసార్లు పడి అతని చేతులు, కాళ్ళు, ముక్కుకూడా వంకర్లుపోయాయి.

ఇలా అవిటివాడై, వృద్ధుడై మనిషి వంగిపోయి ఉన్నా అతను

ఇప్పటికీ మచ్చికకాని గుఱ్ఱంమీద- మాటవినని గుఱ్ఱంమీద ఎక్కి స్వారీ చేస్తాడు, గుఱ్ఱం ఎగిరిపడుతున్నా అతను దిగడు!

"మతగురువుకోసం వచ్చావా? "— అని అడిగాడు బండివాడు.

"అవును" అని చెప్పాను.

"ఏమిటిపని?"—

"ఆయనకొక పుస్తకం ఇవ్వాలి"

"సరే- లోపలికిరా!"—

అతని వెనకాలే ఇంట్లోకి వెళ్ళాను. కాని నా కాళ్ళు గుదిబండలు కట్టినట్లు బరువెక్కాయి. అడుగుతీసి అడుగుపెట్టలేనేమో అనిపించింది. గుండె చెఱువైపోతున్నది. మొన్న ఇక్కడికి వచ్చినప్పుడు నాకు జరిగిన పరాభవం— అదే ఇప్పుడు నా మనస్సులో మెదులుతున్నది, మరొక విషయంపై బుద్ధిపోవడమేలేదు,

పుస్తకాలు లభ్యమయ్యే చోటు మరొకటి ఉన్నట్టయితే ఇక్కడికి రావలసిన దుర్గతి నాకు పట్టేదికాదు

అంటన్, మొదట గదితలుపు తట్టాడు. తరవాత మెల్లగా తలుపు తెరిచాడు. లోపల్నుంచి సిగరెట్లపొగ గుప్పున బయటకివచ్చింది. మత గురువు, ఆయనకుమారుడు గదిలోకూచుని చదరంగం ఆడుకుంటున్నారు సిగరెట్లపొగ గదిఅంతా కమ్ముకొనిఉంది. గోడలకుతగిలించిఉన్న దేవతా చిత్రాలపై కూడా ఆ పొగ కమ్ముకుని, వాటికి ధూపంవేస్తున్నట్టుగాఉంది! మతగురువుకు, ఆయన కుమారుడికి నమస్కారం చేశాను. నా కంఠం రుద్ధమైంది. మతగురువు నా వంక చూడకుండా తలపంకించి ఊరు కున్నాడు. ఆయన కుమారుడు మాత్రం ఉల్లాసంగా పలకరించాడు. (బహుశః ఆటలో ఆయన గెలుస్తూ ఉండవచ్చు!)

"ఏం పండితుడా! వచ్చావా?"— అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. కానీ ఆయన మళ్ళీ నావంక క్రీగంట చూచి "నీకు చదరంగం ఆడడంవచ్చునా?"— అని అడిగాడు.

"ఆఁ"—అన్నాను.

"ఏమిటీ? నిజంగానా? లేక పరాచకాలాడుతున్నావా?"

"మీతో పరాచకాలాడుతున్నానని ఎలా అనుకున్నారు?"—

చివరకు మతగురువు నావంకచూచాడు.

"నిజంగా నీవు చదరంగం ఆడగలవా?"—

"ఎందుకు ఆడలేను?"నేను క్రమేణా ధైర్యం తెచ్చుకుంటూ సమాధానం చెప్పాను "అది మంచిఆట" అన్నాను.

ఏది మంచిఆటో నీకే తెలిసినట్లు మాట్లాడుతున్నావే?"— అన్నాడు మతగురువు కుమారుడు. తరవాత నల్లకాయ ఒకటి చూపుతూ "దీన్ని ఏమంటారు?"— అని అడిగాడు.

"దాన్ని ఏమంటారో మీకు తెలియదా ఏం?"— అంటూ నేను బిగ్గరగా నవ్వాను.

"నాకు తెలుసుననుకో— నీవు చెప్పు! దీన్ని ఏమంటారు?"—

"రాజు"

"మరి ఇదీ?"—

"రాణి"

"గుఱ్ఱం ఎటునడుస్తుందో చెప్పు?"—

"ముందరికి. రెండు ప్రక్కలకు ఒక గడి నడుస్తుంది."

"అద్భుతం! నీ తెలివి అసాధారణంగా ఉందే!"— మతగురువు కుమారుడు ఇప్పుడు నిజంగా నన్ను మెచ్చుకున్నాడు. నాపట్ల ఆసక్తి చూపాడు. "ఎవరు నేర్పారు నీకీ ఆట?"—అని అడిగాడు.

"ఎర్రకోసక్‌లు. వాళ్ళు మా వీధిలో విడిదిచేసినప్పుడు నాకీ ఆట నేర్పారు" అని చెప్పాను.

కానీ నేను చెప్పిన సమాధానం ఆ తండ్రీ కొడుకులకు రుచించినట్టు లేదు. వారిరువురూ ఒకరి వంక ఒకరు చూచుకున్నారు తరవాత చదరంగం విషయం వదలి పుస్తకాల సంగతి మాట్లాడడం మొదలు పెట్టారు.

"నీవా పుస్తకం చదివావా?"— అని కుమారుడు అడిగాడు నా చేతిలోని "విశ్వసృష్టివిజ్ఞానం" వంకచూస్తూ. ఆయన చూపుల్లో మళ్ళీ ఒక విధమైన వెక్కిరింపు కనుపిస్తున్నది.

"లేదు" అని చెప్పాను.

"ఏం? నీకు నచ్చలేదా? లేక విసుగుపుట్టిందా?"—

"అవి రెండూ కాదు. సెబాస్టియన్ మామయ్య మీకో చెప్పమన్నాడు— మీరు వాకేమైనా పుస్తకాలు ఇవ్వదలిస్తే నేను చదవగలిగిన పుస్తకాలు ఏవోచూచి ఇమ్మని ఆయన మీతో చెప్పమన్నాడు."

నామాటలు వారిరువురిపైన ఒకానొక ప్రభావాన్ని కలిగించాయి. మళ్ళీ ఒకరివంక ఒకరు ఏదో గూఢార్థంగా చూచుకున్నారు. ఒక్క నిముషం మౌనంగా ఉన్నారు. తరువాత ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"అవుతే నీవు సెబాస్టియన్ దగ్గరికి వెళ్ళావన్నమాట; అవునా?—" అంటూ కుమారుడు ప్రారంభించాడు:

"యజమానిదగ్గరికి?— హుం!—" అన్నాడు ఏవగింపుగా,

"ఆయన నాకు యజమానికాడు. ఆయన నాకు సెబాస్టియన్ మామయ్య. అంతే!—" అని చెప్పాను.

"ఆయనతో ఏం చెప్పావ్?" మతగురువు కుమారుడి మాటల్లో అనుమానం స్పష్టంగా దృగ్గోచరమైంది. "మామీద ఫిర్యాదుచేశావు; అవునా?—"

ఇది చాలాపెద్ద మాట! నన్నుగురించి వాళ్ళ అభిప్రాయం ఇదన్నమాట!

"పితూరీలు చెప్పడానికి, ఫిర్యాదులు చేయడానికి నేను ఎప్పుడూ ఎవరిదగ్గరికీ వెళ్ళను. నిష్కారణంగా నన్నెవరైనా కొట్టినప్పుడుకూడా ఆపని చెయ్యను. అని చెప్పాను, గంభీరంగా.

"సరే, సరే.— విషయం చెప్పు? అసలు నీవు పేదరైతు సంఘం అధ్యక్షుడి దగ్గరికి ఎందుకు పోవలసివచ్చింది?"

"ఈ పుస్తకం నాకు అర్థం కాలేదు. చాల కఠినంగా ఉంది. ఆయన వివరించి చెపుతాడేమోనని వెళ్ళి అడిగాను."

"సరే, బాగానే ఉందబ్బాయ్!" అన్నాడు మతగురువు ఏదో సమాధానపరచడానికి ప్రయత్నిస్తున్నట్లుగా. "సరే - నీకు ఆసక్తి కలిగే పుస్తకం మరొకటి ఇస్తాను. ఎవరి సహాయంతోనూ పనిలేకుండా నీకు సులభంగా అర్థమయ్యే పుస్తకం ఇస్తాను" అన్నాడు.

"మాదగ్గర వేరేపుస్తకాలు లేవనుకున్నావేమో...." అన్నాడు మతగురువు కుమారుడు, బల్లమీద వ్రేళ్ళతో దరువువేస్తూ.

మతగురువు, కుమారుడివంక "ఇకఊరుకో" అన్నట్లు తీక్షణంగా చూశాడు, తరవాత అక్కడినుంచి లేచి పుస్తకాల బీరువా దగ్గరికి

వెళ్ళాడు. తాళంతీశాడు పుస్తకాలు వెదకడం ప్రారంభించాడు "ఎక్కడా లేని మంచి పుస్తకం ఒకటి ఇస్తాను" అన్నాడు.

కొద్ది నిముషాల తరవాత నే నొక పుస్తకం చేతపట్టుకుని మత గురువు గదిలోనుంచి ఇవతలికి వచ్చాను. ఆ పుస్తకంపేరు తారాస్‌బుల్బా అది మా దేశ ప్రజలకు సంబంధించిన పుస్తకం. దాన్ని గురించి నేను ఇదివరకే విన్నాను. తారాస్‌బుల్బాను మా ఊళ్ళో వాళ్ళంతా "మికోలా బుల్బా" అని పిలుస్తూ ఆయనను గురించి చెప్పుకుంటూఉంటారు.

నేను మళ్ళీ గుర్రాన్ని మేపడానికి పొలాలకు తోలుకుని పోయినప్పుడు పుట్టకొక్కులు పోగుచేసుకుందామని అనుకున్నాను. కానీ పుస్తకం చదవడం ప్రారంభించే సరికి ఆ విషయం మరచి పోయాను. ఎప్పుడూ అంతే! పుస్తకం చేతిలో ఉంటే నాకు ఇతర ప్రపంచం సంగతి పట్టనేపట్టదు, అన్నీ మరచిపోతాను.

నా మీద మంచుపడుతుంటే అప్పుడు గ్రహించాను, చీకటి పడుతున్నదని. తారాస్‌బుల్బా, ఆయన అనుచరులైన కోసక్ వీరులు చేసిన సాహసకృత్యాలు-అన్నీ నా మనస్సులో ముసురుకున్నాయి. నా కెంతో ఉల్లాసంగాఉంది.

సెబాస్టియన్ మామయ్య చెప్పినట్టుగానే ఆ సాయంత్రం మళ్ళీ నేను పేదరైతు సంఘ కార్యాలయానికి వెళ్ళాను. అక్కడ పెద్ద సభ జరుగుతున్నది, చాలమంది జనం పోగైనారు. పని- పాటులు చేసుకునే కార్మిక బృందం అంతా ఎకాఎకి అక్కడికి వచ్చినట్టున్నది. సుత్తెలు, కొడవళ్ళు! గొడ్డళ్ళు, ఆంపాలు, పారలు- రకరకాల పనిముట్లన్నీ అక్కక్కడ గోడకు వరుసగా నిలువబెట్టి ఉన్నాయి. ముందు వరుసలో ఒకమూల నిశబ్దంగా కూచున్నాను. సెబాస్టియన్ మామయ్య తన ఉప

న్యాసం ముగించి ఎప్పుడు వస్తాడా అని నిరీక్షిస్తున్నాను. కొత్త పుస్తకం ఆయనకు చూపాలని ఎంతో ఉబలాటపడుతున్నాను.

సభనుంచి అందరూ వెళ్ళిపోయిందాకా అక్కడే కూచుని తర వాత లోపలికి వెళ్ళాను,

"ఏం నాయనా, వచ్చావా?"— అని సంతోషంగా పలకరించాడు సెబాస్టియన్ మామయ్య. ఆయన ఎప్పుడూనన్ను అలాగే ఆహ్వానిస్తాడు. చెయ్యికూడా అందిస్తాడు నాపట్ల ఆయనకు ఎంతటి ప్రేమ. అభిమానం ఉన్నాయో చెప్పడానికి ఇంక ఏం నిదర్శనంకావాలి? అందువల్లనే ఆయన అంటే నాకు ఎంతో గౌరవం. "ఏమిటీ? ఇంకో పుస్తకం తెచ్చావా" అని అడిగాడాయన.

"అవును" అన్నాను

ఏం పుస్తకం అది? బాగున్నదా? ఏది చూడనివ్వు"— పుస్తకం తీసుకున్నాడు.

"తారాస్ బుల్బా"—అని చెప్పాను, సగర్వంగా

"తారాస్ బుల్బా?—ఎవరతను?—"

"ఒక కోసక్."ఈ పుస్తకం సెబాస్టియన్ మామయ్య ఇంతవరకు చదవనేలేదా? ఇది సంభవమేనా?— నాలోనేను అనుకున్నాను.

"ఒక కోసక్కా? ఊఁ: అవుతే ఆ కోసక్ మనకు అనుకూలుడా లేక ప్రతికూలుడా? –" అని అడిగాడు సెబాస్టియన్ మామయ్య.

"మనకు అనుకూలుడే!" అన్నాను నేను "ఆయనను గురించి నీవు వినలేదా మామయ్యా అని అడిగాను మళ్ళీ.

"అవును – విన్నాను." ఇలా అని ఆయన పుస్తకం తెరిచాడు, "కానీ ఇలాంటి తరుణంలో ఎవరు ఎవరిపక్షాన ఉన్నారో నీవు తెలుసుకో

వాలని నాకోరిక.—ఎవరు ఎవరికి అనుకూలురో, ఎవరికి ప్రతికూలురో నీకు తెలియాలి, అదీ నా ఆకాంక్ష. అర్థమైందా?—ఇహ కూచో.... ఇద్దరం కలిసి పుస్తకం చదువుదాం." అన్నాడు.

"ఒహ్!" అన్నాను, 'ఒహ్!' అనే మాట ఎన్ని అర్థాల్లో ప్రయోగించబడుతుందో తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. దుఃఖంలో, సంతోషంలో, సందేహంలో, నిరసనలో.—అన్నిట్లో ఈ పదప్రయోగం ఉండడం ఎంత అద్భుతమైన విషయం!

"కూచో, చదువుదాం. పెద్దవాళ్ళు చెప్పినప్పుడు విను." అన్నాడాయన మళ్ళీ.

నేను డెస్క్ మీద కూచున్నాను. ఆయన ఒక ఎర్ర గొంగళితీసి పుస్తకం క్రింద పరిచాడు. పుస్తకం దీక్షతో చదవడానికి వీలుగా ఇప్పుడు గంభీర వాతావరణం నెలకొన్నది పెబాస్టియన్ మామయ్య నా ప్రక్కనే కూచున్నాడు. ఒక చెయ్యి నా భుజంమీద వేశాడు. ఆయనను అలా ఆనుకుని కూచోడం నాకు అదోలా ఉంది.

"పుట్టకొక్కులు తెచ్చి మా ఇంట్లో పెట్టి పోయింది నీవేనా మైఖెల్?—" అడిగాడాయన.

ఏమని సమాధానం చెప్పాలో నాకు తోచలేదు

"నీవేనా?" అని ఆయనమళ్ళీ అడిగాడు నావంక తీక్షగా చూస్తూ, ఆయన చూపులో విచారం గోచరిస్తున్నది

"అవును పెబాస్టియన్ మామయ్యా" అన్నాను, ఏదో తప్పు చేశానని భావించుకుంటూ.

"ఎందుకు ఆపనిచేశావు—?"

"ఎందుకేముందీ? నీ మనసే నాకు ఇష్టం కనుక—"

"అలాగా!" అని ఆయన చిన్న నవ్వునవ్వాడు. కానీ ఆ నవ్వులో అంతంలేదు; ఆనందంలేదు. "నేనంటే నీకు ఇష్టం ఉన్నందుకు ధన్యవాదాలు మిత్రమా, ధన్యవాదాలు! పుట్టకొక్కులు తెచ్చి ఇచ్చినందుకు కృతజ్ఞుణ్ణి. నీవంటేకూడా నాకు ఇష్టమేనాయనా, కాని ఇక ఎప్పుడూ ఏ వస్తువూ తీసుకొచ్చి ఇవ్వకు నాకు. పెదరైతు సంఘం అధ్యక్షుడిగా నేను స్వీకరించిన బహుమతి ఇదొక్కటే....సరే. ఇప్పుడు నేనుకూడా నీకొక బహుమతి ఇస్తున్నాను, తీసుకో—" ఇలా అని ఆయన తన జేబులో నుంచి, పొడుగాటి రంగు కాగితంలో చుట్టిన ఒక మిఠాయి పొట్లం బయటికి తీశాడు. సంతలో నేను ఇలాంటి మిఠాయి తినాలని ఇదివరకు ఎంతో ఉవ్విళ్ళూరడం జరిగింది.

"ధన్యవాదాలు సెబాస్టియన్ మామయ్యా!" అన్నాను, దాన్ని పుచ్చుకోడానికే నాకు భయం వేసింది. "పోనీ చెరి సగం తిందాం." అన్నాను చివరకు.

"అలా కాదు. ఇదంతా నీవే తినాలి. ఇది నీకోసం....ప్రొద్దుపోయిం దేమో-నీవు పడుకునేవేళ అయిందా?—"

"లేదు."

"అయితే చదువు. నీకు ఆయాసం వచ్చినప్పుడు నేను చదువుతాను."

"లేదు, మీరే చదవండి. నా కంఠస్వరం బాగుండదు." అన్నాను.

"కాని 'ఆతని' కంఠస్వరం ఎలా ఉంటుందో నీకూ తెలియదు, నాకూ తెలియదు" అంటూ ఆయన నొక్కి పలికాడు. నేను చిన్నపిల్లవాడనే అయినప్పటికి ఆయన మాటల వెనుక ఏదో గూఢార్థం దాగిఉన్నదని గ్రహించగలిగాను.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి సెబాస్టియన్ మామయ్యా? —"

"అంటే మరేం లేదు నాయనా. రేపు-రేదా మరిరెండు రోజులకు మనం ఏమవుతామో మనలో ఎవరికీ తెలియదు. యుద్ధంవల్ల మనకు కలిగిన దైన్యస్థితి త్వరలోనే తొలగిపోతుంది నాయనా. అప్పుడు నీవు ఈనాడు తొడుక్కోడానికి బూట్లు లేక, బడికి పోయి చదువుకోడానికి తాహతులేక ఒక పేదరైతు కడుపునపుట్టి అవస్థపడుతున్న నీవు - గొప్ప చదువు చదువుకోవచ్చు, ఎవరెరుగుదురు నాయనా? — ఇంకా మాట్లాడితే నీవు ఒక ఉపాధ్యాయుడవుకావచ్చు. అటువంటి కాలంలో జీవిస్తున్నాం నాయనా మనం ఇప్పుడూ —"

ఆయన మాటలు నమ్మలేకపోయాను. ఆ ధైర్యం నాకు లేదు, కానీ 'అటువంటి కాలంలో, జీవిస్తున్నాం నాయనా మనం ఇప్పుడూ' అని ఆయన అన్నమాటలు మాత్రం నా మనస్సులో చెరగని ముద్రవేశాయి. ఈ కాలాన్నే కొందరు దూషిస్తున్నారు. ఈ కాలంకోసమే మరికొందరు ప్రాణాలు ధారపోస్తున్నారు. మరి నేనొక ఉపాధ్యాయుణ్ణి కాగలనా ఏనాటికైనా?

"మీ ఉద్దేశ్యం అదేనా సెబాస్టియన్ మామయ్యా?...."

అదే అంటే ఏది? —"

"ఏదో ఒకనాడు నేను ఉపాధ్యాయుణ్ణి అవుతానని"

"అవును మిఖైలో! నీవు బాగా చదువుకుని విద్వాంసుడవైననాడు నామాటలు నీకు జ్ఞాపకం వస్తాయి. నేను నీకు జ్ఞాపకం వస్తాను; అప్పటికి వయస్సు మళ్ళిన ఈ వృద్ధుడు నీకు తప్పక జ్ఞాపకం వస్తాడు నాయనా. అప్పుడు నీవు నా కుటీరానికి వస్తావు నీవు తెలుసుకున్న గొప్పవిషయాలని నాకు బోధించడానికి వస్తావు, మరిచిపోవు కదూ? — అన్నాడాయన

"ఎలా మరువగలను?—" ఇలా అని నేను బరువుగా నిశ్వసించాను—మేం జీవిస్తున్నకాలంలో సంభవించనున్న అద్భుత సంఘటనలను గురించి నేను కొంత విశ్వసించాను. కొంత విశ్వసించలేక పోయాను. కానీ నా ఊహలు కొత్తకొత్త రెక్కలు కట్టుకుని, నన్ను భవిష్యత్తులోనికి లాక్కొని వెళ్ళాయి: నేనొక ఉపాధ్యాయుడనవుతాను. సెబాస్టియన్ మాయయ్య కుటీరానికి వెడతాను. అప్పటికాయన తలంతా నెరసి వృద్ధుడై ఉంటాడు. అప్పుడు నేనాయనకు కానుకగా తెచ్చి ఇచ్చేది పుట్టగొడుగులు కాదు—ప్రేమ, గౌరవం।

భవిష్యత్తును మొట్టమొదట నాకు బాటచూపినవాడు సెబాస్టియన్ మాయయ్య. ఆయన ఇప్పుడు లేడు, ఆయన మరణించి చాలా సంవత్సరాలైంది. కానీ ప్రేమామృతాన్ని వర్షిస్తూ వెలుగులు విరజిమ్మే ఆయన నేత్రాలు ఎల్లప్పుడూ నాకు జ్యోతులవలె ఉండి మార్గంచూపుతూ వచ్చాయి. నా మార్గాన్ని ఉజ్వలితం చేస్తూ వచ్చాయి, ఆయన ఔదార్యం, సౌజన్యం, సత్ప్రవర్తన ఎవరూ ఏనాటికీ మరువలేరు. నేను చెప్పే ఈ స్వల్పమైన మాటలు-ఆయన సహాయం పొందినవారందరూ తెలిపే కృతజ్ఞతలు-ఆయనకు జోహార్లుగా, ఆయన స్మారక చిహ్నాలుగా వెలుగొందుగాక।

—o—

అధ్యాయం: ఆరు



ఆ తరవాత నేను తరచు పేదరైతు సంఘం ప్రధానకార్యాలయానికి వెళ్ళి సెబాస్టియన్ మామయ్యను కలుసుకుంటూ వచ్చాను. ఆయనా, నేనూ తీరికచిక్కినప్పుడల్లా మేం పుస్తకాలలో పత్రికలలో చదువుకుంటూ చూచునేవాళ్ళం. ఏవో కబుర్లు చెప్పుకునేవాళ్ళం—పగ, ద్వేషం, యుద్ధం సమూలంగా ధ్వంసమైపోయిననాడు, తుపాకిపవ్వాలు రాలడానికి బదులు పూలవానలు రాలిననాడు, ప్రపంచమంతటా చీకట్లు కమ్ముకోడానికి బదులు వెన్నెల వెలుగులు విరజిమ్మిననాడు, ప్రతిచోటా దారిద్ర్యం తాండవమాడడానికి మారు సిరిసంపదలు బంగారుగజ్జెలతో నృత్యం చేసిననాడు మానవజీవితం ఎలా ఉంటుందో ఎక్కువగా మేం మాట్లాడుకునేవాళ్ళం. సెబాస్టియన్ మామయ్య నాలో క్రొక్రొత్త ఆశలు, ఆకాంక్షలు రేకెత్తించాడు. హంసలలాగా అవి నన్ను రెక్కలమీద కూచోపెట్టుకొని ఏవేవో వినూత్న లోకాలకు తీసుకొని పోసాగాయి. నా పసిహృదయం దేనికోసమో తపించసాగింది.

"మనం అదేపనిగా కబుర్లు చెప్పుకుంటున్నాం. చూడు. ఎంత ప్రొద్దుపోయిందో!—" అనేవాడు సెబాస్టియన్ మామయ్య. కిటికీవద్దకు వెళ్ళి ఆకాశంలో నక్షత్రాలవంక చూస్తూ. తరవాత మళ్ళీవచ్చి డెస్కుకు అమర్చిఉన్న డ్రాయరు తెరిచేవాడు, రొట్టె, ఉల్లిగడ్డలు, మాంసం, ఇంకా రకరకాల తినుపదార్థాలు బయటపెట్టేవాడు. మేం కడుపారవిందు భోజనం చేసేవాళ్ళం. జార్ చక్రవర్తికూడా నోరూరించే దివ్యభోజనం అది! తరవాత ఆయన రకరకాల కథలు చెప్పేవాడు. రాజులు, సేనాపతులు,

మతగురువులు-వీరందరినీ గురించి తమాషా అయిన కథలు ఎన్నెన్నో చెప్పి నవ్వించేవాడు. కానీ నా మనస్సులో ఒకే ఒక ఆలోచన పురుగులా తొలుస్తూ ఉండేది: "నేను నిజంగా ఉపాధ్యాయుడనవుతానా? నాకు అత్యంత ప్రియతమమైన నన్నని మల్లుచొక్కా ధరించి, మెరుగుపెట్టిన బూట్లువేసుకుని తిరుగుతానా?—"

మొదట మొదట అమ్మ నన్ను తిట్టింది. "పేద రైతు సంఘం అధ్యక్షుడు ఎప్పుడో నీ పీడ వదిలించుకుంటాడులే!"— అనేది. కానీ చీకటిపడేవేళ నేను బయలుదేరి వెళ్ళబోతూ టోపీ కోసం వెదుకుతూ ఉంటే అమ్మ "అదిగో! మళ్ళీ పిట్ట ఎక్కడికో ఎగిరి పోతున్నది!" — అనేది. "అవును - దైవ ప్రార్థనలకు వెడుతున్నది!"— అంటూ నేను సమాధానం చెప్పి, నవ్వుతూ పరుగుతీసేవాణ్ణి.

ఇలా ప్రతిసాయంత్రం నేను సమావేశాలకు వెడుతూ వచ్చాను. వాటిలో ఒక సాయంత్రం నా జీవిత గమనాన్నే పూర్తిగా మార్చివేసింది.

ఒకనాటి సాయంత్రంనేనూ సెబాస్టియన్ మామయ్యా గ్రంథ పఠనంలో నిమగ్నులమై ఉన్నాం. ఎవరో వచ్చి తలుపుతీస్తేకూడా మేం విని పించుకోలేదు. ఒక అపరిచిత వ్యక్తి గదిలోకి వచ్చి నిలుచున్నాడు! భారీమనిషి! చిరిగిన బొచ్చుటోపీ పెట్టుకున్నాడు! చంకలో ఒక రైఫిల్ ఉంది నేను భయంతో చిన్న కేక పెట్టాను. సెబాస్టియన్ మామయ్య గభాలున లేచి తన రివ్వాల్వరు అందుకున్నాడు. అపరిచిత వ్యక్తి తటపటాయిస్తూ నే రైఫిల్ పైకెత్తి బొంగురు గొంతుతో ఇలా అన్నాడు;

"మీతో పోట్లాడడానికి రాలేదు సెబాస్టియన్, మీకు లొంగిపోవడానికి వచ్చాను. మీరారివాల్వరు దించండి"—

"నీవు నిజమే చెపుతున్నావా?" అడిగాడు సెబాస్టియన్ మామయ్య.

"చూడండి!"— అంటూ అపరిచితుడు రైఫిల్ క్రింద పడేసి మా దగ్గరికి వచ్చాడు. అతని ముఖంలో, కళ్ళల్లో, ఒకానొక వేదన, అలసట గోచరిస్తున్నాయి.

"సరే, పోర్ఫిరీ! మీ బందిపోటు దొంగలముఠా నీకు ఏం మేలు చేసింది? ఆ పగ, ద్వేషం, విప్లవ ప్రతిఘాతక (అభ్యుదయ నిరోధక) చర్యలు వీటన్నిటివల్ల నీకు వచ్చిన లాభమేమిటి?"— అని అడిగాడు సెబాస్టియన్ మామయ్య. ఇలా అడిగి అతని విలువా— విస్తారం పరిశీలించి చూచాడు. ఆయన కనులలో కాఠిన్యం ద్యోతకమైంది.

"లాభం ఏమీ లేదు సెబాస్టియన్! లాభం ఏమీలేదు. వాళ్ళ మూలంగా నా పరిస్థితి మరీ అధ్వాన్నం అయింది. అందుకే మీ దగ్గరికి వచ్చాను."— అన్నాడు పోర్ఫిరీ. అతను తల వాల్చుకున్నాడు. అంత బలిష్ఠమైన మనిషికూడా ఇప్పుడు, శక్తి, ధైర్యం కోలుపోయి ఒక దుర్బలుడివంటి హీనంగా కనుపిస్తున్నాడు! అతని గడ్డం మాసి ఉంది, గుడ్డలు పొగచూరిన వాసన వస్తున్నాయి. గొంతు బొంగురుపోయింది!

"నీ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైందని చెపుతున్నావు- అవునా? ఇహ ఆ హంతకులవల్ల నీకు వచ్చేదేమిటి?"—

"ఏముంది?— ఏమీలేదు"— ఇలా అని పోర్ఫిరీ నిట్టూర్చాడు.

"ఇహ నీ వస్తువులన్నీ ఇక్కడపెట్టు"— అని ఆజ్ఞాపించాడు సెబాస్టియన్. ఇలా అని ఒక ఎర్రగుడ్డ, డెస్కుమీద పరిచాడు.

బందిపోటు దొంగ, విరిగిన రైఫిల్ ముక్క, రెండు చేతిగ్రెనేడ్లు, అక్కడ పెట్టాడు. మొలకుకట్టుకున్న బెల్టులోనుంచి ఒక పిస్టల్ తీసి, దాన్ని ఒకసారి పరీక్షించి సెబాస్టియన్‌కు అప్పగిస్తూ విచారంగా నవ్వాడు.

"ఇది మీకోసం—నా ధైర్యసాహసాలకు మెచ్చుకుని ప్రభువు నాకిచ్చిన బహుమతి ఇది." అన్నాడు.

"ఇలాంటి బహుమానం రావాలని నేను ఎప్పుడూ కలలు కంటూ వచ్చాను!" ఇలా అని సెబాస్టియన్, పిస్టల్‌వంక అదోలా చూశాడు. "అదికూడా తక్కిన ఆయుధాలతోపాటు అక్కడపెట్టు"— అన్నాడు.

పోర్‌ఫిరీ, తన ప్రియతమమైన పిస్టల్ అక్కడపెట్టి బరువుగా నిశ్వసించాడు. తరవాత ఏదో ఆలోచిస్తూ నిలుచుండిపోయాడు.

జీవితంలో మరపురాని విషయమిదీ అది. మరి అలాంటి సమయంలో అతను ఆలోచించేది దేనిగురించి? బంగారం పండే భూతలస్వర్గంగా ఉండే పచ్చని పొలాలను గురించా? ప్రేమను వర్షించే తన భార్య చిరునవ్వులను గురించా? లేక తను యుద్ధంలో అడుగుపెట్టి, విప్లవానంతరమగు విజయాలు సాధించిన సంఘటన లను గురించా? లేక తను చేసిన యుద్ధం, అత్యంత ప్రమాదకరము అప్రయత్నంగా అయిన పాడుపనులు ఎన్నెన్నో చేస్తూ ఉంటే తన హృదయంలో ముల్లు వేసినట్టయి, జీవితంలో ఏకాకిగా ఉండిపోవడాన్ని గురించా?

విప్లవం తరవాత పోర్‌ఫిరీ ఇంటికి వచ్చాడు. పాపిష్టి యుద్ధం వల్ల సర్వనాశనమైన తన వ్యవసాయ క్షేత్రాలను తిరిగి బాగుచేసుకోడానికి నడుమకట్టాడు. నిద్రాహారాలుమాని రాత్రింబగళ్ళు ఎముకలు విరుగునట్లుగా పనిచేశాడు. తన భూమిని మరల భూతలస్వర్గంగా మార్చడానికి పడరాని బాధలెన్నోపడ్డాడు. ప్రపంచంలో, ఎన్నడూ ఊహించని మార్పులు సంభవిస్తున్నాయి. యుద్ధాలు, రక్తపాతం, జాతీయ ప్రభుత్వపతనం, విప్లవం— అన్నీ ఒకదానివెంట ఒకటి జరిగిపోయాయి. అతను మరొక లోకంలో, మరొక గ్రహగోళంలో నివసిస్తున్నట్టు—ఈ సంఘటనలన్నీ కళ్ళముందు గిర్రున తిరిగిపోయినవి,

అతనికి పార్టీమీద, సాంఘిక సంస్థలపట్ల ఆసక్తిలేదు. చర్చిమీద కూడా. వయస్సుమళ్ళి, వార్ధక్యంలో మునిగినవారికే చర్చి అని అతను భావించాడు. ఇహ రాజకీయాలనేవి ఎత్తులు, పై ఎత్తులతో కూడిన చదరంగం ఆటలాంటిదని, ఒక కర్షకుడు-ఒకసామాన్యరైతు ఆ రంగంలో సాధించే దేమీలేదని అతను అనుకున్నాడు. రైతుకు కావలసినదల్లా భూమి; భూమిలో పండేపంట. అదే అతని సర్వస్వం. అందుకని పోర ఫెరీ భూమికోసం పాటుపడుతూ వచ్చాడు. భూదేవికీ తన ప్రాణానికీ లంకె పెట్టుకున్నాడు. భూమి, పశుసంపద—ఇవే అతని జీవితమైనాయి. అతను ఇహ ఎటూ చూడలేదు, పొలం వ్యవసాయం, పశువులు, ధాన్యం - ఇవే అతని ప్రపంచం అయినాయి. ప్రతిగింజ లెక్కపెట్టాడు, ప్రతినాణెం లెక్కపెట్టాడు పాపం ఆ కృషీవలుడికి తెలియలేదు. నిరంతరం నిర్విరామంగా సాగిస్తున్న ఈ శ్రమలో, ఈ కృషిలో తన భార్య, దినదినం క్రుంగిపోయి, శక్తి ఉడిగి నేలకు కరుచుకుని పోతున్నదన్న విషయం అతను గమనించనేలేదు, ఆవిడ అధరాలపై ప్రేమామృతం ఇంకిపోవడం అతను చూడనేలేదు. అవును, అతనికి తిండి, తిప్పలు, పడక, ప్రాణం, అన్నీ పొలంలోనే. ప్రపంచంతో సంబంధంలేని ఏకాకి అతను. అతనొక ఋషి!

1820 లో ప్రభుత్వ ఏజంట్లు కొందరు ధాన్యం సేకరించడానికై అతని వ్యవసాయ క్షేత్రానికి వచ్చారు. అయితే వాళ్ళు [illegible]గతి ప్రజలకు చెందినవారు. వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం.—వారు కులక్స్:— రహస్య శత్రువులు!

వాళ్ళు ఏకాఏకి అతని ధాన్యపుకొట్టుదగ్గరికి వెళ్ళారు, అతను ఇంట్లో ఉన్నాడా లేదా అని అడగలేదు, తుపాకి మడమలతో బలవంతాన

తలుపులు పగులగొట్టారు. తమకు చేజిక్కిన ధాన్యం తీసుకొని పోవడానికి సమకట్టారు. పోర్ఫిరీ చూచాడు. తాళపు చెవులు అతని చేతిలోనే ఉన్నాయి. వాళ్ళు చేస్తున్న దౌర్జన్యాన్ని చూస్తూ నిలుచున్నాడు కాసేపు. ఆగ్రహం వచ్చి ఒకసారిగా అతన్ని ఆవేశించింది. ఆశ, అభిమానం అతన్ని చుట్టుముట్టాయి. అతని నరనరాలలో క్రోధవిషాగ్ని రగిలింది. వాళ్ళు ధాన్యం. సంచులలో పోసుకుని బండికి ఎత్తారు. పోర్ఫిరీ వాకిట్లో నిలుచుని వాళ్ళను తిట్టి శపించిపోశాడు.

"ముందు ఇక్కడ నుంచి కదలండి!—" అని అరిచాడు.

"అందుకు చాలా వ్యవధి ఉందిలే—" అన్నారు ఏజంట్లు, హేళనగా.

"అవును—కాటికి చేరడానికి ఎవరికి ఎంతవ్యవధి ఉందో ఎవరికీ తెలియదు." అన్నాడు పోర్ఫిరీ. అతనికి కోపం ఆగడంలేదు. "ప్రాణాల మీద ఆశ ఉంటే ముందిక్కడనుంచి వెళ్ళండి!" అని వెఱ్ఱికేక పెట్టాడు.

ఏజంట్లు అతన్ని తిట్టారు. "మూర్ఖుడవు. వట్టి శుంఠవు."అని అన్నారు.ఆరోజులలో స్థానిక నేరస్తులను విచారిస్తూ ధర్మాన్ని పాలిస్తున్న 'అధికార త్రయంతో' చెప్పి నిన్ను ఏం చేస్తామో చూడమని బెదిరించారు. దాంతో పోర్ఫిరీకి పిచ్చెక్కినట్టయింది. గుడిసెలోకి ఉరికాడు. ఒరలో నుంచి కత్తితీశాడు. ప్రభుత్వ ఏజంట్ల మీదికి వెళ్ళాడు. అంతలో ప్రభుత్వ ఏజంట్లు అక్కడనుంచి పరుగుతీసి. సహాయం కోసం జిల్లా కేంద్రానికి వెళ్ళారు. పోర్ఫిరీకి నిజంగా పిచ్చెక్కినట్టయింది. అప్పటి నుంచీ అతను ఆయుధాలు పట్టాడు. మారువేషం వేసుకున్నాడు. అడవులకుపోయి విప్లవ ప్రతీఘాతక బృందంలో చేరాడు.

తనకు ఇద్దరు మనుష్యులను సహాయంగా ఇవ్వమని ఆ ముఠా

నాయకుణ్ణి అడిగాడు. ఏజంట్లమీద పగతీర్చుకుంటానన్నాడు. కానీ నాయకుడు నవ్వి ఇలా అన్నాడు:

"రైతు ఎప్పటికీ రైతే!— నీకు రాజకీయాలేం తెలుసు?"

"రాజకీయాలకూ దీనికి సంబంధం ఏమిటి?—" అని అడిగాడు పోర్‌ఫిరీ.

"ఏమి సంబంధమా?— చెపుతానువిను. రైతుల ధాన్యాన్ని దోచుకున్నవారిమీద చెయ్యి చేసుకునేవాడు వట్టి అవివేకి. వాళ్ళవంటిమీద మేం చెయ్యి వెయ్యం. ప్రభుత్వ ఏజంట్లువచ్చి ధాన్యం వసూలు చేసుకుని పోతున్నారూ అంటే దాని అర్థం ఏమిటో రైతు తెలుసుకోవాలి! దానివలన మాకు పనితేలిక అవుతుంది" అని చెప్పాడు ముఠానాయకుడు.

తరవాత స్వల్పకాలానికి పోర్‌ఫిరీ ఆ బందిపోటు ముఠాను విడిచి పెట్టి అడవుల్లో ఏకాకిగా తిరిగాడు. తన వ్యవసాయక్షేత్రాన్ని—పోగొట్టుకున్న స్వర్గాన్ని రాత్రివేళల్లో ఒకమాటు అలా దూరంనుంచి తొంగిచూచి వెళ్ళేవాడు.

అలాంటి పోర్‌ఫిరీ ఇప్పుడిక్కడికి వచ్చాడు. ఆకలి అకుగంటి వేటకుక్కలు తరుముగా పరుగుతీసిన తోడేలు పిల్లలా ఇప్పుడతను తన పాత స్నేహితుడిదగ్గరికి వచ్చాడు.

"చివరకు నా బరువు దించుకున్నాను." అన్నాడు పోర్‌ఫిరీ. దెబ్బతిన్నవాడి స్వరంలా ఉన్నది ఆ కనికంఠస్వరం. "నన్ను ఏం చేయదలచుకున్నావు సెబాస్టియన్?—" అని అడిగాడు.

"నిలువునా గొంతులుకోసే ముఠాతో చేతులుకలిపే నిమిత్తం భూమిని వదిలిపెట్టి వెళ్ళిన పుంజాకోరువు! నన్ను ఏంచేస్తే పాపం ఉన్నది? —"

"ఇహ ఊరుకో సెబాస్టియన్! ఇహ ఊరుకో! చచ్చినపామును ఇంకా ఎందుకు చావగొట్టి వేధిస్తావు?——"

"నిన్ను నరకకూపంలో పడ్డనాడు ఆ భూతాలు నిన్ను ఎలాగూ వేధించాయి. నిన్ను వేధించడంకాదు నాపని నేను చూచుకోవలసిన పనులు చాలా ఉన్నాయి."

"సెబాస్టియన్! నీకొక విషయం జ్ఞాపకం ఉన్నదా? మన ఊరి బడిలో మనం చదువుకునే రోజుల్లో నీవూ, నేనూ ఒకే బెంచీమీద, నీవు ఆ చివర, నేను ఈ చివర కూచునేవాళ్ళం" అన్నాడు పోర్ఫిరీ.

"ఇప్పుడూ మనం ఇరువురం అలాగే ఉన్నాం. భూమికి ఆకొసన నీవు, ఈ కొసన నేను! నీతో చదువుకున్న స్నేహితుణ్ణి జ్ఞాపకం తెచ్చుకోడానికి నీకు ఇదే సమయం దొరికింది! బందిపోటు ముఠాలో చేరక ముందు నీవు నా దగ్గరికి ఎందుకు రాలేదూ? నీవేం అంత అవివేకివి కావే?——"

"కోపమూ, తెలివీ–ఇవి రెండూ ఒకేసారి ఒకేచోట ఇమడవు సెబాస్టియన్. ఆగ్రహావేశంలో నాకు వివేకం అనేది పోయింది.——" ఇలా అని పోర్ఫిరీ పూర్తిగా క్రుంగిపోయినట్లు కనుపించాడు. సెబాస్టియన్ అతనివంక కొంతసేపు తదేకంగా చూచాడు. తరవాత మెల్లగా ఇలా అడిగాడు.

"ఇంతకూ ఏమిటి ఇప్పుడు నీ ఆలోచన?"

"ఆలోచన ఏముంది?—— అనిశ్చిత పరిస్థితి. ఇహ ఏం జరగనున్నదో తెలియదు. నాకు పూర్తిగా మతిపోయింది. అంతే!——" అని చెప్పాడు పోర్ఫిరీ.

"దాస్యం పోయినందుకు భగ్గున మండిబడ్డావు. కానీ సభ్యత, తెలివి పోగొట్టుకున్నందుకు నీవు విచారించడం లేదు."

"అదికాదు సెబాస్టియన్! ధాన్యం పోయినప్పుడు ఒకానొక ఆలోచన నన్నుపట్టి పీడించింది—తనవాళ్ళే తనను శత్రువుగా చూచినప్పుడు మనిషి ఎలా జీవించగలడు చెప్పు?....సరే - ఇప్పుడు నన్నేం చేయమంటావు?—"

"డెస్క్—మీదకూచో!—" అని ఆజ్ఞాపించాడు సెబాస్టియన్.

పోర్ఫిరీ, తను అక్కడ పెట్టిన ఆయుధాలకు చాలా ఎడంగా కూచున్నాడు.

సెబాస్టియన్ కిటికీవద్దకు వెళ్ళాడు. ఒకటి, రెండు నిముషాలు ఆలోచించి మళ్ళీవచ్చాడు. మందంగాఉన్న కాగితం ఒకటి పోర్ఫిరీ ముందుపెట్టాడు. సిరాబుడ్డి దగ్గరికి జరిపాడు. కలం అతని చేతికిచ్చాడు.

"వ్రాయి," అన్నాడు.

"ఏం వ్రాయను?—" అని అడిగాడు పోర్ఫిరీ, కలం పట్టుకుని.

"పుండాకోరు వెధవనైన నేను-ఇంతటితో బందిపోటు ముఠాకు విప్లవప్రతిఘాతక కార్యకలాపాలకు - స్వస్తిచెపుతున్నాను, ఇకమీదట సోవియెట్ యూనియన్ శాసనాలకు, న్యాయసూత్రాలకు బద్ధుడనై ఉంటాను. అభ్యుదయ నిరోధకుడుగా ఎన్నటికీ రాజకీయాలలో పాల్గొనను—అని వ్రాయి. తెలిసిందా?—" అన్నాడు సెబాస్టియన్.

"రాజకీయాలు గంగలో కలవనివ్వండి!—" అన్నాడు పోర్ఫిరీ రెండు చేతులు పైకెత్తి, ఏదో పాపాన్ని పరిత్యజిస్తున్నట్టు "ఇహ నా భూమే నాకు సర్వస్వం" అన్నాడు.

పైన చెప్పిన విధంగా వ్రాయడానికి చాలసేపుపట్టింది. వ్రాయడం పూర్తిచేసిన తరవాత అతను ఒకసారి మళ్ళీ చదివి ఆ కాగితం సెబాస్టియన్‌కు ఇచ్చాడు. ఏదో నీలినీడ అతని ముఖం నుండి అవతలికి తప్పు

కున్నది. అతను మళ్ళీ అడిగాడు: "చట్టప్రకారం ఇప్పుడు నన్ను ఏం చేయమంటావు? —"

"ఇంటికివెళ్ళు, అంతే నేను చెప్పేది," అన్నాడు సెబాస్టియన్.

తన చెవులను తానే నమ్మలేకపోతున్నట్టు చూచాడు పోర్‌ఫిరీ.

"ఇంటికి వెళ్ళనా?" అని అడిగాడు.

"మరి ఇంకెక్కడికైనా వెళ్ళాలని ఉందా ?"

"లేదు - ఇంకెక్కడికీ వెళ్ళను భగవంతుడా ! ఇంకెక్కడికీ వెళ్ళను - చేతులతో, మోకాళ్ళతో ప్రాకుతూ అయినాసరే నా భార్యాబిడ్డల దగ్గరికి చేరుకుంటాను."

"ప్రాకటం వదిలిపెట్టి నీ కాళ్ళమీద నీవు నిలబడడం నేర్చుకో. ప్రాకేవి పాములు; మనుష్యులుకారు."

"పోర్‌ఫిరీ కళ్ళలో మళ్ళీ ఏదో ఆశాజ్యోతి మినుకు మినుకు మన్నది.

"మరి నేను జిల్లా కేంద్రానికి వెళ్ళి నివేదించుకోవద్దా సెబాస్టియన్?—"

"మరేం వెళ్ళనక్కర్లేదు. నీలాంటివాళ్ళు అక్కడ చాలామంది ఉన్నారు. వాళ్ళకుపని ఊపిరాడకుండాఉంది. నీవు వ్రాసి ఇచ్చిన కాగితం మీద నేను మరోముక్క వ్రాసి జిల్లాకేంద్రానికి తీసుకుపోతాను, సరేనా ? ఎలాగైనా మనం ఒక బడిలో, ఒక బెంచీమీద కూచుని చదివిన బాల్య స్నేహితులం కదా! —" అని చెప్పాడు సెబాస్టియన్.

"ధన్యవాదాలు సెబాస్టియన్ ! ఇది ఎన్నటికి మరచిపోను. ఇహ నేను ఇలాగే వెనక్కు మళ్ళి మాయింటికి వెళ్ళిపోనా ?"

"అవును—"

పోర్‌ఫిరీ ఒక వెకిలనవ్వు నవ్వాడు. లేచి సెబాసియన్‌ను. సమీపించాడు.

"నా దవుడమీద లాగి ఒక దెబ్బవెయ్యి. సెబాష్టియన్!"— అన్నాడు సంతోషంగా.

"ఏమిటి దానివల్ల లాభం?—"

"నాఆత్మకు హాయి చిక్కుతుంది. ఈశ్వర సాన్నిధ్యంలో చేసిన తప్పు నివేదించుకున్నట్టుగా."

"ఇహ పోనీ ఈ చెత్త కబుర్లు."

"ఊఁ! కానివ్వు సెబాష్టియన్! బలంగాలాగి ఒక దెబ్బకొట్టు! నావే చిన్న ఉపకారం చేయలేవా సెబాషియన్?"

"సరే— నీకు అంతకోరికగాఉంటే కాచుకో!" అన్నాడు సెబాష్టియన్. ఆయన కళ్ళు జ్యోతుల్లా అయినాయి.

"ఓ! సిద్ధం. బలంకొద్ది ఒక చరుపు చరువు ఒక్క దెబ్బతో నాకు పట్టిన దయ్యం వదిలించు!" అన్నాడు పోర్‌ఫిరీ, పూనికతో నిగువబడి.

సెబాస్టియన్ అతన్ని సమీపించాడు. అతన్ని రెక్కపట్టుకుని వంచి పిడికిలితో ఛాతిమీద ఒక గ్రుద్దుగ్రుద్దాడు. ఆముష్టి ఘాతానికి పోర్‌ఫిరీ తూలి కిటికీవద్దకు పోయి పడ్డాడు.

"ఏం? ఇప్పుడు బాగున్నదా?"— అడిగాడు సెబాస్టియన్.

"ఒక పెద్దకొండ దించి నట్టయింది.! అన్నాడు పోర్‌ఫిరీ "ఇహ సరాసరి ఇంటిముఖం పడతాను." అన్నాడు.

ఇలా అని అతను ఒక అంగలో గడపదాటి వెళ్ళిపోయాడు,

అతని నవ్వో లేక ఏడుపో— ఏదో ధ్వని. బయటినుంచి కొంతసేపు వినిపించిందిమాకు.

యుఖ్రిమ్ బెంకో కనుక కొనసాగించపోయి నట్టయితే ఈకథ ఇంతటితో పరిసమాప్తం అయ్యేది. కానీ అతను ఊరుకుంటాడా? ఎక్కడెక్కడి సమాచారం ఇట్టే పసిగట్టడూ?

అమరునాడు ఆదివారం. బాబెంకో వెళ్ళి పోర్ఫిరీని కలుసుకున్నాడు. భలేపని చేశావనన్నట్టు అతన్ని వీపుమీద తట్టాడు. అతని భార్యను అభినందించాడు. జరిగిన సంగతంతా పోర్ఫిరీ చెప్పగా విన్నాడు. వారు కావించిన అతిథి మర్యాదలన్నీ స్వీకరించాడు.

ఇది మధ్యాహ్నం జరిగింది. సాయంత్రం బాబెంకో, అప్పటి వరకూ తాను సేకరించిన సమాచారం ఆధారంగా స్థానిక పత్రికకు ఒక వ్యాసం తయారు చేశాడు. దానినే మళ్ళీ ఒక నివేదికగా రూపొందించి మూడు ప్రతులు సిద్ధంచేశాడు. ఒక ప్రతి జిల్లాకేంద్రానికి ఒక ప్రతి ప్రాంతీయ కేంద్రానికి మూడవది రాజధానీ నగరానికి పంపించాడు. పోర్ఫిరీపై విరోధం పెట్టుకుని అతనిలా చేయలేదు. పేదరైతు సంఘం అధ్యక్షుణ్ణి పడగొట్టి తానే ఆపతలనీ స్వీకరించాలనీ అతనిలా చేయలేదు. ఈపదవిలో అతనికి శ్రద్ధ ఎందుకు ఉంటుంది? కానీ బాబెంకో ఉద్దేశ్యం ఒక్కటే. ఈనూతన పరిపాలనా వ్యవస్థపట్ల తనకెంతో అభిమానం ఆసక్తి ఉన్నట్టి అందరికీ తెలిసేటట్లు చేయాలన్నదే అతని అభిలాష అవిధంగా గొప్పకీర్తి సంపాదించుకోవచ్చు గ్రామంనుంచి కనీసం జిల్లా కేంద్రం వరకూ తన పేరు ప్రాకిపోవచ్చు తన తెలివి. శక్తిసామర్థ్యాలు ఈ ముష్టిపల్లెటూళ్లో ఎందుకు వ్యర్థం కావాలి? ఒక వార్తాపత్రిక విలేఖరిగా ఖ్యాతిని. విశిష్టతను సంపాదించుకోవాలని కోరుతూ, అలాంటి అవకాశం కోసం అతను ఎంతకాలంనుంచో ఎదురు చూస్తున్నాడు. ఇప్పటట్టి అవ

కాశం వచ్చింది. విప్లవం ప్రమాద పరిస్థితిలో ఉన్నది! యుద్రిమ్ బాబెంకో ఆ ప్రమాదంనుండి దానిని కాపాడుతున్నాడు! ఈ అభిప్రాయం కలిగించాలని అతని తాపత్రయం. నివేదిక, అతను పంపిన వ్యాసం, సెబాస్టియన్‌పై తీవ్రమైన నేరారోపణలకు అవకాశం కలిగించాయి. సెబాస్టియన్ జాగ్రత్తగా మెలగడం లేదని, కార్మిక ప్రజలకు శత్రువులైన వారితో అతనికి అనుమానాస్పదమగు సంబంధాలు కలవని, తనతోటి కామ్రేడ్స్‌తో సంప్రతించకుండానే అతను నిర్ణయాలు చేస్తున్నాడని బాబెంకో ఆరోపణ చేశాడు. పై అధికారుల అనుమతి, ఆమోదాముద్ర లేకుండా బందిపోటు ముఠాకు చెందిన పోర్‌ఫిరీని విడిచి పెట్టే హక్కు సెబాస్టియన్‌కు లేదని, అతను లొంగి పోయినట్లు సరియైన పత్ర రూపంలో ధృవపరచుకో కుండానే అతన్ని విడిచి పుచ్చడం చట్టవిరుద్ధమని బాబెంకో తన వ్రాతలలో ప్రత్యేకంగా నొక్కి పేర్కొన్నాడు.

ఈ వ్యవహారాన్ని దర్యాప్తు చేయడానికై నియమించ బడిన తొలి కమిషన్, నాలుగుచక్రాల గుర్రపు బగ్గీమీద వచ్చింది. కమీషన్ అధ్యక్షుడు ఏదో తీవ్రమైన హృద్రోగంతో బాధపడు తున్నాడు. ముఖం నీలి వర్ణంలోకి మారి మాట్లాడ లేని స్థితిలో ఉన్నట్టు కనిపించాడు. అందువల్ల అతనిని పలకరిస్తేనే మండిపడేటంతకోపంతో చిరచిరలాడుతున్నాడు

"కమీషన్ అధ్యక్షుడు సెబాస్టియన్ పట్ల ఏమాత్రం దయ తలచడు." — అని చెప్పుకుంటున్నారు గ్రామస్థులు.

"మహా అతను జైల్లో ఎట్లా పియానో వాయిస్తాడో చూడాలి!" అని వాగాడు వెనకటి శ్రీమంతుడొకడు.

ఇలాంటి వదంతులు, వార్తలు విని నాకు భయం పుట్టింది. ఆందోళన కలిగింది.

కమిషన్ రహస్యంగా, పోర్ ఫిరీని, సెబాస్టియన్‌ను, బాబెంకోను — ఈ ముగ్గురినీ వేరు వేరుగా కలుసుకుని విచారణ జరిపింది.

పోర్ఫిరీ భార్య, తలుపు ప్రక్కన నుంచుని, భయంతో కంపించి పోతున్నది.

బాబెంకో తక్కిన వారందరి కంటె ఎక్కువసేపు మాట్లాడాడు. వార్తా పత్రికా సంబంధమైన అతని వాక్పటిమ అత్యంత పవిత్రమైన కార్యాలకు — అంటే విప్లవం, విప్లవానికి సంబంధించిన ప్రమత్తత, కార్మిక ప్రజల రక్షణ? వీటికిగాను విచ్చలవిడిగా వినియోగించబడింది. ఈ వ్యాపారంలో అతనికి అడ్డు — అపు లేకుండా పోయింది. అతను చెప్పడమంతా అయిపోయిన తరువాత కమిషన్ అధ్యక్షుడు ఇలా అన్నాడు,

"నీవు చెప్పవలసిన దంతా అయిందా? —"

ప్రస్తుతానికి అయింది. కానీ మీరు మినిట్స్ పుస్తకంలోను తీర్మానంలోను పొందుపరచ దలిస్తే మరి రెండు ముక్కలు చెపుతాను" అన్నాడు బాబెంకో, ముఖంమీద చెమట తుడుచుకుంటూ....

అప్పుడు కమీషన్ అధ్యక్షుడు మళ్ళీ ఇలా అన్నాడు:

"నిన్ను రెండు ప్రశ్నలు అడగదలచాను. మొదటిది — విప్లవం అనే పదాన్ని నీ ఇష్టం వచ్చినట్టు నీ నోటికి వచ్చినట్టు ప్రయోగించడానికి అనుమతి ఎవరిచ్చారు? రెండవది — ఈ వ్యవహారంలో తలదూర్చి ఇదంతా నీదే నన్నట్టు పూనుకుని తిరగడానికి అసలు నీకు ఎవరు అధికారం ఇచ్చారు? —"

"మీరు నన్నూ, నా వ్యక్తిత్వాన్నీ అవమానిస్తున్నారా? ఎంత సాహసం! ఈ విషయం ఇంతటితో వదలిపెడతా ననుకోండి! నియమ

నిబంధనల ప్రకారం పై అధికారుల దాకా ఫిర్యాదులు పంపి అంతు తేల్చు కుంటాను"— అన్నాడు బాబెంకో, రోషంతో.

"అందులో నీవు ఘటికుడవే - సందేహం లేదు. నీ జీవితాంతం ఇలా ఫిర్యాదులు పంపుతూ ప్రజలను నాశనం చేస్తూనే వుంటావు. ఎవరో అడ్డుతగిలి వియమ. నిబంధనల ప్రకారం నీకోరలు ఊడ బెరికి, నీ మదం అణచే దాకా నీవు ఈ పని మానవు. నిన్ను అదుపులో పెట్టాలంటే అంతే! "—అన్నాడు కమిషన్ అధ్యక్షుడు.

కొరడా దెబ్బ తిన్న వాడిలా బాబెంకో అక్కడనుంచి విసురుగా వెళ్ళిపోయాడు. తరువాత పోర్ఫిరీ భార్య భయంతో కంపిస్తూ కార్యాలయంలోకి వెళ్ళింది "నీ భర్త నీతిగా జీవిస్తున్నంత కాలం నీనుంచి అతన్ని వేరుచేసి తీసుకుని పోయే ఉద్దేశం ఎవరికీ లేదు. ఈ విషయం సోవియట్ ప్రభుత్వం ఘంటా పథంగా చాటి చెపుతున్నది."— అని కమిషన్ అధ్యక్షుడు ఆమెకు అర్థమయ్యేటట్లు చెప్పడానికి చాలసేపు పట్టింది.

"మీరు సజ్జనులు—మీకు నా ధన్యవాదాలు!" అన్నది ఆ ఇల్లాలు "మీపని అయిపోతే దయచేసి మా ఇంటికి రండి. స్వయంగా తయారు చేసిన సారా ఇంకా కొంత మా ఇంట్లో మిగిలి పోయింది."— అన్నది.

"ఘాటుగా ఉంటుందా?— అడిగాడు కమిషన్ అధ్యక్షుడు.

"అగ్నిహోత్రం!—" అనిచెప్పిందామె.

"అవుతే మేందాన్ని ఆస్పత్రికి తీసుకుపోతాం. మీకేమైనా అభ్యంతరమా?—"

"అభ్యంతరమేమీ లేదు బాబూ. మీకుకావాలంటే చెప్పండి. ఇంకా కాస్త తయారు చేసి ఇస్తాం."

కమిషను అధ్యక్షుడు ఆమె దగ్గరనుంచి సారాయి వశపరచు కున్నాడు. అప్పుడే ఈ విషయం ఎలాపసిగట్టాడో పసిగట్టాడు, బాబెంకో. దీంతో కమిషన్ అధ్యక్షుడి బండారం బయట పడవేస్తానని మీసాలు మెలి దిప్పాడు. కావలసిన పూర్తి సమాచారం, ఆధారాలు సేకరించడానికై ఆస్పత్రికి వెళ్ళాడు. కానీ అతని ఆశలు అడియాసలైనాయి. ఆస్పత్రిలో ఉపయోగించడంకోసం ఆసారాయి పెద్ద డాక్టర్‌కు అప్పగించడం జరిగింది. ఔషధంగా వాడటానికి ఆ రోజులలో సారాయి దొరకడం మహాకష్టంగా ఉంది. ఆరోజులలో నిజమైన డాక్టర్ల వైద్యం తక్కువ. రోగం వచ్చినా, నొప్పివచ్చినా, దెబ్బతగిలినా,— దేనికైనా సరే మంత్రాలు పెట్టేవారు, వేర్లు కట్టేవారు, పసర్లు పూసేవారు, ఎముకలకు కట్లు కట్టేవారు. భూతవైద్యులు, దొంగడాక్టర్లు—వీరే ప్రత్యక్షమయ్యేవారు. రోగంపోదు; ఊపిరి మాత్రంపోతుంది! పోతే పోయింది అంటారు జనం. చావుకు అలవాటు పడ్డారు వారు. వేదాంతం చెప్పి మరీ చస్తున్నారు! దేవుడు పుట్టించాడు; ఆ దేవుడే తీసుకపోతున్నాడు! ఇక దిగు తెందుకూ? భలే బాగున్నది వేదాంతం! ఆ రోజులలో అయి పుట్టినదానికీ దేవుడే! దేవుడిపేరు చెప్పి ఏపని అయినా చెయ్యవచ్చు. అన్నిటికీ దేవుడు, దేవుడు అనడం ఒక పెద్ద అంటువ్యాధిలా అల్లుకున్నది!

ఒకటి రెండురోజులు గడచినవో లేదో బాబెంకో కొన్ని వదంతులు పుట్టించాడు. తనను ఊళ్ళోనుంచి వెళ్ళ గొట్టడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ విప్లవానికి రహస్య శత్రువులుగా ఉంటున్న వాంపై పుకార్లు లేవదీశాడు. అంతే! ఆ తరువాత అతను ఊళ్ళో కనుపించ లేదు. పట్నానికి వెళ్ళి అక్కడ తనకు తగిన ఉద్యోగం కోసం దేవుళ్ళాడడం ప్రారంభించాడు.

ఒకనాటి సాయంత్రం సెబాస్టియన్ మామయ్యా, నేనూ, ఆయన కార్యాలయంలో కూచునిచదువుకుంటున్నాం. అకస్మాత్తుగా బాబెంకో అక్కడ ప్రత్యక్షమైనాడు. అశ్వికదళంలోని వారు ధరించే చక్కని యూనిఫారం ధరించి ఉన్నాడు. తాను యుద్ధంలో పనిచేసినట్లు ప్రజలను మోసగించడానికై వేసిన వేషం ఇది! అతను పక్క జేబుల్లో చేతులు పెట్టుకుని, తన దుస్తుల తళతళ మెరుగులు చూపిస్తూపెద్ద'పోజు'పెట్టాడు.

పిలవని పేరంటంగా వచ్చిన ఈ అతిథి వంక సెబాస్టియన్, అస హ్యించుకుంటున్నట్లు చూచాడు. బాబెంకో పెదవులు కొరుక్కుంటూ తెచ్చిపెట్టుకుంటున్న చిరు నవ్వు నవ్వాడు.

"నేను ఇక్కడికి వస్తానని నీవు అనుకోలేదు కదూ సెబాస్టియను? అవును-అనుకొని ఉండవు. కానీ నాటకంలోని ప్రధాన పాత్రలాంటి నాబోటి వ్యక్తి నియమ, నిబంధనల ప్రకారం నీ వద్దకు రావడం, నీకు అభివందనాలు తెలుపుకోడం సహజమే కదా?"—యన్నాడు.

"నాటకంలోప్రధాన పాత్రా" అని అడిగాడు సెబాస్టియన్.

"అవును. నాటకంలో ప్రధాన పాత్రలాంటి నాబోటివ్యక్తి"

"నీ ప్రధాన పాత్ర ఏనాటకం లోనో చెబుతావా?"—

"విప్లవం అనే నాటకంలో."

"అలాగా! మరి నాపాత్రను ఎలా నిర్వచించ దలిచావు నీవు?"-

"నీ పాత్రకేం? వీరోచితమైన పాత్ర!" అన్నాడు. బాబెంకో; తన వాక్పటిమకు తానే మురిసి పోతున్నట్లు,

సెబాస్టియన్ తలపంకించాడు. మాట్లాడలేదు. నీనక్కజిత్తులన్నీ నే నెరుగుదులే అన్నట్లు చూచాడు. అంతట బాబెంకో తన ఉపన్యాసం ప్రారంభించాడు. పట్నంలో పరిస్థితులన్నీ ఎంతగా మారిపోయినదీ, తన

స్నేహితులందరూ ఎలా ఉన్నత పదవులలోకి పోయినదీ పెద్ద పెద్ద కబుర్లన్నీ చెప్పడం మొదలు పెట్టాడు. తనకు కూడా అలాంటి పదవి ఒకటి ఇప్పించడానికి వాళ్ళు ఎంతో ఆరాట పడుతున్నారని అన్నాడు.

"పాపం, నీవొక ఉన్నతపదవిని వెలిగించాలని వాళ్ళంతగా ఆరాట పడుతూ ఉంటే నీవు నిరాకరించావు. ప్రజానీకంతో సంబంధాలు త్రెంచుకోవాలనని చెప్పావు. అవునా?—"అని అడిగాడు, సెబాస్టియన్.

"నేనింగా ఒకనిర్ణయానికి రాలేదు. మొదట ఇక్కడికి వచ్చి నీతో మాట్లాడం మంచిదనుకున్నాను. వచ్చాను. మరినీవు నాకు ఏం సలహా ఇస్తావో, ఏంచెయ్య మంటావో చెప్పు? నన్ను ఈ గ్రామంలోనే ఉండ మంటావా, లేక పెద్ద పట్నంలో అదృష్టాన్ని వెదుక్కో మంటావా?"—

"నీవు నీ అదృష్టాన్ని ఎక్కడా వెదకవద్దు. అదే నా సలహా!" అన్నాడు సెబాస్టియను, విశ్వసిస్తూ.

"అదెలాగు?" అన్నాడు బాబెంకో! అతని ముఖం లోసంభ్ర మాశ్చర్యాలు మొలకెత్తాయి.

"ఎందు కంటావా?—అదృష్టం కోసం నీవు వెదకడం మొదలు పెడితే అది నీకంట పడవచ్చు. కంటపడింటే అంటే నీవు దాన్ని ఒడిసి పట్టుకుంటావు పట్టుకున్నవాడిదరికి పంచిపెట్టవు. నీ వొక్కడవేదాన్ని అనుభవిస్తావు. నీవొక్కడవే లాభం పొందుతావు. ఇతరులెవరికీ కొంచెమైనా చిక్కనివ్వవు కానీ నీలాగే ఇతరులూ అదృ ష్టాన్ని కోరుకుంటారు. వారికీ కాస్త అదృష్టం కావాలి."

బాబెంకో కొంచెం ఉలికిపడ్డాడు. ఎలా సమాధానం చెప్పాలో అతనికి తోచలేదు; కోపం వచ్చింది.

"చూడు సెబాస్టియన్: నా సంగతి నీకు ఇంకా తెలియదు" అన్నాడు పెదవులు కొరుకుతూ. "ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం నీకు తేలికే. కానీ నీ స్థానంలో ఉన్నవాడు, నియమ నిబంధనల ప్రకారం మరింత వినయ విధేయతలతో మెలగాలి కమిషన్‌తో జరిగిన వ్యవహారం వల్ల నీవు నామీద మండిపడుతున్నావు. నాకు తెలుసు. అందుకనే విచారిస్తున్నాను. పశ్చాత్తాపపడుతున్నాను. అలాంటిపని ఇహ ఎన్నడూ చేయను. కానీ నీవు విప్లవ నిబంధనలు ఉల్లంఘించినట్టు నేను కనిపెట్టాను. అదినా అవివేకం కాదు. సిద్ధాంతాల వెలుగులో ఆచరణవైపు నీవు చేసిన పొరపాటు చూపాలనుకున్నాను; చూపాను. విప్లవాన్ని ఆచరణలో పెట్టవలసినవాడవు నీవు - విప్లవాన్ని సిద్ధాంతాలరీత్యా ప్రచారం చేయవలసినవాడను నేను. ఈ రెండు పనులూ మనలాంటివాళ్ళు చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు?"

"నీ తప్పులు నీవు కప్పిపుచ్చుకోడానికిగాను ఈ బురఖా వేసుకున్నావు! విప్లవానికి ఆచరణలేదా సిద్ధాంతం అని పేర్లుపెట్టి ప్రచారం చేస్తున్నావు. దానిని కాపాడడానికిగాను నీవు ఎవరినైనా, దేనినైనా అమ్మకానికి పెడతావు!—" అన్నాడు సెబాస్టియన్ కోపంగా.

"ఎందుకలా వ్యాఖ్యానం చేస్తావు? బురఖా తగిరించుకునేవారి సమస్య చాల సున్నితమైన సమస్య. ప్రతి ఒక్కడూ తన శక్తివైనంత వరకు తన్నుతాను కాపాడుకోడానికి యత్నిస్తాడు. కొందరైతే అందుకుగాను 'ఏదుపందిలా ముళ్ళు' సృష్టించుకుంటారు. అవునా?—"

"అవును. కొందరు తమ బురఖాలకు 'బంకమన్ను' కూడా పూసుకుంటారు!"

"కావచ్చు. అది నేను కాదనను," బాబెంకో ముఖం అసూయ, ద్వేషాలతో విరూపం అయింది. అతని కళ్ళచుట్టూ నీలినీడలు కమ్ము

కున్నాయి. "సరే—అసలు నేనిక్కడకి వచ్చింది వేరేపనిమీద. చెప్పనా, లేక ఇంతటితో నోరు మూసుకోమంటావా?—" అని అడిగాడు.

"చెప్పు. లోపల ఉన్న కుళ్ళంతా వెళ్ళగక్కడమే మంచిది! నీవు మాట్లాడితే నోటినుంచి వచ్చేవి మాటలుకావు-విష పురుగులు!" అన్నాడు సెబాస్టియన్. ఎంత నిభాయించుకుంటున్నా ఆయనకు కోపం ఆగడం లేదు.

"అలా అనుకోడం కేవలం నీ ఊహ"

"సరే—ఏమిటో చెప్పు."

"ప్రత్యేకంగా ఏమీలేదు. నాకొక సిఫార్సు ఉత్తరం వ్రాసి ఇవ్వు. అదే నేను అడిగేది. పెద్ద చాటభారతం అక్కర్లేదు. నాలుగు ముక్కలు చాలు— కానీ ఆ నాలుగుమాటలూ మణిపూసల్లా ఉండాలి."

"మరి ఉన్నతపదవులు వెలగపెడుతున్నారన్నావే నీ స్నేహితులు?-సిఫార్సులేకుండా వాళ్ళు పనిచేయలేరా?—"

"ఓ! చేస్తారు. కానీ నీకు తెలుసుగా-చట్టం అన్నతరవాత చట్టమే! నాకు ఈ చిన్న సహాయం చేసిపెట్టు సెబాస్టియన్. ఇదేమీ పెద్ద విషయం కాదు. దీనివల్ల నీకూ నాకూకూడా హాయి చిక్కుతుంది."

"నాకేమీ హాయి చిక్కనక్కర్లేదు. నేను నీకు సిఫార్సు ఉత్తరం వ్రాసి ఇవ్వను."

"వ్రాసిస్తావు-ఎందుకు వ్రాయవూ?—" అన్నాడు బొబెంకో. ఏదో ధీమాగా.

"లేదు వ్రాయను - వ్రాయనంటే వ్రాయను."

"నిరాకరించే హక్కు నీకు లేదు." బొబెంకో కళ్ళల్లో క్రౌర్యం నిండింది.

"[illegible] ప్రతి [illegible]

[illegible] అంటే [illegible]

[illegible] ఇది [illegible]

[illegible] విసిరింది.

[illegible] అని [illegible]

"థ్యాంక్స్! వద్దు. నేను వ్రాయగలను. నీవు కాస్త అడ్డంతే."

"ఒక విషయం అడుగుతాను సెబాస్టియన్! ఆ ఒక్కమాట కాగితం మీద పెట్టు. చాలు—ఎనికి బలం వస్తుంది! కార్మిక, కర్షకుల ఎర్ర సైన్యంలో నేను పనిచేశానని వ్రాయి. బంగారంలాంటి మాట! ఈ రోజుల్లో దానికి ఎదురులేదు. దాంతో క్రిందినుంచి పైదాకా లవిచ్చిన్నంగా దూసుకుని పోవచ్చు!—"

"ఓహో, అలాగా! సరే—అలాగే వ్రాస్తాను. నీవు మాట్లాడకుండా కూచో," అన్నాడు సెబాస్టియన్.

బాబెంకో పెద్దబరువు దించుకున్నట్లు నిశ్వసించాడు. వెళ్ళి ఒక ామీద కూచున్నాడు. ఇక కొద్దిరోజులలోనే అతను అగ్రపీఠం ఎ కూచుంటాడు. మహత్తరమైన త్యాగంచేసి ఇన్నేళ్ళు సేవచేసినా సెబాస్టియన్ ఏమీకాలేదు. ఉన్నచోటనే ఉన్నాడు. అలాంటి సెబాస్టియన్ అంటే ఇతనికి లెక్కఏమిటి? ఇక అతను ఒక స్వీయచరిత్రనే సృష్టించుకోవచ్చు. రాజధాని నగరంలో కూచుని ఉత్తర్వులు జారీచేస్తూ ఉండవచ్చు. వారంలో ప్రతిరోజూ తళతళ మెరుగుపెట్టిన బూట్లు ధరించవచ్చు.

"చదివి వినిపించనా?—"అని అడిగాడు సెబాస్టియన్,వ్రాయడం పూర్తిచేసి, డెస్క్దగ్గరనుంచలేస్తూ.

"వినిపించు. మృదుమధురమైన ఆ మాటలు ఈ చెవినపడనివ్వు" అన్నాడు బాబెంకో. అతని పెదవులు కంపించాయి. కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. దేనికోసమో ఉవ్విళ్ళూరుతున్నాడు.

"కానీ నీవు వినాలి. మధ్యలో మాట్లాడకూడదు." అన్నాడు బాస్టియన్.

"అలాగే - మాట్లాడను."

సెబాస్టియన్ చదవడం మొదలుపెట్టాడు:

"యుఖిమ్ బాబెంకోకు వ్రాసి ఇచ్చిన సిఫార్సులేఖ. ఇతను మా ఊళ్లోపుట్టి, మా ఊళ్ళో పెరిగాడు. నీ ఇతనికి ఇంకా బుద్ధిరాలేదు —" సెబాస్టియన్ ఇక్కడిదాకా చదవగానే బాబెంకో మధ్యలో అడ్డుతగిలాడు.

"ఏమిటా మాట? చమత్కారానికి రాశావా?" అన్నాడు చివాలున లేచి.

"మధ్యలో మాట్లాడవద్దని చెప్పలేదూ? — సరే, ఇప్పుడు మళ్ళీ మొదటి నుంచి చదువుతాను–'యుఖిమ్ బాబెంకోకు వ్రాసి ఇచ్చిన సిఫార్సు ఉత్తరం. ఇతను మా ఊళ్ళోపుట్టి, మా ఊళ్లో పెరిగాడు. కానీ ఇతనికిక్కడ బుద్ధిరాలేదు! ఈ వ్యక్తికున్న ప్రధానలక్షణాలు ఇవి: పరాన్నభుక్కు. సోమరిపోతు. కావలి కుక్కలా అరవటంలో పెట్టింది పేరు. సర్పంలా కాటువేస్తాడు. తేలులా కుట్టిపెడతాడు. ఎక్కడికి వెళ్ళినా ఒక కళంకం. చెంగటి ముద్రలా పడిపెట్టి మరీ పెడతాడు. ఇతని జీవితం వెనుక, ఇతని కార్యకలాపాల వెనుక ఉన్నది ఒకే ఒక సూత్రం: ఇతరుల నోళ్ళుకొట్టి నీవు బాగుపడు; ఇతరుల శ్రమతో నీ పొట్టనింపుకో, పరుల సహాయంతో జీవితంలో దాదాపు పైకివెళ్ళు. వెళ్ళినతరవాత ఏరుదాటి తెప్పతగలేసినట్టు – వారికే అపకారం చెయ్యి, ఇదీ ఆసూత్రం! ఇతనికి నిజంపెళ్లాం విడిచేసినని చెపుతారు కొందరు జనం. దీనిని ధృవపరిచే ఆధారాలు దగ్గర లేవుగాని ఒక విషయం మాత్రం కచ్చితంగా చెప్పగలను. ఇతను సమాజానికే పెద్ద ప్రమాదం. ప్రభుత్వంలో ఏ పదవీ తగదు. అలాంటి పదవి లేకుండానే ఇతను కావలసినంత హానిచేస్తాడు. ఇక ఏ పదవి ఉన్నా దానికంటె కాస్త ఎక్కువ స్థాయిలో చేస్తాడు...."

"నీవు....నీవు....నిన్ను ...నిన్ను ఏంచేస్తానో...."బాబెంకో ఇలా ఏవో చెప్పబోయాడు. మాట తడబడ్డది. పెదవులు వణికాయి. కంఠం

ఉద్ధమైంది. పిడికిలి బిగించి చెయ్యెత్తాడు. "ఏం చేస్తావు నీవు నన్ను?-" నిశ్చలంగా, నిబ్బరంగా ఉండి అడిగాడు సెబాస్టియన్.

"ఉండు చెపుతాను - నీకే ఒక సిఫార్సు వ్రాస్తాను!—"

"నీకా శ్రమవద్దు. ఇప్పటికి రెండు యుద్ధాలు నాకు సిఫార్సు వ్రాయనే వ్రాశావు. నీలాంటి నీచమైన గుమాస్తా వ్రాసిందికాదు అది." అన్నాడు సెబాస్టియన్, మేఘ గంభీర కంఠస్వరంతో.

"నాకు తెలుసు. జీవితం. ప్రాణం వ్రాసిన వ్రాత అది. తుపాకి గుండ్ల గాయాలే అక్షరాలుగా వ్రాసిన వ్రాత అది - అవి రక్తాక్షరాలు!" అన్నాడు [illegible] "సరే—[illegible] వాడిగైన కంఠంతో [illegible] - అప్పుడు తెలుస్తుంది ఎవరు ఏమిటో!" అన్నాడు, [illegible] ఇక్కడలేవు — "ఇవాళ నీవు పైన కూచుని ఉన్నావు. కానీ [illegible] పైన ఉంటారో ఆ భగవంతుడికే తెలుస్తుంది. [illegible] సమయం వస్తున్నది. ఆ రోజులు వస్తున్నాయి. ఎవరు సిఫార్సులు వ్రాసి ఇస్తారో, ఎవరు వాటిని ఖుర్దా ఖిలా చేస్తారో త్వరలోనే తెలుస్తుంది! [illegible] పైన ఉన్నంత మాత్రాన సంతోషించనక్కరలేదు, [illegible] ఉంటాయి. అది గుర్తుంచుకో!—" అన్నాడు [illegible].

"గ్రుద్దువచ్చి పళ్లను పెకలించివేయటం నీవాగుడు కట్టిపెట్టు!-" అంటూ సెబాస్టియన్ [illegible] కారా గ్రరున తిరిగి [illegible] చూసుకుని పోయాడు.

—o—

అధ్యాయం: ఏడు

ఆకురాలే కాలం వచ్చింది. ఆకాశంలో నక్షత్రాలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి. ఇళ్ళల్లో నిశ్శబ్దం అలుముకున్నది. ప్రొద్దు తిరుగుడు పూలు [illegible] సూర్యుడివంక తి[illegible]: నక్షత్రాలవైపు చూడడం లేదు. పొగమంచు వాటిన అవి ముడుచుకుని పోయాయి.

జీవితంలో ఎల్లప్పుడూ కూడా నేను నక్షత్రాలనుచూచి ముగ్ధుడ నవుతూ [illegible]ను. ఏదో నిగూఢమై[illegible] చె[illegible]ను. ఎవ[illegible]కీ [illegible]ని వా[illegible] [illegible]. వా[illegible] [illegible]నే అ[illegible]గా[illegible] — ఇవన్నీ [illegible] అర్థంచేసి [illegible]. సమ్మో[illegible]తుడనవుతూ వచ్చా[illegible]. నా బాల్యంనాటి [illegible] [illegible] తారలతో ముడివేసుకుని ఉన్నా[illegible].

[illegible]ప్పుడు నా జీవితంలో గడిచిపోయిన అర్థశతాబ్దంవంక ఒక మారు వెనుదిరిగి చూసుకుంటే ఎన్నెన్నో జ్ఞాపకాలు; ఎన్నెన్నో దృశ్యా[illegible]; ఎన్నెన్నో మధుర స్మృతు[illegible] [illegible]చ్చని [illegible]లు, పచ్చి బియ్య[illegible] [illegible]గా పెరిగిన గడ్డి, [illegible]. గడ్డివాములు — [illegible] దృశ్యా లన్నీ [illegible] [illegible] [illegible] [illegible]. పొలాల[illegible] [illegible] చలి[illegible] దీపోత్స[illegible] నా[illegible] [illegible] కలిగి[illegible], రైతు బిడ్డ[illegible] [illegible] [illegible] చప్పుడు నాకు వి[illegible] పిస్తుంది మంచుకు త[illegible] [illegible] సకిలింపులు, మూల్గులు, [illegible] [illegible] [illegible] [illegible] చూచున్న [illegible]పిల్లలు— అని[illegible] జ్ఞాపకం [illegible]స్తాయి. పసిపాప [illegible] [illegible]స్తూ ప్రవహిస్తున్న కొండవాగులు గుర్తుకువస్తాయి, వంతెనవద్ద నున్న వ్యవసాయ

క్షేత్రంలోనుంచి చూస్తే నీలాలనింగి, నేలమీదికి వంగి తొంగిచూస్తున్నట్టు కనుపిస్తుంది! వెలుగులు విరజిమ్మే ఒక నక్షత్రం ఆకాశంనుండి అవనికి దిగివచ్చి, మంచివారికి ఆనందం పంచి పెడుతుంది. అది మా ఇంట్లో కిటికీ అంచున వచ్చికూచుంటే ఎంత బాగుండును!

నేను 'గాలిమర' మీదికి ఎక్కి దాని కొసన నిలుచుని ఆకాశాన్ని అందుకున్నట్టు, వినీలా కాశపుటంచులు పట్టుకుని పైకి, ఇంకా పైకి ఎగబ్రాకిపోతున్నట్టు, అలా పోయిపోయి ఒకతారను పట్టుకుని గబగబా పొలాలమీదిగా మరల ఊరికి చేరినట్టు ఊహించుకుంటాను. ఆ తారే నన్ను జోకొట్టి నిద్రపుచ్చుతుంది. తరువాత తానుపోయి తక్కిన నక్షత్రాలన్నిటినీ పిలుచుకుని వస్తుంది, పృథ్వీమీదికి రాగానే అవన్నీ పెద్దవైపోతాయి, నాచుట్టూ బంగారపు వలయాలు అల్లుతూ గిర్రున తిరుగుతాయి, వాటి పరిభ్రమణం ఒక కమ్మని సంగీతంలా నా చెవులకు వినవస్తుంది. నేను వాటతోపాటు ఎక్కడికో, ఎక్కడెక్కడికో — ఏ లోకాలలోనో తేలిపోతాను, అద్భుత, ఇంద్రజాలంలాంటి నా స్వప్నాలు, నదీప్రవాహాలు!

ఇప్పుడు నేనూ, తాతయ్యా 'మెయిదానీ' నుంచి బండిమీద తిరిగి వస్తున్నాం. త్రోవలన్ని నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా ఉన్నాయి. పిండి ఆరబోసినట్లు వెన్నెల కాస్తున్నది. ఈ అడివి గుడిసెలలో నివసించే ప్రజల కోసం తాతయ్య, చిన్న చిన్న వ్యవసాయపు పనిముట్లు బాగుచేసి ఇచ్చాడు, తేనె గూళ్ళు కొన్నిచేసి ఇచ్చాడు. ఈ అడవిప్రాంతంలో రైతులు చేతిలో ఆయుధంలేకుండా పొలం పోరు, బందిపోటు దొంగల భయం మిక్కుటం, పొలం దున్నే వారిప్రక్కనే కొన్ని రైఫిళ్ళు ఉండడం నాకు చూపించాడు తాతయ్య.

బాటకు ఇరువైపులా,ఏపుగా పెరిగిన రెల్లుగడ్డి మూల్గుతున్నట్టు ధ్వని

చేస్తున్నది. చుట్టుపక్కల ఎక్కడా పుట్టపురుగు కనుపించడంలేదు. పైన ఆకాశం నిర్మలంగాఉంది. నక్షత్రాలు మినుకుమినుకు మంటు న్నాయి. చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. ఒక నక్షత్రం రాలింది. దూరంగా పొలం అవతల అదృశ్యమైంది.

"మనుష్యులు రాలిపోయినట్లు చుక్కలుకూడా రాలిపోతాయి! మనుష్యులలాగే వాటికీ ఆయుర్దాయం ఉంది." అన్నాడు తాతయ్య. తరవాత నావంక తిరిగి "చలిగా ఉంది రా అబ్బాయ్! నా కోటు తీసి కప్పనా?—" అని అడిగాడు.

"అక్కర్లేదు తాతయ్యా" అన్నాను నేను. బండిలో ఒకప్రక్కకు మరింత ఒదిగికూచున్నాను. దూరంగా వంతెనవద్ద నాకేదో జరగనున్నట్టు కనుపిస్తున్నది.

"ఎందుకు అక్కర్లేదురా? చలికి వణికిపోతున్నావు — కను పిస్తూనే ఉంది" అన్నాడు తాతయ్య.

"ఇదేమంత పెద్ద చలికాదు తాతయ్యా. "మనిషి అన్నతరవాత దేనికైనా అలవాటు పడాలి!" అన్నాను.

ఇది నాకు తాతయ్య చెప్పినమాటే. ఆయనమాట ఆయనకే అప్పగించాను. ఇదివిని ఆయన కాస్త చకితుడైనాడు.

"ఓహో, అలాగా?" అన్నాడు, చిరునవ్వునవ్వి. బండిలో గడ్డి కాస్త తీసి బూట్లులేని నా పాదాలమీద కప్పాడు.

మేము 'చుమక్' రోడ్డుమీదికి వచ్చాం. సాయుధులైన ముగ్గురు అశ్వికులు చెట్ల చాటునుంచి నీడల్లావచ్చి మా బండిముందు నిలుచున్నారు. నేను భయంతో కేకపెట్టినంత పనిఅయింది. బండి తోలుతున్న తాతయ్య ఒకచేత్తో గుర్రాన్ని ఆపి, రెండవచేత్తో నన్ను పట్టుకున్నాడు. నీకేం

[illegible]. ఆ [illegible] గుడ్డుమీద [illegible]

[illegible] తో [illegible]

"[illegible]" [illegible]

[illegible] ఉంది. [illegible] తన [illegible]

"[illegible]" [illegible] ప్రత్యక్షమైంచేశాడు.

"[illegible]"

"[illegible]"

"[illegible]"

"[illegible]"

నేను [illegible]." [illegible]

[illegible] తాకి, [illegible] "[illegible] —" అని అడిగాడు.

"[illegible] —" [illegible] ప్రశ్న వేశాను. నన [illegible].

"ఎం పుతుంది" అన్నాడతను. "నీ పేరేమిటి? —" అని అడిగాను.

"మిఖైలో!"

"చక్కని పేరు....బడికి వెడుతున్నావా?"

"లేదు."

"బడికి వెళ్ళకపోవడమేమిటి? — తప్పు. ఎందుకని వెళ్ళడం లేదు? —"

"శీతాకాలం — నాకు బూట్లు లేవు."

"అవుతే మీరు భాగ్యవంతులు కారన్నమాట?"

నేను అతనివంక కోపంగా చూచాను. అతను నవ్వడం మొదలు పెట్టాడు. అప్పుడు నాకు కనుపించింది. అతని టోపీమీద ముందుభాగంలో పంచకోణ నక్షత్రం గుర్తు ఉన్నది, దాంతో నాకు భయం తొలగి పోయింది, అతను ఎర్రసైన్యానికి చెందినమనిషి. తరవాత అతను నవ్వడం ఆపి గంభీరంగా ఇలా అన్నాడు.

"ఈ రోజులలో పట్టి కాళ్ళతో తిరగడం అసాధారణమైన విషయం ఏమీకాదు నాయనా. మనమందరమూ పేదవాళ్ళమే. కానీ పేద వాళ్ళం అయినంతమాత్రాన బడికి పోగూడదని ఎక్కడాలేదు. నీవు బడికి వెళ్ళితీరాలని విప్లవం చెపుతున్నది, విప్లవం వర్ధిల్లడానికి నీవు చదువుకోడం ఎంతో అవసరం, అర్థమైందా? —"

"అంతేకాదు — ఇంకాఉంది!" అన్నాడు తాతయ్య తల ఊపుతూ.

"అంటే మీ ఉద్దేశ్యం? —" అని అడిగాను ఎర్ర సైనికుడు

"[illegible] అనకూడదా విప్లవం చెపుతున్నది...." అంటూ తాతయ్య [illegible] ప్రారంభించాడు. కానీ మధ్యలోనే ఆశ్వికులు ముగ్గురూ [illegible] చెప్పేసరికి తాతయ్య ఆగిపోయాడు.

"[illegible] పొరపాటు అంటారా?—"అడిగాడు తాతయ్య.

"[illegible] చెప్పారు. కానీ దాని అర్థం అంతా అది మాత్రమే కాదు." [illegible] మళ్ళీ మొదటి ఆశ్వికుడు.

"అర్థం [illegible] తెలుస్తుందా? మనిషికి కడుపునిండా తిండి ఉండాలి. తిండి [illegible] పనివాడెవడున్నాడు? ప్రతి ఒక్కరికీ అది కావాలి. ఎప్పుడూ కావాలి. మనపిల్లలు పొట్టకోసం పనిచేస్తూ బడికి వెళ్ళనిరోజులున్నాయి. అందువల్లనే మనకు బుద్ధి, తెలివి లేకుండా పోయాయి." అని చెప్పాడు తాతయ్య.

"చాలా [illegible] చెప్పారండీమీరు! సారాంశం అంతా ఒక్క ముక్కలో చెప్పారే!—" అంటూ ఆశ్వికులు మళ్ళీ నవ్వారు. "కానీ మీరు మీ మనమణ్ణి బడికి పంపించితీరాలి. బూట్లు ప్రధానంకాదు, కాళ్ళకు బూట్లు లేకుండానే మనం యుద్ధానికి వెళ్ళాం, ఇది జరిగి ఎంతోకాలం కాలేదు."

ఆశ్వికులు మా దగ్గర సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయారు. గుఱ్ఱాల మీద వాళ్ళు దౌడుతీస్తూ వెళుతుంటే వెన్నెల్లో వాళ్ళ దుస్తులు తళతళలాడాయి, భుజాలమీద వ్రేలాడుతున్న తుపాకులు చప్పుడైనాయి. అంతలో అకస్మాత్తుగా ఒక మెల్లని, చల్లనిపాట వినవచ్చింది.

రావే, రావే ఓ సంధ్యతార!
రావే, రావే ఓ శుక్రతార!
చిక్కని, చిక్కని ఆ కొండకొమ్మున
ఉదయించవే సంధ్యతార!!

ప్రాచీనమైన చుమకీరోడ్డు, ఆకాశం [illegible] విస్సచెట్లు, పొలాలు—అంతటా పాట ప్రతిధ్వని [illegible]ంది.

నేను పాటవిన్నాను. ఆకాశం. స[illegible] [illegible]—అన్నీ ఒకానొక విషాద భరితమగు ఆనందంలో [illegible]మాయి.

పాట ఆగిపోయింది, ఆశ్చ[illegible] [illegible]. తాతయ్య మరొకసారి తలపంకించి బరువుగా నిశ్వ[illegible], [illegible]తాను ఏదో గొణిగాడు. తరువాత నావంకచూచి "[illegible]. షెవ్ చెంకోకూడా వట్టిచాళ్ళతోనే ఒడికి వెళ్ళా[illegible] [illegible] ఎంత దుర్భరమైన పరిస్థితులలో జీవించాం! ఒరే [illegible] [illegible] జీవించి ఉండాలి. అంటే — నేను స్వ[illegible] [illegible] పట్టుకుని బడికి తీసుకవెడతాను." అన్నాడు.

"నిజంగానా తాతయ్యా? —" నా [illegible] గాద్గదికమైంది. హృదయం వేగంగా కొట్టుకున్నది.

"అవునురా, సరిగ్గా అతను చెప్పినట్టే చేద్దాం."

"నాకొక పుస్తకం కూడా కొంటావా? —"

"ఓ! కొంటాను. మనమే స్వ[illegible]గా [illegible] [illegible]యారుచేసు కుందాం. నీకొక సిల్కుచొక్కా కుట్టిస్తాను. [illegible] మనం అవసర మైన డబ్బు కూడబెట్టుకుందాం. నీకు [illegible] బూట్లు కొంటాం. అవి వేసుకుని నీవు 'టపటప' మనిపిస్తూ [illegible] [illegible]తుంటే, చూచిన వాళ్ళకు కళ్ళు మిరుమిట్లు గొలుపాలి."

"నిజంగానా తాతయ్యా? —" [illegible] [illegible]తటిసుఖం, అదృష్టం లభిస్తుందా? నేను నమ్మలేక [illegible] [illegible] ఆనందం పట్టపగ్గాలు లేకుండా ఉంది. తాతయ్యకు [illegible] [illegible].

కవి తన పాటలో వర్ణించిన సంధ్యతార. నా భావిజీవితాన్ని ఉజ్వలంగా ప్రకాశింపజేసే ఆ సంధ్యతార ఆకాశంలో ఎక్కడ ఎప్పుడు ఉదయిస్తుందా అని అన్వేషించసాగాను.

ఆరాత్రి హర్షవిషాదాలు రెండూ చెట్టాపట్టాలు పట్టుకుని ప్రక్క ప్రక్కనే నడిచాయి.

ఇల్లు చేరేవరకూ నేను బండిలోకునికి పాట్లుపడ్డాను. మధ్యమధ్య మెలకువ వస్తున్నది. కాస్త కన్ను మూయగానే కల! నేను బండిలో ఉన్నానట. కన్ను తెరవగానే నా నెత్తిపైన గగనంలో తారలు తళతళ ప్రకాశిస్తూ కనుపించాయి. కానీ మళ్ళీ వెంటనే పుస్తకాలసంచీ, బుజాన వేసుకుని నేను బడిలో ఉన్నాను. చేతులో పెన్సులు, కాళ్ళకు బూట్లు!

మేం ఇల్లు చేరేసరికి చంద్రుడు పశ్చిమ దిశకు వాలిపోయాడు. నిద్రపోతున్న నన్ను ఎత్తుకుని బండిలోనుంచి దింపాడు తాతయ్య. నిశ్చల నిశ్శబ్ద నిశీధిలో మాఇల్లు, తోట, దొడ్డి, చెట్లు — ప్రకృతీ, అన్నీ ప్రశాంత గంభీర వాతావరణంలో మునిగి ఉన్నాయి. మంచు నిండిన చెట్లు, మసక మసకగా ఉన్న వెన్నెలవెలుగులో ఒక వినూత్న శోభను సంతరించుకుని, ఏదో అదృశ్యహస్తం వాటిని తాకుతున్నట్టుగా మెల్లమెల్లగా ఊగుతున్నాయి. ఒక బేరీ చెట్టునుండి ఒక బేరీపండు కొమ్మలమధ్యనుండి జారుతూవచ్చి క్రిందపడి చిన్న శబ్దం అయింది. మళ్ళీ నిశ్శబ్దం!

"ఈ ప్రపంచం, ప్రకృతి ఎంత అద్భుతంగా ఉన్నాయి!" అని తనలోతాను అనుకున్నాడు తాతయ్య. ఆ నిశ్చలనిశ్శబ్దంలో ఆయన ఒంటరిగా నిలవబడి ఏవేవో ఊహించుకుంటున్నాడు. గుఱ్ఱం ఆయనదగ్గరికి వచ్చి నిలుచున్నది. ఆయన దాని మెడమీద చెయ్యివేశాడు, "ఇహ

నిన్ను కట్టివేస్తానే — పాపం నీవుకూడా నిద్రపోయే వేళఅయింది." అన్నాడు .... "మిఖైలో! మీ అమ్మను, అవ్వను నిద్ర లేపవద్దు. వాళ్ళు పనివల్ల అలసిపోయి ఉంటారు. నిద్ర పోనివ్వు. మనం ధాన్యపు కొట్లోకివెళ్ళి అక్కడ గడ్డి కుప్పలో హాయిగా పడుకుందాం. ఏమం టావు?—" అన్నాడు.

"అలాగే తాతయ్యా ఇంట్లోకన్నా అక్కడే ఎంతోహాయిగా ఉంటుంది! మనిషి అయినవాడు దేనికైనా అలవాటుపడాలి." తాతయ్య లోగడచెప్పిన మాట ఇప్పుడు మళ్ళీ చెప్పాను

"అవును - పద, పరుగెత్తు. నేను నీ వెనకాలేవస్తాను." అన్నాడు తాతయ్య. ముడతలుపడిన ఆయనముఖంలో వృద్ధాప్యం గూడు కట్టు కున్నది. ఇన్నేళ్ళుగా నిరంతరం ఆయన పడినశ్రమ. తపన ముఖంలో గోచరిస్తున్నాయి.

"నీవు తొందరగా రావాలి తాతయ్యా!" అన్నాను.

"తొందరగా రాక ఏంచేస్తానురా? నీలాంటి మనమణ్ణి ఒంటరిగా వదలి పెడతానా?—"

"ఎప్పుడూ అలాగే చెపుతావు. కానీ మళ్ళీ మామూలు ప్రకారం అవ్వ పడుకునేచోట కిటికీదగ్గర బెంచీమీద వెళ్ళి పడుకుంటావు!—"

"ఈ రాత్రి అక్కడ పడుకోనులే. ఇవాళ చాలా చలిగాఉంది." ఆయన ఒక చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు ఎంత అద్భుతంగాఉంది! మళ్ళీ ఆయనమనస్సులో ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది. చెయ్యి ఊపుతూ "వెళ్ళరా. వెళ్ళు. పరుగెత్తు!" అన్నాడు.

నేను ధాన్యపు కొట్లోకి పరుగుతీశాను. అక్కడ గడ్డికుప్ప ఎక్కి. పైన గడ్డి కప్పుకుని పడుకున్నాను. 'మెయిదానీ' అడవిప్రాంతంలో

కనుపించిన ఆశ్వికులు, వాళ్ళ సంభాషణ, నేను బడికివెళ్ళే విషయం — అన్నీ ఒక్కసారి తలపునకు వచ్చాయి. వాళ్ళు నా పేరు అడిగారు, నన్ను చదువుకోమని చెప్పారు. అవును. త్వరలోనే మళ్ళీ బడికివెళ్ళి బాగా చదువుకుంటాను.

కానీ ఇంతసేపైనా తాతయ్య రాదేమిటి? కళ్ళు బరువెక్కి మూత పడుతున్నా అలాగే బంవంతాన తెరిచి చూచాను. లేచి కూచున్నాను. ధాన్యపు కొట్టు గోడపగుళ్ళలోనుంచి సన్నని వెన్నెల వెలుగు దూసుకుంటూవచ్చి గడ్డికుప్పమీద పడింది. అవతలనుంచి గుఱ్ఱం మూల్గుడు వినిపించింది. తాతయ్య దానితో ఏదో చెపుతున్నాడు. ఫరవాలేదు. తాతయ్య వచ్చి పడుకుంటాడు అని నేను మనస్సు గట్టిచేసుకుని మళ్ళీ కళ్ళుమూసుకున్నాను. నిద్రపట్టింది. గాఢ సుషుప్తిలో మునిగిపోయాను. ఏదో చెప్పలేనంత దుఃఖం పారాడుతూవచ్చి మా ఇంట్లో ప్రవేశిస్తున్నదనే సంగతి నాకు తెలియనే తెలియదు.

తాతయ్య గుఱ్ఱానికి నీళ్ళుతాపి, దాన్ని కట్టివేశాడు. కాసేపు తోటలో తిరిగాడు. చెట్లతో మాట్లాడాడు! ఎవరెవరినో మనస్సులో తలచుకున్నాడు. తరవాత ఆయనకు నిద్రవచ్చింది. ఎప్పటిలాగా అవ్వ పడుకునేచోట కిటికీదగ్గర బెంచీమీద వెళ్ళి పడుకున్నాడు. అంతే!

మాతాత, అవ్వ — వారి జీవితాలు పరిసమాప్తమయ్యే సమయం ఆసన్నమైంది. అప్పటికీ వాళ్ళు వృద్ధుల్లా ఉండరు. అప్పుడే వివాహమైన నూతన వధూవరులలా కనుపిస్తారు. ఆవిధంగా ప్రవర్తిస్తారు. ఒకరిమీద ఒకరికి ప్రేమ, దయ. ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకుంటారు, ఒకరినొకరు గౌరవించుకుంటారు. సజ్జనులపట్ల ఎలా ప్రవర్తించాలో వారికి తెలుసు. పొట్టకోసం నిత్యం పాటుపడే శ్రమ

జీవుల మనోభావాలు, వాళ్ళ కష్టసుఖాలు, వాళ్ళవేదన, తపన—ఇవన్నీ వారిద్దరికీ తెలిసినట్టు మరెవరికీ తెలియదు. కానీ వారికి తెలియంది ఒక్కటే - తమ ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో వారిరువురికీ తెలియదు. తనభార్య కిటికీదగ్గర మంచులో పడుకోడమే చివరకు మా తాతయ్య ప్రాణాలు హరించింది. ఆయనకు తీవ్రంగా జలుబుపట్టింది. శీతలం కమ్మి ఊపిరితిత్తులను పాడుచేసింది. మరునాటి ఉదయం నిద్ర లేచి ఆయన, ఛాతీలో నొప్పిగా ఉన్నదని అన్నాడు. ఎన్ని ఉపచారాలూ, మామూలు వైద్యాలూచేసినా ఆనొప్పి తగ్గలేదు. ఒక గ్లాసెడు 'వోడ్కా' త్రాగించినా ప్రయోజనం లేకపోయింది.

"అంతే! మూడురోజులలో ఆయన జీవితం ముగిసింది! ఆయన చనిపోయాడు. శవపేటికమీద ఆయనను పడుకోబెట్టారు. నేను ఏడ్చాను, వెక్కి వెక్కి ఏడ్చాను. పదేపదే పిలిచాను, తట్టిలేపాను. బ్రతిమాలాను, కానీ లాభం లేకపోయింది, నా పిలుపు ఆయన వినిపించుకోకపోవడం ఇదే తొలిసారి! ఇహ నా పిలుపు ఆయనకు వినిపించదు. ఇహ ఆయన చల్లనిచూపు నాకు కనుపించదు!

తరవాత అవ్వ ఎక్కువరోజులు జీవించలేదు. దిగులుతో, విచారంతో ఆమె మంచం పట్టింది. తనకు అంత్య ఘడియలు సమీపించాయని తెలుసుకున్నది. మంచంమీది నుంచి లేచింది. ఇల్లంతా బూజు దులిపింది. గోడలకు సున్నం పూసింది. నేలయావత్తూ చిమ్మి అలికింది. తరవాత తోటలోకి వెళ్ళింది. రకరకాల పూలు కోసుకునివచ్చి గదిలో చల్లింది. తన బంధువులకోసం కబురు పంపింది!

ఆ రాత్రి మాఅవ్వ, కిరసనాయలుదీపం వెలుతురులో అందరితో కలిసి భోజనానికి కూచున్నది. అదే చివరి రాత్రి! ఇహ ఇప్పుడు ఆమె

దృష్టి ఈ లోకంమీదలేదు. పరలోకాన్ని గురించే ఆమెఆలోచనలు. ఆమె ఇహ ఈలోకం విడిచివెడుతున్నదనీ, అందరిదగ్గరా సెలవు పుచ్చుకుని పోతున్నదనీ ఎవరూ ఊహించలేదు. ఎవరనుకుంటారు? ఆనాడేకదా ఆమె ఇల్లంతా అలికి, సున్నంపూసి ఐండెడు చాకిరీ చేసింది? ఆమెకు జబ్బు ఏమున్నది కనుక? ఫలానా రోగంతో బాధపడుతున్నానని ఎవరితోనూ అనలేదే? అవును. ఆమెకు వ్యాధిలేదు. ఉన్నదల్లా మనోవ్యాధి। దిగులు, దుఃఖం. తీరని, ఆరని దుఃఖం అంతే। ఆ దుఃఖమే ఆమెను లోలోపల క్రుంగదీసింది. ఆమరునాడే ఆమె శాశ్వతంగా ఈలోకం విడిచివెళ్ళింది. మా తాతయ్య ప్రక్కనే ఆమెను ఖననం చేశారు. కాలంకూడా కన్నీరు కార్చింది। ఆమె శవపేటికచుట్టూ జనంపోగై విలపించారు. శ్మశాన వాటికలోని ఒక పండ్లచెట్టునుండి ఒక పండురాలి ఆమెమీద పడింది. అవును పరలోకంలోకూడా అవ్వ ఒక పండ్లతోట వేసి పెంచుతుంది।

—o—

అధ్యాయం: ఎనిమిది

ఆకులు గలగల రాలాయి. కొండ రావిచెట్లు వంకర్లు తిరిగి వంగిపోయాయి. శిశిరం హసించింది; శోకించింది; దుఃఖాశ్రువులు, ఆనంద బాష్పాలు రాల్చింది! నా హృదయవేదన ఇనుమడించి, దుర్భరమైంది. ఇహ నాకీ లోకంలో వెలుగు దూరమైపోయినట్టనిపించింది. రోజులు బరువుగా, భారంగా గడుస్తున్నాయి. హాయిలేదు; ఆనందంలేదు. రాత్రిళ్ల గడపడం మరీ కష్టంగాఉంది, తోచదు, నిద్రపట్టదు. మధ్యలో ఎన్నో సార్లు లేచి కూచుంటాను. కన్నీళ్ళతో ముఖం తడిసిముద్దయి ఉంటుంది. అమ్మ నా కన్నీళ్ళుతుడుస్తుంది. చల్లని మెల్లని హస్తస్పర్శతో నన్ను బుజ్జగిస్తుంది ఓదారుస్తుంది. నా దుఃఖం చల్లార్చడానికి ఎన్నెన్నో చెప్తుంది.

"ఏడవకు మిఖైలో! ఏడవకు, ప్రతిఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోవలసిందే నాయనా, చూడు! ఆ చుక్కలుచూడు!" అంటూ నిర్మల నీలాకాశం చూపుతుంది. కిటికీలోనుంచి నక్షత్రాలు పూలవలె పరుచుకున్న నభోమండలం కనుపిస్తుంది. "ఆ నక్షత్రాలుకూడా ఎప్పుడో రాలిపోవలసినవే!—" అంటుంది అమ్మ.

"చుక్కలు రాలిపోవడం నాకిష్టంలేదమ్మా" అంటూ నేను వెక్కి వెక్కి ఏడుస్తాను. నల్లటిమబ్బు తునక ఒకటి దొంగలావచ్చి నిర్మలంగాఉన్న ఆకాశంపై కమ్ముకుంటుంది.

"మనకు ఇష్టంలేని విషయాలు ఎన్నో ఉన్నాయిరా, మిఖైలో! కానీ జీవితం దాని మార్గాన అది నడుస్తుంది. కొందరు జీవితం విడిచి

పోతారు. కొందరు ఆజీవితంలో ప్రవేశిస్తారు. కానీ ప్రతిఒక్కరూ భవిష్యత్తులో ఏదో మంచి జరగాలని ఆశిస్తారు. పడుకోనాయనా, వెళ్ళి పడుకో."

అమ్మ ఒడిలో పడుకుని నిద్రపోతాను. నాకు కలలువస్తాయి. తాత, అవ్వ ఏదో ఒకమార్గాన వెడుతుంటారు. నేనెన్నడూ చూడని బాట అది. మానవులలాగా, పండిన ఆకులలాగా చుక్కలుకూడా రాలిపోవడం కనుపిస్తుంది!

అడవులలోకి వెళ్ళినా ఇప్పుడు నాకు ఆనందంలేదు. వాటి అందచందాలన్నీ ఎవరో దోచుకునిపోయారు. ఇప్పుడవి నాకళ్ళకు నిర్జీవంగా నిస్తేజంగా కనుపిస్తున్నవి. ఒకప్పుడు పుట్టకొక్కులు కంటపడితే ఎంతో మురిసిపోయే నేను - ఇప్పుడవి కనుపిస్తే అనాసక్తంగా ఉంటున్నాను. వాటిని చాకుతో కోసితీసుకోడంలేదు. 'అవికూడా జీవించ గలిగినన్నాళ్ళు జీవించనీ!' అని ఊరుకుంటున్నాను.

ఒకనాడు నేను మామూలుగా గుఱ్ఱాన్ని తోలుకుని అరణ్య ప్రాంతానికి వెళ్ళాను. గడ్డిమోయడానికి దాన్ని విడిచిపెట్టి పరధ్యాన్నంగా నిలుచుండి ఉన్నాను. అప్పుడు దూరంగా చెట్లమధ్యనుంచి ల్యూబా రావడం కనుపించింది. అల్లంతదూరంనుంచి నన్ను చూడగానె ఆ అమ్మాయి సంతోషంతో ఒక వెఱ్ఱి కేకపెట్టింది. తలకు కట్టుకున్న రుమాలు సవరించుకుని పరుగెత్తుకుంటూ నాదగ్గరికి వచ్చింది.

"బాగున్నావా మిఖైలో?—" అంటూ పలకరించింది. "నీవు ఇక్కడ కనుపిస్తావని నాకు తెలుసు.—" ఇలా అని నన్ను సమీపించి తన చెయ్యి నాకు అందించింది. "నీవిక్కడ ఏంచేస్తున్నావు ల్యూబా?-" అని అడిగాను.

"నేను చెప్పను."

"ఎందుకని?—తోటకు వెడుతున్నావా?—"

"లేదు" ఇలాఅని ల్యూబా తలవాల్చుకున్నది క్రింద రాలిపడి ఉన్న ఎండుటాకులు కాలి బొటనవ్రేలితో కదిలించడం మొదలుపెట్టింది. "నీకోసమే వచ్చాను మిఖైలో! —" అన్నది.

"నాకోసం ఎందుకువస్తావు?—" అని అడిగాను, నమ్మకం లేనట్లు చూస్తూ.

"ఎందుకురానూ? నీవు కష్టంలో ఉన్నావని నాకుతెలుసు. కష్టంలో ఎవరికైనా హృదయవేదన ఉంటుంది. అందుకే నిన్ను చూడాలను కున్నాను. నీకోసం ఒకసారి మీఇంటికికూడా వచ్చాను. లోపలికి రావ డానికి భయం వేసింది."

"నీ అభిమానానికి ధన్యవాదాలు ల్యూబా."

"ధన్యవాదాలు చెప్పనక్కర్లేదులే." ఇలా అని ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వింది. "నాకో చెల్లెలు పుట్టింది మిఖైలో!—" అన్నది.

"బుల్లిపాపాయా?—"

"అవును—బుల్లి అమ్మాయి—" అన్నది ల్యూబా నవ్వి— "ఉయ్యాలలో పడుకుని పెదవులు చప్పరించడంతప్ప ఇంకేమీ చేయ లేదు." అన్నది.

"ఎలాఉంటుంది? చక్కనిదేనా?—"

"ఓ! కానీ దానికి కనుబొమలులేవు:"

"అసలు లేవా?—"

"అసలే లేవు! కనుబొమలు ఉండవలసిన చోట గుంటగా దార లున్నాయి. అంతే! తమాషాగా లేదూ?—"

"హుఁ!" అన్నానునేను. విపరీతవిషయాలనుగురించి ఏమి చెప్పాలో నాకు తెలియదు.

"ఇప్పుడు నేను బడికి వెడుతున్నాను. మేం కూచునేగదిలో రెండు 'గ్రూపు'లకు చెందిన పిల్లలున్నారు. చిన్నపిల్లలు ముందువైపు కూచుంటారు. పెద్దవాళ్లు వెనకాల కూచుంటారు. టీచర్ నన్ను మొట్టమొదటి బెంచీమీదనే కూచోబెట్టారు." ఈ విషయం గొప్పగా చెప్పుకున్నది ల్యూబా.

"మరి నీకు బూట్లు ఏవీ?—" అని అడిగాను ఆవిడ వట్టి కాళ్ల వంక చూస్తూ. నాకుకూడా లేవన్న విషయం మనస్సులోకివచ్చి బరువుగా నిశ్వసించాను.

"నాకు బూట్లున్నాయి. కానీ వాటిని భద్రంగా కాపాడుకుంటున్నాను. రెండేండ్ల వరకూ వాటితోనే గడుపుకోవాలి—అందుకని.... సరే మా తోటలోకి వెడదామా మిఖైలో?—"

"నీవు తప్పనిసరిగా వెళ్లాలా?"

"లేదు — కానీ మనం ఒకసారి నీటికుక్క బొరియ, కాటుక పిట్టగూడు నీటిబుగ్గ చూచి రావచ్చు. ఏమంటావు?—"

"సరే—" — మేం చెట్టాపట్టాలు పట్టుకుని పరుగుతీస్తూ తోట దగ్గరికి వెళ్ళాం.

మొదట చెర్రీ చెట్టుదగ్గరికి వెళ్ళాం. వెనకటివిషయం నాకు జ్ఞాపకం వచ్చింది. గత పేసవికాలంలో ఒక ఉదయాన, నేనిక్కడికి రావడం, వాసిలీనా అత్తయ్య మనోహరంగా పాటపాడుతూ చెట్లమధ్య తిరుగుతూఉండడం — ఆ దృశ్యమంతా ఇప్పుడు మరల నా కనుల ముందు ఘాడగట్టింది.

పైన ఎర్రని వస్త్రం కప్పుకుని ఎక్కడికో ప్రయాణమై పోతు న్నట్లు కనుపించింది ఇప్పుడు చెర్రీచెట్టు.

"మా అత్తయ్య వాసిలీనాను గురించి నీవు ఏమీ వినలేదా?" అని అడిగింది ల్యూబా, చెట్టు బోదెమీద ఎండిన బెరుడు వలుస్తూ.

"వినలేదే — ఎందుకూ? ఏమైంది ఆమె?" అని అడిగాను. భర్త ఆవిడనుచూచి ఎప్పుడూ అసూయపడుతుంటాడని ల్యూబా చెప్పిన విషయం నాకు జ్ఞాపకం వచ్చింది.

"చెడు ఏమీ జరగలేదు." అన్నది ల్యూబా. ఆ అమ్మాయి ముఖంలోకి ఏదో వెలుగువచ్చింది. "ఆమెనుగురించీ, ఆమె గాన మాధు ర్యాన్నిగురించీ పత్రికలలో వ్రాస్తున్నారు. మా అత్తయ్యనుగురించి ఇలా గొప్పగా పత్రికలలో వ్రాస్తారని ఎవరైనా అనుకున్నారా?—" అన్నది.

"కాలం మారింది" అన్నాను. సెబాస్టియన్ మామయ్య చెప్పిన మాట మళ్లీ ఇప్పుడు చెప్పాను. "మరి ఆమె భర్తసంగతి? కమ్మని కంఠంతో అందరినీ ఆకర్షిస్తున్నందుకు భర్త ఇప్పటికీ ఆమెను తిట్టిపోస్తు న్నాడా?" అని అడిగాను.

"లేదు. ఇప్పుడాయన పూర్తిగా మారిపోయాడు; పిల్లికూనలా నోరెత్తడు! వాసిలీనా అత్తయ్య అంటే ప్రాణాలు విడుస్తున్నాడు! ఆమెకోసమని బస్తీకిపోయి అక్కడే ఉంటున్నాడు. 'నాకోసం ఒక్క పాట పాడు! నీ నోటికి పంచదార చిలకలు అందిస్తాను. ఇంక నాకేమీ అక్కర్లేదు. రోజంతా ఇక్కడేపడి ఉంటాను!' అని అంటున్నాడు కూడా." ఇలా చెప్పి కిలకిల నవ్వింది ల్యూబా.

యాపిల్ చెట్టు కొమ్మమీద కాటుకపిట్టగూడు కనుపించింది. కాపీ పట్టిగూడు. పిట్ట ఎక్కడికో ఎగిరిపోయింది! పిట్ట ఈకలు మాత్రం

గూటిలో కనుపిస్తున్నాయి: చెట్టుక్రింద నీటి కుక్క అడుగులజాడ కనపించింది.

"అదితరచుగా ఇక్కడికివచ్చి ఏదో గమ్మత్తుచేసిపోతూ ఉంటుంది!" అన్నది ల్యూబా, నేలమీదికి వంగి అడుగులజాడ పరిశీలిస్తూ.

నీటికుక్క బొరియదగ్గర ఎండిన ఆకులు గుట్టపోసి ఉన్నాయి. శీతాకాలంలో పడుకోడానికి అది ఈ ఏర్పాటుచేసుకున్నదని ల్యూబా నాకు చెప్పింది.

ల్యూబా ఇంకా ఎన్నెన్నోకబుర్లు చెప్పింది. సెలఏరు గలగల ధ్వనులు చేసినట్లుగా ఆ అమ్మాయి ఏదేదో మాట్లాడుతూనే ఉంది. అవన్నీ వింటూఉంటే నా దిగులు, విచారం క్రమేణా అంతరించాయి. ప్రొద్దు క్రుంకేవేళ మేం ఇరువురం మా గుఱ్ఱంమీద ఎక్కాం. ల్యూబా ముందరి వైపు కూచున్నది. ఇంటికి బయలుదేరాం.

మేం ఊరు సమీపించాం. ఇహ తాను గుఱ్ఱం దిగి నడిచివెదతా నన్నది ల్యూబా.

"ఎందుకూ ?—" అని అడిగాను.

"అలా చేయడమే మంచిది!—" అన్నది ల్యూబా. ఏవో సిగ్గు వచ్చి ఆ అమ్మాయి ముఖంలో ముసురుకున్నది.

"నీవు నడిచి ఎందుకు వెళ్ళాలో నాకు అర్థం కావడంలేదు." అన్నాను మళ్ళీ అమాయకంగా.

"మనిద్దరం గుఱ్ఱం మీద కూచోడం ఎవరైనా కుర్రవాళ్ళు చూస్తే ఏడిపిస్తారు! నీకుతెలియదు, వాళ్ళు వట్టి కొంటెపిల్లలు!" అన్నదిల్యూబా.

నేను గుఱ్ఱంమీదనుంచి దూకాను. చెయ్యిపట్టుకుని ల్యూబానుదింపాను. ల్యూబా మళ్ళీనాకు చెయ్యి అందించింది. తరవాత వెళ్ళిపోయింది. కను

చూపుదాటి వెళ్ళిపోయేవరకూ నేను అలాగే తదేకంగా చూస్తూ నిలుచుండి పోయాను.

ఎన్నడూలేనిది ఇవాళ మా ఇంట్లో బయటివాకిలి బార్లగా తెరచి ఉన్నది. ఎందుకా అనుకున్నాను. మా ఇంటికి ఎవరైనా వచ్చారా ? వచ్చారనుకుందామా అంటే వాకిలిముందు బండీ, గుఱ్ఱం - ఏవీలేవు. నేను గుఱ్ఱం దిగి, దాన్ని దొడ్లోకి తీసుకుని పోయాను. గుఱ్ఱాన్ని కట్టి వేస్తూ ఉండగా వెనక నుంచి ఎవరోవచ్చి బలమైన చేతులతో నన్ను ఎత్తుకుని గుండెలకు హత్తుకున్నారు. ఏదో తెలియని ఆనందం నాలో పొంగివచ్చింది. దాంతోపాటు ఏదో భయంకూడా నన్ను చుట్టుముట్టింది. నేను గట్టిగా కళ్ళుమూసుకున్నాను. తరవాత నేను మళ్ళీ కళ్ళు తెరిచి చూచేటప్పటికి నాకు ఒక ముఖం కనుపించింది. అది నాకు చిరపరిచిత మైన ముఖం; కానీ పరిచయంలేని ఏదో కొత్తముఖం కూడా ! మళ్ళీ కళ్ళుమూసుకున్నాను.

"నన్ను గుర్తుపట్టలేదట్రా మిఖైలో ?" అని అడిగాడాయన. పొడుగాటి మనిషి. విశాలము, సమున్నతము అయిన వక్షస్థలం. బలమైన చేతులు. సగానికి కత్తిరించిన మీసాలు ఇలా అడుగుతూ ఆయన, నన్ను మరింత గట్టిగా అదుముకున్నాడు.

"నేను గుర్తుపట్టలేదు." అన్నాను నంగిమాటతో. నాకు తెలిసీ తెలియని మనిషి ఆయన! ఆయన కౌగిట్లో ఉన్నంతసేపూ నాకు ఏదో చెప్పలేనంత మహదానందం కలిగింది.

"మీరు ఎక్కడనుంచి వచ్చారు?—" అని అడిగాను చివరకు.

"నేను మీ నాన్ననురా; మిఖైలో!" అంటూ ఆయన నన్ను పదే పదే ముద్దాడాడు. "ఇప్పుడైనా గుర్తువచ్చిందాలేదా?—" అని అడిగాడు మళ్ళీ.

"లేదు." అని చెప్పాను.

"అరి, భగవంతుడా!" అంటూ ఆయన బరువుగా నిశ్వసించాడు. ఆయన కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. కంఠం రుద్ధమైంది.

ఆయన చెప్పింది నిజమే. ఆయనను నేను ఎరుగుదును. కానీ మళ్ళీ ఎరుగనుకూడా! ఆయన కంఠస్వరం గడచినరోజులు ఎన్నోదాటి, ఎంతోదూరం నుంచి నడచి, నావద్దకు వచ్చినట్టనిపించింది నాకు. ఆయన కళ్ళు నేను ఎప్పుడో, ఎక్కడో చూచాను! కానీ ఎప్పుడో, ఎక్కడో జ్ఞాపకం లేదు. అయినప్పటికీ ఆయన చేతులలో వాలిపోయి ఉంటే నాకు ఎంతో హాయిగా ఉంది. ఆయన నాతల, పాదాలు నిమురుతూ ఉంటే ఏదో ఆనందంలో తేలిపోతున్నట్టు అనిపించింది.

అమ్మ చిరునవ్వు నవ్వుతూ మాదగ్గరికి వచ్చింది.

"నీవు ఆయన్ను గుర్తుపట్టలేదుట్రా?—" అని అడిగింది.

"లేదమ్మా."

"ఆయన మీ నాన్నరా, వెఱ్ఱివాడా! ఆయన ఇన్నాళ్ళకువస్తే ఒక్క మాట అయినా మాట్లాడవేంరా?—"

కానీ నేను మాట్లాడలేక పోయాను. ఏం చెప్పాలో తెలియలేదు. మాటపెగిలి రాలేదు. నా గొంతు మూగవోయింది. నన్ను నాన్న అలాగే ఎత్తుకుని ఇంట్లోకి తీసుకుని వెళ్ళాడు. అక్కడ ట్రంకుపెట్టెమీద ఆయన కోటు కనుపించింది. సైన్యంలోవారు వేసుకునే కోటు అది. ఆయన నన్నుదించి, నావంక కాసేపుచూస్తూ నిలుచున్నాడు. తరవాత తనలోతాను నవ్వుకుంటూ ఇలా అన్నాడు:

"ఏమిరా మొద్దూ! నీకు మాటలేరావా ఏమిట్రా?—"

"కాసేపు ఆగిచూడండి! మీకే తెలుస్తుంది!" అన్నది అమ్మ నవ్వి.

"ఆగుతాను, ఆగిచూస్తాను. అంతకన్నా చేసేదేముంది?.... రేపు వాణ్ణి బడికితీసుకుని వెడితే ..."

"బడికి తీసుకుని వెడతావా?—"అని చిన్నకేక పెట్టాను ఆయన కళ్ళల్లోకి పరిశీలించి చూచాను.

"తప్పక తీసుకపోతాను. బడికి వెళ్ళాలని ఉందా నీకు?—"

"ఓ! వెళ్లాలి, వెళ్లాలి!—" అంటూ నాన్నచెయ్యి గట్టిగాపట్టుకున్నాను. ఆయన ఏదో ఆలోచిస్తూ చేతితో నాతల నిమిరాడు.

నాన్నతో మాట్లాడే అవకాశమే నాకు లేకపోయింది. మా ఇరుగు పొరుగు ఇళ్ళవారంతా అక్కడ పోగైనారు. కాసేపట్లో మా ఇల్లు జనంతో నిండిపోయింది. వారు ఏవేవో చినచిన్న కానుకలు తెచ్చి ఇచ్చారు. తరవాత ముచ్చట్లు మొదలైనాయి. వారు ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నారు. వ్యవసాయం, రాజకీయాలు, యుద్ధం, విదేశాల వైఖరి — వీటన్నిటిని గురించి వారు చాలాచాలా మాట్లాడుకున్నారు. నాకు నిద్రవచ్చింది. కునికిపాట్లు పడుతున్నాను. నాన్నమాటలు నాకు లీలగా చెవిని పడుతున్నాయి.

"ఎవరు ఎలాంటివైఖరి అవలంబించినా జయంమనదే-తప్పదు!-" అంటున్నాడు నాన్న.

ఆ మరునాడు నేను చక్కగా 'క్రాపు'చేయించుకున్నాను. స్నానం చేశాను. కొత్తబట్టలు కట్టుకున్నాను. నాన్న నన్ను బడికి తీసుకుని వెళ్ళాడు. బడిలో గంటకొట్టారు. పిల్లలంతా ఎటువాళ్లు అటు పరుగుతీసి తమ తమ తరగతులలోకి వెళ్లిపోతున్నారు. నాన్న నన్ను పాఠశాల ప్రధానోపాధ్యాయిని దగ్గరికి తీసుకుని వెళ్లాడు. ఆమె సన్నగా, తీగెలా ఉంటుంది. గోధుమవర్ణం జుట్టు.

"మీకొక కొత్త విద్యార్థిని తీసుకొచ్చాను నాస్త్యావాసిలీవ్నా! వాణ్ణి ఏదోవిధంగా బడిలో చేర్చువాలి—" అన్నాడు నాన్న.

"అలాగే!" అంటూ ఆమె చిరునవ్వు నవ్వింది. ఆమె చెక్కిళ్లపై సొట్టలుపడి అవికూడా నవ్వుతున్నట్టు కనపించాయి!.... "నీ పేరేమిటి?–" అని నన్ను అడిగింది.

"మిఖైలో."

"చదువుకోవాలని ఉందా?—"

"చదువుకోసం చచ్చిపోతున్నాను!—"

నా మాటలకు ఆమె పకపక నవ్వింది. ఆనవ్వునన్ను, రెక్కలపై కూచోబెట్టుకుని ఏదో లోకాలకు తీసుకుని పోయింది!

"మరేమీ లేదండీ — వాడికి చదువులేకుండా చాలాకాలం వృధా అయిపోయింది." అని చెప్పాడు నాన్న.

"నేను గ్రహించానులెండి!" అని టీచరు "చదవగలవా?—" అని నన్ను అడిగింది.

"వీడు పుస్తకాల కోసం ఊరంతా తిరుగుతూ ఉంటాడని ఇంట్లో మా ఆవిడ చెప్పుతున్నది." అన్నాడు నాన్న

"మంచిదే....నీకు చదవడం ఎవరు నేర్పారు?—"

"పిల్లలదగ్గరనే నేర్చుకున్నానండీ."

"సరే — ఇది చదివి వినిపించు," అంటూ ఆమె డెస్కుమీద ఉన్న ఒకపుస్తకం తీసి, అందులో ఒక పేజీ తెరిచి నా ముందు పెట్టింది. "ఈ పేజీ చదువు." అన్నది.

అది చదవడం నాకు ఎంతతేలికగా ఉందో చెప్పలేను అక్షరాలు తాటికాయలంతలావున ఉన్నాయి! నేను చీమంత చిన్నఅక్షరాలు చదవడం ఇదివరకే నేర్చుకున్నాను! అందువల్ల ఆ పుస్తకం చదవడం నాకొక లెక్కఅనిపించలేదు. నేను 'బ్రహ్మాండంగా' చదువుతానని

తెలియజేయడానికి గాను 'పుల్‌స్టాపులు. కామాలు' ఏవీ చూడకుండా, ఎక్కడా ఆపకుండా పేజీమొత్తం ఒక్కబిగిన చదివేశాను.

నాన్నముఖం సంతోషంతో 'ఇంత' అయింది। టీచరు నిర్ఘాంత పోయింది.

"ఇంకా గబగబా చదవగలవా?"—అని అడిగింది.

"ఆఁ. చదవగలను. ఏదైనా ఇవ్వండి." అన్నాను. ఫరవాలేదు, అనేధైర్యం నాకు ఏర్పడింది.

"మెల్లగాకూడా చదవగలవా?—"

"చదవమంటే అలాగే చదువుతాను- అన్నాను. తొందరగా చదవగలిగినప్పుడు మెల్లగాచదవడం దేనికా అని నాకు ఆశ్చర్యం కలిగింది.

"నీకు ఒంట్లు కూడా వచ్చునా?"

"ఆఁ। వెయ్యివరకూ వచ్చు?"

"మరి నీకు గుణకారం, ఎక్కాలు వచ్చునా?—"

"రావు. అవి నాకు తెలియవు."

అనిచెప్పాను నిశ్వసిస్తూ. నాకు ఇవి రానందుకు నాన్నగారు కూడా విచారించారు.

ఈ సమయంలో టీచరు అద్భుతమైన విషయం ఒకటి చెప్పింది. అది విని నాన్న పొంగిపోయాడు. నేను ఎగిరి గంతువేశాను।

"ఈ అబ్బాయిని రెండవగ్రూప్‌లో చేర్చుకుంటాం, పానాస్ డెమ్యానొవిచ్." అని చెప్పింది టీచరు.

"ధన్యవాదాలు!" అన్నాడు నాన్న గంభీరంగా. "తక్కిన పిల్ల లతో సమానంగా వీడు రాలేకపోయినట్లయితే ఆ విషయం నాకొక ఉత్తరం ముక్కద్వారా తెలియజేయండి." అన్నాడు.

టీచరు నా చెయ్యి పట్టుకుని రెండవ గ్రూపు పిల్లలుచదువుకునే గదిలోకి తీసుకువెళ్ళింది.

"నీ 'సీట్' ఇది మిఖైలో! నీవు ఇక్కడ కూర్చోవాలి." అని చెప్పి ఆమె ముగ్గురుపిల్లలుకూచునే ఒకబెంచీ చూపింది. "రేపువచ్చేటప్పుడు ఒక కలం, ఒక పెన్సిల్, సిరాబుడ్డి తెచ్చుకో. ఇవాళ నీకు పుస్తకాలు ఇస్తాను." అన్నది.

నా మనస్సు ఒక్కసారిగా ఇంటిమీదికి పరుగెత్తింది. "మొదట అమ్మకుచెబుతాను. నేనేమీ పనికిరాని వాణ్ణి కాదమ్మా. నన్ను బడిలో రెండవగ్రూప్ పిల్లలలో చేర్చుకున్నారు- అని చెబుతాను." అనుకున్నాను నాలో నేను.

"ఇహ నేను అడవికి వెళ్ళి పెద్దపెద్ద 'బెర్రీ'కాయలు, ఓక్‌చెట్టు బెరడూ తీసుకొచ్చి వాటిని నీళ్ళలోవేసి మరగపెట్టి సిరా చెయ్యాలి" అను కున్నాను.

ఆ రోజులలో మేం వాడే సిరా అదే.

మేం ఇంటికి వెళ్ళేసరికి అమ్మ, మికోలాహూదు మా రాకకోసం నిరీక్షిస్తున్నారు. నన్ను రెండవ గ్రూప్ విద్యార్థులలో చేర్చుకున్నారని నాన్న చెప్పాడు. అది విని అమ్మ ఎప్పుడూ అనేమాటే అన్నది "వాడి గతి ఏం కానున్నదో!"— అని. మా ఇంట్లో అందరికీ ఆనందంగా ఉన్నది. ఇహ నా సంగతి చెప్పనేఅక్కర్లేదు. నేను సంతోషంతో పొంగి పోతున్నాను

నేను బాగా చదువుకుంటున్నాను, కాళ్ళకు బూట్లు ఉన్నట్లయితే నిజానికి ఇంకా బాగాచదువుకునేవాణ్ణి. శీతాకాలం వచ్చి, వీధులలోని పల్లపు ప్రదేశాలలో మంచు, పెక్కులు కట్టడం ప్రారంభించగానే నేను దయ్యంపట్టినట్టు బడికి ఒకటే పరుగు తీసేవాణ్ణి. బహుశా దాని వల్లనే కాబోలు పరుగెత్తడంలో నేను మొనగాడనైనాను. ఆ ఊళ్ళో పిల్లలెవరూ కూడా నాతో సమానంగా పరుగెత్తలేకపోయేవారు. ఇందుకు నేను గర్వ పడేవాణ్ణి.

ఒకనాటి ఉదయం నిద్రలేవగానే నేల అంతటా మంచుకురిసి ఉండడం చూచాను. నా హృదయం విచారంతో క్రుంగిపోయింది. నేను బడికివెళ్ళడం ఎలాగ? నేనెలా ఆందోళన పడ్డానో మా నాన్న, అమ్మ కూడా ఈ విషయంలో అలాగే ఆందోళన చెందసాగారు.

ప్రొద్దున్నే ఉపాహారం తీసుకున్న తరువాత నాన్న ముతకకోటు ఒకటివేసుకుని తరువాత ఇలా అన్నాడు:

"మంచు కురవనీ కురవకపోనీ ___ మనం బడికి వెళ్ళవలసిందే-రా రా మిఖైలో!" ఇలా అని ఆయన నన్ను ఎత్తుకున్నాడు; కుందేలు చర్మంతో కుట్టినటోపి నా తలకు పెట్టాడు. తనకోటు కొస నా పాదాలకు చుట్టాడు.

"పాపం ఈ పసివెధవ బూట్లులేకుండా బడికి ఎలా వెళ తాడు? ___" అని అడిగింది అమ్మ.

"ఏం ఫరవాలేదు ___ సలక్షణంగా వెళతాడు" అన్నాడు నాన్న. "ఈ రోజుల్లో బూట్లు ప్రధానంకాదు." అన్నాడు.

"మరి ఏమిటి ప్రధానం? ___" అన్నది అమ్మ!

"పరిశుభ్రమైన దుస్తులు, నిర్మలమైన అంతఃకరణ." అన్నాడు నాన్న నవ్వి.....“అంతేనట్రా మిఖైలో?"

"అవును," అని చెప్పాను, నాన్న మెడకరుచుకుని. మేంవెడుతూ ఉంటే అమ్మ బరువుగా నిశ్వసిస్తూ నిలుచున్నది.

ఇలా పానాస్ తన కుమారుణ్ణి ఎత్తుకుని బడికి తీసుకుని వెడుతున్నాడని త్రోవపొడుగునా జనమంతా ఆశ్చర్యపోయి చూచారు. కొందరు కుర్రవాళ్ళు మావంక వ్రేలుపెట్టి చూపుతూ నవ్వారు. కానీ నన్ను ఇంటిదగ్గర అట్టిపెట్టకుండా నాన్న బడికితీసుకుని వెడుతున్నందుకు నేను ఆనందవార్ధిలో ఈదులాడాను!

శీతాకాలం ప్రారంభమైన తరవాత కొన్నాళ్ళవరకూ రోజూ ఇలాగే జరిగింది, ప్రతిరోజూ నాన్న నన్ను ఎత్తుకుని బడికితీసుకుని వెళ్ళేవాడు. పాఠాలు అయిపోయి బడి విడిచిపెట్టేవేళకు మళ్ళీవచ్చి నన్ను ఎత్తుకుని ఇంటికి తీసుకుని పోయేవాడు. మేమంతా—తక్కిన పిల్లలు, టీచరు, నేను—అందరమూ కూడా దీనికి అలవాటుపడిపోయాం. చలి తగలకుండా నాకాళ్ళకు నాన్న తన కోటు కప్పేవాడు,మంచి గుడ్డ ఏదీ! అని—ఈనాడు నన్ను ఎవరైనా అడిగితే మా నాన్న కోటు కుట్టించుకున్న గుడ్డలాంటిది ఎక్కడా లేదని నేను సమాధానం చెపుతాను. అది ముతక గుడ్డ. అయితేనేం? స్వదేశీ గుడ్డ!

ఒకనాడు హిమపాతం మరీ ఉధృతంగా ఉన్నందున నాన్న నాకోసం బడికిరావడం ఆలస్యమైంది. ఆయన సాయంకాలం వచ్చాడు. ఆయన వంటినిండా మంచు. మీసాలుకూడా మంచుపతెల్లగా అయినాయి, అయినా ఆయన చాలా ఉల్లాసంగా ఉన్నాడు. బడికి వచ్చి మా గదిలో ప్రవేశించాడు.

"బూట్లులేని చిన్న కుర్రవా డెక్కడ?—" అని అడిగాడు.

"ఇదిగో, ఇక్కడే ఉన్నాడు!"—అంటూ నేను గభాలున బెంచీ మీదనుంచి లేచి నిలుచున్నాను.

"ఎవరబ్బాయివి నీవు ?"—అని అడిగాడు నాన్న తమాషాగా.

"పానాస్ కుమారుణ్ణి !" అని చెప్పాను, నేను కూడా ఏమీ తెలియనట్లుగానే నటిస్తూ.

"అయితే ఇదిగో—తీసుకో !"—అంటూ నాన్న, ఒక 'బన్' నా చేతికి అందించాడు. అది మామూలు 'బన్' కాదు. దానిలో గసగసాలు కూడా ఉన్నాయి.

"నీవు సంతకు వెళ్ళావా నాన్నా ?"—అని అడిగాను, 'బన్' కొరికి తింటూ.

"వెళ్ళాను."

"ఏం కొనుక్కొని వచ్చావు ?"—

"చెపితే నీవు అదిరిపోతావు !—" అన్నాడు నాన్న, పరాచకాలాడుతూ. "ఇదిగో, చూడు !—" అంటూ కోటు జేబు విదిలించాడు. ఒక జత బూట్లు క్రింద పడ్డాయి ! అబ్బ ! చక్కని 'లెదర్ బూట్లు' !

నాకు నోటివెంట మాట రాలేదు. శిలాప్రతిమలా విలుచుండిపోయి బూట్లవంక చూచాను. తరవాత నాన్నవంక చూచాను, మళ్ళీ బూట్లవంక చూచాను ! .

"ఇవి నాకోసమేనా తెచ్చింది?—" అని అడిగాను. డగ్గుత్తికతో.

"నీకు కాకపోతే ఇంకెవరికిరా ? —" అన్నాడు నాన్న నవ్వి. "తొడుక్కో నాయనా !—" అన్నాడు.

బూట్లు చేత పట్టుకున్నాను. పైకెత్తి చూచాను. బూట్ల కొసన, అడుగున మడమలకు లోహంతో పొన్నులువేసి ఉన్నాయి. అవి తళతళ మెరుస్తున్నాయి.

తాతయ్య చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది : "........బూట్లు వేసుకుని 'టకటక' మనిపిస్తూ నీవు జనంలో వెళుతూ ఉంటే కళ్ళు మిరుమిట్లుగొలపాలిరా !...." అని.

—o—

అధ్యాయం: తొమ్మిది

చదువులో నేను ఇట్టే చరచర పైకి ఎక్కివచ్చాను. ఆ సంవత్సరమే నన్ను మూడవ 'గ్రూప్' లోకి 'ప్రమోట్' చేశారు. ఆ సందర్భంతో టీచరు నాకు కొన్ని మంచిమాటలు చెప్పారు.

ఇంటికి వచ్చి ఆ విషయం నాన్నకు చెప్పాను. ఆయన ఆశ్చర్యపోయాడు. కానీ అది పైకి పొక్కనివ్వకుండా చిన్న చిరునవ్వు నవ్వాడు : "ఊఁ బాగుంది? కానీ బూట్లుమాత్రం జాగ్రత్తగా వాడుకో" అన్నాడు. అమ్మమాత్రం మళ్ళీ ఎప్పటిపాటే పాడింది : "వాడిగతి ఏం కానున్నదో !"—అని.

ఇహ నేను ఒక నాటకం వ్రాయడానికి ఉపక్రమించాను. ఇది చదివినవారు, విన్నవారు ఎవరైనా బుజాలుఎగరేసి "నాటకం ఎందుకూ? కవిత్వమే వ్రాయకూడదా ?" అని ప్రశ్నించవచ్చు. ఒక తత్త్వవేత్త చెప్పినట్లు ప్రతిదానికి ఒక హేతువు ఉంటుంది. నేను ఆ పనిచేయడానికి హేతువు ఇది :

ఆ శీతకాలంలో మా ఊళ్ళో జనం, వాళ్ళ జీవితంలో మొట్టమొదటిసారిగా 'థియేటర్' ను గురించి చెప్పుకోడం మొదలుపెట్టారు. అది ఏమిటో సరిగ్గా ఎవరికీ తెలియదు. కానీ రకరకాల వదంతులు వ్యాపించాయి.

ఊళ్ళో ఎక్కడ విన్నా ఇదేమాట ! 'థియేటర్, థియేటర్ !—' అందరూ దాన్ని గురించే చెప్పుకున్నారు. వాళ్ళకు ఇహ రెండో విషయం పట్టలేదు. ఒకరోజుకాదు, రెండురోజులు కాదు. రోజూ ఇదే ముచ్చట. ముఖ్యంగా కమ్యూనిస్టు యువజన సంఘాలవారు ఊరంతా

తిరిగి నాటక ప్రదర్శనానికి అవసరమైన కుర్చీలు, దీపాలు, గిన్నెలు, పళ్ళేలు, వస్త్రాలు, దుస్తులు-ఇంకా వేర్వేరు వస్తుసామగ్రి ప్రజలనుంచి సేకరించడం మొదలు పెట్టగానే జనంలో రకరకాలపుకార్లు పుట్టాయి. లేనిపోని అనుమానాలు పెట్టుకున్నవారు కొందరు "ఇంకేమున్నది? మన ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నారు!" అని ప్రచారం మొదలుపెట్టారు. దీంతో భయపడిపోయిన స్త్రీలు కొందరు తాము ఇచ్చిన దుస్తులూ వస్త్రాలు తిరిగి తీసుకున్నారు. కానీ కళాభివృద్ధికి తాము నష్టం కలిగిస్తున్నామన్న సంగతి పాపం, వాళ్ళకు తెలియదు.

నా మటుకు నాకు 'థియేటర్' అనే మాట ఇంద్రజాలంలా ఆకర్షిస్తూ వచ్చింది. అయితే భయంకూడా పుట్టింది. చీకట్లోనుంచి పిశాచాలు ప్రత్యక్షమై వస్తాయా?—అనిపించింది.

(అయితే తరువాత చాలాకాలానికిగాని ఇది సంభవించలేదు)

జనంలో రకరకాల అభిప్రాయాలున్నా మొత్తంమీద ఊళ్ళో అందరూ కూడా నాటకం తొలి ప్రదర్శన ఎప్పుడా ఎప్పుడా అని ఆసక్తితో నిరీక్షిస్తూ వచ్చారు. చివరకు ఆరోజు రానేవచ్చింది. నాటక ప్రదర్శనకు సంబంధించిన ప్రకటన కాగితాలు గ్రామీణ సోవియెట్ భవనాలపైన, పేదరైతు సంఘం కార్యాలయ భవనంపైన, వినియోగదారుల సంఘం భవనంపైన, పాఠశాల భవనంపైన అంటించారు.

గమనిక! ముఖ్యగమనిక!

ఈరోజు సాయంత్రం 7 గంటలకు మన గ్రామంలో మొట్టమొదటిసారిగా నాటక ప్రదర్శన!

టికెట్ వెల :

గోధుమలు	4 పౌనులు
గ్రుడ్లు	4 కోడిగ్రుడ్లు
	3 బాతుగ్రుడ్లు
మొక్కజొన్నలు	5 పౌనులు
బార్లీ, బటానీలు, చిక్కుళ్ళు	6 పౌనులు

అందరూ ప్రదర్శనాన్ని తిలకించండి !!!

ఇది చదవగానే మొదట ఆనందంలో మునిగిపోయాను. కానీ మళ్ళీ అంతలోనే నిరాశా, నిస్పృహాలు ఆవరించాయి. టికెట్ ఎలా కొనగలను ?

ఇన్ని వస్తువులు ఇస్తేకాని; నాటకానికి టికెట్ ఇవ్వరు. నాకు ఏమాత్రం ఆశలేదు. చివరకువెళ్ళి అమ్మను అడిగాను. అమ్మ నావంక అదోలా చూచింది.

"చూడండి ! ఈ కుర్రవెధవ నాటకానికి వెడతాట్ట. తాను ఒక నటుడు కావాలనుకున్నాడు కాబోలు !" అన్నది నవ్వి.

"ఈ సంవత్సరం కాదమ్మా, వచ్చే సంవత్సరం అవుతాను" అన్నాను. "కానీ నటులు ఎలాఉంటారో చూడాలని ఉందమ్మా. టికెట్ కొనడానికి ధాన్యం ఇస్తావా?" అని అడిగాను.

"ధాన్యంకాస్తా నాటకానికి ఖర్చుపెడితే ఏంపెట్టుకుని తింటాంరా? మళ్ళీ పంటవచ్చేదాకా పస్తు పడుకుందామనుకున్నావా ? రొట్టెకు పిండి కూడా అయిపోవచ్చింది" అన్నది అమ్మ.

ఇహ నేను మాట్లాడేదేమున్నది ? ఊరుకున్నాను. అమ్మ అవతలికి వెళ్ళిన తరవాత చొప్పదొడ్లోకి వెళ్ళాను. గడ్డికుప్పలో వదిలిపెట్టిన

గ్రుడ్లు ఏమైనా దొరుకుతాయేమోనని వెదికాను. ఊహుఁ! ఒక్కటీ లేదు.

నాటక ప్రదర్శన పాఠశాల భవనంలో జరుగుతున్నది. జనం గుంపులు గుంపులుగా వెళుతున్నారు. నేనూ ఎలాగో ధైర్యంచేసి గుంపులో జొరబడ్డాను. పాఠశాల భవనం బయట గేటువద్ద ఒక టేబిల్ అడ్డంగా పెట్టారు. ధాన్యం తూకం వేయడానికి దానిమీద ఒక త్రాసు ఉంచారు. గ్రుడ్లు పడవేయడానికి రెండు పెద్ద రాతిజాడీలు అటొకటి, ఇటొకటి పెట్టారు. ఉన్న మహారాజులు ధాన్యం, గ్రుడ్లుఇచ్చి టికెట్లు కొంటున్నారు. ప్రదర్శన నిర్వాహకులు వారికి ఎర్రటి చీట్లు ఇస్తున్నారు. అవే టికెట్లు. వాటిమీద 'రబ్బరుస్టాంప్'తో ముద్రలు కొట్టిఉన్నాయి. ఆ టికెట్లు ఉన్నవారికే ప్రవేశం. ఇహ లేని నాబోటి దురదృష్టవంతులున్నారు. వాళ్ళంతా చేసేదిలేక, తేనెపట్టూ ఈగలు ముసిరినట్లు గేటు చుట్టూ మూగిఉన్నారు. లోపలికి పోయేవారివంక గ్రుడ్లప్పగించి చూస్తూ గుటకలు మ్రింగుతున్నారు. వీరిలో కొందరు నాలాగే ఎవరూ చూడనప్పుడు ఎలాగో సందుచేసుకుని టేబిల్ క్రిందనుంచి దూరి లోపలికి పోవచ్చునని ఆలోచిస్తున్నారు. ఇంకా కొందరు పాపం, ఎటూ పాలుపోక కిటికీ సందుల్లోనుంచి ప్రదర్శన చూద్దామని నానాతంటాలు పడుతున్నారు!

కమ్యూనిస్టు యువజనసంఘం కార్యదర్శి మికోలా గుమెన్యుకి గేటుదగ్గరికి వచ్చాడు. 'క్యాషియర్' ప్రక్కన నిలుచుని "అబ్బాయిలూ! ఒకమూట పచ్చిగడ్డి తెచ్చి ఇచ్చినవాళ్ళకు వెంటనే ఉచితంగా టికెట్ ఇస్తాం!" అని ప్రకటించాడు.

"ఓ! అలాగైతే నేను క్షణంలో తెస్తాను!—" అని కేకపెట్టాడు మా అందరికంటె ముందునిలుచునిఉన్న ఒమెల్కో.

"అవుతే తీసుకరా" అన్నాడు గుమెన్‌యుక్.

"ఎండుగడ్డికూడా తీసుకుంటారా?—" అని అడిగాను నేను, ధైర్యంచేసి.

"లేదు, అదిమాకు అక్కర్లేదు." అన్నాడు కార్యదర్శి. నాకు ఉన్న ఆ ఒక్క ఆశకూడా చచ్చిపోయింది!

బరువుగా నిశ్వసించాను. థియేటర్ వాళ్ళకు పశుగ్రాసం కావాలని నాకుముందే తెలిసి ఉన్నట్టయితే ఉదయమే నేను ఒక మూటెడుతెచ్చి పడేసేవాణ్ని. రోజంతా దానిమీదనే కూచుని ఉండేవాణ్ని.

ఒమెల్కో ఒక మూటెడు పచ్చిగడ్డి వాటేసుకుని తేనే తెచ్చాడు. అతని ముఖంనిండా మచ్చలు. 'హీ, హీ!' అని నవ్వుతూ గుంపుగా నిలుచునిఉన్న మాదగ్గరికివచ్చి "అడ్డంలేవండి! నన్ను లోపలికి పోనివ్వండి! ఊఁ! ఊఁ!" అని అరిచాడు.

ఒమెల్కోను లోపలికిపోనిచ్చారు. ఇప్పుడు నాకళ్ళన్నీ, క్యాషియర్ కాళ్ళమీదఉన్నాయి. టేబిల్ క్రిందిదూరిపోవడం ఎలాగా, ఎప్పుడు సందుదొరుకుతుందా అని కనిపెట్టుకునిఉన్నాను. చివరకు నాకు సందు దొరికింది! క్యాషియర్‌లేచి ఆవతలి ప్రక్కనఉన్న జాడీదగ్గరికివెళ్ళాడు. ఇదే సమయంఅని నేను టేబిల్‌క్రింద దూరాను, పొట్ట నేలకు ఆనించి బల్లిలా ప్రాకుతూ లోపలికి ప్రవేశించాను.

"పట్టుకోండి! పట్టుకోండి!" అంటూ నావెనకాల ఎవరో అరిచారు. భయంతో నేను లోపల మరోవాకిలిదాకా పరుగెత్తాను. ఎర్ర చొక్కా తొడుక్కుని ఒక పొడుగాటి యువకుడు అక్కడ ఉన్నాడు. నన్ను ఒడిసిపట్టుకున్నాడు. "ఏయ్? ఎవరునీవు? ఎక్కడినుంచి వచ్చావు?—" అని అడిగాడు,

"నేను.... నేను.... దయచేసి నన్ను థియేటర్‌లోకి పోనివ్వండి." వణికిపోతూ ప్రతిమాలుకున్నాను.

"అదేనా నీకు కావలసింది. సరే—పోనిస్తాను. కానీ నిన్నేం చేస్తానో చూడు! చలికాలంలో ఎండ్రకాయలు ఎక్కడుంటాయో నీకు చూపుతాను!" అని ఆ యువకుడు బెదిరించాడు.

"చలికాలంలో అవి ఎక్కడుంటాయో నాకు తెలుసు. మీరేం చూపనక్కర్లేదు." అని సమాధానం చెప్పాను. చిన్నవాణ్ణిచేసి నన్నిలా ఆ యువకుడు బెదిరిస్తున్నందుకు లోలోపల ఉడికిపోయాను.

"కోడిపుంజు గ్రుడ్లు పెట్టడంకూడా నీకు తెలుసుకదూ?—" అని మళ్లీ అడిగాడు యువకుడు.

"ఆఁ! అదికూడా తెలుసు!" అని చెప్పాను ధైర్యంగా.

"మేక కొమ్ములు వంకరలేకుండా సరిచేయడం ఎలాగోకూడా తెలుసు?—"

"అదీ తెలుసు."

"పడి పందిపిల్లల చెవులు ఎంత ధర ఉంటాయో. అదీ?—"

"అది 'మార్కెట్'మీద ఆధారపడి ఉంటుంది!—" ఈసారి వెక్కిరింపుగా సమాధానం చెప్పాను.

నా సమాధానాలు విని సంతోషించినట్లు కనుపించాడు యువకుడు. నవ్వుతూ — "ఇహ నీకు తెలియనిదేమిటి?—" అని అడిగాడు.

"నాకు తెలియనివల్లా థియేటర్. దయచేసి నన్ను లోపలికి పోనివ్వండి."

"కుర్రకుంకా! ఇంత కొంటెతనం నేర్చుకున్నావా? నీ ముఖానికి

తారుపూసి, నల్పుతో తోమినట్టు తోముతాను. ఇహ థియేటర్ అనేది గుర్తురాకుండా చేస్తాను." — ఇలా అని అతను నన్ను ఒక్క నెట్టు నెట్టాడు. నేను లోపలవాకిట్లోకిపోయి పడ్డాను. తక్కిన కుర్రవాళ్ళంతా నన్ను చూచారు. జరిగినదంతా వాళ్ళకు తెలిసినట్టున్నది. నావంక వ్రేళ్లు పెట్టి చూపుతూ నన్ను ఎగతాళి చేయడం మొదలుపెట్టారు.

ఇదంతా జరిగినందుకు సంతోషిస్తున్నానని చెప్పలేను. కానీ అక్కడ కాపలా మనిషికి నన్ను అప్పగించారు. అతను. యువకుడు. నన్ను వెంటపెట్టుకుని క్యాషియర్ టేబిల్ దగ్గరికి తీసుకుని వెళ్ళారు. అంతలోనే అక్కడ సెబాస్టియన్ మామయ్య నాకంటపడ్డాడు. నన్ను చూచి గబగబా వస్తున్నాడు. ఆయన కనుపించగానే నాకు తల కొట్టివేసి నట్టు అయింది. పాతాళంలోకి క్రుంగిపోతే బాగుండుననిపించింది. ముఖం కందగడ్డలా అయింది. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. నేను ప్రక్కకు ఒదిగి నిలుచున్నాను. తలవాల్చుకుని సెబాస్టియన్ మామయ్య పాదాల వంక ఏదో ఆశతో చూస్తున్నాను.

"ఆ కుర్రవాణ్ణి ఏం చేయాలనుకుంటున్నారు అంద్రీ? —" అని అడిగాడు సెబాస్టియన్ మామయ్య. నావంక చూడకుండా.

"ఏంచేయ దలుచుకున్నామంటారా? రెండుచెవులూ పట్టుకుని గోడ అవతలికి విసిరివేస్తే సరి" అని చెప్పాడు ఎర్రచొక్కా యువ కుడు నవ్వుతూ.

"వాణ్ణి మనం లోపలికి పోనిస్తేఏం? థియేటర్ ఏమిటో చూస్తాడు పాపం! వాడికెంత జాగాకావాలి? ఎక్కడో ఒకచోట నిలబడతాడు" అన్నాడు సెబాస్టియన్ మామయ్య.

"అవుతే మీ ఇష్టం. నాకేమీ అభ్యంతరంలేదు."

అంతట సెబాస్టియన్ మామయ్య క్యాషియర్‌వంక తిరిగి "వీడి కొక 'పాస్' ఇవ్వు అలెగ్జాండర్ ! లేకపోతే వీణ్ణి లోపల, చావచితక కొడతారు." అన్నాడు. ఇలా అని నా తలపై మెల్లగా నిమిరాడు. తర వాత లోపలికి వెళ్ళిపోయాడు. ఆయన నాతో ఎందుకు మాట్లాడలేదో నాకు తెలుసు. నాకు కళ్ళవెంట నీళ్ళు కారడం ఆయనచూచాడు. నా మనస్సు ఎలా ఉందో ఆయన గ్రహించాడు.

అంద్రీ నావంక చురచుర చూచాడు, నేనేదో దొంగనైనట్టు.

"పాస్ ఏదీ?" అని అడిగాను తలఎత్తకుండా.

"ఇదిగో, తీసుకో! లోపలికి వెళ్ళు. కానీ ఇంకొకరిచోట్లో కూచోకు. నిలుచునేవాళ్ళకోసం వేరేగదిఉంది. దానికే ఈ 'పాస్'" — అన్నాడు క్యాషియర్.

చిన్న చీటీముక్క గుప్పిట్లో పెట్టుకుని పాఠశాలలోకి పరుగెత్తాను. లోపల ప్రేక్షకులంతా కబుర్లలో, నవ్వులలో మునిగి ఉన్నారు. స్కూలు బెంచీలన్నీ మామూలుగాలేవు, అన్నీ సర్ది జనం కూచోడానికి వీలుగా ఎడ ఎడంగా వేశారు. పెద్దవాళ్ళ తలలు అడ్డంగా ఉన్నాయి. నాకేమీ కనుపించడంలేదు. అందుకని గదిలో ముందరివైపునకు వెళ్ళాను. రంగ స్థలం (స్టేజ్) ముందుకువెళ్ళి అక్కడ నిలుచున్నాను. రంగస్థలంమీద నాలుగుడ్డ తెర క్రిందిదాకా వ్రేలాడుతున్నది. నేనలాచూస్తూ ఉండ గానే ఎవరో నాకాలుపట్టిలాగారు. తరవాత పకపకనవ్వులు. ఏదో లోకం నుంచి వచ్చినట్టనిపించిందనాకు. చుట్టూ కలయచూచాను. ఎవరా నవ్వింది? ఎవరూలేరు. కానీ తలఎత్తగానే, మళ్ళీ ఎవరో నా కాలు పట్టుకుని లాగారు. ఈసారి రెండవకాలు. మళ్ళీ పకపక నవ్వులు. ఎవరది? థియేటర్‌లో భూత, పిశాచాలు తిరుగుతాయని చెపుతారు! అవేనేమో! నాకు ముచ్చెమటలు పోశాయి. అక్కడనుంచి వెళ్ళిపోబోయాను.

అంతలో క్రిందినుంచి సన్నని గొంతు వినిపించింది. "మెల్లగా మా దగ్గ రికిరా మిఖైలో! ఇక్కడఉంటే ఎవరూచూడరు. టికెట్ ఎవరూ అడగరు."

నేను వంగి చూచాను. రంగస్థలంక్రింద ఒక రంధ్రంఉంది. నా సహాధ్యాయులు స్టొఫాన్, విక్టర్, ఉల్యాన్, గ్రిగరీ—ఈ నలుగురు ఆ రంధ్రంలో నక్కిఉన్నారు. వాళ్ళే నన్ను కాలుపట్టి లాగింది. పకపక నవ్వింది‌ను. వాళ్ళే నేను అనుకున్న భూతాలు! బడిలో పాఠాలు అయి పోగానే వాళ్ళు ఇళ్ళకు పోకుండా ఎకాఎకి ఇక్కడికి వచ్చారు. ఈ రంధ్రంలో దాక్కొన్నారు. ఆకలి అవుతున్నా, తిండితిప్పలు లేక పోయినా, అసౌకర్యంతో బాధపడుతున్నా ప్రదర్శన చూడాలన్న అభి లాషతో పాపం వాళ్ళు ఈ బాధంతా భరించారు.

"నీ కోసం మీ అమ్మ వెదుకుతున్నది." అని స్టొఫాన్‌తో చెప్పాను.

"దీపంపెట్టి వెతుకుతున్నదా ?—"

"లేదు."

"ఫరవాలేదు. నేను యింటికి వెళ్ళేసరికి రెండోఆట మొదలు పెడతారులే....నీ దగ్గర తినడానికేమైనా ఉన్నదా ?—"

"వేయించిన బటాణీలు కాసిని ఉన్నాయి" అని చెప్పాను.

"ఓహో ! అంతికన్నానా ?—" వాళ్ళు ఎగిరి గంతువేశారు. నా దగ్గరున్న బటాణీలు వాళ్ళు లాక్కొన్నారు. మళ్ళీ నవ్వులు, నేను వాళ్ళతో చేరిపోయాను.

తెర కదులుతూ ఇహ లేవబోతున్నది. ఇహ అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. నా స్నేహితులు ఇవతలకి వచ్చి నేలమీద చోటు చేసుకుని కూచున్నారు. తెర లేచింది. నటులు సంభాషణలు ప్రారంభించారు.

ప్రేక్షకులలో గుసగుసలు ప్రారంభమైనాయి. ఎవరు ఏ వేషం ధరిస్తు న్నదీ అందరూ ఊహించుకుంటున్నారు.

"అతను నిజంగా ముసలివాడుకాడు—యవటుక్. కావాలంటే పందెం," అన్నారు ఒకరు, తానొక పెద్దవిషయం కనిపెట్టినట్టు.

"యవటుక్ ఉన్నట్టుండి అంత ముసలివాడు ఎలా అయిపోయా డయ్యా?"

"ముసలివాళ్ళు కావడం ఎలాగో నటులకు తెలుసు—గడ్డమూ, మీసాలు పెట్టుకుంటే సరి. చిన్నవాళ్ళను చేయడం కష్టంఅని ముసలి వాళ్ళను చేయడం తేలిక."

"కాదు. యువటుక్ కాదు. అతని గొంతువేరు."

"ఓరి బుద్ధిలేనిమొద్దూ! అదంతా నటన. అతను అలా నటిస్తు న్నాడు—"

నాటకంలో వృద్ధుని పాత్ర ధరించిన నటుడు ఉన్నట్టుండి భయం కరంగా మారిపోయాడు. పెదవులు కొరికాడు. బిగ్గరగా నవ్వడం మొదలుపెట్టాడు. అవుతే అతను అలా నవ్వడంలో మొదట మీసం ఊడిపోయింది! తరవాత గడ్డం ఊడి క్రిందపడ్డది. ఇహ చూడండి! ప్రేక్షకులు విరగబడి నవ్వడం మొదలుపెట్టారు! బెంచీ న్నీ ఊగి పోయాయి. ఒక బెంచీఅవుతే విరిగేపోయింది. దానిమీద కూచున్నవారు దభీమని క్రిందపడ్డారు. తక్కిన ప్రేక్షకులలో ఇంకా బిగ్గరగా నవ్వులు కేకలు! బొబ్బలు! కోలాహలం! ఇంత కలకలం పుట్టినా ఉలకక, పలకక ఆనందించకుండా ఉన్నవ్యక్తి ఒకేఒకరు—అతను ప్రాంప్టర్. (నాట కంలో పాత్రధారులకు మాటలు అందించే వ్యక్తి). అతను తనుకూచునే పెట్టెలోనుంచి ఇవతలికి వచ్చి "తెర! తెర!" అని అరిచాడు. కాసిని

గింజాయిచ్చి ప్రజలు హాయిగా, ఆనందంలో ఓలలాడుతూ ఉంటే మధ్యలో అతనికేమిటి అభ్యంతరం ?

తెరవాలింది. మళ్ళీ తెరలేచింది. ఈసారికూడా నటులు ఎవ రెవరో ఊహించుకుంటూ ప్రేక్షకులు తమలోతాము మహదానందం పొందుతున్నారు.

ఈ దృశ్యంలో ఒక సన్నివేశం అందరినీ అమితంగా ఆకర్షించింది. ఒక యువకుడు ఒక బావివద్ద తన ప్రియురాలిని కలుసుకుంటాడు. ఆవిడచుట్టూ చేతులు పెనవేసి కౌగలించుకుంటాడు. ప్రేక్షకులలోఉన్న అమ్మాయిలు ఇదిచూసి సిగ్గుతో తలలు దించుకున్నారు. కానీ అబ్బాయిలున్నారుచూదారూ? ధీమగా తలలు పైకెత్తి రెప్పవాల్చకుండా తిలకించసాగారు. కొందరైతే ఆ అమ్మాయిని ముద్దాడవద్దని నటుడికి హెచ్చరిక కూడా చేశారు.

యువతులను బహిరంగంగా, రంగస్థలంమీదనైనాసరే ముద్దాడటం అసభ్యకరమైన విషయమని ఆ రోజులలో యువకులు భావించే వారు. నాటకం అచ్చు పుస్తకంలో 'వారు ముద్దాడతారు' అని సూచించి ఉన్నప్పటికీకూడా రంగస్థలంమీద అలా ప్రవర్తించరాదని వారి ఉద్దేశ్యం.

నాటకం చివరి 'సీను'—భర్త భార్యను చంపడానికి ఉద్యుక్తుడైనాడు. ప్రేక్షకలోకం మళ్ళీ భయభ్రాంతులలో మునిగిపోయింది. వారు బిగ్గరగా కేకలు పెడుతూ భర్తవేషం ధరించిన నటుణ్ణి బెదరించారు. అయినా ప్రేక్షకులమాటలు లక్ష్యపెట్టకుండా నటుడు, భార్యను ఒక్క దెబ్బవేశాడు. ఆ దెబ్బకు ఆమె కుప్పకూలి పడిపోయింది. నాటకం చూస్తున్న ఆడపిల్లలు కెవ్వున కేకపెట్టారు. ఇద్దరు కుర్రవాళ్ళు అప్పుడే హంతకుణ్ణి కొట్టి, బంధించటానికై రంగస్థలంమీదికి పరుగెత్తారు. కానీ

ప్రాంప్టర్ అతి చాకచక్యంతో గభాలున ఇవతలికివచ్చి నటుడికి అలాంటి గతి పట్టకుండా కాపాడాడు. "తెర ! తెర !" అని కేకలువెట్టాడు.

"తెర అలాగే పట్టుకోండి. అక్కడ హత్య జరిగింది!"—అని ఒక గంభీరకంఠం గది వెనుకభాగంనుంచి వినవచ్చింది.

ఆ సమయంలో ప్రాంప్టర్ ప్రేక్షకుల ముందుకువచ్చి రెండు చేతులూ ఊపుతూ "ఆగండి ! ఆగండి !"—అని అరిచాడు.

"రివల్యూషనరీ థియేటర్‌వారు నాటకం ప్రదర్శిస్తూవుంటే మీరు టికెట్‌లుకొని చూడడానికి వచ్చారుకదా? రంగస్థలంమీద రక్తపాతం జరుగుతుందని మీరు ఎలా ఊహించగలిగారు? శత్రువునైనా సరే సంహరించడానికి థియేటర్‌వారు నటులను అనుమతించబోరన్న సంగతి మీకు తెలియలేదా? వెనకటి రోజులతో అవుతే ఒక దిక్కులేని స్త్రీ అవమానంతో, ఆవేదనతో అహరహమూ అణగారిపోవలసి వచ్చేది. ఇప్పుడు స్త్రీకి అలాంటి దుర్గతి సంభవిస్తే మనం అంగీకరిస్తామా? ఈమాత్రం మీకు ఎలా తెలియకపోయింది ?" అని ప్రేక్షకజనాన్ని వానాచీవాట్లు పెట్టాడు. తరవాత యువతివేషం ధరించిన నటీమణిని లెమ్మన్నాడు. ఆమె లేచి నిలుచున్నది. దుస్తులకు అంటుకున్న ధూళి దులుపుకున్నది. తన వేషాన్ని, నటనను అభినందిస్తున్న ప్రేక్షకులవంక తిరిగి నవ్వింది. ప్రేక్షకులంతా మళ్ళీ నవ్వారు. హర్షధ్వానాలు చేశారు.

నాటకం బ్రహ్మాండంగా రక్తికట్టింది గొప్ప విజయం సాధించింది. చివరకు తెరవ్రాలిన తరవాత ప్రేక్షకులు 'స్టేజి' మీదికి పరుగెత్తారు. తమ అభిమాన నటీనటులను పలువిధాల అభినందించారు.

ఆ తరవాత మహానగరాలలోని పెద్దపెద్ద థియేటర్లలో నేను నాటక ప్రదర్శనాలు చూచాను కానీ ఇలా అఖండవిజయం సాధించిన ప్రదర్శన నాకు ఎక్కడా కనుపించలేదు. నటీనటులకూ ప్రేక్షకులకూ

మధ్య ఇంతటి సన్నిహిత సంబంధం, ప్రేక్షక లోకంలో ఇంతటి అభి మానం, ఆనందం, నిజమైన సానుభూతి; సంపాదించుకున్న ప్రదర్శన నే నెక్కడా చూడలేదు.

ప్రదర్శన జరిగినమరునాడు నేను టీచర్ దగ్గరికి వెళ్లాను. చదువు కోడానికి నాకొక నాటకం ఇవ్వమని అడిగాను. 'మార్టిన్ బొరుల్యా' అనే నాటకం ఆమె నాకు ఇచ్చింది. తరవాత మరొక నాటక సంపుటి కూడా ఇచ్చింది. అది నేను శ్రద్ధగా చదివాను. నాటక రచనాశిల్పం ఎలా ఉంటుందో, దృశ్యాలు, అంకాలు ఎలా విభజిస్తారో అవగతం చేసు కున్నాను. నాటక రచన నన్ను ముగ్ధుణిచేసింది. ఆ తరవాత ఇంకా అనేక నాటకాలు చదివాను. నేనే స్వయంగా ఒక నాటకం రచించాలని సంకల్పించుకున్నాను. ఆ నాటకంలో సెబాస్టియన్ మామయ్యాను, మికోలా మామను, మేరియానాను, మాఊళ్ళో ఇంకా కొందరిని పాత్ర లుగా చిత్రించాలనుకున్నాను.

నాకు పట్టుకున్న సమస్య ఒక్కటే. 'ఇటాలిక్స్'లో ఉండే అక్ష రాలు వ్రాయడం ఎలాగ అని. అచ్చుపుస్తకాలలో అవుతే అవి వేరే 'టైప్'లో ఉంటాయి. మరి వ్రాసేటప్పుడు నేనెలాగ వాటిని వ్రాయడం? కొంత తికమకపడి ఆలోచించుకున్న మీదట ఒక నిర్ణయానికివచ్చాను. మామూలు రచన యావత్తూ కుడివైపునకు ఏటవాలుగా వ్రాయాలని. 'రిమార్కులు' మాత్రం ఎడమ వైపునకు ఏటవాలుగా వ్రాయాలని నిశ్చయించుకున్నాను. దీని ఫలితం నాకు పూర్తిగా సంతృప్తి కలిగిం చింది.

ఆవిధంగా ప్రాతఃకాలంలో కూచుని రచన సాగిస్తున్నాను. నాటకంలో అది తృతీయాంకం. కథానాయకి నోటినుంచి ప్రేమవర్షం కురిపించాలి. నాకు మాటలు తట్టడంలేదు. ఇది తప్పక ఉండాలి, ప్రేమ,

ముద్దులేని నాటకం ఏం నాటకం? ముద్దులంటారా? నాటకంలో అన్ని అంకాలోనూ ముద్దులు కావలసినన్ని గుప్పించి వదిలిపెట్టాను. లేని దల్లా ప్రేమే. ఈ విషయంలో పెద్దవాళ్ళతో సంప్రతించే ధైర్యం నాకు లేదు. వాళ్ళు నవ్వి, ఎగతాళి పట్టిస్తారు. ఒహో! పదేండ్ల వయస్సులో నాటకం వ్రాయడం తేలిక విషయయా? దీనిబదులు కవిత్వం వ్రాసు కుంటే నయం. కాదూ? కానీ కవిత్వంలో ఆనందం ఏమున్నది? కవితా గోష్ఠులలో, జరిగే కావ్యపఠనం నేను విన్నాను. చదివేవారిలో ఆనందం ఉండదు. వినేవారిలో అంతకన్నా ఉండదు. కానీ నాటకం అలాకాదు. నాటకం చూస్తుంటే ప్రజలలో ఎంత ఉద్విగ్నత! ఎంత ఆవేశం! ఎంత ఆనందం!

సంభాషణలు ఎలా పొదగాలో రకరకాలుగా ఆలోచించుకుంటూ ఉండగానే తూర్పున ఆకాశం కాంతివంతమైంది. భళ్ళున తెల్లవారింది. భానుడు ఉదయించాడు. బాలభాస్కరుని అరుణ కిరణజాలం నా కిటికీ లోకి దూసుకుని వచ్చింది. నేను కూచున్న ప్రదేశమంతా అపరంజి కరిగిపోసినట్టున్నది. పావురాళ్ళు 'కూ, కూ!' అని కూస్తున్నాయి. బడికి వెళ్ళే వేళఅయింది! పుస్తకాలన్నీ సర్దుకుంటూ ఉండగా ఒక బండివచ్చి మా ఇంటిముందు ఆగింది. గేటు తెరిచిన చప్పుడైంది. మా ముసలి బాతు ఆనంద సూచకంగా "క్వాక్, క్వాక్!" అని అరిచింది. ఎవరో గబ గబా లోపలికివచ్చి తలుపు తీశారు. నేనువెళ్ళి చూచేటప్పటికి మేరియానా వాకిట్లో నిలుచుని ఉంది. వసంత ఋతువులో వన కన్యలాఉంది! ఆవిడ చెక్కిళ్ళు ఎర్రబారి గులాబీరేకులను వెక్కిరిస్తున్నట్టున్నాయి కళ్ళల్లో ఏదో ఎన్నడూలేనికాంతి. ఆవిడ తొడుక్కున్న కొత్తజాకెట్టు గుండీ రంధ్రంమీద ఆ సంవత్సరపు తొలిహిమబిందువులు రెండురాలి ఉన్నాయి!

"శుభోదయం! కలకాలం మీరంతా చల్లగా వర్ధిల్లాలి! —" అన్నది మేరియానా, అమ్మకూ, నాన్నకూ వంగి నమస్కారం చేస్తూ. తరవాత నన్నుచూచి అదేవిధంగా అన్నది.

"శుభోదయం మేరియానా! నీవు చల్లగా ఉండాలి తల్లీ!" అన్నది అమ్మ.

ఏదో అతిముఖ్యమైన విషయం చెప్పడానికై ఇప్పుడా అమ్మాయి ఇక్కడికి వచ్చినట్టు మా అందరికీ అనిపించింది. మొదట ఆ అమ్మాయి అమ్మచెవిలో ఏటో చెప్పింది. అది వినగానే అమ్మ కళ్ళు మిఃమిల మెరిశాయి.

"నీవు దుఃఖించకు అత్తయ్యా — నీవు ఏడిస్తే నాకూ ఏడుపు వస్తుంది!—" అన్నది మేరియానా. ఆవిడ మాటల్లో నవ్వూ, ఏడుపూ కలిసి ఉన్నాయి!

"మరి మీ ఆయన — ఆ మహావీరుడు ఎలాఉంటాడేమిటి?" అని అడిగింది అమ్మ.

"క్రిందటిసారి మీ తోటలోనే నన్ను కలుసుకోడానికి వచ్చాడు. నీవు చూడలేదా అత్తయ్యా? — " అని అడిగింది మేరియానా, ఆశ్చర్యంతో.

"ఎవరో ఒక కోసక్ వీరుణ్ణిగురించి చెప్పావు. కాని అతనికి నన్ను పరిచయం చేయడం మరిచిపోయావు." అన్నది అమ్మ: ఇలా అని నవ్వింది.

"ఇప్పుడు రా అత్తయ్యా, ఆయన్ను చూద్దువుగాని." అంటూ మేరియానా బండివైపు చూపించింది. "పెద్ద దొరలాగా బండిలోకూచుని ఉన్నాడు." అన్నది, మళ్ళీ మెల్లగా అమ్మకుమాత్రమే వినిపించేటట్టు —

"నేను ఒక తారకనట—ఆయన అంటాడు; తానొక చంద్రుడైనట్లు. నేను రాకుమార్తెనట! తనకు పట్టపురాణినట!—ఆయన చెపుతాడు"— అన్నది.

"అవును — నీవు నిజంగా తారకవే!" అన్నది అమ్మ కళ్ళ వెంటవచ్చే ఆనంద బాష్పాలు తుడుచుకుంటూ.

"మరి నీకూ ? నీ కంటికి ఆయన ఎలా కనిపిస్తున్నాడు?" అని అడిగింది.

"ఆయన నా భర్త—నాకు నాన్నకూడా !"— అన్నది మేరియానా మెల్లగా.

"ఏమిటీ !"—అన్నది అమ్మఆశ్చర్యపోతూ.

"అంటే -మరేమీలేదు. నాకు మానాన్న గుర్తులేదు. మా ఆయన కొటోవ్‌స్కీ అశ్వికదళంతోపాటు వెళ్ళి అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. ఒక గొప్ప 'బిరుదు'కూడా పొందాడు" అని చెప్పింది మేరియానా.

"బిరుదా !"—అని అడిగాను నేను ఆశ్చర్యచకితుడనై.

"అవును 'డార్లింగ్' "— అన్నది మేరియానా. తరవాత నా చెక్కిలి ముద్దాడింది. "వెళ్ళొస్తాను మిఖైలో! ....నాచిట్టితండ్రీ; వెళ్ళొస్తాను. మళ్ళీ మనం ఒకరినొకరం ఎంతకాలానికి చూచుకుంటామో ! సరే....కష్టపడి బాగా చదువుకో మిఖైలో! రైతుబిడ్డఅంటే ఏమిటో లోకానికి చూపించు. కలవారు, కడుపునిండిన మహారాజులు, గర్వంతో విర్రవీగే శ్రీమంతులు—బుద్ధితెచ్చుకునేటట్టు ప్రవర్తించు. మనం వ్యర్థులంకాము, పనికిమాలినవాళ్ళం కాము—అనే సంగతి నిర్దయులైన ఆ ధనికులకు తెలిసివచ్చేటట్టు చెయ్యి! ఒకప్పుడు మనం బుద్ధిలేని

ముద్దులమే కావచ్చు. కానీ ఇప్పుడుకాదు కాలంమారింది!" — అని చెప్పింది.

నా గొంతుకు ఏదో అడ్డం పడింది. కంఠం పెగిలిరాలేదు. ఎలాగో నిబ్బరంతెచ్చుకుని "మళ్ళీ ఒకమాటు వచ్చి చూచిపో మేరియానా! నీవు కనుపించకపోతే మా అందరికీ అదోలా ఉంటుంది." అన్నాను, గాద్గదికంగా.

"ఓ! వీలైనప్పుడు తప్పక వస్తాను మిఖైలో! .... ఇహ వెళ్ళొస్తానూ...." ఇలా అని మేరియానా మళ్ళీ నన్ను ముద్దాడింది. అమ్మను కూడా ముద్దాడి, బయటికి వెళ్ళిపోయింది.

వారు వచ్చినబండి జోడుగుర్రాల బండి. మేం బండి దగ్గరకి వెళ్ళాం. ఒక అందమైన యువకుడు బండిలో కూచుని ఉన్నాడు. సైనికులు ధరించేకోటు ధరించాడు. మమ్మల్ని చూడగానే చిరునవ్వునవ్వాడు. నాన్న వెళ్ళి అతన్ని పలకరించాడు.

"భలేవాడివయ్యా నీవు! మా అమ్మాయిని తన్నుకుని పోతున్నావే!" — అన్నాడు. "అలాంటిపిల్ల నీ కెక్కడా దొరకదు," అన్నాడు.

"ఆవిడకోసం ఎంతోకాలం వేచిఉన్నానండీ. ఒకరోజు, రెండు రోజులుకాదు — మూడేండ్లు! చివరకు నా శ్రమకుతగిన ఫలం చేకూరింది." అన్నాడు యువకుడు, మేరియానాకు చెయ్యి అందిస్తూ.

మేరియానా బండిలోఎక్కి కూచున్నది. అదే సమయంలో వెనకనుంచి ఎవరో నన్ను తాకారు నేను వెనక్కుతిరిగి చూచాను. ల్యూబా! సంచీ భుజానవేసుకుని నిలుచుని ఉంది. దేనికో ఆపిల్ల కళ్ళు కూడా ఎన్నడూలేనంత ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి.

"పెండ్లికుమార్తా?" — అని అడిగింది ల్యూబా.

"అవును" అన్నాము. ఆ అమ్మాయికి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోయాను.

"ఎంత అద్భుతంగా ఉంది." అన్నది మళ్లీ ల్యూబా. మేరియానా వెళ్ళిపోతున్నందువల్ల నా హృదయం ఎంత బాధపడుతున్నదో ఆ అమ్మాయికి తెలియదు

"నమస్కారం! వెళ్ళొస్తామండీ!" అన్నాడు యువకుడు. టోపీ పైకెత్తి. బండి కదిలింది.

మేరియానా వెళ్ళిపోతుంటే మేము అటువైపు తదేకంగా చూస్తూ చాలాసేపు నిలుచుండిపోయాం. బండి సముద్రంవైపు తిరిగి వెళ్ళిపోతున్నది. ఆ నూతన వధూవరులు లీలగా కనుపిస్తున్నారు. అయినా మేం అలాగే శూన్యంలోకి చూస్తూ నిలుచున్నాం. దూరంగా పొలాలు. ప్రకృతి యావత్తూ వసంతశోభను వెదజల్లుతున్నది.

"ఆ పిల్ల అదృష్టం ఎలాఉందో?"—అన్నది అమ్మ మెల్లగా.

ల్యూబా నేను చెట్లాపట్టాలు పట్టుకుని బడికి బయలుదేరాం. ఇప్పుడు కొత్తమార్గాన వెళుతున్నాం.

ఉన్నట్టుండి హఠాత్తుగా ఘంటానాదంవంటి ఏదో ధ్వని వినవచ్చింది. ల్యూబా, నేను పైకిచూచాం. వినీలాకాశంలో హంసలు విహరిస్తున్నాయి స్వచ్ఛధవళ మేఘాలను స్పృశిస్తూ రెక్కల సంగీతం వినిపిస్తున్నాయి. ఆ మృదుమధుర సంగీతం పృథ్విని, ప్రకృతిని, మా కుటీరాలను, హృదయాలను సయితం స్పందింపజేస్తున్నది. మరి నాకు—పసివాడనైన నాకు ఆ క్షణంలో ప్రపంచం యావత్తూ అతి రమణీయంగా, అత్యద్భుతంగా, ఒక ఆనందమందిరంగా గోచరించింది.

హంసలు నా బాల్యస్మృతులపైన, నా జీవితం అంతటిపైన అలా అలా విహరించసాగాయి.

[సమాప్తం]

—o—